ఈనాడు

విజయవాడ 10-11-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 90
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

మంచు కురిసే వేళలో..

రాష్ట్రంలో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో రెండు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీలకంటే దిగువకు పడిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు అవస్థలు పడుతున్నారు. శనివారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో అత్యల్పంగా 11.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, విజయనగరం, వైఎస్సార్ కడప, (మిగతా 2లో)

ఇంటి వద్దకే సంజీవని



శంకర సూపర్ స్పెషాలిటీ ఐకేర్ బీ బ్లాక్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, శంకర ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రమణి, కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి, శంకర ఐ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ మురళీ కృష్ణమూర్తి

"మానవ సేవే మాధవ సేవ అని నమ్ముతుంది కాబట్టే కంచి పీఠం దేశవ్యాప్తంగా కంటి ఆసుపత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది. ఆదిశంకరాచార్యుల స్వామి స్థాపించిన కంచి పీఠం ఆది నుంచీ హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతోంది. 1977లో ప్రారంభమైన శంకర కంటి ఆసుపత్రులు ఎందరో పేదల జీవితాల్లో వెలుగులను ప్రసాదించాయి. ఐదు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో 14 ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. 30 లక్షల మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం ఆషామాషీ కార్యక్రమం కాదు. సగటున రోజుకు 750 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు జరుగుతాయంటే ఆశ్చర్యంగా ఉంది. నేపాల్, కాంబోడియా, నైజీరియాల్లోనూ సేవలందించడం గొప్ప విషయం. త్వరలో జరిగే స్వర్ణోత్సవాలకు తప్పక హాజరవుతా."
- సీఎం చంద్రబాబు

- రోగి చెంతకే ప్రపంచస్థాయి వైద్యం
- రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా
- గుంటూరులో శంకర కంటి ఆసుపత్రి నూతన భవన ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: జగద్గురు ఆదిశంకరాచార్య ఆకాంక్షించినట్టు పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ముందుకెళుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. 'టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ 'సంజీవని' కేంద్రాలను త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తాం. ప్రపంచంలో ఆరోగ్యానికి సంబంధించిన విజ్ఞానం ఎక్కడ ఉన్నా రోగి ఇంటి వద్దే అందించేలా ఈ ప్రాజెక్టు పని చేయబోతోంది. 5 కోట్ల రాష్ట్ర ప్రజల హెల్త్ రికార్డులు ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రయత్నాలు చేస్తున్నాం. ఆరోగ్యం విషయంలో ప్రపంచానికి ఏపీ ఒక రోల్ మోడల్‌గా ఉంటుంది' అని చెప్పారు. డబ్బు, హోదా, ఆస్తి, భవంతులు, కార్లు.. ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకుంటే ఉపయోగం ఉండదని సీఎం అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని సమీపంలోని శంకర కంటి ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ కేంద్రాన్ని (బీ బ్లాక్) ఆదివారం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అనారోగ్యమే నిజమైన పేదరికం. అందుకే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తెస్తున్నాం. ప్రతి ఒక్కరికీ రూ.2.50 లక్షల ఆరోగ్య బీమా, ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల వరకు విలువైన వైద్య సేవలు ఈ పాలసీ కింద అందిస్తాం. ప్రజారోగ్యాన్ని కాపాడటానికి శంకర కంటి ఆసుపత్రులు చేస్తున్న సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని వెల్లడించారు.

రెయిన్‌బోతో చిన్నారులకు చూపు

'రెయిన్‌బో' కార్యక్రమం ద్వారా పిల్లల కంటి ఆరోగ్యంపై దృష్టి పెట్టడం అభినందనీయం. శంకర గ్రామీణ సేవ ప్రాజెక్టు 'గిఫ్ట్ ఆఫ్ విజన్' కార్యక్రమంలో 32 వేలకుపైగా శిబిరాలు నిర్వహించడం వారి సేవాభావానికి నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా ఉండాలనేది నా ఆలోచన. జ్ఞానం, సంపద, ఆరోగ్యం విషయాల్లో ప్రపంచానికి (మిగతా 2లో)

ఎకో టూరిజం ప్రాజెక్టులతో రైతుల ఆదాయం పెంచండి

- వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణలు జరగకుండా చర్యలు
- పలమనేరు పర్యటనలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- కుంకీ ఏనుగుల శిబిరం, గజారామం నగరవనం ప్రారంభోత్సవం



ఏనుగుకు ఆహారం పెడుతున్న పవన్ కల్యాణ్

ఈనాడు, చిత్తూరు: న్యూస్‌టుడే, పలమనేరు, కల్లూరు: వన్యప్రాణులు, మనుషుల మధ్య సంఘర్షణలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పొలాలపై ఏనుగులు, కోతుల దాడితో రైతులు నష్టపోతున్నారు.. ఇలాంటి సమస్యలున్న ప్రాంతాల్లో 10-12 ఎకరాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులు ఏర్పాటుచేసి అన్నదాతల ఆదాయం పెంచాలని సూచించారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గజరాజుల సంచారం అధికంగా ఉందని.. వీటికి రేడియో కాలర్లు అమర్చి ఎటు వెళ్తున్నాయో ప్రజలకు చెప్పాలన్నారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగులో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం పర్యటించారు. కుంకీ ఏనుగుల శిబిరం, గజారామం నగరవనం ప్రారంభోత్సవంతో పాటు ఏనుగుల గుంపు నిరోధక కంచె ఏర్పాటుకు పునాదిరాయి వేశారు. ఏనుగుల విన్యాసాలు చూసి, వాటికి శిక్షణ ఇచ్చిన మావటీలకు రూ.50వేలు అందజేశారు. తొలుత అటవీశాఖ కన్జర్వేటర్ యశోదా బాయి ఏనుగుల కారణంగా అన్నదాతలు పడుతున్న ఇబ్బందులు, పరిష్కారానికి తీసుకోవాల్సిన, తీసుకుంటున్న చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వన్యప్రాణులు-మానవుల మధ్య సంఘర్షణల నివారణకు చేపడుతున్న చర్యలు చెప్పి, ర్యాపిడ్ రెస్పాన్స్ వ్యాన్లు, నూతన సాంకేతికత, వన్యప్రాణుల ట్రాకింగ్.. లాంటి 11 ప్రాజెక్టులు తయారుచేసినట్లు చెప్పగా ఈ నెల 18న వీటిపై కూలంకషంగా చర్చించడానికి సమావేశం ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు.

గడువు నిర్దేశించుకోకుంటే జాప్యం

హనుమాన్ ప్రాజెక్టు ప్రజంటేషన్ సందర్భంగా.. రాష్ట్రంలో ఆరు ఏనుగులకు రేడియో కాలర్ అమర్చడానికి (మిగతా 2లో)

బాబా శతజయంతి వేడుక.. విశ్వమంతా పండగ

దేశ, విదేశాల నుంచి పుట్టపర్తి తరలిరానున్న భక్తులు

18న రథోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభం

3లో

బిహార్‌లో ముగిసిన ప్రచారం

రేపు మలివిడత పోలింగ్

10లో

ఓట్ల చోరీని అడ్డుకుంటే... మాదే అధికారం

రాహుల్ గాంధీ

ఎన్డీయేను తిరిగి గెలిపించాలి

- మూడు అంశాల ఆధారంగా తీర్పివ్వండి
- బిహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి లోకేశ్
- వైకాపాకు 'ఒక్క ఛాన్స్' ఇచ్చి ఏపీ తీవ్రంగా నష్టపోయిందని వ్యాఖ్య



పట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర యువతపై ఉందని ఏపీ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. 'ఒక్క ఛాన్స్ పేరుతో 2019లో ఆంధ్రప్రదేశ్‌లో వైకాపా ప్రభుత్వానికి అవకాశం ఇవ్వడం వల్ల.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయి. ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. అలాంటి పరిస్థితులు బిహార్‌లో తెచ్చుకోవద్దు' అని కోరారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్నాలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. 'వికసిత భారత్ లక్ష్యసాధనలో బిహార్ పాత్ర (మిగతా 2లో)

కొనసాగింపుతో అభివృద్ధి

బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వాన్ని 3 అంశాల ప్రాతిపదికగా గెలిపించాలని లోకేశ్ కోరారు. అవి ఆయన మాటల్లోనే..

1. స్వచ్ఛమైన, అవినీతిరహిత పాలన కోసం ఎన్డీయే మళ్లీ గెలవాలి. నరేంద్ర మోదీ బిహార్ రూపురేఖలు మార్చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ఆయన లక్ష్యం. ఇక్కడ నరేంద్రమోదీ, నీతీశ్‌కుమార్ నాయకత్వం ఉంది. ఏపీలో మోదీ, చంద్రబాబు నాయకత్వం ఉంది. విజన్, సమర్థతతో వీరు పాలన చేస్తున్నారు.

2. ఎన్డీయే ప్రభుత్వంలో శాంతిభద్రతలు బాగుంటాయి. అభివృద్ధికి పెద్దఎత్తున అవకాశాలు వస్తాయి. బిహార్, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వాలు ఉండడంతో మౌలిక సౌకర్యాల కల్పన, విద్యాసంస్థల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది. కేంద్రం తీసుకునే విధానపరమైన నిర్ణయాల్లో రాష్ట్రాల్లోని ఎన్డీయే ప్రభుత్వాల పాత్ర ఉంటోంది. వివిధ పరిశ్రమలు రావడానికి కేంద్రం మద్దతు లభిస్తోంది.

3. గుజరాత్, ఒడిశాల్లో ప్రభుత్వాల కొనసాగింపు వల్ల పెద్దఎత్తున అభివృద్ధి సాధించాయి. బిహార్‌లో జంగిల్‌రాజ్ పాలన పోయి నీతీశ్‌కుమార్ ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతలు బాగున్నాయని, ఎంతో అభివృద్ధి జరిగిందని పరిశ్రమల సంఘం ప్రతినిధులు చెప్పారు. ఏపీలోనూ చంద్రబాబు ఇంటికో పారిశ్రామికవేత్త నినాదం ప్రకటించారు. సూక్ష్మ, చిన్న, మధ్యస్థాయి పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు.

₹ 5,000 కోట్లతో లారస్ ల్యాబ్స్ ప్లాంట్

విశాఖలో నిర్మాణం

అవసరాన్ని బట్టి మరిన్ని పెట్టుబడులు

సీఈఓ చావా సత్యనారాయణ



ఈనాడు వాణిజ్య విభాగం: ఔషధ సంస్థ లారస్ ల్యాబ్స్, అధునాతన తయారీ కాంప్లెక్స్‌ను విశాఖపట్నంలో రూ. 5,000 కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మిస్తోంది. ఇందుకోసం ఏపీ ప్రభుత్వం నుంచి 532 ఎకరాల స్థలం కేటాయింపు (మిగతా 2లో)

సాంకేతికత.. నమ్మకం.. వాణిజ్యం

- విశాఖ భాగస్వామ్య సదస్సు వేదికగా.. కొత్త ఆర్థిక వ్యవస్థకు మార్గాలు
- రెండు రోజుల సదస్సులో 48 కీలక సెషన్లు

ఈనాడు - అమరావతి



ముస్తాబైన విశాఖ దత్ ఐలాండ్ కూడలి

₹9.76 లక్షల కోట్ల పెట్టుబడులు.. 7.48 లక్షల మందికి ఉపాధి

112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

టెక్నాలజీ (సాంకేతికత).. ట్రస్ట్ (నమ్మకం).. ట్రేడ్ (వాణిజ్యం).. అన్న మూడు అంశాలను మూలస్తంభాలుగా చేసుకుని కొత్త ఆర్థిక వ్యవస్థకు మార్గాలు రూపొందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం విశాఖ భాగస్వామ్య సదస్సును నిర్వహించనుంది. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సదస్సులో భాగంగా 48 కీలక సెషన్లతోపాటు ఆంధ్రప్రదేశ్ పెవిలియన్, హ్యాకథాన్, బీటుబీ (బిజినెస్ టు బిజినెస్), బీటుజీ (బిజినెస్ టు గవర్నమెంట్) సమావేశాలు జరగనున్నాయి. వివిధ రంగాల్లో 7.48 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రూ. 9.76 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి ప్రభుత్వం 410 ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 2.94 లక్షల కోట్ల వ్యయంతో 112 పరిశ్రమలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకూ భాగస్వామ్య సదస్సు వేదిక కానుంది. రెండు రోజుల పాటు జరిగే సదస్సుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహా ఆరుగురు కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. భాగస్వామ్య సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు ఇప్పటికే సమాచారం అందింది. జీ20, ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, యూరోప్, దక్షిణాసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, కరేబియన్ తదితర దేశాల నుంచి ప్రతినిధులు రానున్నారు. ప్రపంచ వాణిజ్య సమాఖ్య డైరెక్టర్ జనరల్ నగోజి ఒకన్జో, యూఎన్ ఆర్థిక, సాంఘిక కమిషన్ (థాయ్‌లాండ్) కార్యనిర్వాహక కార్యదర్శి అమిడా సైసియా, (మిగతా 2లో)

ఇవీ లక్ష్యాలు..

- ప్రపంచ వాణిజ్యంలో భారతదేశ పాత్రను విస్తరించడం
- గ్లోబల్ టెక్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను లాభదాయకంగా ఉపయోగించడం
- ప్రాధాన్య రంగాలను బలోపేతం చేసే చర్యలు
- దక్షిణ-దక్షిణ, దక్షిణ-ఉత్తర ప్రాంతాల మధ్య సంబంధాలు పెంపొందించడం
- పెరుగుతున్న అనిశ్చితి మధ్య ప్రపంచ దేశాల నమ్మకాన్ని పునర్నిర్మించడం.


రేపు మైనారిటీ సంక్షేమ దినోత్సవం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు

ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేసిన వారికి అవార్డుల ప్రదానం

ఈనాడు, అమరావతి: భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11న మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి వేడుకల్ని, జిల్లా కేంద్రాల్లో జిల్లా స్థాయి వేడుకలను నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయి వేడుకల్లో ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి విశేషంగా కృషిచేసిన వారికి అవార్డులు ప్రదానం చేయనున్నారు. జీవనకాల సాఫల్య పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అవార్డులు, సాంస్కృతిక, కళారంగాల్లో (మిగతా 2లో)

ఇదీ సంగతి!



సంతృప్త శాతంలో.. సర్కారుకే టోకరా

- రిజిస్ట్రేషన్ల శాఖ తీరే వేరు
- కొనుగోలుదారుల ఫోన్ నంబర్లకు బదులు డాక్యుమెంట్ రైటర్ల నంబర్లు
- స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ సేవల్లో అవినీతి షురూ?

ఈనాడు - అమరావతి



రెవెన్యూలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ తీరే వేరు.. తమ శాఖలో సంతృప్త శాతం పెంచేందుకు ప్రభుత్వానికే టోకరా వేస్తోంది. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారి ఫోన్ నంబర్లకు బదులుగా డాక్యుమెంటు రైటర్లు, ప్రైవేటు వ్యక్తుల నంబర్లిచ్చి వారికే ఫోన్లు వచ్చేలా జాగ్రత్త పడుతోంది. అయినా అవినీతి శాతం తగ్గుదల అంతంతమాత్రమే. గతేడాది జూన్ నుంచి కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలోనూ ఈ విషయం వెల్లడవుతోంది. డబ్బు తీసుకుంటున్నారని ముడింట ఒకవంతు మంది చెప్పారు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ శాఖలో దస్తావేజులు, ఆస్తుల విలువ ఆధారంగా ఏ రోజుకారోజు 'లెక్కలేసి' మరీ పనిచేస్తారు. కొనుగోలుదారుల నుంచి 1% చొప్పున ప్రాంతాలకు అనుగుణంగా వసూలు చేస్తారు. చాలా కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల్ని ఏర్పాటుచేసుకుని దందా చేయడంతోపాటు దస్తావేజు లేఖరుల ద్వారా అన్నీ నడిపిస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే. కూటమి ప్రభుత్వంలో ఇంకా గాడిన పడని విభాగాల్లో ఇదీ ఒకటి. ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నా, అవినీతి నిరోధక శాఖ దాడులు చేస్తున్నా వసూళ్లు మాత్రం ఆగడం లేదు.

సొంత నంబర్లిచ్చి..

సేవల్లో పారదర్శకత పెంచేందుకు, అవినీతి తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తుంటే.. ఈ శాఖలోని కొందరు సర్కారుకే (మిగతా 2లో)


కంటి ఆసుపత్రిలోని ఓ విభాగాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

ఇంటి వద్దకే సంజీవని

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌ను సమూనాగా తయారుచేద్దాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.


చంద్రబాబుకు ఆశీస్సులు అందిస్తున్న కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి

ప్రతి రాజధానిలో శ్రీవారి ఆలయం: నాడు కంచి స్వామి చొరవతో ప్రారంభమైన తితిదే ధర్మ ప్రచార పరిషత్ నేడు దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ చొరవతో ప్రారంభమైన అన్నదానం, తాను మొదలు పెట్టిన ప్రాణదానం, శ్రీవారి సేవ కార్యక్రమాలు ఎంతో మందికి బాసటగా మారాయన్నారు. "అలిపిరిలో నాపై బాంబు దాడి జరిగితే ఆ వేంకటేశ్వరస్వామే కాపాడారు. ప్రపంచంలో హిందువులు ఎక్కడుంటే అక్కడ వేంకటేశ్వర స్వామి ఆలయం కట్టాలని సంకల్పించాం. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి దేవాలయం నిర్మిస్తాం. గ్రామీణ ప్రాంతాల్లో 5 వేల దేవాలయాలను నిర్మించాలని నిర్ణయించాం. కంచిస్వామి సూచన మేరకు వేద పండితులు 700 మందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి పారితోషికం ఇస్తున్నాం. భారత దేశంలో కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా ఉండేలా కంచి వంటి పీఠాలు ఎంతో కృషి చేస్తున్నాయి. మనకు ఆసుపత్రుల్లో శరీరానికి చికిత్స ఇస్తారు. కానీ, మానసిక స్థైర్యాన్ని ఇచ్చేది ఆధ్యాత్మిక కేంద్రాలే" అని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ■ కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం చేస్తూ.. పరోపకారం చేయడానికి భగవంతుడు ఈ దేహాన్ని ఇచ్చాడని, ఆ దిశగా ప్రతి ఒక్కరు అడుగేయాలని ఆదిశంకరులు చెప్పిన మాటలు పాటించాలన్నారు. రాజధాని ప్రాంతంలో కొత్త పాఠశాలలు రానున్నాయన్నారు. ధర్మంలో ఏపీ దేశంలోనే ముందుందన్న స్వామి.. కంచికి వచ్చి కామాక్షిదేవి, చంద్రమౌళీశ్వరస్వామి ఆశీస్సులు తీసుకోవాలని చంద్రబాబును కోరారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, శంకర కంటి ఆసుపత్రి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


పట్నాలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో సమావేశమైన మంత్రి నారా లోకేశ్. చిత్రంలో ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, సానా సతీశ్, గంటి హరీశ్

ఎన్డీయేను తిరిగి గెలిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

చాలా కీలకం. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీయేకు అధికారం ఇవ్వాలి. రాష్ట్రాలు బలంగా ఉంటేనే భారతజాతి బలోపేతమవుతుంది' అని పేర్కొన్నారు. 'బిహార్‌లోని ఒక పార్టీ ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెబుతోంది. ఆచరణ సాధ్యం కాని హామీలను యువత నమ్మొద్దు. డబుల్ ఇంజిన్ సర్కారు కారణంగానే బిహార్, ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం నుంచి పెద్దఎత్తున నిధులు లభిస్తున్నాయి' అని వివరించారు. ■ విలేకరుల సమావేశంలో భాజపా మీడియా విభాగం కో-హెడ్, ఎమ్మెల్సీ సంజయ్ మయూక్, ఎంపీలు సానా సతీశ్, గంటి హరీశ్, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో భేటీ: భాజపా బిహార్ ఎన్నికల వ్యవహారాల బాధ్యుడు, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో లోకేశ్ ఆదివారం పట్నాలో భేటీ అయ్యారు. ఎన్నికల్లో ఎన్డీయే విజయానికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. లోకేశ్ వెంట ఎంపీలు సానా సతీశ్, గంటి హరీశ్, కలిశెట్టి అప్పలనాయుడు తదితరులున్నారు. ఎన్డీయే అభ్యర్థుల తరఫున ప్రచారానికి ఈ దఫా చంద్రబాబుకు బదులు లోకేశ్‌ను ఆహ్వానించడం విశేషం.



1కి చెబితే.. మిగతా 4 వినాల్సిందే!

శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలోని రాఘవంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడే ఉండగా.. 13 మంది విద్యార్థులు, ఐదు తరగతులు ఉన్నాయి. ఒకటో తరగతిలో ఇద్దరు, రెండులో నలుగురు, మూడులో ఇద్దరు, నాలుగులో ముగ్గురు, ఐదులో ఇద్దరు ఉన్నారు. వీరికి ఎస్జీటీ రామమూర్తి పాఠాలు చెబుతున్నారు. వారంతా ఒకే గదిలోనే విద్యాభ్యాసం చేస్తున్నారు. అంటే ఒకటో తరగతి పిల్లలకు పాఠం చెప్పినా.. మిగతా నాలుగు తరగతుల వారూ వినాల్సిందే. నిబంధనల మేరకు 20 కంటే తక్కువ విద్యార్థులుంటే ఒక్కరే ఉపాధ్యాయుడిని నియమించాల్సి ఉంటుందని ఎంఈవో చెబుతున్నారు. ఇక్కడి ఐదో తరగతి విద్యార్థులు ఏడాదంతా ఒకటో తరగతి పాఠాలు వినాల్సి వస్తుంది మరి.

- ఈనాడు, పుట్టపర్తి

వాడినదే.. మళ్లీ మళ్లీ వాడకుండా!

- ఒకసారి ఉపయోగించిన వంట నూనెలను సేకరిస్తున్న స్టార్టప్‌లు
- లీటరుకు రూ.50 దాకా చెల్లింపు!

వాడిన వంటనూనెకు గిరాకీ పెరుగుతోంది. కొన్ని స్టార్టప్‌లు దీనిని కొని, బయోడీజిల్ తయారీకి వినియోగిస్తున్నాయి. నూనెను మళ్లీ మళ్లీ వాడి అనారోగ్యాలకు కారణమవకుండా... దుకాణదారులకు ఆదాయమొచ్చేలా చేస్తున్నాయి.. పర్యావరణ పరిరక్షణకూ పాటుపడుతున్నాయి. 'రీ పర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్(రుకో)' పేరిట.. వాడేసిన నూనె నుంచి బయోడీజిల్ తయారుచేసే కార్యక్రమాన్ని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) చేపట్టింది. దీనికి క్రమంగా ఆదరణ పెరుగుతోంది.

తమిళనాడులో పలు స్టార్టప్‌లు.. వాడేసిన నూనె సేకరిస్తూ వినియోగదారులకు నేరుగా డబ్బులు చెల్లిస్తున్నాయి. చెన్నైలో 'యురేనస్ ఆయిల్' స్టార్టప్ తన సేవల్ని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు 20 రాష్ట్రాలకు విస్తరించింది. ముందుగా ఒప్పందం కుదుర్చుకుని.. హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ యూనిట్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థల నుంచి కొంటోంది. రోజుకు 20 టన్నులకు పైగా సేకరిస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చెన్నైలోని పలు ప్రాంతాల్లో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆర్‌డబ్ల్యూఏ)ల సభ్యులతో కలిసి ఇళ్ల నుంచీ పెద్ద ఎత్తున నూనెను కొంటున్నారు.


వాడిన నూనెను సేకరిస్తున్న కేబీ ఎనర్జీ కార్పొరేషన్ స్టార్టప్ సిబ్బంది

- తిరుచ్చి జిల్లా తిరువానైకోయిల్‌కు చెందిన 'కేబీ ఎనర్జీ కార్పొరేషన్' స్టార్టప్ 7 జిల్లాల నుంచి నెలకు 20 టన్నుల నూనెను సేకరిస్తోంది.
- చెన్నైలోని ఎన్వోగ్రీన్ స్టార్టప్ 2022లో ఒక నెలకు లక్ష లీటర్ల వాడిన నూనెను సేకరించి రికార్డు సృష్టించింది. ప్రస్తుతం నెలకు 28 వేల నుంచి 30 వేల లీటర్ల వరకూ కొంటోంది. కొన్ని స్టార్టప్‌లు ఆన్‌లైన్ ఆర్డర్ల ద్వారానూ కొంటున్నాయి. నాణ్యతను బట్టి లీటరు రూ.25 నుంచి రూ.50 దాకా చెల్లిస్తున్నాయి.

ఏం చేస్తున్నారంటే..

వాడిన వంటనూనెను సేకరించిన స్టార్టప్‌లు దానిని బయోడీజిల్ తయారీ ప్లాంట్లకు విక్రయిస్తున్నారు. ఇలాంటి ప్లాంట్లు దేశవ్యాప్తంగా 64 దాకా ఉన్నాయి.

- ప్రపంచవ్యాప్తంగా వ్యర్థ నూనె మార్కెటింగ్ 2021కి 45 బిలియన్ డాలర్లుగా ఉండగా.. 2031కి 70.6 బిలియన్ డాలర్లకు పెరగనున్నట్లు విశ్లేషకుల మాట.
- ప్రస్తుతం దేశంలో ఏటా 2,700 కోట్ల లీటర్లకు పైగా వంటనూనె వినియోగిస్తున్నారు. ఇందులో 140 కోట్ల లీటర్లు సేకరిస్తుండగా.. 110 కోట్ల లీటర్ల బయోడీజిల్ తయారవుతోంది.
- వచ్చే 10 ఏళ్లలో ఈ మార్కెట్ వార్షిక వృద్ధిరేటు 7.5 శాతం కానుంది.

- ఈనాడు, చెన్నై


నూనెను బ్యారెల్‌లో పోస్తున్న యురేనస్ ఆయిల్ సిబ్బంది

వాహనాలకు ఇంధనంగా..

వాడేసిన లీటరు వంటనూనె నుంచి తయారుచేసిన బయోడీజిల్‌తో బస్సును 3 నుంచి 5 కి.మీ. నడపొచ్చు. ఈ ఇంధనాన్ని కార్లు, విమానాలు సహా ఇతర వాహనాలకూ వాడొచ్చు. సాధారణ డీజిల్ ధర కన్నా బయోడీజిల్ లీటరుకు రూ.7-8 తక్కువని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

డబ్బులొస్తున్నాయి



- విజయ మురుగేశన్, చెన్నై

నేనో చిన్న రెస్టారెంట్‌ను నడుపుతున్నా. రోజూ 30 లీటర్ల నూనె వాడతాం. తర్వాత దానిని పారబోసేవాళ్లం. ఇప్పుడు అమ్ముతున్నాం. లీటరుకు రూ.45 ఇస్తున్నారు. దీని వల్ల అదనపు ఆదాయం వస్తోంది.

ఎకో టూరిజం ప్రాజెక్టులతో రైతుల ఆదాయం పెంచండి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని యశోదాబాయి తెలిపారు. కర్ణాటకలో ఇలా చేశారని, మన రాష్ట్రంలోనూ త్వరలోనే అమర్చి.. ఏనుగుల జాడ గుర్తించి జనావాసాలకు వెళ్లకుండా చేసి ప్రాణనష్టం తగ్గిస్తామన్నారు. ప్రతి పనికీ నిర్ణీత సమయం నిర్దేశించుకోకుంటే జాప్యం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆరునెలల్లో చేస్తామని చెప్పగా కొంత వేగంగా చేయాలని సూచించారు. ఏనుగుల కారణంగా నష్టం తలెత్తితే యాప్‌లోనే వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారులు వివరాలు నమోదు చేస్తే త్వరగా పరిహారం ఇచ్చేందుకు చర్యలు చేపడతామని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వెల్లడించారు.

కోతులు పట్టుకోవడం సాధ్యమేనా?

కోతుల కారణంగానూ పంట నష్టం జరుగుతోందని, వాటిని పట్టుకుని స్టెరిలైజ్ చేస్తామని యశోదాబాయి తెలపగా వాటిని పట్టుకోవడం సాధ్యమేనా? అని పవన్ ప్రశ్నించారు. ఈ పని చేయడానికి కొందరు ఉన్నారని ఆమె సమాధానమిచ్చారు. పాముల విషయం వచ్చినప్పుడు పంచాయతీల్లో 'సర్పమిత్ర'ల సేవలు వినియోగించుకుంటామని పేర్కొన్నారు. జిల్లా అటవీశాఖ అధికారులు వీరికి గుర్తింపు ఇస్తే మరింత ఉత్సాహంతో పనిచేస్తారని పవన్ సూచించారు.

ఆహారం అందించిన పవన్

ఏనుగులు దుంగలు మోయడం, మదపుటేనుగు కట్టడిని అందరూ ఆసక్తిగా గమనించారు. మోకాళ్లపై నిలబడి పవన్‌కు అవి అభివాదం చేయగా ఆయన సెల్యూట్ చేశారు. అభిమన్యు, కృష్ణ అనే ఏనుగులకు ఆయన బెల్లం తినిపించగా ఆశీర్వాదం ఇచ్చాయి. ఏనుగుల దాడులతో నష్టపోయిన రైతులతో రచ్చబండ ఉంటుందని షెడ్యూల్‌లో తెలిపారు. కన్జర్వేటర్ ప్రజంటేషన్ ఆలస్యంకావడంతో ఈ కార్యక్రమాన్ని రద్దుచేయడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

పెద్దిరెడ్డి కబ్జా చేసిన అటవీ స్థలం పరిశీలన

పులిచెర్ల మండలం మంగళంపేట సమీపంలో మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు ఆక్రమించుకున్న అటవీ భూములను ఉపముఖ్యమంత్రి పవన్ హెలికాప్టర్ నుంచి పరిశీలించారు. ఈ ఏడాది జనవరి 29న 'ఈనాడు'లో 'అడవిలో అక్రమ సామ్రాజ్యం' శీర్షికతో కథనం ప్రచురితమైన తర్వాత ప్రభుత్వం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, అటవీశాఖ కన్జర్వేటర్ యశోదాబాయితో విచారణ కమిటీని నియమించింది. 32.64 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించినట్లు గుర్తించారు. అటవీశాఖ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు.


పిస్టల్‌ను పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్


ఫైరింగ్ సాధన చేస్తున్న పవన్ కల్యాణ్

జనసేనాని స్ట్రైక్‌రేట్ 100%!

తాడేపల్లి, న్యూస్‌టుడే: అధికారులతో సమావేశాలు.. క్షేత్రస్థాయి పర్యటనలతో బిజీగా ఉండే జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిస్టల్‌తో ఫైరింగ్ సాధన చేస్తూ కనిపించారు. ఈ నెల 4న గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలోని ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌ను ఆయన సందర్శించారు. అక్కడి అధికారులతో మాట్లాడి తుపాకీ నిర్వహణ వివరాలు తెలుసుకున్నారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ సభ్యుడిగా కొనసాగిన పవన్ కల్యాణ్.. మద్రాస్ రైఫిల్ క్లబ్ సభ్యుడిగా చెన్నైలో ఉన్న రోజుల్లో చేసిన రైఫిల్ ఫైరింగ్ సాధనను గుర్తు చేసుకున్నారు. గ్లోక్ 0.45 పిస్టల్‌తో ఏపీఎస్పీ ఫైరింగ్ రేంజ్‌లో 30 రౌండ్ల వరకు కాల్చి, ప్రాక్టీస్ చేశారు. ఈ వీడియోను మంగళగిరి నియోజకవర్గ జనసేన మీడియా విభాగ వర్గాలు ఆదివారం విడుదల చేశాయి.

రేపు మైనారిటీ సంక్షేమ దినోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సేవలందించిన వారికి విశిష్ట పురస్కారాలు అందించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణపై ఆదివారమిక్కడ అధికారులతో మంత్రి ఫరూక్ సమీక్షించారు.

139 మంది అవార్డులకు ఎంపిక

ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేసిన వారికి అవార్డులతోపాటు ఇచ్చే నగదు ప్రోత్సాహకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెంచింది.

■ మౌలానా అజాద్ జాతీయ అవార్డుకు వైకాపా ప్రభుత్వం రూ.1.50 లక్షలు అందించగా, కూటమి ప్రభుత్వం దాన్ని రూ.2.50 లక్షలకు పెంచింది. ఈ అవార్డుకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన షేక్ సయ్యద్ బాషా ఎంపికయ్యారు.

■ డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డుకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు పెంచారు. నంద్యాల జిల్లాకు చెందిన మహమ్మద్ అంజాద్ బాషా సిద్దిఖీ ఈ అవార్డుకు ఎంపికయ్యారు.

■ జీవనకాల సాఫల్య పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందించనున్నారు. ఈ అవార్డులకు రాష్ట్రవ్యాప్తంగా 8 మందిని ఎంపిక చేశారు. వైఎస్సార్ కడప జిల్లా నుంచి ఎస్.అన్వర్ హుస్సేన్, పి.మహమ్మద్ మునీమ్, కర్నూలుకు చెందిన సయ్యద్ ఖాద్రీ రసూల్, ఎన్.సలీమ్ బాషా, ఎ.నసీర్ హుస్సేన్, అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన సయ్యద్ రియాజ్, విజయవాడకు చెందిన ఎండీ ఇర్ఫాన్ పాషా, తాడేపల్లికి చెందిన సయ్యద్ నసీర్ అహ్మద్ ఈ అవార్డులకు ఎంపికయ్యారు.

■ ఉత్తమ ఉర్దూ అధ్యాపకులుగా ఐదుగురు, ఉత్తమ ఉపాధ్యాయులుగా 66 మంది ఎంపికయ్యారు. వీరికి రూ.10 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తారు. 58 మంది ఉత్తమ విద్యార్థులుగా ఎంపికయ్యారు. వీరికి రూ.5 వేలు చొప్పున ఇస్తారు. మొత్తంగా వివిధ కేటగిరీల కింద ఇచ్చే అవార్డులకు 139 మంది ఎంపికయ్యారు.

భారాస నుంచి అవమానకరంగా పంపారు

ఆడపిల్ల రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తా: కవిత

బాలసముద్రం, న్యూస్‌టుడే: 'భారాస నుంచి నన్ను అవమానకరంగా బయటకు పంపారు.. తప్పు చేసి ఉంటే నోటీసైనా ఇవ్వాల్సింది. ఇప్పుడు రాజకీయంగా భారాసతో ఎలాంటి సంబంధం లేదు' అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. ఆదివారం తెలంగాణ హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు ప్రొటోకాల్ పేరుతో నన్ను నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికే కట్టడి చేశారు. నాడు ప్రజా సమస్యలపై మాట్లాడే అవకాశం లేకుండా అనేక కుట్రలు చేశారు. అయినా అనేక సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించా. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ వ్యయం పెంచారు. మొదట రూ.1,100 కోట్లతో ఒక కంపెనీకి వచ్చిన పనులను బినామీ కంపెనీకి ఇచ్చారు. ఆ బినామీ కంపెనీ అంచనాలు రూ.1,700 కోట్లకు చేర్చింది. ఈ బినామీ కంపెనీ హరీశ్‌రావుదే. ఫ్రెంచ్ విప్లవం, సాయుధ పోరాటం, తెలంగాణ ఉద్యమాల స్ఫూర్తితో 'అవకాశం, అధికారం, ఆత్మగౌరవం' నినాదాలతో జనం బాట కార్యక్రమం చేపట్టా. పాలక పక్షం, ప్రతిపక్షం పనిచేయడం లేదు. అందుకే మేము ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నాం. ఇప్పుడే రాజకీయం చేయను, ఇంకా సమయం ఉంది, ఆడపిల్ల రాజకీయం చేస్తే ఎలా ఉంటుందో చూపిస్తా' అని కవిత అన్నారు.

మంచు కురిసే వేళలో..

(మొదటి పేజీ తరువాయి)

ప్రకాశం, అనకాపల్లి, నంద్యాల, పార్వతీపురం మన్యం, పల్నాడు, తూర్పు గోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 నుంచి 20 డిగ్రీల మధ్యలో నమోదవుతున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్టులో 12.7, డుంబ్రిగుడలో 13.7, పెదబయలులో 13.9, అరకులో 14.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తగ్గాయి.

సాంకేతికత.. నమ్మకం.. వాణిజ్యం

(మొదటి పేజీ తరువాయి)

లండన్‌లోని యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ ఎండీ నాదియా పెట్కోవా సహా అంతర్జాతీయ సంస్థలు, వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖులు అతిథుల జాబితాలో ఉన్నారు.

200 మంది భారత అగ్రశ్రేణి సీఈఓలు

భారతదేశానికి చెందిన సుమారు 200 మంది అగ్రశ్రేణి సంస్థల సీఈఓలు సదస్సులో పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇతర దేశాలకు చెందిన 102 మంది మంత్రులు, 13 మంది కేంద్ర మంత్రులు, 40కి పైగా బహుళజాతి సంస్థలు, 650కి పైగా ప్రపంచస్థాయి సీఎక్స్‌ఓలు (చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్), 500కు పైగా భారతదేశ సీఎక్స్‌ఓలతో పాటు 100 దేశాలకు చెందిన 250 పారిశ్రామిక సంఘాలను ఆహ్వానించారు. మొత్తంగా సుమారు 2,500 మంది వరకు పాల్గొంటారని అంచనా.

■ భాగస్వామ్య సదస్సు వేదిక నుంచి రూ.25,302 కోట్ల విలువైన 30 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం చేయడంతో పాటు రూ.2,68,434 కోట్ల వ్యయంతో చేపట్టే 82 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఇందులో ఐటీ రంగానికి చెందిన రూ.99,857 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి.

భాగస్వామ్య సదస్సు సందర్భంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇవే

ప్రాంతం	ప్రాజెక్టులు	పెట్టుబడులు	ఉపాధి
రాయలసీమ	34	58,883	47,558
కోస్తా	78	2,34,853	2,27,892

భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు

శాఖ	ఒప్పందాలు	ప్రతిపాదిత పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగ కల్పన
పరిశ్రమలు, వాణిజ్యం	101	4,03,528	1,97,342
ఇంధన	26	2,65,288	68,660
ఐటీ, ఎలక్ట్రానిక్స్	79	98,138	1,61,757
మారిటైమ్ బోర్డు	23	54,954	74,390
ఏపీసీఆర్‌డీఏ	40	48,965	6,200
మెప్మా	19	38,768	39,287
టూరిజం	56	28,660	52,199
టెక్స్‌టైల్స్	14	21,635	53,850
ఆహారశుద్ధి	32	12,313	88,412
విమానాశ్రయ అభివృద్ధి	2	4,000	–
పశుసంవర్ధక	18	–	6,330
మొత్తం	410	9,76,249	7,48,427

సంతృప్త శాతంలో.. సర్కారుకే టోకరా

(మొదటి పేజీ తరువాయి)

టోకరా వేస్తున్నారు. భూములు, స్థలాలు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో కొనుగోలుదారుల ఫోన్ నంబర్లు తీసుకుంటారు. వీటినే ప్రభుత్వానికి పంపిస్తారు. సంతృప్త శాతం సేకరణకు ప్రభుత్వం నుంచి ఫోన్లు వీటికే వస్తాయి. దీంతో కొన్నిచోట్ల కొనుగోలుదారుల ఫోన్ నంబర్లకు బదులు.. డాక్యుమెంట్ రైటర్లు, ప్రైవేటు వ్యక్తుల నంబర్లనే నమోదు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ కాల్‌సెంటర్ నుంచి కొనుగోలుదారులకు బదులు.. వీరికే ఫోన్లు వెళ్తున్నాయి. తమను ఎవరూ డబ్బు అడగలేదని, సేవలు అద్భుతంగా అందాయని వారు చెబుతున్నారు. ఇంత చేసినా సంతృప్త శాతం బాగా వస్తుందా అంటే అదీ లేదు. అవినీతి జరుగుతోందని 33% మంది పైగా చెప్పారు.

■ స్లాట్ బుకింగ్ సులభతరంగా లేదని కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో 38% మంది, నవంబరులో 29.9% మంది చెప్పారు. రిజిస్ట్రేషన్ సేవల్లో ఇబ్బందులున్నాయని తొలి ఏడాదిలో సగటున 31.6% మంది, నవంబరులో 22.9% మంది అభిప్రాయపడ్డారు.

అవినీతి జరుగుతోందని చెప్పినవారు

కాలం	స్లాట్ బుకింగ్	రిజిస్ట్రేషన్ సేవలు
కూటమి ప్రభుత్వ తొలి ఏడాదిలో	33.0%	38.4%
ఈ ఏడాది తొలి త్రైమాసికం	36.8%	37.5%
నవంబరులో	33.4%	34.7%

₹5,000 కోట్లతో లారస్ ల్యాబ్స్ ప్లాంట్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తయిందని లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకులు, ముఖ్య కార్యనిర్వహణాధికారి చావా సత్యనారాయణ తెలిపారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇక్కడ అధునాతన తయారీ కాంప్లెక్స్ నిర్మిస్తామని, ఇందుకోసం రాబోయే 8 ఏళ్లలో 600 మిలియన్ డాలర్ల (సుమారు రూ.5,280 కోట్లు) పెట్టుబడులు పెడతామని వెల్లడించారు. ఇప్పటి నుంచి ఏడాదికి రూ.1,000 కోట్ల పెట్టుబడితో పనులు చేపడతామని వివరించారు. భవిష్యత్తులో అప్పటి అవసరాలకు అనుగుణంగా, మరింత పెట్టుబడి పెట్టేందుకూ సిద్ధమని పేర్కొన్నారు.

ఫెర్మెంటేషన్ ప్లాంట్ కూడా..: ఔషధ పరిశ్రమల్లో ఫెర్మెంటేషన్ ప్రక్రియ కీలకం. ఇందుకు అవసరమైన యూనిట్‌ను ఇంతకుముందు మైసూర్ (కర్ణాటక)లో ఏర్పాటు చేయాలని లారస్ ల్యాబ్స్ ప్రతిపాదించింది. ఇప్పుడు ఈ ప్లాంటునూ విశాఖపట్నంలోనే ఏర్పాటుచేస్తామని.. ఈ పనులు శరవేగంగా చేపడతామని సత్యనారాయణ మదుపర్లతో నిర్వహించిన ఎర్నింగ్స్ కాల్‌లో చెప్పారు. మైసూర్ నుంచి ఈ ప్లాంటును విశాఖకు తరలించేందుకు ఇక్కడి మెరుగైన మౌలిక వసతులు, నౌకాశ్రయం అందుబాటులో ఉండటం కారణమన్నారు. వ్యర్థాలను శుద్ధిచేసే సదుపాయాలు మైసూర్‌లో ఇంకా సిద్ధం కాలేదని, అందుకే ఈ సదుపాయం కోసమూ విశాఖనే ఎంచుకున్నట్లు విశదీకరించారు.

■ ఈ సంస్థకు హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు, ముంబయి, కాన్పూర్‌లలో తయారీ, పరిశోధనా కేంద్రాలున్నాయి. మొత్తం 7,000 మందికి పైగా ఉద్యోగులున్నారు.

గ్రహం అనుగ్రహం

10–11–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
పంచమి: ఉ. 7-55 తదుపరి షష్ఠి
పునర్వసు: రా. 1-24 తదుపరి పుష్యమి
వర్జ్యం: మ. 1-57 నుంచి 3-29 వరకు
అమృత ఘడియలు: రా. 11-07 నుంచి 12-38 వరకు
దుర్ముహూర్తం: మ. 12-07 నుంచి 12-52 వరకు
తిరిగి 2-22 నుంచి 3-07 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.06; సూర్యాస్తమయం: సా.5.23

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	35.0	22.0
అనంతపురం	33.8	19.5
నరసాపురం	33.0	24.2
నెల్లూరు	32.6	24.5
ఒంగోలు	32.1	23.3
తాడేపల్లిగూడెం	32.0	28.0
విశాఖపట్నం	31.8	23.2
కర్నూలు	31.6	18.3
తిరుపతి	31.5	25.4
విజయవాడ	31.4	21.4
గుంటూరు	31.0	23.0
శ్రీకాకుళం	31.0	21.0
విజయనగరం	31.0	22.0
హైదరాబాద్	29.2	16.9
కడప	28.0	21.0



శ్రీవారి ఆలయం నుంచి పార్వేట మండపానికి చిన్న గజవాహనంపై బయలుదేరిన మలయప్పస్వామి

తిరుమలలో కార్తిక వనభోజన మహోత్సవం



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి అభిషేకం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపంలో తితిదే ఆదివారం కార్తిక వనభోజన మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించింది. ఉదయం మలయప్పస్వామి వారిని బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి వాహన మండపానికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి స్వామివారు చిన్న గజవాహనంపై, ఉభయ నాంచారులు పల్లకిలో పార్వేట మండపానికి ఊరేగింపుగా బయలుదేరారు. అనంతరం స్నపన తిరుమంజనం కనులపండువగా జరిగింది. వర్షాల కారణంగా 2020 నుంచి పార్వేట మండపంలో వనభోజనాలు జరగలేదు. ఐదేళ్ల తర్వాత నిర్వహించడంతో భక్తులు భారీగా హాజరయ్యారు.

సైబర్ మోసమా... ఫస్ట్ రియాక్ట్ అవ్వు బ్రో!

సత్వర ఫిర్యాదుతోనే ఛేదించవచ్చు ● నిపుణుల సూచనలు



వెబినార్‌లో పాల్గొన్న జి.పాలరాజు, శ్రీరామ్, పాటిబండ్ల ప్రసాద్, ప్రతాప్ శివకిశోర్

ఈనాడు, హైదరాబాద్: సైబర్ మోసానికి గురైతే ఎలాంటి వెనకడుగూ వేయకుండా ఫిర్యాదు చేసేందుకు ధైర్యంగా ముందుకు రావాలని సూచిస్తున్నారు నిపుణులు. సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయి, బాధితులు ఎలా స్పందించాలనే అంశాలపై 'ఈనాడు' వెబినార్ నిర్వహించింది. ఈటీవీ సీనియర్ న్యూస్ కోఆర్డినేటర్ పోచిరాజు శ్రీరామ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ వెబినార్‌లో ఏపీ ఫోరెన్సిక్ ప్రయోగశాల డైరెక్టర్, ఐజీ జి.పాలరాజు, సీఆర్‌సీఐడీఎఫ్ డీజీ పాటిబండ్ల ప్రసాద్, ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిశోర్ కీలక సూచనలు చేశారు. ప్రజలు, అధికార యంత్రాంగం సమష్టి కృషితో దండయాత్ర చేస్తేనే ఈ మోసాలను నిలువరించగలమన్నారు. ఈ సందర్భంగా వారు చేసిన సూచనలు, సలహాలు ఇవీ..

● సైబర్ నేరాలు రెండు రకాలు. ఆర్థిక, ఆర్థికేతర నేరాలు. ఎన్‌సీఆర్‌బీ, ఐ4సీ (ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్) అధ్యయనం ప్రకారం.. పెట్టుబడి, ఉద్యోగం, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ పేరుతో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి.

● డిజిటల్ అరెస్టు పేరుతో ఇటీవల ఎక్కువ మోసాలు జరుగుతున్నాయి. కొత్త నేర న్యాయ చట్టాల్లో 'డిజిటల్ అరెస్టు' ఉందేమోనన్న అపోహతో గంటల తరబడి వీడియో కాల్‌లో నేరగాళ్ల ముందు కదలకుండా కూర్చుంటున్నారు.

పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

● ఉద్యోగాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి ధ్రువీకరించుకోవాలి. అక్కడి నుంచే అప్లై చేసుకోవాలి. జాబ్ ఆఫర్ మెయిల్స్ వచ్చినప్పుడు ఐడీని నిశితంగా పరిశీలిస్తే ఒరిజినలా లేక నకిలీనా అనేది అర్థమవుతుంది.

● 'మీ ఇంటర్వ్యూ వాట్సప్ లేదా టెలిగ్రామ్ ద్వారా చేస్తాం' అని ఎవరైనా అంటే అనుమానించాల్సిందే. జూమ్ కాల్స్, వెబ్ ఎక్స్, మైక్రోసాఫ్ట్ టీమ్స్ వంటి ప్రొఫెషనల్ ప్లాట్‌ఫాం ద్వారానే ఇంటర్వ్యూలు చేసే అవకాశాలు ఉంటాయి. ఉద్యోగం చేస్తే మీకు డబ్బులు వస్తాయి తప్ప.. దాని కోసం మీరు డబ్బులు కట్టక్కర్లేదు.

● యూజర్ డేటా ప్రొటెక్షన్ కోసం కేంద్ర ప్రభుత్వం డీపీడీపీ యాక్ట్‌ను తీసుకొచ్చింది. డేటా సర్వీస్ ప్రొవైడర్లు/ ప్రొడక్ట్ సర్వీస్ ప్రొవైడర్ల సర్వర్లు హ్యాక్ అయి మీ డేటా లీక్ అయితే భారీ పెనాల్టీలు విధించేలా ఆ చట్టం రూపొందించారు.

● యూజర్ ఐడీలు, మన ఫోన్ నంబర్లు లీకయ్యాయేమో అనేది తెలుసుకోవాలంటే haveibeenpwned.com అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూడొచ్చు. అందులో మీ మెయిల్ ఐడీ ఇస్తే వివరాలు వస్తాయి.

● మన దేశంలో జరుగుతున్న సైబర్ మోసాల్లో 90 శాతం అసలు బయటపడటం లేదు. పరువు పోతుందనో, మరో కారణంతోనో చాలా మంది మౌనంగా ఉండిపోతున్నారు. ఇది సరికాదు. సైబర్ నేరం జరిగిందని గుర్తించిన ఒకట్రెండు గంటల్లోనే 1930కి కాల్ చేసి ఎలా జరిగిందన్న సమాచారం ఇవ్వాలి. అలాగే మీ బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల ట్రాన్సాక్షన్లకు పరిమితులు సెట్ చేసుకోవాలి.



ఆలయం ఎదుట ముకేశ్ అంబానీ. చిత్రంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ దక్షిణ భారత మెంటార్ పి.వి.ఎల్.మాధవరావు, తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి, తితిదే బోర్డు సభ్యుడు ఎన్.సదాశివరావు తదితరులు

శ్రీవారి సేవలో ముకేశ్ అంబానీ

● తిరుమలలో అధునాతన అన్నప్రసాద కేంద్రం నిర్మాణానికి చేయూత అందించేందుకు అంగీకారం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ ఆదివారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి సాదర స్వాగతం పలికారు. అనంతరం శ్రీవారి సుప్రభాత సేవలో పాల్గొని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఆయనకు రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం, అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట తితిదే బోర్డు సభ్యుడు ఎన్.సదాశివరావు తదితరులున్నారు.

ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు..: తిరుమలలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న అధునాతన అన్నప్రసాద కేంద్రం నిర్మాణానికి ముకేశ్ అంబానీ చేయూత అందించనున్నారు. సీఎం చంద్రబాబు సూచనలతో రూ.100 కోట్లకు పైగా అంచనాలతో అత్యాధునిక కిచెన్, ఏఐ టెక్నాలజీలతో భక్తులకు ఈ అన్నప్రసాద కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై తితిదే దృష్టి సారించింది. శ్రీవారి దర్శనానికి వచ్చిన ముకేశ్ అంబానీ దృష్టికి ఈ విషయాన్ని తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని సామాజిక మాధ్యమ వేదికగా రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ప్రకటించింది. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే దాదాపు రెండు లక్షల మంది భక్తులకు ప్రతిరోజూ అన్నప్రసాదం అందించే అవకాశం ఉంటుంది. తితిదే, ఏపీ ప్రభుత్వంతో కలిసి ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్నందుకు ఆనందంగా ఉందని రిలయన్స్ సంస్థ పేర్కొంది.

గురువాయురులో ఆసుపత్రుల నిర్మాణానికి రూ.15 కోట్ల విరాళం

తిరుమల పర్యటన అనంతరం ముకేశ్ అంబానీ కేరళ రాష్ట్రం త్రిశ్శూర్ జిల్లా గురువాయుర్‌లో శ్రీకృష్ణ ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో తలపెట్టిన మల్టీస్పెషాలిటీ ఆసుపత్రితో పాటు ఆలయానికి చెందిన ఏనుగుల వైద్యం కోసం నిర్మించే ఆధునిక పశు వైద్యాలయానికి రూ.15 కోట్ల విరాళం చెక్కు అందజేశారు.

శ్రీశైలంలో కోటి దీపోత్సవానికి పేర్ల నమోదు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో కార్తిక మాసోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 14న కోటి దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు ఈ నెల 12వ తేదీ లోపు దేవస్థానం ప్రజా సంబంధాల విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దీపోత్సవానికి అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే అందజేయనున్నట్లు తెలిపారు.

ముందే వచ్చిన తాటిముంజలు!



బీచ్‌రోడ్డులోని శీతకొండ మలుపు వద్ద తాటిముంజల విక్రయాలు

వర్షాకాలంలో ఎండలు మండిపోవడం.. వేసవిలో వర్షాలు పడడం.. శీతాకాలంలో చలి తక్కువగా ఉండడం చూస్తున్నాం. అలాగే కొన్ని కాలాల్లో మాత్రమే కాసే కాయలు ఏడాది పొడవునా కనిపిస్తున్నాయి. ఈ కోవలోనే వేసవి కాలంలో మాత్రమే లభించే తాటి ముంజలు శీతాకాలంలోనూ దొరుకుతున్నాయి. విశాఖపట్నం నగర శివారు ప్రాంతాలైన ఆనందపురం, భీమిలి, పద్మనాభం నుంచి వీటిని తెచ్చి విశాఖ-భీమిలి బీచ్‌రోడ్డులోని సీతకొండ వద్ద ఓ వ్యక్తి తాజాగా విక్రయించారు. డజను తాటి ముంజెలు రూ.100 చొప్పున అమ్మారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (గ్రామీణ భీమిలి)

రూ.95 కోట్లు దోచేసిన 81 మంది అరెస్టు

● ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్

● నిందితుల్లో బ్యాంకు, ఐటీ ఉద్యోగులు, దినసరి కూలీలు

ఈనాడు, హైదరాబాద్: సైబర్ నేరాలపై యుద్ధం ప్రకటించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో గతంలో ఎన్నడూలేని విధంగా దేశవ్యాప్తంగా ఏకకాలంలో ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి 81 మందిని అరెస్టు చేసింది. అక్టోబరులో 25 రోజులపాటు జరిగిన ఈ భారీ ఆపరేషన్‌లో అనేక మంది అధికారులు పాల్గొన్నారు. భారీ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) సంచాలకులు శిఖాగోయల్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విదేశాల్లో కాల్‌సెంటర్లు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రజల నుంచి రూ.95 కోట్లు దోచుకున్న 41 కేసులను ఎంపిక చేసిన సీఎస్‌బీ అధికారులు వాటి లింకులు ఛేదించుకుంటూ కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రల్లో దాడులు జరిపి 81 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇందులో 17 మంది ఏజెంట్లు కాగా చెక్కులు, నగదు విత్‌డ్రా చేసేవారు 11 మంది, నకిలీ ఖాతాలు నిర్వహిస్తున్నవారు 53 మంది ఉన్నారు.

దేశవ్యాప్తంగా 754 నేరాలతో సంబంధం..

అరెస్టయిన వారిలో 106 కేసులతో సంబంధం ఉన్న ఐడీఎఫ్‌సీ బ్యాంకుకు చెందిన సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి, బంధన్ బ్యాంకు మేనేజర్ ఉన్నారు. కొల్లగొట్టిన డబ్బు లావాదేవీల్లో వీరికి ప్రత్యక్షంగా సంబంధం ఉంది. అలాగే కంప్యూటర్ ఆపరేషన్స్‌లో డిప్లొమా విద్యార్హత ఉన్న వ్యక్తికి 96, చెన్నైలోని కిల్పాక్ ఆడిట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎకౌంటెంట్‌కు 31 కేసులు, బీబీఏ చదివిన వ్యక్తికి 45 కేసులలో ప్రమేయం ఉంది. బహుళ జాతి సంస్థలో పనిచేస్తున్న ఒక వ్యక్తి తన కార్పొరేట్ ఖాతాను కూడా నేరాల కోసం వాడినట్లు వెల్లడైంది. ఐటీ ఉద్యోగులు, ఆరోగ్య రంగంలోని వారు, దళారులు, విద్యార్థులు, దినసరి కూలీలు కూడా అరెస్టయిన వారిలో ఉన్నారు. వీరందరికీ తెలంగాణలో 128, దేశవ్యాప్తంగా 754 నేరాల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులతో సంబంధం ఉన్న పలువురు విదేశీయుల కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు.

రాష్ట్రాల వారీగా అరెస్టయిన వారి వివరాలివి	
కేరళ	28
మహారాష్ట్ర	23
ఆంధ్రప్రదేశ్	10
తమిళనాడు	7
కర్ణాటక	13

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాలో 4,255 సీట్ల భర్తీ

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ఎంబీబీఎస్ ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌లో 262 సీట్లు భర్తీ అయినట్లు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి తెలిపారు. ఇప్పటికి మూడు విడతల్లో కలిపి 4,255 సీట్లు భర్తీ అయ్యాయన్నారు. సీట్లు పొందినవారు నవంబరు 11న మధ్యాహ్నం 3 గంటల్లోగా చేరాలని, నియామక పత్రాలు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మూడో విడత కౌన్సెలింగ్‌లో ప్రత్యేక కేటగిరీ ఎన్‌సీసీ కోటాలో 39, క్రీడా విభాగంలో 21, ఎస్సీ విభాగంలో 12 సీట్లు కలిపి 72, రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొంది చేరని 17 మంది, ఫ్రీ ఎగ్జిట్ ఇచ్చిన 48 మంది, కొత్తగా వైద్య కళాశాలల్లోకి వచ్చిన 125 కన్వీనర్ సీట్లను కలిపి మొత్తం 262 సీట్లు తాజాగా భర్తీ చేసినట్లు చెప్పారు. మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు సెప్టెంబరు 22 నుంచి ప్రారంభం అయ్యాయని, మూడో విడత కౌన్సెలింగ్‌లో చేరని సీట్లను 'స్ట్రే' విడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు.

రైతులకు అండగా.. మద్దతు చెప్పేలా!



ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్

మార్కెట్ పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను రైతులు దళారులకు అయిన కాడికి తెగనమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఈ పరిస్థితిని మార్చి. . అన్నదాతలకు మద్దతు ధర అందించే లక్ష్యంతో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కృషి చేస్తోంది. ఖరీఫ్‌లో వివిధ పంటలకు అందించే కనీస మద్దతు ధరల వివరాలను రైతులతో పాటు ప్రజలందరికీ తెలిసేలా కలెక్టరేట్లలో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తోంది. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్లకు వచ్చే వారు ఈ సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. – ఈనాడు అమరావతి

బాబా శతజయంతి వేడుక.. విశ్వమంతా పండగ

● దేశ, విదేశాల నుంచి తరలిరానున్న భక్తులు

● 18న రథోత్సవంతో కార్యక్రమాలు ప్రారంభం



విద్యుత్ కాంతులతో యజుర్వేద మందిరం

ఈనాడు, పుట్టపర్తి: పుట్టపర్తి, న్యూస్‌టుడే: మానవాళికి ప్రేమను పంచిన శ్రీసత్యసాయి శతజయంతి వేడుకలకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ మందిరాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. వేడుకలకు దేశ, విదేశాల నుంచి లక్షల మంది భక్తులు తరలిరానున్నారు. ఇప్పటికే మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ దేశాధినేతల నుంచి పలువురు ముఖ్యమంత్రులు, గవర్నర్లను కలిసి వేడుకలకు ఆహ్వానం పలికారు. పుట్టపర్తి విద్యుత్తు కాంతులతో వెలుగులీనుతోంది.

అఖండ భజనలతో నాంది

సత్యసాయి శతజయంతి వేడుకలకు ఈ నెల 8న ప్రశాంతినిలయం వేదికగా గ్లోబల్ అఖండ భజనతో నాంది పలికారు. 18న జరిగే రథోత్సవంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 19న హిల్‌వ్యూ స్టేడియంలో జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వచ్చే అవకాశాలున్నాయి. 20, 21 తేదీల్లో సాయికుల్వంత్ మందిరంలో నాయకత్వ లక్షణాలపై యువజన సదస్సులు నిర్వహిస్తారు. 22న సత్యసాయి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఉంటుంది. 23న సత్యసాయి శతజయంతి వేడుకలు హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహిస్తారు. భక్తుల కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులు నడుపుతున్నారు.


మౌలిక సదుపాయాలు

భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా ట్రస్టు వర్గాలు ఏర్పాట్లు చేపట్టాయి. తాత్కాలిక టెంట్లు, వసతి, భోజనం, తాగునీరు, స్నానపు గదులు, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. వేడుకల ప్రారంభం నుంచి ముగిసేవరకు 25 లక్షల మంది రావొచ్చని అంచనా వేశారు. ప్రశాంతినిలయంతో పాటు పడమర ద్వారం, గణేశ్ కూడలి, గోకులంలో భక్తులకు తాత్కాలిక వసతితో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. రోజూ లక్ష మందికి అన్నప్రసాదం అందించేలా సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 13 నుంచి 25వరకు భక్తులకు మూడుపూటలా భోజన సదుపాయం కల్పించనున్నారు.

ప్రైవేటు వైద్య, దంతవైద్య కళాశాలల ఫీజు ఖరారు

● 2020–23 బ్లాక్ పీరియడ్‌తో పోలిస్తే పెంపునకు అనుమతి ● యూజీ కోర్సులకు 10%, సూపర్‌స్పెషాలిటీ, పీజీ కోర్సులకు 15% పెంపు

● మూడు వేర్వేరు ఉత్తర్వులిచ్చిన వైద్యారోగ్యశాఖ ● ఫీజు పెంపు నిర్ణయం కోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టీకరణ



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు అన్ ఎయిడెడ్ ప్రొఫెషనల్ వైద్య, దంత వైద్య కళాశాలల్లో సూపర్ స్పెషాలిటీ, పీజీ, యూజీ కోర్సులకు 2025-26 విద్యా సంవత్సరానికి ఫీజుల్ని ప్రభుత్వం ఖరారు చేసింది. 2020-23 బ్లాక్ పీరియడ్‌లో ఉన్న ఫీజుపై యూజీ కోర్సులకు 10%, సూపర్ స్పెషాలిటీ, పీజీ కోర్సులకు 15% చొప్పున పెంపును తాత్కాలికంగా ఆమోదించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఆదివారం మూడు వేర్వేరు ఉత్తర్వులిచ్చింది. సుప్రీంకోర్టు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల తుది తీర్పునకు లోబడి ఈ ఫీజు నిర్ణయం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

సూపర్ స్పెషాలిటీ కోర్సులకు..: జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, కాటూరి మెడికల్ కాలేజీ, నారాయణ మెడికల్ కాలేజీ, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, డాక్టర్ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య కళాశాలలకు రూ. 17.25 లక్షలుగా ఫీజును నిర్ధారించింది.

యూజీ కోర్సులకు..

ఎంబీబీఎస్‌లో..	ఏ కేటగిరీ రుసుం:	రూ.16,500
	బీ కేటగిరీ రుసుం:	రూ.13.20 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా)
	సీ కేటగిరీ రుసుం:	రూ.39.60 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా)
బీడీఎస్‌లో..	ఏ కేటగిరీ రుసుం:	రూ.14,300
	బీ కేటగిరీ రుసుం:	రూ.4.40 లక్షలు (మేనేజ్‌మెంట్ కోటా)
	సీ కేటగిరీ రుసుం:	రూ.13.20 లక్షలు (ఎన్ఆర్ఐ కోటా)

పీజీ కోర్సులకు ఇలా

మెడికల్ విభాగంలో..

1. క్లినికల్ డిగ్రీ కోర్సులకు
   - ఏ కేటగిరీ రుసుం: రూ.4,96,800 (కన్వీనర్ కోటా)
   - బీ కేటగిరీ రుసుం: రూ.9,93,600 (మేనేజ్‌మెంట్)
   - సీ కేటగిరీ రుసుం: రూ.57.50 లక్షలు (ఎన్ఆర్ఐ/ఇన్‌స్టిట్యూషనల్)
2. పారా క్లినికల్ డిగ్రీ, డిప్లొమా కోర్సులకు
   - ఏ కేటగిరీ రుసుం: రూ.1,55,250 (కన్వీనర్)
   - బీ కేటగిరీ రుసుం: రూ.3,10,500 (మేనేజ్‌మెంట్)
   - సీ కేటగిరీ రుసుం: రూ.17.25 లక్షలు (ఎన్ఆర్ఐ/ఇన్‌స్టిట్యూషనల్)
3. ప్రీ క్లినికల్ డిగ్రీ కోర్సులకు
   - ఏ కేటగిరీ రుసుం: రూ.70,380 (కన్వీనర్)
   - బీ కేటగిరీ రుసుం: రూ.1,40,760(మేనేజ్‌మెంట్)
   - సీ కేటగిరీ రుసుం: రూ.9.20 లక్షలు (ఎన్ఆర్ఐ/ఇన్‌స్టిట్యూషనల్)

దంతవైద్య విభాగంలో...

1. క్లినికల్ డిగ్రీ కోర్సులకు
   - ఏ కేటగిరీ రుసుం: రూ.3,41,550 (కన్వీనర్)
   - బీ కేటగిరీ రుసుం: రూ.6,83,100 (మేనేజ్‌మెంట్)
   - సీ కేటగిరీ రుసుం: రూ.13.80 లక్షలు (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)
2. పారా క్లినికల్ డిగ్రీ, డిప్లొమా కోర్సులకు
   - ఏ కేటగిరీ రుసుం: రూ.3,07,395 (కన్వీనర్)
   - బీ కేటగిరీ రుసుం: రూ.4,99,790 (మేనేజ్‌మెంట్)
   - సీ కేటగిరీ రుసుం: రూ.8,05,000 (ఎన్ఆర్ఐ/ ఇన్‌స్టిట్యూషనల్)

ఈనాడు

ప్రజాభద్రతకు కుక్కల బెడద!

వాడవాడలా విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధికుక్కలు చిన్నాపెద్దా అందరినీ బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధానంగా చిన్నపిల్లలపై అవి క్రూరంగా దాడి చేస్తూ ప్రాణాలు తీస్తున్నాయి. మొన్న జులైలో నంద్యాల జిల్లా బనగానపల్లి మండలంలో ఇంటిముందు ఆడుకుంటున్న బాలికను అలాగే పొట్టన పెట్టుకున్నాయి. అదే నెలలో మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో మూడేళ్ల బాలుణ్ని రాకాసి శునకాలు మూకుమ్మడిగా చుట్టుముట్టి చంపేశాయి. అంతకుముందు గుంటూరులో వీధికుక్క నాలుగేళ్ల బాలుడి మెడపట్టి ఈడ్చుకెళ్లడంతో పాపం ఆ పిల్లాడికి అప్పుడే నూరేళ్లు నిండిపోయాయి. కొద్దిరోజుల క్రితం మెదక్ జిల్లా తూప్రాన్‌లో శునకాలు ఒకేరోజు పాతిక మందిని గాయపరిచాయి. ఇటీవల ప్రపంచ పారాఅథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ సమయంలో దిల్లీ స్టేడియం దగ్గరే వీధికుక్కలు జపాన్, కెన్యా కోచ్‌లను కరిచాయి. ఎక్కడికక్కడ వాటి విజృంభణ తీవ్ర సమస్యగా పరిణమించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధికుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించి సంతాన నియంత్రణ చికిత్సలు చేయాలని ఆదేశించింది. వీధిశునకాల జనాభాను కట్టడి చేయడంలో యంత్రాంగం చేతకానితనమే ప్రజాభద్రతకు పెనుముప్పుగా మారిందిప్పుడు!

పశుసంవర్ధక శాఖ లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా కోటిన్నరకు పైగా వీధికుక్కలున్నాయి. సందుగొందుల్లో యథేచ్ఛగా విహరిస్తున్న వాటి సంఖ్య వాస్తవంలో అంతకు నాలుగు రెట్లు ఎక్కువగా ఉంటుందని పరిశీలనలు చాటుతున్నాయి. అధికారిక గణాంకాల మేరకు నిరుడు దేశీయంగా 37లక్షలకు పైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇవి 21శాతం అధికం! గడచిన మూడేళ్లలో తెలంగాణలో 3.33 లక్షల మంది కుక్కకాట్ల బారినపడ్డారు. అదే కాలవ్యవధిలో ఏపీలో అంతకు రెట్టింపు మంది ఆ నరకలోకపు జాగిలాల ఉన్మాద ప్రకోపాలకు బాధితులయ్యారు. సుప్రీంకోర్టు గత ఉత్తర్వులను అనుసరించి స్థానిక సంస్థల అధికారులు వీధి శునకాలకు రేబిస్ టీకాలు వేయించి, సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. కానీ- యంత్రాంగం అలక్ష్యం, సిబ్బంది-నిధుల లేమివల్ల అవేమీ అంతగా ఆచరణకు నోచుకోవట్లేదు. దాంతో కుక్కకాట్లు, రేబిస్ మరణాలు అధికమవుతున్నాయి. ప్రాణాంతక రేబిస్ విశ్వవ్యాప్తంగా ఏటా 60వేల మందిని కబళిస్తోంది. వారిలో 36శాతం భారతీయులు కావడం దురదృష్టకరం! ప్రభుత్వాసుపత్రుల్లో రేబిస్ టీకాల కొరతకు తోడు అవగాహన లోపంతో చాలా మంది నాటువైద్యాన్ని ఆశ్రయిస్తుండటం ప్రాణాలమీదకి తెస్తోంది!

వీధికుక్కల గుంపుల స్వైరవిహారంతో బయటికి రావాలంటేనే చాలా చోట్ల జనం బీతిల్లుతున్నారు. వాటికి జడిసి పెద్దలు వాకింగ్ మానేస్తున్నారు. పిల్లలు పార్కులూ మైదానాల్లో ఆటలకు దూరమవుతున్నారు. అంతిమంగా ఇది ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోంది. కుక్కలు భీకరంగా అరుస్తూ వాహనదారులను వెంబడిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. 'స్వచ్ఛభారత్' అమల్లోకి వచ్చాక దేశవ్యాప్తంగా బహిరంగ మలవిసర్జన తగ్గింది. కానీ, వీధికుక్కలు ఇష్టారాజ్యంగా తిరుగుతూ పరిసరాలను పాడుచేస్తుండటం లేనిపోని రోగాలకు అంటుకట్టే ప్రమాదముంది. 2030కల్లా దేశంలోంచి రేబిస్‌ను తరిమికొట్టాలన్నది కేంద్రం లక్ష్యం. అది సాకారం కావాలంటే శునకాల సంతాన నియంత్రణకు ప్రభుత్వాలు తగినంతగా నిధులు కేటాయించాలి. ప్రభుత్వాసుపత్రుల్లో రేబిస్ టీకాలను విరివిగా అందుబాటులో ఉంచాలి. నానా రకాల చెత్త, ఆహార వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయడం వీధికుక్కల సంతతిని ఇబ్బడిముబ్బడి చేస్తుందని ప్రజలూ గుర్తించాలి!

స్వేచ్ఛ అనేది కేవలం రాజకీయ అధికారానికే పరిమితం కాదు. సామాజిక, ఆర్థిక, నైతిక స్వేచ్ఛలను ప్రతి పౌరుడూ అనుభవిస్తున్నప్పుడే ఆ దేశం స్వతంత్రమైనది అవుతుంది.

– బిపిన్ చంద్రపాల్



శ్రీమన్నారాయణుడు

దైవం అంటే సర్వోన్నత శక్తి. ఆ శక్తికి ఒక రూపం లేదని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. ఈ భూమి, దాని పైనున్న సకల జీవులు, చరాచర ప్రకృతి, నదీనదాలు, లోతు తెలియని సముద్రాలు, అంతరిక్షం... అన్నీ ఆ శక్తి సృజనలే. ఆ చలన శక్తికి నివాసం లేదు. అందువల్లే ప్రతి జీవిలోని అంతర్గత శక్తినే దైవం అంటున్నాం. ఆ సమర్థత ఇంకెవరి తరం కాదు. ఆ సృష్టికర్త విశ్వాన్ని పాలించేవాడు.

బలమెవ్వడు నీకు నాకు బ్రహ్మాండములకు అన్నట్లు ఆ సత్తువను అనంత విశ్వాన్ని సృష్టించిన పారమార్థిక అధికారాన్ని మనం నారాయణుడనే పేరుతో పిలుచుకుంటున్నాం. ఆ నిపుణత ఆలోచనలకు నిరూపణలకు అందనిది. వర్ణనలకు అతీతమైనది. విశ్వమంతటిలో ఆ నారాయణుడు నిండి ఉన్నాడు. అందుకే 'ఎక్కడరా నీ నారాయణుడు' అని తండ్రి అంటే- ఇందు కలడు అందు లేడని అనుకోవద్దు తండ్రీ.... ఆయనకు ధామం (నివాసం) లేదు. పరంధాముడాయన... అన్నాడు ప్రహ్లాదుడు.



అంతర్యామి

నారాయణుడు పుట్టుక, వృద్ధాప్యం లాంటివి(జరా మరణాలు) లేనివాడని గరుడపురాణం చెబుతోంది. ఆ సర్వ సమర్థుడు కల్యాణకారకుడు, అనంతుడు, మాయకు అతీతుడు, పరమ పవిత్రుడు, మంగళమయుడు. కాలగర్భంలో కలిసి సమసి పోయిందనుకున్న సంఖ్యా శాస్త్రాన్ని తిరిగి సృజించి జీవులను తరింపజేసిన నారాయణుణ్నే శ్రీహరి అంటున్నామందుకే. ఇందువల్లే అన్నమాచార్యులు 'నారాయణతే నమో నమః' అన్నాడు. శ్రీకృష్ణుడు భగవద్గీతను అర్జునుడికి ఉపదేశిస్తూ 'సంభవామి యుగే యుగే' అన్నాడు. జన్మలన్నింటిలోకి మానవ జన్మ గొప్పది కాబట్టి మనుషులు అధర్మం చేస్తే ధర్మ సంస్థాపన కోసం నారాయణుడు అవతరిస్తాడు. ఆ శక్తి నిరంతరం మనుషుల ఔన్నత్యం కోసం పరితపిస్తూనే ఉంటుంది. ఎవరిని పూజించినా ఆ పూజాఫలం కేశవుడికే దక్కుతుందని బ్రహ్మ సూత్రాలు తెలుపుతున్నాయి. 'సర్వ దేవ నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' అంటోంది యజుర్వేదం. ఆ అద్భుత శక్తి కన్నా వేరేదీ లేదంటారు. నారాయణుడే పరమాత్మ, పరబ్రహ్మ, దేవాధిదేవుడు, సృష్టి స్థితి లయలకు కర్త. 'శివాయ విష్ణు రూపాయ, శివ రూపాయ విష్ణవే' అనేది పరమాత్మ వివిధ రూపాల మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. ఇది పరమాత్మ ఐక్యతకు నిదర్శనం.

దేవ రహస్యాలు అంటూ ఏమీ ఉండవు. తెలుసుకునే సమర్థత పట్టుదల ఉండాలే కానీ ఆ సర్వ శక్తిమంతుడు జీవులకు అందుబాటులోనే ఉంటాడు. నేనే గొప్పవాణ్నే అనే భావం ఆయనకు ఉండదు. గుణాలేవీ లేని ఉత్తముడు దేవుడు. ఆయనలో లీనమై మనుషులు సైతం బ్రహ్మగా మారవచ్చు. అందుకే 'అహం బ్రహ్మాస్మి' అనుకుని సాధన చేయాలని బృహదారణ్యక ఉపనిషత్తు చెబుతోంది. అన్నమయ్య 'కొరుదు నామది ననిశము గుణధరు నిర్గుణు కృష్ణుని' అంటూ ఎలుగెత్తి కీర్తించిందీ అందుకే మరి.

– అప్పరుసు రమాకాంతరావు

తీరని దిల్లీ బాధలు...
కరుణించని కృత్రిమ వానలు!



ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయు కాలుష్యం నుంచి తప్పించుకోవడానికి దిల్లీ ప్రభుత్వం కృత్రిమ వర్షాలపై ఆశలు పెట్టుకుంది. మేఘమథనం ద్వారా వానలు కురిపించి, వాతావరణంలోని కాలుష్య కారకాలను తొలగించవచ్చని భావిస్తోంది. ఇందుకు చేసిన తాజా ప్రయత్నాలేవీ ఫలించలేదు. హస్తినపై చినుకు రాలలేదు. దీంతో కాలుష్య కట్టడికి ఈ విధానంపై ఆధారపడటాన్ని కొందరు నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

భౌగోళికంగా దిల్లీ ఉన్న ప్రదేశం చాలా సంక్లిష్టమైనది. శీతాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. వాహనాల పొగ, నిర్మాణ పనుల నుంచి రేగే ధూళి, పంట వ్యర్థాల దహనం వంటివాటితో పీఎం-2.5, 10 వంటి సూక్ష్మరేణువులు ఉద్ధృతమవుతుంటాయి. వీటికి ఒకింత స్తబ్దుగా ఉండే గాలులు తోడవడంతో హస్తినలో కాలుష్య కారకాలు పెరిగి, గాలి నాణ్యత తగ్గిపోతోంది. మొన్న దీపావళి మరుసటి రోజుకల్లా దిల్లీలోని చాలా ప్రాంతాలు దట్టమైన పొగమంచు గుప్పిట్లో చిక్కుకుపోయాయి. అనేక చోట్ల వాయు నాణ్యత సూచీ 'తీవ్రస్థాయి'కి పడిపోయింది. ఈ నేపథ్యంలో దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కృత్రిమ వర్షం అంశాన్ని తెరపైకి తెచ్చారు.

అంతా అనుకూలంగా ఉంటేనే...

మేఘాల ద్వారా వర్షాన్ని కురిపించే సహజసిద్ధ ప్రక్రియను ఈ విధానం ఒకవిధంగా వేగవంతం చేస్తుంది. మేఘాల్లోకి సిల్వర్ అయొడైడ్, డ్రై ఐస్(ఘన కార్బన్ డైఆక్సైడ్), సాధారణ ఉప్పు, రాక్‌సాల్ట్, అయొడైజ్డ్ ఉప్పు వంటివి చల్లుతారు. ఇవి కృత్రిమ వర్షాలకు విత్తనాల్లా పనిచేస్తాయి. వాటి చుట్టూ నీటి బిందువులు, మంచు స్ఫటికాలు ఏర్పడతాయి. వాటిని న్యూక్లియై అంటారు. క్రమంగా అవి పెద్దవిగా మారి, పరస్పరం కలిసిపోయి భారీ పరిమాణాన్ని సంతరించుకుంటాయి. ఈ దశలో అవి కిందకి పడిపోవడం మొదలవుతుంది. మార్గమధ్యంలో మంచు స్ఫటికాలు కరిగి, వానలా నేలపై పడతాయి.



మేఘమథనంలో రెండు విధానాలు ఉన్నాయి. మేఘాల ఉష్ణోగ్రత సున్నా డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా ఉంటే... సిల్వర్ అయొడైడ్ రేణువులను ఉపయోగిస్తారు. దీన్ని గ్లేసియోజెనిక్ సీడింగ్ అంటారు. మేఘాల ఉష్ణోగ్రతలు సున్నా డిగ్రీల సెల్సియస్ కన్నా ఎక్కువ ఉంటే, సీడింగ్ కోసం సోడియం క్లోరైడ్ లేదా పొటాషియం క్లోరైడ్‌తో కూడిన రసాయన ద్రావణాన్ని ఉపయోగించడం రెండో పద్ధతి. దీన్ని హైగ్రోస్కోపిక్ సీడింగ్ అంటారు. వీటిని విమానాలు, రాకెట్లు, నేల నుంచి ప్రత్యేక జనరేటర్ల ద్వారా మేఘాల్లోకి పంపుతారు. కరవు ప్రాంతాల్లో వర్షాలు కురిపించడానికి, వడగళ్ల వానను నివారించడానికీ ఈ విధానాన్ని ప్రయత్నిస్తుంటారు. ఇటీవల ఐఐటీ కాన్పూర్, దిల్లీ ప్రభుత్వం, భారత వాతావరణ విభాగం సంయుక్తంగా దిల్లీలో మేఘమథనం ప్రాజెక్టును చేపట్టాయి. గ్లేసియోజెనిక్ సీడింగ్ విధానాన్ని ప్రయత్నించాయి. ఇందులో సిల్వర్ అయొడైడ్‌కు బాణసంచా లాంటి పదార్థాలను కలిపారు. ఈ మిశ్రమాన్ని ప్రత్యేక సెస్నా 206-హెచ్ విమానం ద్వారా మేఘాల్లోకి తీసుకెళ్లి, జ్వాలల రూపంలో విడుదల చేశారు. మేఘమథనం తరవాత 15 నిమిషాల నుంచి నాలుగు గంటల్లోగా వర్షం పడాలి. దిల్లీలో పలు దఫాలుగా ప్రయత్నించినా వాన కురవలేదు.

విమానం ద్వారా రసాయనాలను ఆకాశంలోకి తీసుకెళ్లి చల్లేస్తే వర్షం కురవదు. ఆకాశంలో సరిపడా మేఘాలు ఉండాలి. వాటిలో కనీసం 50శాతం తేమ ఉండటంతో పాటు అవి నేలకు 500 నుంచి ఆరు వేల మీటర్ల ఎత్తులో సంచరిస్తేనే మేఘమథనానికి అనుకూలం. ఉష్ణోగ్రత, మేఘాల సాంద్రత వంటి అంశాలూ ప్రభావం చూపుతాయి. దిల్లీ వంటి మహానగరంలో మేఘమథనం ఫలించడం కష్టమనీ, పొడి వాతావరణంతో కూడిన శీతాకాలంలో ఇది దాదాపు అసాధ్యమని కొందరు నిపుణులు చెబుతున్నారు. పైగా అక్టోబరు, నవంబరులో దిల్లీలో ఎక్కువకాలం మనుగడలో ఉండే, తేమ అధికంగా కలిగిన మేఘాలు ఏర్పడటం చాలా అరుదు. అక్కడ క్లౌడ్ సీడింగ్ చేపట్టినప్పుడు మేఘాల్లో తేమ 15-20 శాతమే ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఒకవేళ మేఘమథనం విజయవంతమై ఉంటే గాలిలోని సూక్ష్మ ధూళికణాలు నేలమీదకు వచ్చి, వాయు నాణ్యత మెరుగుపడేది. ఇలాంటి ప్రయోగం వల్ల 3-4 మిల్లీమీటర్ల వర్షం పడినా కాలుష్యం 25-30శాతం మేర తగ్గొచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

యాభై ఏళ్లుగా పరిశోధనలు...

పుణెలోని భారత ఉష్ణమండల వాతావరణ పరిశోధన సంస్థ(ఐఐటీఎం) 1972 నుంచి మేఘమథనంపై పరిశోధనలు సాగిస్తోంది. కానీ ఇంతవరకు మిశ్రమ, అసంపూర్ణ ఫలితాలే వచ్చాయి. ప్రామాణిక పరిస్థితుల్లో దీన్ని నిర్వహిస్తే వర్షపాతాన్ని 15-20 శాతం మేర పెంచొచ్చని 'క్లౌడ్ ఏరోసాల్ ఇంటరాక్షన్ అండ్ ప్రెసిపిటేషన్ ఎన్‌హాన్స్‌మెంట్ ఎక్స్‌పెరిమెంట్' పేరిట ఐఐటీఎం నిర్వహించిన ప్రయోగంలో వెల్లడైంది.

దేశంలో తొలిసారిగా 1984లో ఈ విధానాన్ని తమిళనాడులో నిర్వహించారు. ఆ తరవాత కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లలోనూ సాగాయి. అవన్నీ కరవును తగ్గించడానికి, వర్షపాతాన్ని పెంచడానికి చేపట్టినవే. అమెరికా, చైనా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోనూ మేఘమథనాన్ని ప్రయత్నించారు.

తాత్కాలిక ప్రయోజనాలే...

ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల్లో దిల్లీ ఒకటి. సురక్షితమైన గాలిలో నివసించేవారితో పోలిస్తే దిల్లీ వాసుల సగటు ఆయుర్దాయం 12 ఏళ్ల మేర కోతపడుతున్నట్లు అధ్యయనాలు తేల్చాయి. గాలిలో హానికర పీఎం-2.5 రేణువులు క్యూబిక్ మీటరుకు 15 మైక్రోగ్రాములు మించరాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించింది. అయితే, దిల్లీలో ఇటీవల అవి ఏకంగా 120రెట్లు పెరిగిపోయాయి. ఒకవేళ మేఘమథనం విజయవంతమైనా దానివల్ల కలిగే ఉపశమనం మూడు రోజులే! పైగా భారీ ఖర్చు, వాతావరణ అనిశ్చితి వంటి పరిస్థితుల వల్ల దిల్లీలో కాలుష్య కట్టడికి మేఘమథనాన్ని ప్రధాన సాధనంగా ఉపయోగించడం కుదరదన్నది నిపుణుల అభిప్రాయం. ఏదిఏమైనా వాహన ఉద్గారాలు, పంట వ్యర్థాల దహనం, నిర్మాణ పనులను సమర్థంగా నియంత్రించకపోతే- దిల్లీ కాలుష్యానికి శాశ్వత పరిష్కారం లభించకపోవచ్చు.

– కంభంపాటి సురేష్



ఎవరు నేర్పాలి?

'స్కూలుకు టైమ్‌కి రావాలని ఎన్నిసార్లు చెప్పాలి?' అన్నారు టీచర్ అసెంబ్లీ అయిపోయాక లోపలికొస్తున్న రాజేష్‌ని చూసి. పిల్లాణ్ని దించి వెళ్లబోతున్న తండ్రి వెనక్కి వచ్చి 'అయిదు నిమిషాలు ఆలస్యమైతే కొంపలేం మునిగిపోవు. బాబును అలా నిలబెట్టి అడగడం బాగోలేదు' అని హెచ్చరించినట్లు అన్నాడు. విద్యార్థి ముందే టీచర్‌ను అలా గదమాయిస్తే వారి మధ్య ఉండాల్సిన గురుశిష్య సంబంధం ఏ పరిస్థితికి దారితీస్తుందో ఊహకందనిది కాదు.

ఈమధ్య కాలంలో పాఠశాలల దగ్గర తరచుగా కనబడుతున్న దృశ్యమే ఇది. మూసి ఉన్న గేటు ముందు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుంపులుగా ఉంటున్నారు. ఒకప్పుడు సమయానికి బడికి రావడమనేది విద్యార్థి బాధ్యతగా ఉండేది. రాను రాను అది తల్లిదండ్రుల బాధ్యతగా మారింది. ఎవరికైనా రోజుకు ఉండేది 24 గంటలే. ప్రణాళికాబద్ధంగా నడుచుకునే వారికి ప్రతి నిమిషం విలువైందే అవుతుంది. అలారం పెట్టుకుని సమయానికి నిద్రలేచి పనులు చేసుకునే పిల్లలతో ఏ ఇబ్బందీ ఉండదు. నిద్ర లేవడం దగ్గర నుంచి అనుక్షణం సమయాన్ని గుర్తు చేస్తూ వెంటపడితే తప్ప తయారవ్వని వారితోనే సమస్య. తొందరగా పడుకుని, తొందరగా నిద్ర లేవడం ఆరోగ్యానికి చాలా మంచిదని అందరికీ తెలుసు. కానీ పాటించేది ఎంతమంది? ఇంట్లో పెద్దవారిని బట్టే పిల్లల అలవాట్లు ఉంటాయి. ఒకప్పుడు ఏడింటికి భోజనం చేసి తొమ్మిదింటికల్లా నిద్రపోయేవారు. టీవీలు వచ్చి నిద్రా సమయాన్ని పదీ, పదకొండు చేస్తే- మొబైల్, ఓటీటీ వచ్చాక ఒంటిగంట, రెండవుతున్నా పట్టపగల్లా లైట్లు వెలిగే ఇళ్లే కనిపిస్తున్నాయి. అలాంటివారికి పొద్దున్నే లేవడం సాధ్యం కాదు. ఏ ఏడింటికో లేచి అరుపులూ కేకలతో హడావుడిగా పిల్లల్ని లేపి, తయారుచేసి చివరి నిమిషంలోనో, అయిదు పది నిమిషాల ఆలస్యంతోనో బడి దగ్గర దింపుతారు. నిజమే, రాజేష్ తండ్రి అన్నట్లు అయిదు నిమిషాలు ఆలస్యమైతే ఏమీ అయిపోదు. అలాగని వదిలేస్తే ఆ అబ్బాయికి జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన అనేవి ఎప్పటికీ అలవాటు కావు. ఇంట్లోనూ స్కూల్లోనూ ఎక్కడా నేర్పకపోతే వాటి విలువ పిల్లలకు ఎలా తెలుస్తుంది?

'టైమ్ ఈజ్ మనీ' అంటారు కానీ, కానేకాదు. డబ్బుకి విలువ ఉంది, సమయానికి విలువ కట్టలేం. డబ్బు పోతే సంపాదించవచ్చు. ఎంత డబ్బున్నా పోయిన సమయంలో ఒక్క క్షణాన్ని కూడా కొనలేం. అందుకే పిల్లలకు సమయం విలువ చిన్నప్పుడే తెలియాలి. అలా తెలిసేలా ఇంటి వాతావరణాన్ని ఉంచాల్సింది పెద్దలే. ఇంట్లో పనులన్నీ సమయం ప్రకారం అయ్యేలా చూసుకోవాలి. రాత్రి భోజనం తప్పనిసరిగా పిల్లలతో కలిసి చేయాలి. వాళ్లు రోజూ ఒకే సమయానికి నిద్రపోయి ఉదయం త్వరగా నిద్ర లేచేలా బడిలో చేరక ముందు నుంచే అంటే- మూడో ఏట నుంచే అలవాటు చేయాలి.

– బండ్ల మాధవరావు

ఆర్థికాభివృద్ధికి జీవనాడులు

జాతీయ రహదారులు ఆర్థికాభివృద్ధిలో కీలకంగా నిలుస్తాయి. దేశీయంగా 2014లో నేషనల్ హైవే రహదారుల వ్యవస్థ పొడవు 91 వేల కిలోమీటర్లు. పదేళ్లలో అవి 60శాతం మేర పెరిగి 1.46 లక్షల కిలోమీటర్లకు చేరాయి. దశాబ్ద కాలంలో హైస్పీడ్ కారిడార్లు, రహదారుల పక్కన వాహనాలు నిలపడానికి, సైకిలిస్టులు వెళ్లడానికి ఏర్పాటున్న టూ లేన్ విత్ పేవ్డ్ షోల్డర్ రోడ్ల పొడవు బాగా పెరిగింది. నాలుగు లేన్లు అంతకు మించిన రహదారులూ విస్తరించాయి. పదేళ్ల కాలంలో ఆయా రోడ్ల పొడవుల్లో వచ్చిన మార్పులు.
(కిలోమీటర్లలో)

రోడ్డు రకం	2014	2024
రెండు లేన్లు	27,517	13,000
రెండు లేన్లు లేదా టూలేన్ విత్ పేవ్డ్ షోల్డర్	45,399	84,774
నాలుగు లేన్లు, అంతకు మించి	18,278	45,947
హైస్పీడ్ కారిడార్	93	2,474

(ఆధారం: కేంద్ర రోడ్డు రవాణా, హైవే మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక-2024-25)

సాహితీ సంరక్షకుడు... ప్రాతఃస్మరణీయుడు!


'తెలుగు సాహిత్యం చచ్చిపడి ఉంది. విదేశీయుణ్ని అయిన నేను ముప్పై సంవత్సరాల్లో దాన్ని తిరిగి బతికించి నిలబెట్టాను' అని చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ రాసుకున్నది అక్షరాలా సత్యం. మన విస్తృత సాహితీ సంపద విస్మృతమయ్యే పరిస్థితుల్లో ఆయన రంగప్రవేశం చేశారు అక్కడా ఇక్కడా ఆలయాల్లో, ఇళ్లల్లో, వ్యక్తిగత గ్రంథాలయాల్లో చెల్లాచెదురుగా ఉన్న అమూల్యమైన తాళపత్రాలు, రాతప్రతుల ఉనికిని ఆరాతీశారు. వాటిని సేకరించి పరిష్కరించి పండితులతో ప్రామాణిక వ్యాఖ్యానాలు రాయించారు. తాళపత్రాలకు రాతప్రతులు సిద్ధం చేయించారు. వాటిలో కొన్నింటిని ముద్రింపజేశారు. ఇలా మన భాషా సాహిత్యాలకు అపార సేవలందించిన సి.పి.బ్రౌన్ జయంతి నేడు!

కలకత్తాలో 1798 నవంబరు 10వ తేదీన రెవరెండ్ డేవిడ్ బ్రౌన్, ఫ్రాన్సిస్ కౌలే దంపతులకు జన్మించారు సి.పి.బ్రౌన్. ఆయన తండ్రి సంస్కృత భాషను నేర్చుకున్నాడు. పిల్లలకు అరబ్బీ, పార్సీ, హిందుస్థానీ, సంస్కృతాలను నేర్పించాడు. సి.పి.బ్రౌన్‌కు ఆంగ్ల సాహిత్యంపై అభిరుచి ఎక్కువగా ఉండేది. 1812లో తండ్రి చనిపోవడంతో బ్రౌన్ కుటుంబం ఇంగ్లాండ్‌కు వెళ్లిపోయింది. అక్కడ హెయిల్‌బరీ కాలేజీలో చదువుకున్నారు బ్రౌన్. లాటిన్, గ్రీకు భాషలూ నేర్చుకున్నారు. విద్యార్థులకు శిక్షణనిచ్చి భారతదేశంలో ఎక్కడికి ఏ ఉద్యోగంలో పంపాలో ఈస్ట్ ఇండియా కంపెనీ నిర్ణయించేది. సి.పి.బ్రౌన్‌ను మద్రాసు సర్వీసుకు ఎంపిక చేయడం ఒక చారిత్రక సేవకు నాంది పలికింది.

విదేశీయుడు అనుకోగలమా...

రైటర్ ర్యాంకులో సి.పి.బ్రౌన్ 1817 ఆగస్టులో మద్రాస్‌కు వచ్చారు. కంపెనీ సిబ్బందికి శిక్షణనిచ్చే ఫోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో చేరారు. అక్కడ చేరినవారు రెండు భారతీయ భాషలను తప్పక నేర్చుకోవాలి. తెలుగు, మరాఠీ నేర్చుకునేందుకు బ్రౌన్ దరఖాస్తు చేశారు. తరవాత మరాఠీకి బదులు హిందుస్థానీ తీసుకున్నారు. ఆయన తెలుగు నేర్చుకుంటాననడం మన భాషా సాహితీ భవితకు ప్రగతి సూచకమైంది. 22 ఏళ్ల సి.పి.బ్రౌన్‌కు 1820 ఆగస్టులో కడప కలెక్టర్‌కు అసిస్టెంటుగా ఉద్యోగమొచ్చింది. తెలుగు భాషలో పస, సాహిత్యంలోని లోతుపాతులు నెమ్మదిగా బ్రౌన్ జీవితాన్ని మార్చేశాయి.

కడప, మచిలీపట్టణం, రాజమహేంద్రవరం వంటి ప్రాంతాల్లో వేర్వేరు ఉన్నతోద్యోగాల్లో ఉన్నప్పుడు తెలుగు భాషా సాహిత్యాల రక్షణరాహిత్య దుస్థితి బ్రౌన్‌ను



కలచివేసింది. ఓ ఫ్రెంచి మతగురువు రాసిన 'హిందువుల ఆచారాలు, అలవాట్లు, మతకర్మలు' అనే ఆంగ్ల గ్రంథంలో వేమనను వివేకం, స్వతంత్రతగల గొప్పకవి అని బ్రౌన్ గమనించారు. అంతే.. మన జాతీయకవి పద్యాలను 'వెర్సెస్ ఆఫ్ వేమన' అని ఆంగ్లీకరించి ప్రపంచానికి చూపించారు. 223 ప్రాచీన గ్రంథాల గురించి పరిశీలన చేసి రిమార్కులు రాయడంలో బ్రౌన్ సమాచార పరిశోధనాసరళి తెలుస్తోంది. 49మంది లేఖకులు ఆయన దగ్గర ఉండేవారు. బ్రౌన్ కచ్చేరిలో 23 మంది పండితులు పనిచేసేవారు. 1825లో రాజమహేంద్రి కలెక్టర్‌కు హెడ్ అసిస్టెంట్ మేజిస్ట్రేట్‌గా వచ్చారు. నన్నయ స్వస్థలం వచ్చాననే స్ఫూర్తితో అక్కడ ఆంధ్ర మహాభారతం చదివారంటే, బ్రౌన్‌ను విదేశీయుడు అనుకోగలమా? 1826లో కడప జిల్లా కోర్టు రిజిస్ట్రార్‌గా చేరారు. అక్కడ పెద్ద బంగళా తోట కొన్నారు. దాన్ని బ్రౌన్ కాలేజీ అని ప్రజలు పిలిచేలా... అక్కడ సాహిత్య చర్చలు, గ్రంథాల పరిష్కారాలు నిత్యం సాగేవి. తెలుగు సాహితీ పైకంతో సొంత పైకంతో పండితుల పోషణ బాధ్యతలు చూసేవారు బ్రౌన్. మనుచరిత్ర తదితరాలకు జూలూరి అప్పయ్యతో అక్కడే వ్యాఖ్యానాలు వెలయింపజేశారు. బ్రౌన్ చలువతో ఎన్నో ప్రాచీన తెలుగు గ్రంథాలు నూతన దర్శనాలిచ్చాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పండితులను కలవడం, గ్రంథాలను సేకరించడం, కొనడం, గ్రంథాలయాల ఏర్పాటు ఉండేవి.

సాహితీ సముద్ధరణలో కారణజన్ముడు


ఆంధ్ర గీర్వాణ ఛందోరీతులను విశదపరుస్తూ ఇంగ్లీషు-తెలుగు, మిశ్రమ నిఘంటువులను కూర్చారు బ్రౌన్. ప్రజల వాడుకభాషలోని మాటల ద్వారానూ పదాలకు అర్థాలను వివరించారు. దాంతో ఆ నిఘంటువులకు సమగ్రత ఏర్పడింది. తనకు ముందు పరిశోధకులు రాసిన కైఫీయతులు, స్థానిక చరిత్రల గ్రంథాలను మంచి కాగితాలపై ఎత్తి రాయించారు బ్రౌన్. రాయల్ ఏసియాటిక్ జర్నల్ అనే ప్రామాణిక పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. కంపెనీ గ్రంథాలయంలో అనామకంగా ఉన్న తెలుగు, సంస్కృతం, కన్నడ రాతప్రతులకు పట్టికలు తయారుచేశారు. 'ధర్మబడులు' పేరిట విద్యాదానం చేశారు. తన జీవితకాలంలో ఎంతో భాగాన్ని తెలుగు భాషా సాహిత్యాలకే అంకితం చేసిన బ్రౌన్ ఛాయాచిత్రం లభ్యం కాలేదు. ఇప్పుడు మనకు కనపడేది ఊహాచిత్రాలే. బ్రౌన్ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ఏపీ ప్రభుత్వం నిశ్చయించడం అభినందనీయం. బ్రౌన్ సేకరణల్లోంచి పరిశోధనా గ్రంథ రత్నాలు ఇంకా వెలుగుచూడటానికి ఒక నేపథ్య సృష్టిగా దీన్ని భావించాలి. భారతదేశంలో పుట్టిన సి.పి.బ్రౌన్ 1884 డిసెంబరు 12న ఇంగ్లండ్‌లో కీర్తిశేషులయ్యారు. తెలుగు భాషాసాహిత్య సముద్ధరణలో ఆయన కారణజన్ముడు. ఇంతకన్నా పెద్ద విశేషణం ఉంటే ఇంకా బాగుండేది!

– సన్నిధానం నరసింహశర్మ

అలసత్వం ప్రమాదం

హాయ్! బుజ్జీ!!

ఒకరోజు జింక పరుగు పరుగున మృగరాజు దగ్గరికి వచ్చింది. 'రాజా! మన అడవికి వేటగాళ్ల గుంపు వచ్చింది. వారి వల్ల మన జీవులకు చాలా ప్రమాదం పొంచి ఉంది. నేను తృటిలో వారి బాణాలను తప్పించుకుని మీ దగ్గరికి వచ్చాను. మనం వెంటనే జాగ్రత్తపడటం మంచిది' అని చెప్పింది. 'ఇది నేను విశ్రాంతి తీసుకునే సమయం. ఇప్పుడు అటువైపు రాలేను. ఏదైనా ఉంటే రేపు ఉదయం చూసుకుందాం. అయినా అంతటి ప్రమాదం ఉంటే నీలాగే మిగతావీ తప్పించుకుంటాయిలే' అని నిర్లక్ష్యంగా జవాబిచ్చి.. హాయిగా విశ్రాంతి తీసుకోసాగింది మృగరాజు. దాంతో అక్కడి నుంచి వెళ్లి మిగతా జంతువులకు సమాచారం ఇచ్చింది జింక. అవి వేటగాళ్ల నుంచి తప్పించుకుని ప్రమాదం లేని చోట్ల తలదాచుకున్నాయి. వేటగాళ్లు జంతువుల కోసం తిరుగుతూ మృగరాజు గుహ దగ్గరికి వచ్చారు.



అక్కడ వారికి సింహం గురక శబ్దం వినిపించింది. మెల్లగా చప్పుడు చేయకుండా లోపలికి వెళ్లి తమతో పాటు తెచ్చిన ఒక మత్తు గుళికను సింహం ముక్కు దగ్గర పెట్టారు. ఆ వాసన పీల్చి.. మత్తులోకి వెళ్లగానే దాన్ని బోనులో బంధించి తీసుకెళ్లారు. తెల్లవారి మత్తు వీడిన సింహానికి తాను బోనులో చిక్కుకున్నాననే విషయం అర్థమైంది. 'జింక చెప్పినప్పుడు జాగ్రత్తపడి ఉంటే.. నేను ఇలా ఇరుక్కునేదాన్ని కాదు. రాజుగా అడవికి వచ్చే ప్రమాదాలను తప్పించాల్సింది పోయి.. నేనే ప్రమాదంలో చిక్కుకున్నాను. అసలు ఇప్పుడు అడవిలో జంతువుల పరిస్థితి ఎలా ఉందో ఏంటో?' అనుకుని బాధపడింది మృగరాజు.

– మొర్రి గోపి

అవునా.. కాదా!

ఇక్కడ కొన్ని వాక్యాలున్నాయి. వాటిని చదివి అవునో, కాదో చెప్పండి చూద్దాం.

1. ఇంద్రధనస్సులో ఎనిమిది రంగులు ఉంటాయి.
2. లాఫింగ్ గ్యాస్‌ని నైట్రస్ ఆక్సైడ్ అంటారు.
3. సూర్యుడు పడమర దిక్కున ఉదయిస్తాడు.
4. 'సున్నా'ని ఆర్యభట్ట కనిపెట్టారు.

జవాబు: 1.కాదు 2.అవును 3.కాదు 4.అవును



కార్తికమాసం ఆదివారం సందర్భంగా పెద్దలు, పిల్లలు కలిసి ప్రకృతి బాట పట్టారు. పచ్చని చెట్ల కింద సరదాగా గడిపారు. మ్యూజికల్ ఛైర్స్, లెమన్ స్పూన్, అంత్యాక్షరి వంటి పోటీల్లో ఆనందంగా పాల్గొన్నారు. అందరూ ఒకచోట కూర్చుని వన భోజనాలు చేశారు. నున్న మామిడితోటలో కనిపించిన సందడి ఇది. -ఈనాడు, అమరావతి



మామిడితోటలో వన భోజనాలు చేస్తూ..

బెజవాడలో అద్దె ఖాతాల జాడలు

- ఇద్దరు నగరవాసుల్ని అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు
- మోసగాళ్లకు సాయం చేసిన షణ్ముక ఆంజనేయులు, శ్రీధర్

ఈనాడు, అమరావతి

విజయవాడ నగరంలో మరోసారి అద్దె ఖాతాల జాడలు బయటపడ్డాయి. ఇటీవలి కాలంలో తరచూ విజయవాడకు చెందిన వారి ప్రమేయం ఈ వ్యవహారంలో వెలుగులోకి వస్తోంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తాజాగా అరెస్టు చేసిన నిందితుల్లో ఇద్దరు నగరానికి చెందినవారు ఉన్నారు. వ్యాపారి అయిన కోడూరి నాగ సాయి శ్రీధర్‌తో పాటు ఫెడరల్ బ్యాంకు ఉద్యోగి షణ్ముఖ ఆంజనేయులును ఇటీవల తెలంగాణ సైబర్ పోలీసులు వచ్చి విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ నమోదైన కేసుల్లో వీరి పాత్ర ఉండడమే ఇందుకు కారణం.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సాయం



నగరానికి చెందిన **షణ్ముఖ ఆంజనేయులు..** స్థానిక ఫెడరల్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో నమోదైన సైబర్ కేసులో అక్కడి పోలీసులు విచారణ చేస్తుండగా కొన్ని బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు బదిలీ అయినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ఖాతాదారులను అదుపులోకి తీసుకుని విచారించగా ఆంజనేయులు డబ్బుకు ఆశపడి చట్టవిరుద్ధంగా ఆర్థిక వ్యవహారాలు నిర్వహించినట్లు బయటకు వచ్చింది. అమాయకులను తీసుకువచ్చి, వారితో ఖాతాలు తెరిపించడం, ఆ పాస్ పుస్తకాలు, చెక్కు పుస్తకాలను ఏజెంట్లకు చేర్చడం వంటి వాటిలో క్రియాశీలక పాత్ర పోషించినట్లు వెలుగుచూసింది. నగదు, చెక్కుల ద్వారా విత్‌డ్రాయల్స్ కోసం సాయం చేసినట్లు గుర్తించారు.



★ ఇంజినీరింగ్ చదువుకుని వ్యాపారం చేస్తున్న మరో నిందితుడు **కోడూరి నాగసాయి శ్రీధర్** కూడా అరెస్టు అయ్యాడు. మొబైల్ నంబర్లు, సిమ్ కార్డులు సమకూర్చేవాడని తెలంగాణ సైబర్ పోలీసుల దర్యాప్తులో బయటకు వచ్చింది. అమాయకులను గుర్తించి, వారికి డబ్బు ఆశచూపించి వారి పేరుతో ఖాతాలు తెరిపించాడు. వారి పేరున సిమ్ కార్డులు తీసుకుని మోసగాళ్లకు చేర్చేవాడని తెలిసింది. వీటికి సంబంధించి శ్రీధర్‌కు 5 శాతం వరకు కమీషన్ అందేది.

తరచూ వెలుగుచూస్తున్న కేసులు

మూడు నెలల కిందట తెలంగాణ సైబర్ పోలీసులు విజయవాడకు చెందిన శరణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. సైబర్ నేరాల్లో కొట్టేసిన సొమ్మును పలు మార్గాల్లో బదిలీ చేసేందుకు మ్యూల్ ఖాతాలు తెరవడంలో కీలక సూత్రధారి. పలు ప్రాంతాల్లో డబ్బు ఆశచూపి బ్యాంకు ఖాతాలను తెరిపించి కమీషన్ ముట్టజెప్పేవాడని తెలిసింది. శరణ్‌కు పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు హైదరాబాద్ పోలీసుల విచారణలో వెల్లడైంది. కంబోడియా, చైనా, మలేషియా, దుబాయ్, తదితర దేశాల్లో సైబర్ నేరగాళ్లకు అద్దె ఖాతాలను సమకూర్చేవాడు.

కృష్ణా జలాలొచ్చేశాయ్!

ఈనాడు, అమరావతి



నీటిని తీసుకెళుతున్న మహిళలు

ఎ.కొండూరు పరిధిలోని కిడ్నీ బాధిత గిరిజన తండాల్లో ఇంటింటికీ స్వచ్ఛ జలాలను ట్రయల్ రన్‌లో భాగంగా అందించే కార్యక్రమం ఆరంభమైంది. కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే అత్యంత త్వరగా ప్రాజెక్టు పూర్తి చేసి గిరిజనులకు కృష్ణా జలాలు అందిస్తోంది. కేంద్ర జలజీవన్ మిషన్, రాష్ట్ర సంయుక్త ఆధ్వర్యంలో రూ.49.94కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నారు. సిలికా, ఫ్లోరైడ్ కలిసిన నీటిని తాగడం వల్లే తాము కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నామంటూ గిరిజనులు గత కొన్నేళ్లుగా తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే.. 300 మందికి పైగా కిడ్నీ వ్యాధుల బారినపడి చనిపోయారు.

ఇవే ఎనిమిది: ఈస్ట్ మాధవరం, వెస్ట్ మాధవరం, రేపూడితండా, మెట్టతండా, ఎల్ఐజీకాలనీ, పాత రేపూడి, కొత్త రేపూడి, కుమ్మరికుంట్ల గ్రామాలకు.. ట్రయల్‌రన్‌లో భాగంగా నీటి సరఫరా ఆరంభమైంది. స్వచ్ఛ జలాలు ఇంటింటికీ అందిస్తూ సమస్యలు ఎక్కడెక్కడున్నాయో గుర్తిస్తున్నారు.

డిసెంబరులోగా అందరికీ


మరోవైపు ఎ.కొండూరు పరిధిలోని మాన్‌సింగ్‌తండా, పెదతండా, కేసియాతండా, చీమలపాడు, దీప్లానగర్, కృష్ణారావుపాలెం గ్రామాలకు ట్రయల్‌రన్‌లో భాగంగా నీటిని అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తాజాగా కృష్ణారావుపాలెంలో పర్యటించి ప్రాజెక్టు పురోగతిని పరిశీలించారు. డిసెంబరులోగా పనులన్నీ పూర్తి చేసి అన్ని గ్రామాలకూ నీటి పంపిణీ ఆరంభించాలని సూచించారు.

38 గిరిజన తండాలకు జలాలు..

★ ఎ.కొండూరు పరిధిలోని 38 గిరిజన తండాల్లోని 30వేల మందికి ఈ ప్రాజెక్టు ద్వారా లబ్ధి చేకూరబోతోంది. ప్రస్తుతం ఎనిమిది తండాల్లో ఇంటింటికీ నీళ్లొస్తున్నాయి. మిగతా వాళ్లందరికీ డిసెంబరులోగా పనులన్నీ పూర్తిచేసి.. నీటిని అందించే ప్రక్రియ ఆరంభిస్తారు. ★ ఎ.కొండూరుకు 10కి.మీట దూరంలోని కుదప సంపు వద్ద పంప్‌హౌస్, 1.20లక్షల లీటర్ల ట్యాంకు ఏర్పాటు చేశారు. ఆ ట్యాంకు నుంచే నీటిని గిరిజన తండాలకు తీసుకొచ్చే పైప్‌లైన్ వేశారు.

★ కుదప ట్యాంక్ నుంచి గిరిజన తండాల్లోని.. 36 ట్యాంకులకు నీటిని సరఫరా చేసి.. అక్కడి నుంచి ఇంటింటికీ పంపిణీ చేస్తారు. ఈ ట్యాంకుల్లో ఎక్కువ భాగం నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగిలినవి కూడా తుదిదశలో ఉన్నాయి.

> మాకు ఏమీ వద్దు తాగడానికి కృష్ణా జలాలు అందించాలంటూ గత ఐదేళ్ల వైకాపా హయాంలో వేడుకున్నా పట్టించుకోలేదు. స్వయంగా నాడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ వచ్చి, హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయారు. చంద్రబాబు సర్కారు కొలువుదీరిన వెంటనే ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయిస్తోంది.



కుదప వద్ద సిద్ధమైన పంప్‌హౌస్, ట్యాంకు

పతకాల మోత.. స్వారీలో ప్రత్యేకత!

సాధారణంగా గుర్రపు స్వారీలో సవారీ చేసే వాళ్లనే విజేతలుగా చూస్తుంటాం. కానీ అసలైన విజేతలం తామేనని.. తమకి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయంటున్నాయి గుర్రాలు. గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ ఏఆర్‌ఈడీ ఎన్‌సీసీ యూనిట్ ఆవరణలోని గుర్రాలు ఎన్‌సీసీ (గ్రూప్), రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాయి. క్యాంపునకు చెందిన నీల్‌జాజ్, గోల్డెన్ స్టార్, గూగుల్ పేర్లు గల గుర్రాలు.. గణతంత్ర వేడుకల్లో వివిధ పతకాలు సాధించాయి. 15 ఏళ్ల వయసున్న నీల్ జాజ్ మూడు పర్యాయాలు వేడుకల్లో పాల్గొనగా రెండు బంగారు పతకాలు, 18 ఏళ్లున్న గోల్డెన్‌స్టార్ రెండు పర్యాయాలు పాల్గొనగా ఒక రజతం.. ఒక్కసారే పాల్గొన్న ఏడేళ్ల వయసున్న గూగుల్ కూడా బంగారు పతకం సాధించింది. యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ లల్లూర్ శ్రీధర్‌చౌదరి, సిబ్బంది ఆటలీచార్జ్, బాబూరావు, గాలయ్య సుజీత్ మార్గదర్శకత్వంలో తర్ఫీదు పొందుతున్నాయి.





-ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

తిరుపతమ్మ అలంకారం.. శోభాయమానం



పెనుగంచిప్రోలులోని గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ అమ్మవారిని పలు రకాల పండ్లతో అలంకరించారు. కార్తికమాసం మూడో ఆదివారం సందర్భంగా గన్నవరానికి చెందిన చిలకపాటి లక్ష్మీగణేష్, గోపినేనిపాలెం గ్రామానికి చెందిన కామినేని రాంబాబు, అనిల్‌కుమార్‌ల సహకారంతో అమ్మవారికి పండ్లతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈవో కిశోర్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే


కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నదిలో వరద ప్రవాహం ఆదివారం తగ్గుముఖం పట్టింది. ఉదయం ఆరు గంటలకు 60,150 క్యూసెక్కులను సముద్రంలోకి, 8,473 క్యూసెక్కులను కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు విడుదల చేశారు. సాయంత్రానికి క్రమేపీ వరద ప్రవాహం తగ్గింది. రాత్రి 7 గంటలకు 60 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. మిగతా 10 గేట్లను మూసివేశారు. 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. పంట కాల్వలకు 8,850 క్యూసెక్కులు వదిలారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,615, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 5,009, గుంటూరు ఛానల్‌కు 226 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 1,705, ఏలూరు 1,110, కేఈబీ 500, బందరు కాల్వలకు 300 క్యూసెక్కుల మేర ఇస్తున్నారు.

జీవన ధ్రువపత్రం అందుకోండిలా..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా జీవన ధ్రువపత్రాన్ని పింఛనుదార్లు వారివారి సంస్థలకు ఆన్‌లైన్లో సమర్పించేలా భారతీయ తపాలాశాఖ ఏర్పాట్లు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారు ప్రతి సంవత్సరం నవంబరు నుంచి ధ్రువపత్రం తమ పింఛను ఆగకుండా సంబంధిత కార్యాలయాల్లో సమర్పించాల్సి ఉంటుంది. పింఛను పొందుతున్న వృద్ధులైన, కుటుంబ పింఛనుదారులు ఆయా కార్యాలయాలకు వచ్చి ఈ పత్రం సమర్పించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు భారతీయ తపాలాశాఖ తన అనుబంధ సంస్థ ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు ద్వారా బయోమెట్రిక్ ఆధారిత ఆధార్ నంబరు అనుసంధానించి లైఫ్ సర్టిఫికెట్ అందించనుంది.



ఎలా చేయాలంటే.. గూగుల్ ప్లేస్టోర్ నుంచి పోస్టు ఇన్ఫో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో చిరునామా, పేరు, పిన్‌కోడ్ వివరాలు నమోదు చేసి సంబంధిత సంస్థకు సమర్పించాల్సి ఉంది. ఓటీపీ వచ్చిన తర్వాత నిర్ణయించిన తేదీన సంబంధిత తపాలా కార్యాలయానికి చెందిన ఉద్యోగి వారి ఇంటి వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న మొబైల్ కిట్ ద్వారా వేలిముద్రలు స్వీకరించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ అందిస్తారు. బయోమెట్రిక్ విధానంలో ఆధార్‌తో అనుసంధానమై ఉంటుంది. పింఛనుదారుల సంస్థ నుంచి సర్టిఫికెట్ అందినట్లు వారి చరవాణికి సమాచారం వస్తుంది. ఇంటి వద్దనే అత్యంత సులభమైన సురక్షితమైన ఈ సేవలను వినియోగించుకోవాలని తపాలశాఖ అధికారులు సూచించారు.

పైసలిస్తేనే.. పాస్‌పుస్తకం



- రూ.5వేల నుంచి రూ.20వేల వరకు వసూళ్లు
- అడ్డంగా దోచేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈనాడు, అమరావతి

★ **పామర్రు** నియోజకవర్గ పరిధిలోని ఓ తహసీల్దార్, ముగ్గురు వీఆర్వోలు, ఓ ప్రైవేటు వ్యక్తిని పనుల్లో పెట్టుకుని దండుకుంటున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా కొర్రీలు పెట్టి ఒక్కో పాస్ పుస్తకం మంజూరుకు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. తాజాగా ఓ రైతు పాస్ పుస్తకం కోసం డబ్బులు డిమాండ్ చేయగా సదరు రైతు విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో తహసీల్దార్ బండారం బయటపడింది.

★ **ఇబ్రహీంపట్నం, జి.కొండూరు** మండలాల పరిధిలో ఆరుగురు వీఆర్వోలు వసూళ్ల పరమావధిగా పని చేస్తున్నారు. ఆర్‌ఐ నెలలో 5 పాస్ పుస్తకాలు మంజూరు చేయడానికి సైతం ముడుపులు ఇవ్వాల్సిందే. రూ.70వేలు వసూలు చేశారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని రైతులు అంటే ఇదంతా మా కోసమే కాదు.. చాలా మంది దేనికి తలా కొంత పంచాలంటూ చెప్పడం గమనార్హం.

★ **తిరువూరు** నియోజకవర్గంలోని ఓ తహసీల్దార్ రైతులను దోచేస్తున్నారు. పాస్ పుస్తకం కోసం వస్తే సంబంధిత వీఆర్వోతో మాట్లాడండి అని చెబుతారు. రైతులు వీఆర్వోలకు ముడుపులు సమర్పిస్తేనే దస్త్రం కదులుతుంది. పుస్తకానికి రూ.10వేలు చొప్పున వసూలు చేస్తున్నారు.

పాస్ పుస్తకాల మంజూరులో రెవెన్యూ సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. పైసలిస్తే తప్ప పాస్ పుస్తకం మంజూరు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. అవసరాన్ని బట్టి ఓ ధర, ఆత్మహత్యాయత్నం మరో ధర అన్నట్లు వసూళ్ల పర్వం సాగుతున్నాయి. వీఆర్వోలు కొందరు తహసీల్దార్లు కమ్మక్కయి కథ నడిపిస్తున్నారు. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు.

దరఖాస్తుకు ముందే ముడుపులు..

నిబంధనల ప్రకారం పాస్‌పుస్తకాల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. అన్నీ సక్రమంగా ఉంటే నెలలో మంజూరు చేయాలి. చాలా మంది రైతులకు అవగాహన లేక దరఖాస్తు చేయకుండా వీఆర్వోను కలుస్తున్నారు. వారు దరఖాస్తు చేయించకుండా బేరం తెగ్గొడుతున్నారు. ముడుపులు కూడా ముందే తీసుకుంటున్నారు. ఒక్కో పాస్ పుస్తకానికి అవసరాన్ని బట్టి రూ.5వేల-రూ.20వేల వరకు వసూలు చేసుకుంటున్నారు.

తహసీల్దార్లే సూత్రధారులు..

ముడుపులు తీసుకొస్తేనే దస్త్రం కదులుతుందని కొందరు తహసీల్దార్లు వీఆర్వోలకు అనధికారిక నిబంధనలు పెడుతున్నారు. తెలంగాణ సరిహద్దుల్లోని ఓ మండలంలో తహసీల్దార్ లక్ష్యాలు పెట్టి మరీ వేధిస్తున్నారని కొందరు వీఆర్వోలు తలలు పట్టుకుంటున్నారు. రైతులు నేరుగా దరఖాస్తు చేసినా.. సిపార్సులు చేయించినా చుక్కలు చూపిస్తున్నారు. విచారణ, సర్వే, కొలతల్లో నిత్యం ఏదో ఒక తిప్పలు పెడతారు. ★ 'విచారణ చేసి రైతులను ఇబ్బందులు పెట్టే రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని' కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

పచ్చని ఛత్రం..



చెట్టే ఛత్రంగా మారి..ఎండ నుంచి రక్షణ ఇస్తున్న ఈ చిత్రం చూశారా. కడియం నుంచి తెచ్చిన పొగడ చెట్టు ఇది. ఈ మొక్కను అందంగా కత్తిరిస్తూ ఇలా గొడుగు ఆకారంలో తీర్చిదిద్దారు విజయవాడ గురునానక్‌కాలనీ సమీపంలోని కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీకి చెందిన విద్యాసాగర్. మొక్కలు పెంచాలనుకోవడం మంచిదే కానీ ఎప్పటికప్పుడు వాటి నిర్వహణ చేపడితేనే అందంగా కనిపించడంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతాయని ఆయన తెలిపారు. –ఈనాడు, అమరావతి

ప్రజాసమస్యల పరిష్కార వేదిక నేడు

పాయకాపురం, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం (నేడు) ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ జి. లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆనంద ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు



వాకథాన్‌లో కలెక్టర్ లక్ష్మీశ వాస్క్యులర్ సర్జన్లు, వైద్యులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర విజన్- 2047 లక్ష్యంతో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే స్వర్ణాంధ్ర సాధించగలమని తెలిపారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఐ.ఎం.ఎ. హాలు నుంచి వాస్క్యులర్ వాక్‌థాన్ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వాస్క్యులర్ వ్యాధులు, సర్జరీల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కలిగే ఇబ్బందులు గురించి ప్రజలకు వివరిస్తే.. తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ కిరణ్ మాకినేని మాట్లాడుతూ. . వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియాలో 800 మంది వరకు సభ్యులు ఉన్నారని, నేడు దేశవ్యాప్తంగా 22 ప్రాంతాల్లో ఈ వాక్‌థాన్ నిర్వహించినట్లు తెలిపారు. జాగ్రత్తలు పాటించటం, రక్తనాళాలకు చికిత్స చేయడం ద్వారా చాలా వరకు తగ్గించవచ్చన్నారు. మధుమేహాన్ని ముందు నుంచి నియంత్రించుకోవాలని, రక్తనాళాల సమస్యలకు మందులు వాడాలని, కాలికి పుండు ఉంటే ముందే డ్రస్సింగ్ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వాస్క్యులర్ సర్జన్లు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకానికి.. ఒక్క టెండర్

- ఏపీటీడీసీ ఆధ్వర్యంలో ఓఅండ్ఎం విధానానికి ఆహ్వానం
- విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగింటికి ఒక్కటే

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) ఆధ్వర్యంలోని పర్యాటక ప్రదేశాల నిర్వహణకు ప్రైవేటు సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని నాలుగు ప్రాంతాలకు కలిపి కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలవడం గమనార్హం. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను.. ఆపరేషన్, మెయింటెనెన్స్(ఓఅండ్ఎం) విధానంలో ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఏపీటీడీసీ సన్నాహాలు చేస్తోంది. దీనిలో భాగంగా.. విజయవాడ క్లస్టర్ పరిధిలోని భవానీ ద్వీపం, బరంపార్కు, సూర్యలంక బీచ్, నాగార్జునసాగర్ ఈ నాలుగు ప్రదేశాలకు ప్రైవేటు సంస్థల నుంచి టెండర్లను ఆహ్వానించగా.. స్పందన చాలా తక్కువగా వచ్చింది. కేవలం ఒకే ఒక్క టెండర్ దాఖలైంది. పర్యాటక ప్రదేశాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని ఇప్పటికే.. సంస్థలోని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల సంస్థ కార్యాలయం వద్ద నిరసన కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు సంస్థలు సైతం.. పర్యాటక ప్రదేశాల నిర్వహణను తీసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదని స్పష్టమవుతోంది.

సృజనాత్మక ప్రాజెక్టులతో ఉపాధి అవకాశాలు



విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న రజనీకుమారి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంతో సృజనాత్మకంగా ఉన్నాయని సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం. రజనీకుమారి అన్నారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్స్‌ను ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక కార్యక్రమాలతో విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయవచ్చునన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 41 ఒకేషనల్ పాఠశాలల విద్యార్థులు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని ప్రతిభ కనబరచడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ ప్రదర్శనలు ఆలోచనాత్మకంగా ఉండడంతో పాటు ఇవే భవిష్యత్తులో మంచి ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో పిచ్చేశ్వరరావు, గౌతం, ఎన్ చంద్రశేఖర్, నారాయణ, చక్రవర్తి, ప్రసాద్‌బాబు, రవి, రమేష్ వివిధ పాఠశాలల వృత్తి విద్యా ట్రైనర్స్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఱి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -106 రిటైల్ ధర 133 చికెన్ విత్ స్కిన్ - 193, చికెన్ స్కిన్‌లెస్ - 219.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 600 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

సిరిపంచని మామిడి.. పామాయిల్‌కు త్వరపడి

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన ఆయిల్‌పామ్

మైలవరం, న్యూస్‌టుడే

దాదాపు ఐదు దశాబ్దాలుగా రైతుల ఆదాయానికి వెన్నుదన్నుగా ఉన్న మధురఫలం మామిడి సాగులో రైతులు భారీగా నష్టాలు చవిచూస్తున్నారు. కలిసిరాని కాలం, ప్రతికూల వాతావరణంతో ఎనలేని కష్టాలు పడ్డారు. సాగుభారంగా మారుతున్న తరుణంలో, ప్రత్యామ్నాయంగా పామాయిల్‌పై దృష్టి సారిస్తున్నారు. దీర్ఘకాలం ఇష్టంతో పెంచుకున్న తోటలను నిలువునా నరికేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్‌కు గిరాకీ నేపథ్యంలో, మామిడి నష్టాలను పూడ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏటా ప్రతికూల పరిస్థితులే.. : రాష్ట్రంలో నూజివీడు తర్వాత అత్యధికంగా మామిడి సాగుకు మైలవరం నియోజకవర్గం పేరు గాంచింది. నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల పరిధిలో ఐదారు దశాబ్దాల కిందటి నుంచి సాగు చేస్తున్న రైతులను మోతుబరులను చేసింది. రారాజుగా, అధిక విస్తీర్ణంలో సాగు చేసిన పంటగా ఘనత దక్కించుకున్న మామిడి నేడు రైతులను నిరాశలో ముంచెత్తుతోంది. గడిచిన నాలుగైదేళ్లుగా సగానికి పైగా సాగు రైతులు కనీస ఆదాయాన్ని చూడలేదంటే అతిశయోక్తి కాదు. ఏయేటికాయేడు అనుకూల పరిస్థితుల కోసం ఆశగా ఎదురుచూసినా, ఈ ఏడాది ఎదురైనా ప్రతికూల పరిస్థితులు వారి ఆశలపై పూర్తిగా నీళ్ల చల్లాయి. కొన్నేళ్లుగా మామిడి కర్రను ఇటుక బట్టీలకు కలపగా, వంట చెరకుగానే ఉపయోగిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాల వరకు మామిడి తోటలను నరికేసినట్లు అధికారులు చెబుతున్నారు.

తోడుగా కూటమి ప్రభుత్వం : నాలుగైదేళ్ల కిందటి వరకు గోదావరి జిల్లాలకే పరిమితమైన పామాయిల్ సాగు క్రమేపీ ఎన్టీఆర్ జిల్లాకు ప్రవేశించింది. ప్రభుత్వ మద్దతు ధర ఉండడంతో పాటు, కరోనా సమయంలో, మద్దతు ధర కంటే రెట్టింపు ధరలు పలకడంతో రైతుల్లో ఈ సాగుపై మక్కువ పెరిగింది.. అయితే వైకాపా హయాంలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సొంతగా మొక్కలు కొనుగోలు చేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే సాగుకు ప్రోత్సాహం అందించింది. మొక్కలను ఉచితంగా ఇవ్వడమే గాక, అంతర పంటలకు ప్రోత్సాహం, రాయితీపై బిందు సేద్య పరికరాలు, ఉపాధిహామీ పథకానికి అనుసంధానించడంతో రైతుల్లో మరింత ఆసక్తి పెరిగింది.



మైలవరంలో సాగవుతున్న పామాయిల్ తోట

మామిడి, పామాయిల్ సాగులో వ్యత్యాసమిదీ..

	మామిడి	పామాయిల్
సాగు విస్తీర్ణం(జిల్లాలో)	60వేల ఎకరాలు	23వేల ఎకరాలు
మద్దతు ధర	లేదు	రూ.13,650
మార్కెట్ ధర	నిలకడ లేదు	రూ.19,700 (ప్రస్తుతం)
మార్కెటింగ్ సౌకర్యం	వ్యాపారుల దయ	విత్తన కంపెనీలే తీసుకుంటాయి

న్యాయవాదుల ఆటల పోటీలు విజయవంతం



విజేతలతో జస్టిస్ జయసూర్య, న్యాయమూర్తులు గోపి, సత్యానంద్, భాస్కర్‌రావు, సునీల్, శర్మ తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీబీప హాల్లో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న న్యాయవాదుల క్యారమ్స్, చెస్ పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లకు చెందిన 400 మందికి పైగా న్యాయవాదులు పాల్గొన్నారు. విజేతలకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులంతా ఒకే వేదికపై వచ్చి క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ.. వివిధ బార్ అసోసియేషన్ల నుంచి పెద్ద ఎత్తున న్యాయవాదులు వచ్చి పోటీలను విజయవంతం చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

మ్యాచింగ్ గ్రాంట్ విడుదలపై హర్షం.. మృతి చెందిన న్యాయవాదుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వచ్చే మ్యాచింగ్ గ్రాంట్ కోసం కృషి చేసిన ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు చలసాని అజయ్‌కుమార్ కమిటీని న్యాయవాదులు అభినందించారు. రూ.48కోట్లు ఫండ్ విడుదల చేసేలా హైకోర్టులో రిట్ వేసి, ఉత్తర్వులు వచ్చేలా చేశారని కొనియాడారు. జస్టిస్ నైనాల జయసూర్య ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి జి.గోపి, రెండో అదనపు జిల్లా జడ్జి ఎ. సత్యానంద్, న్యాయమూర్తులు భాస్కర్‌రావు, సునీల్, ఆర్.వి.ఎస్.శర్మ, ఏపీ బార్ ఫెడరేషన్ సెక్రటరీ కె.సీతారాం, చలసాని అజయ్‌కుమార్, వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మదిలో నిలిచిన ఇళయరాజా గీతాలు



ఇళయరాజాకు జ్ఞాపిక అందజేస్తున్న ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, ఎంపీ శివనాథ్

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఇళయరాజా గీతాలు ప్రజల మనసుల్లో మెలోడీ మంత్రాలుగా నిలిచిపోయాయని ఉపసభాపతి రఘురామకృష్ణరాజు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వహించిన సంగీత విభావరికి హాజరై లబ్బీపేటలోని ఓ హోటల్లో ఉన్న ఇళయరాజాను ఆదివారం ఉపసభాపతి, ఎంపీ వెళ్లి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ సంగీత చరిత్రలో అజరామరమైన స్వరకర్త ఇళయరాజా గుర్తింపు పొందారని తెలిపారు. భారతీయ సంగీతాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన లెజెండ్ కంపోజర్ ఇళయరాజాకు సంగీత ప్రపంచం ఎప్పుడూ ఋణపడి ఉంటుందని పేర్కొన్నారు. వెయ్యికి పైగా సినిమాలకు సంగీతం సమకూర్చిన సంగీత మాంత్రికుడని కొనియాడారు. ఎంపీ సోదరి కేశినేని శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు వసంత, బొండా

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు. గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో రూ.కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న రహదారుల నిర్మాణానికి ఎంపీ, శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్, బొండా ఉమామహేశ్వరరావులతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డులు నిర్వీర్యమయ్యాయని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకవర్గాలను ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ.. రైతులు, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా మార్కెట్‌యార్డులను తీర్చిదిద్దుతున్నామన్నారు. రైతుబజారు నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని, రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని కోరారు. మధ్య నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేసేలా ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. మార్కెట్‌యార్డు ఛైర్మన్ నర్రా వాసు, తెదేపా నాయకులు బొమ్మసాని సుబ్బారావు, వడ్డె మాడి జగన్నాధరావు, నారదా, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



మాట్లాడుతున్న ప్రసాద్, వేదికపై కృష్ణయ్య, శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గవర్నర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ "రాష్ట్రంలో సర్వీస్‌లో ఉన్న 1.3 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలనే నిర్ణయంలో మినహాయింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. విద్యాహక్కు చట్టంలోని నిబంధనలను పార్లమెంట్‌లో సవరించాలి" అని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో టెట్ ఉత్తీర్ణులవ్వాలనే తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయాలని కోరారు. 12వ వేతన సవరణ కమిటీ నియామకం ఆలస్యమైనందున, ఈ లోగా 29% మధ్యంతర భృతి ఇవ్వాలని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి.మనోహర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎక్కువ సమయం బోధనకే కేటాయించేలా, బోధనేతర పనులు అప్పగించవద్దని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు ఎం. కృష్ణయ్య, కె. శ్రీనివాసరావు, సుందరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఐక్య పోరాటాలతోనే బీసీలకు న్యాయం



ప్రసంగిస్తున్న శంకర్రావు. చిత్రంలో క్రాంతికుమార్, మూర్తి, మహేశ్వరరావు తదితరులు

కృష్ణలంక(రాఘవయ్య పార్క్ కూడలి), న్యూస్‌టుడే: ఐక్య పోరాటాలకు బీసీలు సిద్ధం కావాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు పిలుపునిచ్చారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. శంకరరావు మాట్లాడుతూ "రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర కులగణననూ శాస్త్రీయంగా చేపట్టాలి. జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి. కూటమి ఎన్నికల వాగ్దానమైన చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలంటే ముందుగా కులగణన తప్పనిసరి. అందుకు ఆటంకాలు తలెత్తకుండా దాన్ని సమగ్రంగా నిర్వహించాలి" అని పేర్కొన్నారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ "బ్యాక్‌లాగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి. ఓబీసీల రిజర్వేషన్ల అమలుకు, వారి అభ్యున్నతికి ఆటంకంగా ఉన్న క్రీమీలేయర్‌ను పూర్తిగా ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సోము మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పసిడి పతకం



రవీంద్రరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : విజయవాడకు చెందిన లింగం రవీంద్రరావు ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో సత్తా చాటి పసిడి పతకంతో మెరిశారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 5 నుంచి 9 వరకు జరిగిన 23వ ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో 70+ పురుషుల విభాగంలో తలపడిన రవీంద్రరావు 10 కి.మీ. రోడ్డు రేస్‌ను 50 నిమిషాల, 34.70 సెకన్లలో పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. 5 వేల మీటర్ల పరుగులో త్రుటిలో పతకం చేజారిందని రవీంద్రరావు తెలిపారు. ఈ విజయానికి కోచ్, ట్రైమెట్రిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ రుషిల్, వారి బృందం కారణమని చెప్పారు. ఈ ప్రతిభ ద్వారా వచ్చే ఏడాది ఆగస్టు నెలలో దక్షిణ కొరియాలో జరిగే వరల్డ్ మాస్టర్స్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించినట్లు వెల్లడించారు.

ద్వీపం.. ఆహ్లాదకరం..



పున్నమిఘాట్ వద్ద స్పీడ్ బోట్‌లో పర్యాటకులు



భవానీ ద్వీపంలో ఆడుతున్న చిన్నారులు

కార్తికమాసం పురస్కరించుకుని కృష్ణానది మధ్యలో ఉన్న భవానీద్వీపానికి ఆదివారం సందర్శకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పున్నమి బోటింగ్ పాయింటు వద్ద నుంచి వారంతా బోటులో ద్వీపానికి వెళ్లారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సందర్శకుల రాకతో ద్వీపం సందడిగా మారింది. కొత్తూరు తాడేపల్లి లోని మామిడితోటల్లోను వనసమారాధనలు నిర్వహించారు.

- ఈనాడు అమరావతి,
- న్యూస్‌టుడే, భవానీపురం

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

ఇబ్రహీంపట్నం గ్రామీణం 9773300487 గొల్లపూడి 8008574638

? జూపూడి గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే వాటర్ ట్యాంకును నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో తాగునీటిలో నలకలు వస్తున్నాయి. **- భూక్య రామానాయక్**

✔ ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకును శుభ్రం చేస్తున్నాం. ఒకటి రెండు రోజుల్లో ట్యాంకును శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- భాగ్యలక్ష్మి, గ్రామ కార్యదర్శి** - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



? విస్సన్నపేట చింతల బజారు, తిరుపతమ్మ గుడి ఏరియాలో రోజుల తరబడి చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. **-స్థానికులు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయిస్తాం **- కేశవ హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి**- న్యూస్‌టుడే, విస్సన్నపేట

స్పందనకు వందనం



✦ స్థానిక చెరువు బజారు, గుడి సెంటర్‌లోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుపోయి దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను ఈ నెల 9న 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి బసవలింగేశ్వరరావు స్పందించారు. సిబ్బందితో పూడిక తీయించి దోమల నివారణకు బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



✦ పట్టణంలోని 8వ వార్డులో ఉన్న డ్రెయినేజీల్లో మట్టి, బురద పేరుకుపోయి మురుగు పారుదలకు ఇబ్బందిగా ఉందని స్థానికుడు కుటుంబరావు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

కబడ్డీలో సత్తా

మైలవరం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్ 17 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి ఇనపనూరి చరణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్ తెలిపారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

వ్యవసాయ కనెక్షన్ల విద్యుత్తు సరఫరా వేళల్లో మార్పు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని కనుమూరు, వినగడప తండా పరిధిలోని వ్యవసాయ కనెక్షన్లకు సోమవారం ఉదయం 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేస్తామని డిస్కం ఏఈ సీహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్తు లైన్ల మరమ్మతుల నిమిత్తం వ్యవసాయ కనెక్షన్ల సరఫరా వేళల్లో మార్పు జరిగినట్లు వివరించారు.

సాగర్ జలాలను వినియోగించుకోవాలి

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఆదివారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం వద్ద 72వ కి.మీ నియంత్రిక నుంచి 690 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 411 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 45, పెదకొమర 30, మధిర 40, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేసినట్లు వివరించారు. కాల్వలకు విడుదలైన సాగర్‌జలాలను మిరప తోటలకు నీటి తడులు అందించేందుకు వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

శిక్షణ పూర్తయింది.. కొనడమే మిగిలింది

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు కేంద్రాలు సిద్ధమయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. మండల పరిధిలో ఈ ఏడాది 9 వేల ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు అకాల వర్షాలు, ఎరువులు, విత్తనాల కొరత, తెగుళ్లను అధిగమించి పంటకాలం పూర్తిచేశారు. మరో పది రోజుల్లో వరి కోతలు ఊపందుకోనున్నాయి. మూలపాడు, ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాలతో పాటు మరో మూడు గ్రామాల్లో కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ముఖ్యంగా దళారుల ప్రమేయం లేకుండా చేసేందుకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్ నవంబరు చివరి నాటికి సాగుదారులందరూ చేయించుకోవాలని గ్రామ వ్యవసాయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు అవగాహన కలిపిస్తున్నారు. మిల్లులకు ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ పరికరాన్ని తప్పనిసరిగా అమర్చాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. దీని ధర మార్కెట్‌లో రూ.2700 లుగా ఉంది.

గత ఏడాది కంటే....

ఖరీఫ్ సాగుచేసిన రైతులకు కనీస మద్దతు ధర పెంచింది. గత ఏడాదితో పోల్చితే రూ.69 పెరిగింది. ఇలా సాధారణ రకం75 కేజీలు రూ.1,792, క్వింటాకు రూ.2,369, ఏ గ్రేడ్ రకం క్వింటాకు రూ.2,389, 75 కేజీలు రూ.1,777లుగా మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది.



మూలపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరపతి కేంద్రం ఛైర్మన్ శ్రీనివాసరావు

సద్వినియోగం చేసుకోవాలి - వై. రజని, మండల వ్యవసాయాధికారిణి

వరి సాగుదారులు వ్యవసాయ పరపతి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. గోనె సంచులు సైతం సిద్ధం చేసి అక్కడే అందజేస్తున్నాం. ఈ క్రాప్ బుకింగ్ రైతులకు తప్పనిసరిగా ఉండాలి. అధికారులు అనుమతి ఇచ్చిన వాహనాల్లోనే ధాన్యం రవాణా చేయాల్సి ఉంటుంది. హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.రూ.22 చెల్లించనున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడికి అవార్డు



ఇర్ఫాన్ పాషా

ఇబ్రహీంపట్నం గ్రామీణం: జాతీయ విద్యా దినోత్సవం, భారతరత్న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమి ఏటా ఇస్తున్న జీవితకాల సాఫల్య అవార్డు ఈ ఏడాది ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కాచవరం మండల పరిషత్తు పాఠశాల ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషాకు లభించింది. ఈ నెల 11వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకోనున్నారు. ఈయన విద్యారంగంలో చేసిన సేవలు, విద్యార్థుల భాషా అభివృద్ధి, సామాజికసేవ, విద్యార్థుల నమోదు, పాఠశాల అభివృద్ధిలో దాతలను భాగస్వాములను చేయడం తదితర సేవా కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఈ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎస్సైకి సన్మానం



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ఎ.కొండూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి.మహాలక్ష్మిబుడును మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎం.ఏలియాబాబు, వి.డైమండ్, రత్నాకర్, కె.శౌరి, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెదేపా నాయకుడు మధుసూదనరావు

స్థానిక సంస్థల ఎన్నికల విజయానికి కృషి

కొండపల్లి, న్యూస్‌టుడే: తారతమ్యాలు మరచి పార్టీ కేడర్ అంతా స్థానిక ఎన్నికలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని తెదేపా నాయకులు మధుసూదనరావు అన్నారు. తెదేపా సర్వసభ్య సమావేశాన్ని కొండపల్లి పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఛైర్మన్ చిట్టిబాబు మాట్లాడుతూ..బూత్ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను తెలియజేయాలని సూచించారు. వైస్ ఛైర్మన్ శ్రీను మాట్లాడుతూ..బూత్ కమిటీలకు బాధ్యులను ఇప్పటికే నియమించామన్నారు. బూత్ కన్వీనర్, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంగా ఓటర్ వెరిఫికేషన్ చేయాలన్నారు. మృతి చెందిన వారి వివరాలతో పాటు డబుల్ ఎంట్రీలను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బూత్ కన్వీనర్లు, ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో పేదలకు మేలు

మైలవరం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆస్పత్రులు నిర్వహించే వైద్య శిబిరాలతో పేదలకు మేలు జరుగుతుందని శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక వివేకానంద హైస్కూల్‌లో ఆదివారం పెద్దేశ్వర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం శివాలయంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఈ నెల 16 నుంచి నిర్వహించనున్న మహా అన్నసమారాధన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభానులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన వెంట పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ధ్వజస్తంభం.. విగ్రహాల ప్రతిష్ఠోత్సవం నేడు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు మండలం రోలుపడిలో కోదండ రామాలయంలో ధ్వజస్తంభం, గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి, నాభిశిల ప్రతిష్ఠోత్సవం సోమవారం నిర్వహించేందుకు గుడి అభివృద్ధి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలకు గ్రామోత్సవం, సామూహిక కుంకుమార్చన, హోమం ఆదివారం నిర్వహించారు. పురోహితులు జక్కేపల్లి నరసింహమూర్తి, వేదపండితులు కేతముక్కల శ్రీనివాసశాస్త్రి ఆధ్వర్యంలో ప్రతిష్ఠోత్సవం జరుగుతుంది.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

బాధ్యతల స్వీకరణ



ఎస్సై శ్రీను

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా నియమితులైన ఎస్.శ్రీను ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గంపలగూడెం ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై బి.మోహనరావు నందిగామకు బదిలీ అయ్యారు.

అడ్డుగా ఆవులు.. పట్టించుకోరెవరు..



పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువుల అడ్డంగా తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా బోసుబొమ్మ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, చీరాల సెంటర్, కూరగాయల మార్కెట్ వద్ద రోడ్లపైనే పడుకుండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా, ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ఆవులను రోడ్లపైకి వదిలేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

పట్టుతప్పితే పడిపోవడమే..



మండలంలోని దాసుళ్లపాలెం వద్ద బుడమేరు వాగుపై వంతెనకున్న రెయిలింగ్ విరిగి నామరూపాల్లేకుండా పోయినా అధికారులకు, ప్రజాప్రతినిధులకు పట్టడంలేదు. 50 మీటర్ల పొడవున ఏర్పాటు చేసిన దిమ్మెల్లో ఒకట్రెండే మిగిలాయి. విరిగిన వాటి స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సినా ఎవరూ పట్టించుకోవడంలేదు. జాతీయ రహదారి నుంచి దాసుళ్లపాలెం గ్రామానికి వెళ్లేందుకు ప్రధాన మార్గం కావడంతో నిత్యం స్థానికులతో పాటు, పాఠశాలల బస్సులు కూడా తిరుగుతుంటాయి. ఎదురెదురుగా వాహనాలు వస్తే, తప్పుకునే క్రమంలో అంచుకు వెళ్తే వాగులో పడి కొట్టుకుపోవడమేనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. **-న్యూస్‌టుడే, మైలవరం**

ఎండిన చెట్టు కొమ్మల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన



స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద ఎండిన చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయని 'తొలగిస్తే విద్యార్థులను కాపాడినట్లే' శీర్షికన ఈనాడులో శనివారం చిత్ర వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు ఆదివారం సిబ్బందితో ఆయా కొమ్మలను తొలగింపజేశారు. ఉప సర్పంచి కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు, ఆర్ఐ జి.పుల్లయ్య, వీఆర్వో రమేష్ నాయక్‌లు పర్యవేక్షించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కట్టుబడిపాలెం శివారులో ఎన్‌సీఎల్ కంపెనీలో కూలిన ట్యాంకు

జి.కొండూరు, న్యూస్‌టుడే: కట్టుబడిపాలెం గ్రామ శివారులోని ఎన్‌సీఎల్ (నాగార్జున సిమెంట్స్ లిమిటెడ్) లైట్ వెయిట్ బ్రిక్స్ కంపెనీలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. దాదాపు 250 టన్నుల బరువు కలిగిన ట్యాంకు కింద పడింది. కార్మికులంతా భోజనానికి వెళ్లిన సమయంలో ఘటన జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గత ఆరేళ్లలో రెండు ఘటనలు జరిగి ప్రాణ నష్టం వాటిల్లుతున్నా.. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే యూనిట్ నిర్వహణ చేపట్టి ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


శిరస్త్రాణమే ప్రాణాలకు రక్ష

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరిస్తే వ్యక్తికే కాదు కుటుంబానికి రక్ష అన్న సంగతి ప్రతి ద్విచక్ర వాహన చోదకుడు గుర్తించాలని ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు అన్నారు. ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో ఆదివారం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చిన్న నిర్లక్ష్యం కుటుంబాన్ని కుంగదీస్తున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఏముందిలే అని వాహనంతో రహదారిపైకి రావడం.. అనుకోకుండా ప్రమాదానికి గురికావడం.. ఆ తర్వాత కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి భారంగా మారడం జరిగిపోతుందన్నారు. ఇటువంటివి రోజులో ఎన్నో చూస్తున్నా.. ఆలోచనల్లో మార్పు రాకపోవడం విచారకరమన్నారు. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ నేను-నా కుటుంబం-సమాజం అనే ఆలోచన అనుక్షణం ఉండాలని సూచించారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించారు.



యువకులకు అవగాహన కలిగిస్తున్న ఎస్సై లక్ష్మణరావు

నెమలి కృష్ణాలయానికి విరాళం



నగదు, వాటర్ కూలర్ అందజేసిన దాతలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి గుడికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం వాస్తవ్యులు కోటి రామకృష్ణ, పద్మావతి, వీరి కుమారుడు చరణ్‌తేజ, సాయి నాగవినీల దంపతులు ఆదివారం రూ.75వేలు వితరణగా అందించినట్లు ఆలయ ఉద్యోగులు తెలిపారు. ఆలయంలో భక్తులకు నిర్వహించే అన్నప్రసాదం కార్యక్రమానికి రూ.40వేలతో పాటు రూ.35వేల విలువైన వాటర్ కూలర్ దాతలు అందజేసినట్లు చెప్పారు. స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకున్న దాత కుటుంబ సభ్యులను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, ప్రసాదం, చిత్రపటం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

97 మందికి వైద్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలో ధన్వంతరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండవ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 97 మంది రోగులు రాగా డా.ఈశ్వర్, డా.పి.శ్రీవాణి వైద్యులు మధుమేహం, రక్తపోటు, సాధారణ జ్వరం తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు రోగులకు నెలరోజులకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు. వాలంటీర్‌గా యేసు, రామారావు, నవీన్, దుర్గా గాయత్రి తదితరులు సేవలందించారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

'జోగి అరెస్టు హేయం'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జోగి రమేష్ అరెస్టు అక్రమం అని వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏసురాజు అన్నారు. జోగి రమేష్ కుటుంబ సభ్యులను ఎస్సీ సెల్ సభ్యులు ఆదివారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఆధారాలు లేని ఆరోపణలపై ఆధారపడి జోగిని అరెస్టు చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, శ్యాంబాబు, శరత్, జక్రిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి వాయుభక్త దాసాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో మైలవరం జనసేన నాయకులు అక్కల రామ్మోహనరావు పాల్గొన్నారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గోతుల సమస్య తీర్చారు



చదును చేస్తున్న జేసీబీ

గణపవరం(మైలవరం), న్యూస్‌టుడే: మండలంలోని గణపవరంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల సమస్యకు ఆ గ్రామ తెదేపా నాయకులు తాత్కాలిక ఉపశమనం కలిగించారు. ఆదివారం ఇటుక బట్టీల ముక్కలతో గోతులను పూడ్చించారు. ఇప్పటికే పలుమార్లు ఆ గ్రామంలో నాయకుల సహకారంతో తాత్కాలిక చర్యలు చేపట్టగా, వర్షాలతో తిరిగి సమస్య పునరావృతం అవ్వడంతో తాత్కాలికంగా పూడ్చివేసినట్లు తెదేపా నాయకులు బుజ్జిరెడ్డి, శ్యాంప్రసాద్ తెలిపారు.

శాంతిభద్రతలు కాపాడడం అందరి బాధ్యత

తిరువూరు టౌన్: సమాజంలో శాంతిభద్రతలు కాపాడడం ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . గతంలో నేర కార్యక్రమాల్లో పాల్గొన్నవారు తీరు మార్చుకుని మంచి జీవన విధానాన్ని ప్రారంభించాలని పేర్కొన్నారు. తిరిగి నేరప్రవర్తనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తమ్ముడిపై అన్న దాడి

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెల్వడంలో తమ్ముడిపై అన్న దాడి చేసిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్వడానికి చెందిన కోట రాంబాబు అతని తమ్ముడు రాంపండుల మధ్య కొంతకాలంగా వివాదాలు నడుస్తున్నాయి. శనివారం ఒక కార్యక్రమంలో తమ్ముడు అనుచితంగా మాట్లాడాడంటూ..తెలిసిన వ్యక్తులు చెప్పడంతో ప్రధాన రహదారి వద్ద ఓ దుకాణంలో ఉన్న తమ్ముడి తలపై బీరు సీసాతో కొట్టాడు. దీంతో తీవ్ర గాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరిన రాంపండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్టు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మూడు చోట్ల జూదమాడుతున్నట్లు సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ ఆదివారం తన సిబ్బందితో దాడులు చేసి 16 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వెల్లటూరు గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంలో ఓ చోట 5 మంది నుంచి రూ.11,200, మరో చోట నలుగురి నుంచి రూ.620, జి.కొండూరు శివారు గొల్లగూడెంలో మరో 7 మంది వద్ద రూ.4,900 చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట మండలం నాయకులగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న జూద శిబిరంపై స్థానిక పోలీసులు దాడి చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.38,000 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై జి.రామకృష్ణ తెలిపారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధనలు



మైలవరం : పూజల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు



గుంటుపల్లి: వాయులింగేశ్వర స్వామికి అభిషేకాలు

మైలవరం, న్యూస్‌టుడే: కార్తిక వనసమారాధన, వనభోజనాల కార్యక్రమాలను ఆదివారం మైలవరంలో పలు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, జనసేన నాయకులు ఉదయభాను, అక్కల గాంధీ పాల్గొన్నారు. పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో తోటలో కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

అభిషేకాలు.. అల్పాహారాలు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం(గ్రామీణం), న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా గుంటుపల్లి సిమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటుపల్లి పుష్కర ఘాట్ వద్ద వాయు లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం కృష్ణానదికి పూజలు చేసి భక్తులతో పాటు నదీతీరానికి వచ్చిన వారికి నదీ సమారాధన పేరుతో అల్పాహారం అందజేశారు.

సామూహిక వనభోజనాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: కార్తికమాసం సందర్భంగా ఆదివారం గంపలగూడెం ఆర్యవైశ్య సంఘీయులు వనసమారాధన ఘనంగా నిర్వహించారు. కుటుంబ సమేతంగా తోటమూల సమీప మామిడి తోటకు వెళ్లి సత్యనారాయణస్వామి వ్రతం చేశారు. అనంతరం సామూహిక వనభోజనం చేశారు. మహిళలకు ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. నాయకులు కె.నరసింహారావు, బి.నరసింహారావు, కె.శ్రీనివాసరావు, కె.రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



గంపలగూడెం: సత్యనారాయణస్వామి వ్రతం

నిజమేంటో నోరులేని శునకాలకేం తెలుసు?

- రాష్ట్రంలో 43.14% శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తి చేశారట
- ఏటా 2 లక్షలకు పైగా కుక్కకాట్ల కేసులు ఎందుకు నమోదవుతున్నట్లు?
- పుర, నగరపాలక సంస్థల లెక్కల్లో డొల్ల



ఈనాడు, అమరావతి: విశాఖలో 87% వీధి శునకాలకు సంతాననియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. కర్నూలులో 11,970 శునకాల్లో 10,054 మేర శస్త్రచికిత్సలు పూర్తయ్యాయి. తిరుపతిలోనూ 74%పైగా సంతాననియంత్రణ శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తయింది. వీధికుక్కల విషయంలో పుర, నగరపాలక సంస్థల లెక్కలు ఇలా ఉన్నాయి. ఇంత పటిష్ఠమైన చర్యలు తీసుకుంటే ఇంకా వాటి బెడద ఎందుకు ఉంది? కుక్కకాట్లతో ప్రజలు రోజూ ఆసుపత్రులకు ఎందుకు వస్తున్నారు? రాష్ట్రంలో ఏటా 2 లక్షలకు పైగా కేసులు ఎలా నమోదవుతున్నాయి?

వీధికుక్కల విషయంలో పుర, నగరపాలక సంస్థలు తప్పుడు లెక్కలతో గారడీలు చేస్తున్నాయి. శునకాలకు పెద్దఎత్తున శస్త్రచికిత్సలు చేయిస్తున్నట్లు నివేదికలు సృష్టిస్తున్నాయి. రేబిస్ టీకాలు వేయిస్తున్నట్లు చెబుతున్నాయి. ఈ నివేదికలను పరిశీలించే యంత్రాంగం లేకపోవడంతో కమిషనర్లు ఇచ్చిందే నివేదిక, చెప్పిందే వేదం అన్నట్లుగా తయారైంది. ఇలాంటి పరిస్థితిపైనే సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

చాలాచోట్ల సెంటర్లే లేవు... చికిత్సలెలా సాధ్యం?

★ రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థల్లో, నగర పంచాయతీల్లో 4.34 లక్షల వీధి శునకాలు ఉన్నట్లుగా గుర్తించారు. వీటిలో 2,32,538కి సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్సలు, రేబిస్ వ్యాక్సినేషన్ పూర్తిచేసినట్లు ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో కమిషనర్లు పేర్కొన్నారు. ఇంకా 2.02 లక్షల కుక్కలకు శస్త్రచికిత్సలు, వ్యాక్సినేషన్ చేయాల్సి ఉందని వివరించారు.

★ సగానికిపైగా పుర, నగరపాలక సంస్థల్లో శస్త్రచికిత్సలు నిర్వహించే కేంద్రాలు లేవు. వైకాపా ప్రభుత్వంలో శస్త్రచికిత్సల బిల్లులు పెండింగ్‌లో పెట్టడంతో చాలా కేంద్రాలు మూతపడ్డాయి. అయినా సగానికిపైగా శునకాలకు శస్త్ర చికిత్సలు, వ్యాక్సినేషన్ పూర్తిచేశామంటేనే అనుమానాలు వస్తున్నాయి.

★ శునకాలకు విధిగా శస్త్రచికిత్సలు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా చాలాచోట్ల కమిషనర్లకు పట్టడం లేదు. రేబిస్ టీకాలనూ వేయట్లేదు.

★ కుక్కల దాడిలో చిన్నారులు గాయపడినప్పుడు హడావుడి చేసి, తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఇదీ ప్రధాన నగరాలైన విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, అనంతపురంలలో తప్ప మిగిలిన చోట్ల కనిపించదు.

కొద్దిపాటి శస్త్ర చికిత్సల్లోనూ కమీషన్ల బాగోతం

★ శునకాలకు చేస్తున్న కొద్దిపాటి శస్త్ర చికిత్సలు, టీకాల్లోనూ పలు పుర, నగరపాలక సంస్థల్లో కమీషన్ల వ్యవహారంపై ఆరోపణలున్నాయి. శస్త్రచికిత్సలు చేయకపోయినా చేసినట్లుగా రికార్డులు సృష్టించి బిల్లులు డ్రా చేస్తున్నారు. వ్యాక్సినేషన్ విషయంలోనూ ఇంతే.

★ అక్రమాలు నిరోధించేందుకు గతంలో చేపట్టిన పలు విధానాలను పక్కన పెట్టారు. శస్త్రచికిత్సలు, వ్యాక్సిన్ వేసిన ప్రతి శునకాన్ని గుర్తించేలా చెవికి రింగు, రంధ్రం లాంటిది వేయాలని 2014-19 మధ్య నిర్ణయించి అమలు చేశారు. వైకాపా హయాంలో దీనికి తిలోదకాలిచ్చారు.

చిన్న పరిశ్రమలకు.. ఆధునిక సొబగులు!

- కామన్ ఫెసిలిటీ సెంటర్ల ద్వారా సౌకర్యాల కల్పన
- రూ.200 కోట్లతో.. 100 సీఎఫ్‌సీల ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు అధునాతన సాంకేతికత, అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒకే తరహా ఉత్పత్తులు చేసే పరిశ్రమలు ఉన్న క్లస్టర్లలో ప్రభుత్వ నిధులతో కామన్ ఫెసిలిటీ సెంటర్ల (సీఎఫ్‌సీ) ఏర్పాటుకు నిర్ణయించింది. ఒక్కోదానికి రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. రూ.200 కోట్లతో ప్రాజెక్టును సిద్ధం చేసింది. రాష్ట్రంలో కనీసం 100 సీఎఫ్‌సీల ఏర్పాటును లక్ష్యంగా నిర్దేశించింది. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై మూలధన పెట్టుబడి భారాన్ని తగ్గించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడేలా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ ఆలోచన.

గరిష్ఠంగా రూ.10 కోట్లు

ఒక్కో సీఎఫ్‌సీకి గరిష్ఠంగా రూ.10 కోట్ల వరకు ప్రభుత్వం ఇస్తుంది. దీనికోసం 10 మంది సూక్ష్మ, చిన్న పరిశ్రమల నిర్వాహకులు ప్రత్యేక వాహక నౌక (ఎస్పీవీ)ను ఏర్పాటు చేయాలి. సీఎఫ్‌సీ నిర్వహణను ఎస్పీవీ పర్యవేక్షిస్తుంది. యంత్రాల కొనుగోలుకు చేసే ఖర్చులో 80 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. సీఎఫ్‌సీలోని యంత్రాలు, సాంకేతికత వినియోగించుకున్న యూనిట్ల నుంచి నామమాత్రంగా సర్వీసు ఛార్జీలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని నిర్వహణకు ఎస్పీవీ వినియోగిస్తుంది. సీఎఫ్‌సీ ఏర్పాటుకు తక్కువ వ్యవధిలో అవసరమైన అనుమతులను ప్రభుత్వం ఇస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. చిన్న పరిశ్రమలు ఏర్పాటైన తర్వాత యంత్రాలు, సాంకేతికతలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు ఆర్థిక పరిస్థితి వారికి సహకరించడం లేదు. వాటితోనే ఉత్పత్తి చేస్తుండటం వల్ల నిర్వహణ వ్యయం పెరుగుతోంది. నాణ్యమైన ఉత్పత్తులు సాధ్యం కావడం లేదు. ఇదే సమయంలో అవే ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు తక్కువ ధరకు మార్కెట్‌లో అందుబాటులోకి తెస్తున్నాయి. అవి అధునాతన యంత్రాలను (ఆటోమేషన్) వినియోగించడం వల్ల తక్కువ సమయంలో ఎక్కువ వస్తు ఉత్పత్తి జరుగుతోంది. దీంతో కార్పొరేట్ సంస్థలతో ధరల్లో పోటీ పడే స్థాయి ఎంఎస్ఎంఈలకు ఉండటం లేదు. ఆ సమస్యలకు సీఎఫ్‌సీల ద్వారా పరిష్కారం లభించనుంది.

సీఎఫ్‌సీల్లో ఉండే సౌకర్యాలు

★ డిజైన్లు, పరిశోధన, అభివృద్ధి ★ అత్యాధునిక టెస్టింగ్ సదుపాయాలు, క్వాలిటీ కంట్రోల్ సెంటర్లు ★ నైపుణ్య శిక్షణ ★ ముడిసరకు డిపోలు, ఉత్పత్తుల విక్రయాలు.. మార్కెటింగ్ డిస్‌ప్లే సెంటర్లు

పరిశ్రమలకు వచ్చే మరికొన్ని ప్రయోజనాలు

★ డిజైన్లలో వచ్చే మార్పులు.. టెస్టింగ్, శిక్షణ సహా విస్తృతశ్రేణి సేవలు అందుబాటులో ఉంటాయి. ★ కామన్ నీటిశుద్ధి ప్లాంటు వ్యవస్థ ఉంటుంది. ★ అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడేలా ఉత్పత్తుల తయారీకి అవకాశం.

వరికోత యంత్రానికి విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరి మృతి



సంఘటనా స్థలం వద్ద మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్సై శివనాగబాబు

గండేపల్లి, న్యూస్‌టుడే: వరి కోత యంత్రాన్ని వాహనంపై తీసుకెళ్తున్న క్రమంలో విద్యుత్తు తీగలు తగిలి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల కథనం.. పశ్చిమగోదావరి జిల్లా పేకేరు, రాపాక గ్రామాలకు చెందిన కరిపెట్టి సింహాద్రి అప్పన్న(57), గెడ్డం సందీప్(17)లు కాకినాడ జిల్లా సింగరంపాలెంలో వరి కోతలు కోసేందుకు యంత్రాన్ని వాహనంపై ఆదివారం తీసుకెళ్తున్నారు. రామయ్యపాలెం వద్ద 11 కేవీ విద్యుత్ తీగలు యంత్రానికి ఉన్న గొట్టానికి తగిలాయి. ఇది గమనించిన వ్యాన్ డ్రైవర్ సింహాద్రి అప్పన్న వాహనం దిగేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో వాహనానికి ముందు ద్విచక్ర వాహనంపై పైలట్‌గా వెళ్తున్న గెడ్డం సందీప్.. ఇది చూసి హెచ్చరించడానికి వ్యాన్ వద్దకు వచ్చాడు. వ్యాన్‌కు సైతం విద్యుత్తు ప్రసరించడంతో షాక్‌కు గురై ఇద్దరూ ఘటనాస్థలిలోనే మృతి చెందారు.

మొంథాతో భారీ వర్షాలంటూ.. భయపెట్టిన మెసేజ్‌లు

- ఆదివారం వేకువజామున ప్రజల ఫోన్లకు హెచ్చరికలు
- స్పష్టతనీయని విపత్తుల నిర్వహణ సంస్థ


ఈనాడు – అమరావతి

"కృష్ణానదికి వరద పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజి వద్ద సాయంత్రం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. నది ప్రయాణాలు, ఈతకు వెళ్లొద్దు"

– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

"మొంథా తుపాను ప్రభావంతో ఈ రోజు మీ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండండి. తగిన జాగ్రత్తలు తీసుకోండి"

– ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం



ఫోన్లకు వచ్చిన హెచ్చరిక సందేశాలు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజల మొబైల్ ఫోన్లకు ఆదివారం వేకువజామున వచ్చిన హెచ్చరిక సందేశాలివి. దీంతో లంక గ్రామాల ప్రజలతో పాటు నది తీర ప్రాంతాల ప్రజల్లో ఆందోళన నెలకొనగా, తుపాన్ తీరం దాటి ఇన్ని రోజులవుతుంటే మొంథా ప్రభావంతో ఇప్పుడు వర్షాలేంటని మరికొందరు విస్తుపోయారు. సహజంగా తెల్లవారుజామున, అర్ధరాత్రి సమయాల్లో ఇలాంటి సందేశాలు వస్తే చాలా తక్కువ మందే చూస్తారు. ఆయా ప్రాంతాల్లోని బంధువులు, స్నేహితుల్ని నిద్రలేపి మరీ అప్రమత్తం చేస్తుంటారు. ఆదివారం తెల్లవారుజామున కూడా కొందరు ఇదే చేశారు. ఆదివారం వచ్చిన సందేశాలు ఎలా, ఎందుకు వచ్చాయో తెలియదు. విపత్తుల నిర్వహణ సంస్థ నివృత్తి చేసేందుకు ప్రయత్నించలేదు. మొబైల్ సందేశాల విషయాన్ని సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్‌జైన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన కూడా స్పందించలేదు. చివరికి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు ఆరా తీయగా మొబైల్ కంపెనీ నెట్‌వర్క్ సమస్య కారణమని తేలింది.

సిబ్బంది మధ్య సమన్వయలోపం

వర్షాలు, వరదలు, పిడుగులు తదితర సమాచారాన్ని, హెచ్చరికల్ని విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు చేరవేస్తుంది. ఎప్పటికప్పుడు అలర్ట్స్ ఇస్తుంది. ప్లానింగ్ సొసైటీ ఆధ్వర్యంలోని విభాగం వర్షాలు, వర్షపాత శాతం తదితర సమాచారాన్ని నమోదు చేస్తుంది. అయితే కొంతకాలంగా ఆర్టీజీఎస్‌లోని 'అవేర్' విభాగం కీలకంగా మారింది. విపత్తుల్ని అక్కడి నుంచే పర్యవేక్షిస్తున్నారు. విపత్తుల నిర్వహణ, ఆర్టీజీఎస్ శాఖల అధికారి ఒకరే అయినా సిబ్బంది మధ్య సమన్వయలోపం కన్పిస్తోంది.

జీఎంసీలో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ఈనాడు, అమరావతి: గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నారు. డిసెంబరు 8 నుంచి జరపాలని ప్రాథమికంగా నిర్ణయించగా 10 నుంచి 15 రోజుల పాటు కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకునే ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే నోడల్ అధికారి నియామకం జరగ్గా.. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. పాథాలజీ, సైకియాట్రీ, డెంటల్, ఈఎన్‌టీ, ఎనస్థీషియా, రేడియాలజీ, కార్డియాలజీ, ఆప్తల్మాలజీ.. ఇలా వివిధ విభాగాలు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నాయి. ప్రస్తుతం తుది రూపునకు వచ్చిన వాటిల్లో ఫ్లోరైడ్‌ను నీటి నుంచి వేరుచేసే పద్ధతులు, రక్త, ఇతర పరీక్షలు నామమాత్రపు రుసుముతో ఎలా చేయవచ్చు అనే పలు ఆసక్తిగొలిపే ప్రాజెక్టులున్నాయి. ఎగ్జిబిషన్‌కు వచ్చిన వారికి విజ్ఞానం పంచేలా, కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు జీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి.

సెకండరీ ఆసుపత్రులకు 227 మంది స్పెషలిస్ట్ వైద్యులు

ఈనాడు, అమరావతి: సెకండరీ ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరత తీరనుంది. ఇన్ సర్వీస్ అభ్యర్థులుగా 12 సబ్జెక్టుల్లో పీజీ పూర్తి చేసిన 227 మంది స్పెషలిస్ట్ వైద్యుల్ని 142 సెకండరీ ఆసుపత్రుల్లో నియమిస్తూ వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది. 100 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 115 మంది, 33 ఏరియా ఆసుపత్రుల్లో 60 మంది, 7 జిల్లా ఆసుపత్రుల్లో 10 మంది, 2 ఎంసీహెచ్‌ల్లో ఇద్దరి చొప్పున త్వరలో విధుల్లో చేరనున్నారు.

500 కుటుంబాలకు కర్రల వంతెనే ఆధారం



కర్రల వంతెన తయారు చేసుకున్న గిరిజనులు

పదేళ్లుగా తాము పడుతున్న కష్టాలకు పరిష్కారం కనుగొనాలని గిరిజనులు సంకల్పించారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దులో దేవాపురం పంచాయతీ శివారు అర్జాపురం, తుమ్మలపాలెం, మునగలపాలెం గ్రామాల్లో సుమారు 500 కుటుంబాలు ఉంటున్నాయి. వీరు బయట ప్రపంచానికి వెళ్లే మార్గం లేదు. వాగు దాటుకుని రహదారి వరకు రావాలి. వాగుపై చిన్నపాటి వంతెన నిర్మించాలని కొన్నేళ్లుగా అర్జీలు పెట్టినప్పటికీ ఏ ప్రభుత్వాలూ పట్టించుకోలేదు. దీంతో వాగుపై చెట్టు ఆధారంగా కట్టెలతో వంతెన నిర్మించుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలన్నా అవస్థలు తప్పడం లేదని వాపోయారు. ఇప్పటికైనా శాశ్వత వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, పాడేరు

5 ఏళ్లకోసారి.. అదీ ఒక్కరోజే!

- రవాణా వాహన డ్రైవర్లకు ఒక్క రోజే పునశ్చరణ శిక్షణ
- అప్పుడూ వెళ్లనివారే ఎక్కువ

ఈనాడు – అమరావతి: సరకు, ప్రజా రవాణా వాహనాలు నడిపే డ్రైవర్లు లైసెన్స్ తీసుకున్నాక ఐదేళ్లకు దానిని పునరుద్ధరించుకోవాలి. అప్పుడు ఒకరోజు డ్రైవింగ్ పునశ్చరణ (రిఫ్రెషర్) శిక్షణకు హాజరుకావాలి. గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూల్‌లో ఈ ఒక్కరోజు శిక్షణ పొందినట్లు ధ్రువీకరణ పత్రం తీసుకుని చూపిస్తే చాలు వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను రవాణా అధికారులు రెన్యువల్ చేసేస్తారు. నిత్యం ప్రతి బస్సులో పదుల సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్లే ఈ డ్రైవర్లకు ఐదేళ్లకోసారి.. అదీ ఒక్క రోజు శిక్షణతో ఏం ఉపయోగం ఉంటుంది? ఆ ఒక్కరోజు శిక్షణ తీసుకునేవారు కూడా అరుదే. డ్రైవింగ్ స్కూళ్లలో మేనేజ్ చేసి, పునశ్చరణ శిక్షణ తీసుకున్నామని ధ్రువపత్రం చూపేవారే ఎక్కువ. అంటే ప్రైవేట్ బస్సుల డ్రైవర్లు లైసెన్స్ తీసుకున్నాక మధ్యలో ఎటువంటి శిక్షణ, పునశ్చరణ లేకుండానే ఏళ్ల తరబడి బస్సులను పరుగులు పెట్టిస్తున్నారు. అతి వేగంగా, నిర్లక్ష్యంగా బస్సులు నడిపినా, ప్రమాదాలు చేసినా సరే యాజమాన్యాలు వారి చేతికే స్టీరింగ్ ఇస్తున్నాయి.

ఆర్టీసీలో ప్రతి డ్రైవర్‌పై దృష్టి

■ ఆర్టీసీలో ప్రతి డ్రైవర్ డ్రైవింగ్ తీరును అధికారులు నిశితంగా పరిశీలిస్తారు.

■ ప్రతి డిపో పరిధిలో బస్సులకు చిన్నచిన్న డ్యామేజ్‌లు అయ్యేలా నడిపినవారిని, మైలేజ్ తక్కువగా వచ్చేలా డ్రైవింగ్ చేసిన వారిని కలిపి 20 మందిని ఎంపిక చేస్తారు.



■ ఆ డిపోలో ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్‌ను సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా నియమించి. ఆయనకు ఆ 20 మంది డ్రైవింగ్ తీరును పరిశీలించే బాధ్యత అప్పగిస్తారు.

■ ఇన్‌స్ట్రక్టర్ ఒక్కో డ్రైవర్‌తోపాటు విధులకు వెళ్లి ఎలా డ్రైవింగ్ చేస్తున్నారో పరిశీలించి, లోపాలుంటే వాటిని ఎలా సరిదిద్దుకోవాలో వివరిస్తారు.

■ అయినా ఆ డ్రైవర్లలో మార్పు కనిపించకపోతే జిల్లా స్థాయిలో శిక్షణకు పంపుతారు. అక్కడా మెరుగవకపోతే జోనల్ స్థాయి శిక్షణ కళాశాలకు పంపి, వారం రోజుల వరకు శిక్షణ ఇస్తారు.

■ దూరప్రాంత సర్వీసుల్లో 55 ఏళ్ల పైబడినవారికి, హృద్రోగం, ఇతర తీవ్ర వ్యాధులు ఉన్నవారికి విధులు కేటాయించరు. గత ఐదేళ్లలో ఒక్క ప్రమాదం కూడా చేయనివారిని ఈ బస్సుల్లో డ్యూటీకి పంపుతారు. దూరప్రాంత సర్వీసుల్లో డ్రైవర్లు ఒకసారి ప్రమాదం చేస్తే, వారికి మరోసారి ఆ సర్వీసుల్లో డ్యూటీ వేయరు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు వంటి స్థానిక సర్వీసులకే కేటాయిస్తారు.

■ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు, ఆన్‌కాల్ డ్రైవర్ల డ్రైవింగ్ తీరును సైతం ఏడాదికి ఓసారి పరిశీలిస్తారు. అవసరమైన వారికి వారం శిక్షణ ఇస్తారు.

ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లకూ శిక్షణ అవసరం

● రోడ్ ఇంజినీరింగ్‌లో అనేక మార్పులు వస్తున్నాయి. హైవేలతోపాటు యాక్సెస్ కంట్రోల్ హైవేలు తదితరాలన్నీ నిర్మితమవుతున్నాయి. బస్సుల్లో కూడా అనుసంధాన టెక్నాలజీతో కూడినవి వస్తున్నాయి.

● ఈ నేపథ్యంలో ప్రైవేట్ బస్సుల డ్రైవర్లకు కూడా ఆరు నెలలకో, కనీసం ఏడాదికోసారయినా డ్రైవర్లకు కొన్నిరోజుల శిక్షణ ఉండేలా చూడాలని నిపుణులు చెబుతున్నారు.

● ప్రయాణికుల భద్రత దృష్ట్యా ట్రావెల్స్ యాజమాన్యాలు దీనిని అమలు చేస్తే ప్రమాదాలు చాలావరకు తగ్గించే అవకాశం ఉంటుంది.



డొక్కు బస్సులతో.. ప్రైవేటు ట్రావెల్స్‌కు పోటీ ఇవ్వగలరా?

- ఆర్టీసీ ఏసీ బస్సుల్లో కాలం చెల్లినవే అధికం
- కొత్త ఏసీ బస్సులు తీసుకొని చాలాకాలమైంది
- ప్రయాణికులు ప్రైవేటువైపు మొగ్గేందుకు ఇదీ కారణమే

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ అంటే సురక్షితమైన ప్రయాణమనే నమ్మకం ప్రజల్లో ఉంది. శిక్షణ పొందిన డ్రైవర్లు ఉండటం, నిర్దేశిత వేగంతో మాత్రమే నడపటంతో.. క్షేమంగా గమ్యస్థానానికి చేరుకుంటామని ప్రయాణికులు బలంగా నమ్ముతారు. అటువంటి సంస్థ దూరప్రాంత సర్వీసులకు ఎప్పటికప్పుడు మంచి బస్సులను అందుబాటులో ఉంచితే.. ప్రయాణికులు వాటిలో వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తారు. ఆర్టీసీ మాత్రం కొత్త బస్సులను కొనకుండా ఎప్పుడో 7-10 ఏళ్ల కిందట తీసుకున్న ఏసీ బస్సులనే నిత్యం రోడ్డెక్కిస్తోంది. 15 లక్షల కి.మీ. దాటేసిన బస్సులను సైతం పరుగులు పెట్టిస్తోంది. ఇవన్నీ డొక్కుగా తయారై ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి. ప్రైవేటు ట్రావెల్స్ మాత్రం కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తుండటంతో.. ప్రయాణికులు ఆర్టీసీని కాదని వాటివైపే మొగ్గుచూపిస్తున్నారు. అవి ప్రమాదకరమని తెలిసినా వాటిలోనే ప్రయాణిస్తున్నారు.

ఇలా అయితే పోటీ ఇవ్వగలరా?

● రాష్ట్రంలో వివిధ నగరాలు మధ్య తిరిగేవి, పొరుగు రాష్ట్రాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రైవేటు ట్రావెల్స్ ఏసీ స్లీపర్ బస్సుల సంఖ్య వందల్లో ఉంటుంది.

● ఆర్టీసీలో మాత్రం 33 ఏసీ స్లీపర్ బస్సులే ఉన్నాయి. వెన్నెల పేరుతో వీటిని నడుపుతున్నారు. నైట్‌రైడర్ పేరిట మరో 15 బస్సులు ఉండగా, వీటిలో సగం సీట్లు, సగం బెర్తులు ఉంటాయి.

● అయితే 10 లక్షల కి.మీ.కుపైగా తిరిగేసిన వెన్నెల బస్సులు 8, నైట్ రైడర్ బస్సులు 9 ఉన్నాయి.

● ఏసీ సీటర్ బస్సులుగా తిరిగే అమరావతి-60, డాల్ఫిన్ క్రూయిజ్-16, ఇంద్ర-215 బస్సులు ఉన్నాయి. వీటి పరిస్థితి మరీ ఘోరంగా ఉంది.

● 60 అమరావతి బస్సుల్లో.. 54 బస్సులు 10 లక్షల కి.మీ.కుపైగా తిరిగేశాయి. వీటిలో కూడా 24 బస్సులు 15 లక్షల కి.మీ.కుపైగానే తిరిగినా. ఇప్పటికీ నడుపుతున్నారు.

● 78 ఇంద్ర బస్సులు కూడా 10 లక్షల కి.మీ.పైగానే తిరిగాయి. డాల్ఫిన్ క్రూయిజ్ ఏడు బస్సులు 10 లక్షల కి.మీ.కు పైగా నడిచాయి.

● సాధారణంగా ఇలా దూరప్రాంతాలకు తిరిగేవి, ఏసీ బస్సులను 8-10 లక్షల కి.మీ.దాటాక ఆపేయాలి. కానీ అవి ఎన్ని లక్షల కి.మీ. తిరిగినా ఇంకా నడుపుతూనే ఉన్నారు.

● కాలంచెల్లిన ఈ బస్సులన్నీ పెద్ద శబ్దాలతో, కదిలిపోతూ ఉంటాయి. వీటికి ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా, మెరుగులు దిద్దినా అధ్వానంగానే ఉంటున్నాయి.

● ఇలాంటి డొక్కు బస్సులతో ప్రైవేటు ట్రావెల్స్‌కు ఆర్టీసీ పోటీ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

కొత్త ఏసీ బస్సులు ఎప్పుడు కొన్నారు?

■ ఆర్టీసీలో 2017, 2020లలో కలిపి 60 ఏసీ బస్సులు కొన్నారు. ఇవి పదేసి లక్షల కి.మీ. తిరిగేశాయి. గత రెండేళ్లలో 40 బస్సులు తీసుకున్నారు. ఇవి మినహా మిగిలిన ఏసీ బస్సులన్నీ పాతవే.

■ వైకాపా ప్రభుత్వంలో పెద్ద సంఖ్యలో ఏసీ బస్సులు కొనుగోలు చేసేందుకు అనుమతివ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బస్సులు మాత్రమే తీసుకోవాలని పట్టుదలతో ఉంది. విద్యుత్ బస్సులను దూరప్రాంత సర్వీసులుగా నడపలేరు.

■ పాత ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో కొత్తగా 908 డీజిల్ బస్సులు కొనేందుకు ఆర్టీసీ కొంతకాలం కిందట ప్రతిపాదనలు పంపగా.. దీనికి ఆర్థికశాఖ ఆమోదం తెలిపింది. అయితే విద్యుత్ బస్సులు మాత్రమే తీసుకోవాలన్నది ప్రభుత్వ విధానం కావడంతో.. కొత్త బస్సుల కొనుగోలుకు బ్రేక్ పడింది.

■ కర్ణాటక ఆర్టీసీ.. ఐరావత, అంబారీ ఉత్సవ్ పేరిట కొత్త ఏసీ స్లీపర్ బస్సులను నడుపుతోంది. ఏపీఎస్‌ఆర్టీసీ మాత్రం పాత బస్సులతోనే నెట్టుకొస్తోంది.

■ తక్షణమే కొత్త ఏసీ స్లీపర్ బస్సులు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించి.. వాటిని అందుబాటులోకి తీసుకువస్తే ప్రైవేటు ట్రావెల్స్‌కు చెక్‌పెట్టేందుకు వీలుంటుంది.

ప్రభుత్వ గుర్తింపు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు

- రాష్ట్రవ్యాప్తంగా 53 ఏర్పాటుకు నిర్ణయం
- ఒక్కో సెంటర్‌కు రూ.2.5 కోట్ల వరకు ఆర్థికసాయం
- ఇందులో తర్ఫీదు పొందితే పరీక్ష ఉండదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపుతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయి. ఇప్పటివరకు కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ కావాల్సినవారికి సరైన శిక్షణ, అవగాహన లేకుండానే లైసెన్సులు పొందుతున్నారు. నగరాలు, పట్టణాల్లో డ్రైవింగ్ స్కూల్స్ ఉన్నప్పటికీ.. వాటికి డ్రైవింగ్ ట్రాక్‌లు, ఇతర వసతులు లేకుండానే మొక్కుబడి శిక్షణ ఇస్తున్నాయి. అందుకే డ్రైవింగ్ నేర్చుకోవాలి అనుకునేవారికి నిబంధనల ప్రకారం శిక్షణ అందించేలా.. కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పది లక్షల జనాభాకు ఒకటి చొప్పున మన రాష్ట్రానికి 53 డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల(డీటీసీల)ను కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ (మోర్త్) మంజూరుచేసింది. అలాగే 5 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు(ఆర్‌డీటీసీలు) కూడా మంజూరు చేసింది.



ఆర్‌డీటీసీలో నేరుగా లైసెన్స్ జారీ

■ రాష్ట్రానికి 5 ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు (ఆర్‌డీటీసీ) మంజూరుకాగా, ఇవి ఉత్తరాంధ్రలో ఒకటి, కోస్తాలో మూడు, రాయలసీమలో ఒకటి చొప్పున ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పిస్తారు.

■ ఒక ఆర్‌డీటీసీ ఏర్పాటు చేయాలంటే కనీసం 3 ఎకరాల స్థలం ఉండాలి. వీటిలో పెద్ద ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు.

■ ఒక్కో సెంటర్‌కు కేంద్రం రూ.5 కోట్ల వరకు ఆర్థికసాయం అందిస్తుంది.

■ ఇందులో శిక్షణ పూర్తిచేసుకుంటే.. ఆ సెంటర్ నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తుచేసి, మంజూరయ్యేలా చేస్తారు.

డ్రైవింగ్ పరీక్ష అవసరం లేదు

● డీటీసీ ఏర్పాటుకు కనీసం 2 ఎకరాల స్థలం ఉండాలి.

● ఒక్కో ప్రాజెక్ట్ ఏర్పాటుకు అయ్యే వ్యయంలో 85 శాతంగాని, గరిష్ఠంగా రూ.2.5 కోట్ల వరకు మోర్త్ ఆర్థిక సాయం అందిస్తుంది.

● వీటిలో ద్విచక్ర వాహనం, లైట్‌మోటారు వాహనం (కార్లు), భారీ వాహనాలు (లారీ, బస్‌లు) నడిపేందుకు శిక్షణ ఇస్తారు.

● మెలకువలు నేర్పే తరగతులతోపాటు, సిమ్యులేటర్స్‌పైన, తర్వాత ట్రాక్స్‌పై శిక్షణ ఇస్తారు.

● ఏయే లైసెన్సులకు ఎన్ని రోజులు శిక్షణ, ఎంత ఫీజులు వంటివన్నీ మోర్త్ ఖరారు చేస్తుంది.

● డీటీసీలో శిక్షణ పూర్తిచేసుకుంటే.. రవాణాశాఖ వద్ద లైసెన్స్ పొందే సమయంలో డ్రైవింగ్ పరీక్షకు హాజరవ్వాల్సిన అవసరం ఉండదు. నేరుగా లైసెన్స్ జారీచేస్తారు.

కలెక్టర్ సిఫార్సుతో కేటాయింపు

✦ 53 డీటీసీలు, 5 ఆర్‌డీటీసీల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థల నుంచి రవాణాశాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

✦ వీటిని ఏర్పాటు చేయాలనుకునే వాళ్లు కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ వాటిని పరిశీలించి రవాణాశాఖ కమిషనర్‌కు సిఫార్సు చేస్తారు.

✦ అవసరమైన భూమి, ఇతర అర్హతలు ఉంటే.. వాటిని పరిశీలించి సగటున జిల్లాకు రెండు చొప్పున డీటీసీలు మంజూరు చేస్తారు.

✦ ఇప్పటికే ఎన్టీఆర్, శ్రీకాకుళం, నెల్లూరు జిల్లాల నుంచి రెండు చొప్పున, అనంతపురం, కృష్ణా, తిరుపతి, పశ్చిమగోదావరి, బాపట్ల, కాకినాడ జిల్లాల నుంచి ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.

✦ వీటిలో అనంతపురం నుంచి వచ్చిన డీటీసీ దరఖాస్తును దిల్లీలోని మోర్త్‌కు పంపగా, దానిని మంజూరుచేస్తూ ఆదేశాలొచ్చాయి.

✦ ఆర్‌డీటీసీలకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

✦ డీటీసీలు, ఆర్‌డీటీసీలకు జనవరి ఆఖరు వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నామని, ఫిబ్రవరి ఆఖరు నాటికి వాటిని మోర్త్‌కు పంపాల్సి ఉంటుందని రవాణా శాఖ అధికారులు తెలిపారు.

✦ వచ్చే ఏడాదిలో ఈ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలన్నీ అందుబాటులోకి తీసుకొచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

పడేయొద్దు... పనికొస్తాయ్!

కార్తీకం అంటేనే పూజలు, పెళ్లి వేడుకల మాసం. పూలు, పండ్లు, అరటిదొప్పలు, ఆకులు... ఎన్నెన్ని వీటి కోసం వాడతామో! తరవాత వాటిని చెత్తబుట్టలో పడేస్తున్నారా? వద్దు... ఇలా చేయండి.

ఇలా చేద్దాం!



పెరడు ఉన్నా లేకపోయినా కనీసం బాల్కనీలో అయినా మొక్కలు పెంచుతున్నవారే ఎక్కువ. ఏపుగా పెరగాలంటూ ఎరువును కొనుక్కొచ్చిమరీ వేస్తుంటారు. శ్రమ లేకుండా పువ్వులు, ఇతరాలతో ఎరువుని మీరే తయారుచేసుకోవచ్చు. వృథా తగ్గుతుంది, బోలెడు లాభం కూడా!

✦ ఒక ఖాళీ డబ్బా తీసుకుని... దానికి కింద కొన్ని రంధ్రాలు చేసి పెట్టండి. పువ్వుల్లో ప్లాస్టిక్ ఏమీ లేకుండా చూసుకోండి. పూలు, తమలపాకులు, పండ్ల తొక్కలు వంటి వచ్చిన్నిట్ని ఒకచోట పెట్టండి. వృథా ఆహారాన్నీ ఈ జాబితాలోకి చేర్చొచ్చు. అయితే ఎక్కువ జిడ్డు ఉండేదాన్ని చేర్చకపోవడమే మేలు. దీన్ని గ్రీన్ వేస్ట్ అంటారు. ఇక ఎండుటాకులు, టెంకాయ పీచులు వంటివాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసి మరోచోట పెట్టుకోవాలి. దీన్ని బ్రౌన్ వేస్ట్ అంటారు.

✦ ఒక పొర గ్రీన్ వేస్ట్... మరో పొర బ్రౌన్ వేస్ట్ చొప్పున వేసుకుంటూ వెళ్లాలి. వీటి కలయిక మొక్కలకు అవసరమయ్యే నైట్రోజన్, కార్బన్‌నే కాదు... మేలు చేసే సూక్ష్మజీవుల ఉత్పత్తికి కారణమవుతుంది. ఈ రెండూ వేశాక పైన కాస్త మట్టిని వేసి, నీళ్లు చల్లాలి. అయితే నీళ్లు మరీ ఎక్కువగా ఉండకుండా చూసుకోవాలి. ప్రతి నాలుగైదు రోజులకు మట్టి మొత్తాన్ని కిందనుంచి పైకి కదుపుతూ అవసరమైతే నీళ్లు చల్లుతూ వెళ్లాలి.

✦ ఎంతైనా వృథా కదా! వాసన వస్తుంది... అలాంటప్పుడు పేడ, నిమ్మ లేదా ఏదైనా ఎండిన ఆకులను చేర్చే సరిపోతుంది. ఎనిమిది వారాల్లోపు వృథా అంతా నల్లగా మారుతుంది. అంటే ఎరువు వాడటానికి సిద్ధంగా ఉందన్నమాట. దానిలో పెద్ద ముక్కలేవైనా ఉంటే పక్కన పెట్టి, చక్కగా మొక్కలకు చల్లేయండి. నాణ్యమైన ఎరువుతో మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

పొదుపు అంటే ఠక్కున గుర్తొచ్చేది... అమ్మ, అమ్మమ్మల పోపుల పెట్టె కదా. చిన్నచిన్న మొత్తాలతో ఎన్ని పనులు పూర్తయ్యేవో... పిల్లల ఫీజులూ, ఆస్పత్రి బిల్లులూ, స్కూల్ ట్రిప్పులూ, అంతెందుకు నెలాఖరులో నాన్నకు అప్పు ఇవ్వాలన్నా... అన్నింటికీ పోపుల పెట్టె సమాధానం. కొందరైతే ఇలా దాచిన డబ్బులతో బంగారం కూడా చేయించుకునేవారు. కానీ ఈతరం డిజిటల్ చెల్లింపుల మాయాజాలంలో పడి పొదుపు సంగతే మరిచిపోతుంది. పెద్ద మొత్తాలు ఒక్కసారిగా చేతికి వస్తే తప్ప, ఆ మాటే ఎత్తడం లేదు. అరచేతిలో ప్రపంచం పేరుతో అవసరానికి మించి ఖర్చులు పెడుతూ... ఆర్థిక స్థిరత్వాన్ని కోల్పోతున్నారు అంటున్నారు ఆర్థిక నిపుణులు.



అమ్మాయిలూ...

డిజిటల్ లావాదేవీలు తగ్గించండి!

రంగమేదైనా నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం మంచి విషయమే. కానీ అది మన ఆర్థిక ప్రణాళికల్నీ, మనుగడనూ దెబ్బతీసేది అయితే... వీలైనంత వరకు దాన్ని నిలవరించడమే మేలు. ఓ విధంగా ప్రజలు అందిపుచ్చుకున్న డిజిటల్ లావాదేవీలు కూడా ఆ కోవకు చెందినవే. చేతిలో ఫోను చేస్తూ... పొదుపు మరచిపోతున్న వారిలో అమ్మాయిలే ఎక్కువట. మహిళల శాతం కూడా నానాటికీ పెరుగుతోందని అంటున్నాయి అధ్యయనాలు. వీరిలో నచ్చిన బ్యాగ్, ఆహారం, దుస్తులు, ఆన్‌లైన్ షాపింగ్‌లు అంటూ అప్పటికప్పుడు అవసరాలపై దృష్టి పెడుతున్న వారే ఎక్కువ. స్కాన్ చేస్తే చెల్లింపు అయిపోతుంది. దాంతో ఎంత మొత్తం ఖర్చు చేస్తున్నారో కూడా తెలియడం లేదు. జీరో బ్యాలెన్స్, ఇన్‌సఫిషియంట్ ఫండ్స్ అని వచ్చేటే గానీ తెలియడం లేదు బ్యాంక్ ఖాతా ఖాళీ అయ్యిందని. తీరా తెలిశాక నాలుక కరుచుకుంటున్నారు. అంతా అయ్యాక పశ్చాత్తాప పడితే మాత్రం లాభం ఏముంది. 'అవసరం లేని వస్తువుల్ని కొంటుంటే... త్వరలోనే మీకు అవసరమైన వస్తువుల్ని అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తుంది' వారెన్ బఫెట్ చెప్పిన మాటలివి. ఇప్పుడు మనమంతా ఈ తోవలోనే నడుస్తున్నాం. అప్పులపాలై తిప్పలు పడుతున్న వారూ లేకపోలేదు. ఆన్‌లైన్ చెల్లింపులు ఆర్థిక లావాదేవీలను ఎంత సులభం చేస్తున్నాయో... తెలియని, అవసరం లేని ఖర్చుల్నీ అంతే ఎక్కువగా పెంచుతున్నాయి. వీటికి చెక్ చెప్పి... పొదుపు ప్రారంభించాలంటే నగదుతోనే చెల్లింపులు జరిగేలా చూసుకోమంటున్నారు నిపుణులు.

పరిష్కార మార్గాలు...

- పర్సులో వారానికి కావాల్సినంత నగదును పెట్టుకుని, దాన్నే అవసరాలకి వాడుకునేలా ప్రణాళికలు వేసుకోండి.
- వారానికి రెండుసార్లైనా డిజిటల్ లావాదేవీల్ని పూర్తిగా నిలువరించేలా ప్లాన్ చేసుకోండి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కొనుగోళ్లు అన్నీ బంద్ చేయండి. అలానే వారాంతాల్లో బయటకు వెళ్లేటప్పుడు నగదు చెల్లింపులు చేస్తే... ఖర్చులు తగ్గే అవకాశం ఎక్కువ.
- ఆ వారానికి ఖర్చవగా మిగిలిన మొత్తాన్ని దాచేందుకు ప్రయత్నించండి. అది ఎంత చిన్న మొత్తమైనా ఓ పక్కన పెట్టండి.
- ఆటో పే, ఈఎమ్ఐ ఆప్షన్లను వాడి ఏదైనా కొనే ముందు... దాని జీవితకాలం, వినియోగం, ప్రస్తుతానికి మనకు అవసరమైనదేనా అని అన్ని కోణాల్లో ఆలోచించాకే కొనండి. యాప్‌లు, సబ్‌స్క్రిప్షన్లకు అవసరమైతే తప్ప ఆటోపేను యాక్టివేట్ చేయకండి.
- రోజుకి రూ.200 గోల్డ్, రూ.200 సిప్‌లకు సేవింగ్స్ వెళ్లేలా డిజిటల్ ఆప్షన్లను యాక్టివేట్ చేసుకోండి. దీనివల్ల మీకు తెలియకుండానే పొదుపు మొదలవుతుంది.

● భౌతిక నగదుకు ఉండే విలువ తెలుసా? రూ.500 నోటు ఉంటే... దాన్ని వినిమయం చేసేటప్పుడు ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాం. అంటే దాంతో ఏదైనా కొనేటప్పుడు అది ఇప్పటికి అవసరం అయినదేనా అని అన్ని కోణాల్లో బేరీజు వేసుకుంటాం. అదే ఆన్‌లైన్ చెల్లింపుల్ని వినియోగిస్తే అసలీ విషయాన్నే ఆలోచించం.

● ఇదివరకు రూ.100 నోటును మారిస్తే... మిగలగా వచ్చిన మొత్తాన్ని కిడ్డీ బ్యాంకుల్లో వేసేవారు మహిళలు. లేదా బీరువాలో భద్రంగా దాచేవారు. క్రమేణా అవే పెద్ద మొత్తాలు అయ్యేవి. అవసరాలకు ఆదుకునేవి. కానీ ఇప్పుడా చిల్లర శ్రీ మహాలక్ష్మీ కనిపించడమే లేదు.

● పెద్దవాళ్లే కాదు, పిల్లలూ పుస్తకమో, పెన్నో కొన్నాక మిగిలిన చిల్లరను డిబ్బీల్లో వేసేవాళ్లు. కొన్ని నెలలకో, సంవత్సరానికో తీసి చూస్తే... ఎంత పెద్ద మొత్తం అయ్యేదో. కానీ డిజిటల్ లావాదేవీల వల్ల ఆ అవకాశమే ఉండటం లేదు. చిన్నా పెద్దా తేడా లేకుండా చివరి రూపాయి వరకూ తెలియకుండానే డబ్బులు ఖర్చైపోతున్నాయి.

క్యాన్సర్ రోగుల కష్టాలు ఆమెకు తెలుసు. ఇంటాబయటా వాళ్ల బాధలు చూసి వారికోసం ఏదైనా చేయాలనుకున్నారు గారీ శిరీష. ఈ తలంపుతో ఆమె చేసిన పని తన ఇద్దరు కూతుళ్లకూ అనుసరణీయ మార్గమైంది. అసలు ఆమె ఏం చేశారంటే...



గారీ శిరీష

అమ్మ కష్టమే కారణం..!

మాది గుంటూరు. మధ్యతరగతి కుటుంబం. అమ్మ ఏసు కుమారి. నాన్న సూర్యనారాయణ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఎన్జీఓలో పనిచేసేవారు. దీనిద్వారా రోడ్లు వేయించడం, మరుగుదొడ్లు కట్టించడం, ఇళ్ల స్థలాలు ఇప్పించడం చేసేవారు. ఆయన్ని చూసే సామాజిక సేవ మీద నాకు ఆసక్తి కలిగింది. చిన్నప్పట్నుంచే నేనూ ఆ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. అలా 2019లో ప్రజ్వల కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీని ప్రారంభించా. స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, రక్తదానం, వైద్య శిబిరాలు ఏర్పాటుచేసేదాన్ని. మా సొసైటీ తరఫున విద్యార్థులకు మోటివేషనల్ తరగతులూ చెప్పేదాన్ని. ఈ ప్రయాణంలో సేవ, కెరియర్ రెండింటినీ ఎప్పుడూ కలపలేదు. దేని స్థానం దానిదే. ప్రస్తుతం లోక్‌అదాలత్‌లో పారా లీగల్ వాలంటీర్‌గా పనిచేస్తున్నా. తొమ్మిదేళ్ల క్రితం అమ్మ థైరాయిడ్ క్యాన్సర్ బారినపడ్డారు. చికిత్స సమయంలో ఆమె పడ్డ కష్టం చూస్తే చాలా బాధగా ఉండేది. ఇదంతా ఒక ఎత్తైతే... కీమోల వల్ల జుట్టు రాలిపోతుంటే ఆమె దుఃఖం మాటల్లో చెప్పలేను. మా నానమ్మ, బంధువుల్లోనూ కొందరు ఈ వ్యాధి బాధితులే. అందరిదీ ఇదే కష్టం. అందుకే ఇలాంటి వారందరికీ ఏదైనా చేయాలి అనిపించింది. అప్పుడే సామాజిక మాధ్యమాల్లో ఓ చిన్న పాప కేశదానం మీద చేసిన వీడియో చూశా. నేనూ అలా చేయాలి అనుకున్నా. సంబంధిత ట్రస్టును సంప్రదించి నా ఉద్దేశం చెప్పా. కేశాల్ని దానం చేశా. నన్ను చూసి నా పిల్లలు సూర్య, ప్రజ్వల కూడా 'మేమూ చేస్తాం అమ్మా' అని అడిగారు. సరే అని ఒప్పుకొన్నా. అలా నాతో మొదలైన ఈ ప్రయాణం... మరో పదకొండు మందికి ప్రేరణనిచ్చింది. మేమంతా కలిసి ఇటీవల మరోసారి కేశదానం చేశాం. ఈ పరిధి ఇంకా విస్తరించి, మరింత మందికి ఈ సందేశం చేరాలన్నదే నా ఆశ.



– గాలి సురేష్, గుంటూరు

వ్యసనాలకు బానిసైందా?

? మా చెల్లి ఇంటర్ చదువుతోంది. ఈమధ్య అప్పుడే ఏడుస్తోంది, అంతలోనే నవ్వుతోంది. అమ్మానాన్నలు, అందరినీ ఎదురించి మాట్లాడుతోంది, తిరగబడుతోంది. పార్టీలంటూ స్నేహితులతో వెళ్తోంది. ఏమైనా వ్యసనాలకు బానిస అయ్యిందేమోనని భయంగా ఉంది. తనని మార్చేదెలా? - ఓ సోదరి

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

మీ చెల్లి యుక్తవయసులో ఉంది. ఈ సమయంలో ఆమెలో అనేక మార్పులు సహజం. కొన్నిసార్లు అవి సానుకూలంగా ఉంటే ఇంకొన్నిసార్లు ప్రతికూలంగా ఉండొచ్చు. పైగా ఈ దశలో ఇంట్లోవాళ్ల కంటే స్నేహితులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వారి మాటే వాళ్లకి వేదవాక్కు. స్నేహితుల అలవాట్లు, మాటతీరు, ప్రవర్తనను అనుకరిస్తుంటారు. కాబట్టి, ముందు మీ చెల్లి ఫ్రెండ్స్ ఎవరు? ఎలాంటివారు? కాలేజీకి రోజూ వెళ్తుంటారా? ఎగ్గొట్టి ఇంకెక్కడికైనా వెళతారా? పార్టీలంటే ఏ తరహావి... ఈ విషయాలన్నీ తెలుసుకోండి. అయితే ఇవన్నీ మీ చెల్లెలికి తెలియకుండా చేయాలి. అలాగని నిఘా పెట్టినట్లుగానూ ఉండొద్దు. కాలేజీలో ప్రొఫెసర్లు, ఇతర పిల్లలతో మాట్లాడి తెలుసుకోండి. ఈ వయసులో పిల్లలు కొందరు మొండిగా, తాము పెద్దవాళ్లు అయిపోయినట్లుగా భావించి ఎదిరించి మాట్లాడుతుంటారు. అందుకని మీరూ అలాగే ప్రవర్తించొద్దు. తొందరపడకుండా అన్ని విషయాలూ సమగ్రంగా తెలుసుకోండి. ఆ తరవాత దానికి తగ్గట్టుగా మీరూ తనతో స్నేహంగా ఉండండి. అన్నీ పంచుకునేలా, మీతో కలిసేలా దగ్గరవ్వండి. మీపై నమ్మకం వచ్చాక ఏది చెడు, మంచి అన్నది బలంగా కాకుండా నెమ్మదిగా చెబుతూ వెళ్లండి. ఒకవేళ మీరు భావించినట్లుగానే చెడు వ్యసనాలకు బానిసైతే మాత్రం చికిత్స తప్పనిసరి. ఏదేమైనా మీరెంత నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రవర్తిస్తే తనని అంత చక్కగా మార్చొచ్చు. ఇది గమనించి... ప్రయత్నించండి.



జీవితంలో ఏ పని చేయడానికైనా స్ఫూర్తి, ప్రోత్సాహం, దన్ను అవసరం. ఇవన్నీ నాకు అమ్మ నుంచి అందుతాయి. అమ్మ వైజయంతి కూడా ఆంత్రప్రెన్యూర్. ఏ విషయంలోనైనా నేను వెనకడుగు వేస్తే 'ఎందుకు భయం? మహా అయితే వైఫల్యం ఎదురవుతుంది. అంతేగా?' అంటుంది. 'ఒక మహిళ తన కల నిజం చేసుకుంటే... మరో పది లక్షల మంది మహిళలు ఆమె స్ఫూర్తితో ముందడుగు వేస్తార'ంటుంది. అమ్మవల్లే చిన్న వయసులోనే ఆంత్రప్రెన్యూర్‌గా మారగలిగా.

- పృకల్ప శంకర్, సహ- వ్యవస్థాపకురాలు, అట్లాన్



కృత్రిమ పూలు... కురిపిస్తున్నాయి సిరులు!

'నిద్రలేచింది మొదలు ఇంటిపనులతోనే సరిపోతుంది. ఉద్యోగం, ఉపాధి గురించి ఆలోచించే వీలెక్కడ'? అంటూ కొంతమంది మహిళలు నిట్టూరుస్తుంటే... 'ఏ కొద్ది సమయం దొరికినా ఆర్థిక స్వావలంబనకు మా వంతు ప్రయత్నం చేస్తాం' అంటున్నారు మరికొంతమంది. రెండో కోవకు చెందిన వారే ఈ పదిమంది మహిళలు.

హరియాణాలోని కురుక్షేత్ర జిల్లా, సురా గ్రామం ఈ మహిళలది. స్వయం సహాయక సంఘంలో సభ్యులు వీరంతా. ప్రభుత్వం ఇచ్చే రుణంతో ఏదైనా వ్యాపారం చేయాలనేది వీళ్ల ఆలోచన. కానీ ఎప్పటికప్పుడు వచ్చినవి వచ్చినట్లే ఖర్చయిపోతుండేవట. దీనికి అడ్డుకట్ట వేయాలంటే... రుణం కోసం ఎదురు చూడకుండా చిన్న పెట్టుబడితో అయినా వ్యాపారం ప్రారంభించాలని సమష్టిగా నిర్ణయించుకున్నారు. 'ఏం చేయాలా' అని ఆలోచిస్తున్నప్పుడు కృత్రిమ పూల వ్యాపారం తట్టిందట. 'పెద్ద పెట్టుబడులు, మార్కెటింగ్ ప్రణాళికలు, ప్రచారాలు... లాంటివేమీ తెలియదు మాకు. మాలో చాలామందికి కుట్లు, అల్లికలు, పూల తయారీ, ఎంబ్రాయిడరీ వంటి నైపుణ్యాలు ఉన్నాయి. వాటిని ఉపయోగించే వ్యాపారం చేయాలనుకున్నాం' అంటారు సంఘం అధ్యక్షురాలు. అలా రూ.5వేలతో ప్రారంభమైన వీళ్ల వ్యాపారం ఏడాదిలోనే రూ.15 లక్షల టర్నోవర్‌కు చేరుకుంది. 'రోజూ ఇంట్లో పని పూర్తయిన వెంటనే ఇక్కడికి వస్తాం. వీలైనంత సేపు పూలు తయారుచేస్తాం. పని, సమయం బట్టి రోజుకు రూ.500-1000 దాకా సంపాదిస్తున్నాం. బయటకు వెళ్లే అవసరం లేకుండానే మాలో చాలామంది నెలకు రూ.10వేల నుంచి రూ. 15 వేలు దాకా సంపాదిస్తున్నాం' అంటారు మరో సభ్యురాలు రేఖ. 2022లో ప్రారంభించిన ఈ వ్యాపారం అనతి కాలంలోనే పెళ్లిళ్లు, వేడుకలు, జాతర్లకు పూలు సరఫరా చేసేదాకా చేరుకుంది. ఈ మహిళల శ్రమ, ఆలోచన, పనితీరుని మెచ్చిన ప్రభుత్వం... ఎగ్జిబిషన్లలో ఉచిత స్టాళ్లు కేటాయించింది. ప్రభుత్వ వేడుకలు, ప్రదర్శనలకు వీళ్లు తయారుచేసిన పూలే వాడేలా ఒప్పందం కుదుర్చుకుంది. దాంతో వీళ్ల పనికి మరింత ఆదరణ పెరిగింది. దీన్ని మరింత విస్తరించి, చుట్టుపక్కల మహిళలకూ ఉపాధి అవకాశాల్ని కల్పించాలనే ప్రయత్నంలో ఉన్నారట వీళ్లు. శ్రమను పెట్టుబడిగా పెట్టి స్థిరమైన వ్యాపారాన్ని రూపొందించుకున్న ఈ మహిళల ప్రయాణం స్ఫూర్తిదాయకమే కదూ!



ఈటీవీ భారత్

రక్ష

పక్కటెముకలు విరిగేలా...



మోకాలితో కిక్

ఈ టెక్నిక్‌కి 'నీ ఆన్ రిబ్స్' అని పేరు. దీన్ని సరిగ్గా ప్రయోగిస్తే దాడిచేసే వ్యక్తి పక్కటెముకల్ని తీవ్రంగా గాయపరచొచ్చు. ఫొటోలో చూపినట్లు మనవైపు వచ్చే వ్యక్తి భుజాలపైన చేతులు వేసి గట్టిగా నిలువరించాలి. ఆపై, ముందుకు లాగి ఉంచి... ఆ వెంటనే మోకాలిని వేగవంతంగా పైకి లేపి పక్కటెముకల్లో కిక్ ఇవ్వాలి. కిక్ సరిగ్గా ఇస్తే ఎముకలు విరిగి ఊపిరితిత్తుల్లోకి దిగుతాయి. కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది.

గుండెలపై పిడిగుద్దు





దీన్ని బాడీ షాట్‌గా పిలుస్తారు. పిడికిలి గట్టిగా బిగించి డయాఫ్రామ్ కింద భాగంలో గుద్దాలి. అలా చేస్తే ఊపిరాడకుండా ఉక్కిరిబిక్కిరి అయిపోతారు. చాలా సింపుల్‌గా, వేగవంతంగా ఈ పంచ్‌ని ప్రయోగించవచ్చు. పిడికిలి బిగించినప్పుడు మీ బొటనవేలు మిగతా వేళ్లకు లోపలకాకుండా బయటే ఉండాలి. లేకుంటే పంచ్ సమయంలో దీనిమీద ఒత్తిడి ఎక్కువై... అది మీ గుండె మీద దుష్ప్రభావం చూపుతుంది.

జాగ్రత్తలు: ప్రాక్టీసు సమయంలో ఎదుటివ్యక్తి గాయపడకుండా చూసుకోవాలి. వందల సార్లు వీటిని ప్రాక్టీసు చేయడంతో పాటు, మీరు ఫిట్‌గా ఉండటం ముఖ్యం. దీనికోసం రోజూ వ్యాయామాలు చేయాలి. మంచి ఆహారం తీసుకోవాలి. అలా చేస్తే ప్రయోగించే సమయంలో 100 శాతం విజయవంతమవుతారు.

కొన్నిసార్లు దాడిచేసే వ్యక్తి మనకంటే ఎత్తుగా, దృఢంగా ఉండొచ్చు. అయినా రెండో ఆలోచన లేకుండా, పోరాటస్ఫూర్తితో పంచ్‌లు, కిక్‌లు ఇవ్వాలి.



– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు









స్వీట్ హోమ్

ఇంటికి సరికొత్త రాజసం!

ఒకప్పుడు బంగ్లాలు, ప్యాలెస్‌లలో వాటి రాజసానికి తగ్గట్టు షాండ్లియర్లు వేలాడుతూ కనిపించేవి. కాలంతోపాటు వాటి ఆకారాలు, పరిమాణాల్లో మార్పులొచ్చాయి. ఇప్పుడు ప్రతి ఒక్కరి ఇళ్లల్లోనూ ఇవి కనువిందు చేస్తున్నాయి. ఇంటి మధ్యలో వేలాడుతూ... సరికొత్త లుక్‌ని తీసుకొస్తున్నాయి. అందుకే కొత్త ఇంటిని డిజైన్ చేయించుకునేవాళ్లు బెడ్‌రూమ్, చిల్డ్రన్ రూమ్, లివింగ్ రూమ్, డైనింగ్ హాల్, బాల్కనీల్లో అధునాతన షాండ్లియర్లు అమరుస్తున్నారు. అయితే, వీటి డిజైన్లు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. అలా కొత్తగా వచ్చినవే ఈ 'గ్లాస్ బబుల్, బెలూన్ సీలింగ్' షాండ్లియర్లు. క్రిస్టల్, గ్లాస్ మెటీరియల్స్‌తో తయారయ్యే ఇవి రాత్రిపూట విద్యుత్ కాంతులతో మెరిసే బెలూన్లలాగా కనిపిస్తుంటాయి. ఇవి ఎక్కడ ఉంటే అక్కడ పార్టీ వాతావరణాన్ని తీసుకొస్తాయి అంటున్నారు డిజైనర్లు. సో... పుట్టినరోజుకో, పెళ్లిరోజుకో వేలకు వేలు ఖర్చు చేసి బయట హోటళ్లూ, హాళ్లూ బుక్ చేసుకునే కన్నా ఈ బెలూన్ షాండ్లియర్లను ఇంటీరియర్‌లో భాగం చేసుకుంటే సరి. పార్టీ కళని ఇంటికి తెచ్చుకుని సరదాగా గడిపేయొచ్చు. గృహప్రవేశాలకి బహుమతిగా ఇచ్చేందుకూ మంచి ఎంపిక! బడ్జెట్ ఫ్రెండ్లీ కూడా. ఆన్‌లైన్లోనే కాదు, స్థానిక మార్కెట్లలోనూ ఇవి దొరుకుతున్నాయి ఓ లుక్కేయండి.







ప్రకృతి... ఆమె... కలుషితం అవ్వొద్దు!

పేద మహిళలకీ, బాలికలకీ ఉచితంగా క్లాత్ ప్యాడ్స్ అందించడం... నెలసరిమీద అవగాహన కల్పించడం... పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మూడేళ్ల క్రితం ఆ గ్రామం అడుగులువేసింది. ఇటీవల 'జీరో శానిటరీ వేస్ట్' గ్రామంగా పేరుతెచ్చుకుంది. ఇంతకీ ఇదెలా సాధ్యమైందంటే...






దాదాపు మూడేళ్ల క్రితం కర్ణాటకలోని నాగవాలా గ్రామంలో ప్రారంభం అయ్యింది ఈ కార్యక్రమం. అక్కడి స్థానిక నాయకులతో కలిసి హసీరు దలా, స్టోన్ సూప్ ట్రస్ట్ 'జీరో శానిటరీ వేస్ట్'పై అక్కడి మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. సంవత్సరాల తరబడి భూమిలో కరగకుండా హాని కలిగించే ప్లాస్టిక్, సింథటిక్ ప్యాడ్లకు ప్రత్యామ్నాయంగా క్లాత్ ప్యాడ్లను అందిస్తున్నారు. సాధారణంగా ఒక శానిటరీ ప్యాడ్ భూమిలో కలవడానికి 5-8వందల ఏళ్లు పడుతుంది. అంతేకాదు, వీటివల్ల ఇన్ఫెక్షన్ల ముప్పు కూడా ఉంది. వీటిని తగ్గించి పునర్వినియోగ రుతుక్రమ ఉత్పత్తులను ప్రోత్సహించాలనుకున్నారు. గైనకాలజిస్టులు, మహిళా వాలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను ప్రతి ఇంటికీ పంపి నెలసరి జాగ్రత్తలు చెప్పిస్తారు. వీళ్లు అమ్మాయిలకూ, ఆడవాళ్లకీ మెన్‌స్ట్రువల్ కప్పులు ఇచ్చి వాటి వాడకంపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమం ఇక్కడ విజయవంతం కావడంతో చుట్టు పక్కల ఉండే కీలనపుర, సిద్ధలింగపుర, గుంగ్రాల్, చత్ర, జయపుర గ్రామాల్లోనూ పైలట్ ప్రాజెక్టుగా దీన్ని మొదలుపెట్టారు. అంతేకాదు, ఈ మెన్‌స్ట్రువల్ కప్పుల వాడకంపై మహిళలకు సందేహాలు వస్తే... నివృత్తి చేసేందుకు వాట్సాప్ గ్రూపులను తీసుకొచ్చారు. ఏ లాభాపేక్ష లేకుండా ఈ కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని అడిగితే... 'మా దృష్టిలో ప్రకృతి, ఆడవాళ్లు... ఒక్కటే. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే మన జీవన మనుగడ సక్రమంగా సాగుతుంది. అందుకే ఈ ప్రాజెక్టుని మొదలుపెట్టాం. ఇప్పుడు ఈ గ్రామాలు జీరో శానిటరీ వేస్ట్ లిస్ట్‌లో పేరు దక్కించుకున్నాయి. ఈ విజయం మాకు మరిన్ని గ్రామాలను ఈ దిశగా అడుగులు వేసేందుకు ఉపయోగపడుతుంది' అంటున్నారు ఎన్జీవో నిర్వాహకులు. ప్రకృతికి మేలుచేసే వీళ్ల ఆలోచన అభినందించదగ్గదే కదా!

100 సీసీ బైకుపై బ్రదర్స్..
గ్వాలియర్ టు హిమాలయ్

కలలను తపన తోడై నడిపిస్తే చిన్న సాధనాలు కూడా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తాయి. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన సోదరులు (కజిన్స్) గౌరవ్, రోహిత్ దీన్ని రుజువు చేశారు. వీరు హిమాలయాల్లోని ఆది కైలాస్, ఓం పర్వతాల యాత్రను మొత్తం 2,500 కి.మీ.ల మేర తమ వద్ద ఉన్న 100 సీసీ బైకుతో పూర్తిచేయడం విశేషం. తొమ్మిది రోజుల ఈ పర్యటనలో బండరాళ్ల మైదానాలు, కొండవాలు ప్రాంతాలు, ప్రమాదకరమైన మలుపులు, కాలువలు దాటుకొని సముద్రమట్టానికి 14,700 అడుగుల ఎత్తు వరకు వీరు ప్రయాణించారు. 'ఇది మా చిన్నదైన కల. పెద్ద లక్ష్యాలకు పెద్ద సాధనాలు అక్కర్లేదు. గుండెధైర్యం ఉంటే చాలు' అని ఈ సోదరులు అంటున్నారు. అదే బైకుపై గతంలో వీరు మనాలీ, నేపాల్, ఉత్తరాఖండ్ లా పాస్‌లకు కూడా వెళ్లారు. ఈ ప్రయాణాలతో పర్యటన కిట్లు, అదనపు ట్యూబులు, టైర్ ఇన్‌ఫ్లేటర్లు వెంట తీసుకువెళ్లారు. తమ తదుపరి లక్ష్యం లద్దాఖ్‌లో 19,400 అడుగుల ఎత్తున ఉన్న ఉమ్లింగ్ లా పాస్ అని గౌరవ్, రోహిత్ తెలిపారు.



అయోధ్య థీమ్ పార్కులో
లంకేశుడి భారీ విగ్రహం

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అయోధ్యలో తుదిమెరుగులు దిద్దుకుంటున్న రామాయణ థీమ్ పార్కులో 25 అడుగుల రావణాసురుడి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. పురాణ కాలంలో రామ, రావణుల మధ్య జరిగిన యుద్ధాన్ని తలపించేలా ఈ విగ్రహం ఉంటుందన్నారు. గుప్తార్ ఘాట్‌కు సమీపంలో తీర్చిదిద్దుతున్న ఈ పార్కులో రామాయణంలోని కీలక ఘట్టాలను కళ్లకు కట్టేలా పలు భారీ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు అయోధ్య మేయర్ గిరీశ్‌పతి త్రిపాఠి తెలిపారు. రాముడు జలసమాధి పొందిన ప్రాంతంగా భావించే ఈ ఘాట్‌కు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. సీతారాములు, లక్ష్మణుడి విగ్రహాలతో రూపొందిస్తున్న 'రామ్‌దర్బార్' మరో అద్భుత ఆకర్షణగా పేర్కొన్నారు. సందర్శకులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతూ సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా థీమ్ పార్కు సిద్ధమవుతున్నట్లు వివరించారు.



అవయవ దానాలను ప్రోత్సహించండి

రాష్ట్రాలకు కేంద్రం సూచన

దిల్లీ: దేశంలో అవయవ దానాలు చాలా తక్కువగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వీటిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్రాలను కోరింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నోటో) డైరెక్టర్ అనిల్ కుమార్ ఒక లేఖ రాశారు. అందులో ఆయన పలు సూచనలు చేశారు. ప్రమాదాల సమయంలో మొదట స్పందించే పోలీసు సిబ్బంది, అంబులెన్స్ డ్రైవర్లు, పారా మెడికల్ సిబ్బంది తదితరులకు శిక్షణ ఇవ్వడం, ఆసుపత్రుల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం, ట్రామా కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి, వాటిని అవయవ సేకరణ కేంద్రాలుగా నమోదు చేయడం వంటివి ఇందులో ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల్లో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. ఆరోగ్యవంతులైన యువత కూడా వీటిలో మృత్యువాత పడుతుంటారు. 2023లో రహదారులపై 1.7 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే సకాలంలో చర్యలు లేకపోవడం వల్ల వీరిలో అనేకమంది నుంచి అవయవాలను సేకరించలేకపోయినట్లు అనిల్ కుమార్ తన లేఖలో వివరించారు. రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను రక్షించడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని కోరారు.



అలాంటి చోట అస్సలు ఉండొద్దు

ఇతరుల ప్రవర్తనను మీరు నియంత్రించలేకపోవచ్చుగానీ, అమర్యాదకర పరిస్థితులకు దూరంగా వెళ్లిపోవడానికి నిర్ణయించుకోవడం మాత్రం మీ చేతుల్లోనే ఉంది. మిమ్మల్ని మీరు నిజంగా ప్రేమిస్తుంటే, మీ మనశ్శాంతికి, గౌరవానికి భంగం కలిగేచోట ఉండకండి.

– మరీసా, కంటెంట్ క్రియేటర్

ప్రపంచ ఆధ్యాత్మిక రాజధానిగా
ఉత్తరాఖండ్

- అంత శక్తి ఉన్న రాష్ట్రమిది
- రజతోత్సవాల్లో ప్రధాని మోదీ

దేహ్రాదూన్: పెద్దసంఖ్యలో పుణ్యక్షేత్రాలున్న ఉత్తరాఖండ్‌కు అసలైన బలం ఆధ్యాత్మిక శక్తి అని, ఈ రాష్ట్రం సంకల్పిస్తే రాబోయే ఏళ్లలో ప్రపంచానికి ఆధ్యాత్మిక రాజధానిగా అవతరించగలదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆవిర్భవించిన పాతికేళ్లలో అన్ని రంగాల్లో గణనీయ పురోగతి సాధించి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. ఆదివారం దేహ్రాదూన్‌లో నిర్వహించిన ఉత్తరాఖండ్ రజతోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. రూ.8,260 కోట్ల వ్యయమయ్యే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇక్కడి ఆలయాలు, ఆశ్రమాలు, ధ్యాన, యోగ కేంద్రాలను ప్రపంచంతో అనుసంధానించి మరింతగా అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. జనాభా కూర్పులో మార్పులు రాకుండా చూడటం, ఉమ్మడి పౌర స్మృతి అమలు, మతమార్పిళ్లను అడ్డుకోవడం వంటివి ధైర్యంగా అమలుచేసిన ఉత్తరాఖండ్ తీరును ఇతర రాష్ట్రాలు అనుసరించాలని సూచించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సున్నిత అంశాలపైనా పుష్కర్‌సింగ్ ధామీ సర్కారు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని ప్రశంసించారు. 'దేశవిదేశాల ప్రజలు ఆరోగ్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఔషధ మూలికలు, ఆయుర్వేద ఔషధాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. గత పాతికేళ్లలో ఆరోగ్య పర్యాటకంలో ఉత్తరాఖండ్ అద్భుత ప్రగతి సాధించింది. ఉత్తరాఖండ్ అంటే దేశ ఆధ్యాత్మిక జీవితానికి గుండె చప్పుడు' అని చెప్పారు.




దేహ్రాదూన్ సభలో అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ

సభకు హాజరైతే అదనపు మార్కులు.. ఖండించిన కేంద్రం

మోదీ సభకు హాజరైన విద్యార్థులకు పరీక్షల్లో అదనంగా 50 అంతర్గత మార్కులు వేస్తామని ఉత్తరాఖండ్ విశ్వవిద్యాలయం ఓ నోటీసులో తెలిపినట్లు వచ్చిన వార్తల్ని కేంద్రం ఖండించింది. ఇలాంటిదేమీ జారీ కాలేదని పీఐబీ నిజనిర్ధారణ విభాగం స్పష్టం చేసింది. తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ వెల్లడించారు.

ఓట్ల చోరీని అడ్డుకుంటే..
మాదే అధికారం
రాహుల్ గాంధీ

కిషన్‌గంజ్: భాజపా, ఆరెస్సెస్‌లు దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఇండియా' కూటమి మాత్రం దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు కృషి చేస్తోందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజైన ఆదివారం కిషన్‌గంజ్‌లో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. రాష్ట్రంలో ఓట్ల చోరీని అడ్డుకుంటే.. 100 శాతం 'ఇండియా' కూటమిదే అధికారమని పేర్కొన్నారు. 'కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీపై ఆధారాలు చూపించాం. కానీ.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లు సమాధానం ఇవ్వలేకపోయారు. ఎందుకంటే.. వాస్తవాలన్నీ ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చాయి. మోదీ, అమిత్ షాలు దేశంలో ఎక్కడికెళ్లినా.. చివరకు 'ఓట్ల చోరీ' విషయంలో దొరికిపోతారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో 'ఇండియా' కూటమి ప్రభుత్వం ఏర్పడుతుంది. దీని కోసం యువత, రైతులు, కార్మికులంతా కలిసికట్టుగా ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు.



బిహార్‌లో ముగిసిన ప్రచారం

- రేపు మలివిడత పోలింగ్

పట్నా: బిహార్‌లో మలివిడత పోలింగుకు ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. సుమారు నెలరోజులుగా ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కూటమి నేతల మధ్య హోరాహోరీగా సాగిన మాటల యుద్ధానికి తెరపడింది. 243కి గానూ 121 స్థానాలకు ఈ నెల 6న పోలింగ్ నిర్వహించగా మిగిలిన 122 సీట్లకు మంగళవారం జరగనుంది. అధికార, ప్రతిపక్ష కూటములు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. ఎన్డీయే తరఫున ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, భాజపా పాలిత రాష్ట్రాల సీఎంలు బహిరంగసభల్లో పాల్గొన్నారు. మహాగఠ్‌బంధన్ నుంచి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, మల్లికార్జునఖర్గే, ప్రియాంకా గాంధీ, ఆర్జేడీ అగ్రనేత.. మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ సుడిగాలి ప్రచారం నిర్వహించారు. చివరిరోజు కూడా అమిత్‌షా, రాజ్‌నాథ్, రాహుల్ పలు సభల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ పెద్దగా ప్రచారంలో కనిపించలేదు. రెండు దశలకు కలిపి ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఇందిరా, నెహ్రూలానే ఆడ్వాణీ

- భాజపా అగ్రనేతను ప్రశంసిస్తూ శశిథరూర్ వ్యాఖ్యలు

దిల్లీ: కేవలం ఒక్క సంఘటనతో భాజపా సీనియర్ నేత ఎల్.కె.ఆడ్వాణీ దేశానికి సుదీర్ఘ కాలం పాటు చేసిన సేవలను తక్కువ చేయడం అన్యాయమని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ పేర్కొన్నారు. శనివారం 98వ జన్మదినోత్సవం జరుపుకొన్న ఆడ్వాణీకి థరూర్ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడ్వాణీ గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి అని ప్రశంసించారు. ఈ వ్యాఖ్యలను 'ఎక్స్'లోనే ఓ న్యాయవాది విమర్శించారు. రామజన్మభూమి ఉద్యమం సందర్భంగా రథయాత్రతో దేశంలో ఆడ్వాణీ విద్వేష బీజాలు నాటారని, ఆయన చేసింది ప్రజా సేవ కాదని పోస్టు చేశారు. దీనికి థరూర్ సమాధానమిస్తూ, ఒక్క సంఘటనతో సుదీర్ఘకాలం పాటు ఆయన చేసిన సేవలను తక్కువ చేయడం సమంజసం కాదన్నారు. "చైనా ఎదురుదెబ్బను దృష్టిలో ఉంచుకొని నెహ్రూ మొత్తం కెరీర్‌ను లేదా అత్యయిక స్థితి ఆధారంగా ఇందిరాగాంధీని అంచనా వేయడం న్యాయం కాదు. అదే న్యాయం ఆడ్వాణీకీ వర్తిస్తుందని నమ్ముతున్నా" అని థరూర్ తెలిపారు. ఆడ్వాణీని ప్రశంసిస్తూ థరూర్ చేసిన వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని కాంగ్రెస్ పేర్కొంది. అవి ఆయన వ్యక్తిగతంగా చేసినవని వివరణిచ్చింది.



ఫిలిప్పీన్స్‌ను వణికిస్తున్న మరో సూపర్ టైఫూన్

మనీలా: అతిపెద్ద తుపాను 'ఫంగ్-వాంగ్'.. ఫిలిప్పీన్స్‌ను వణికిస్తోంది. ఈ ఏడాది వచ్చినవాటిలో ఇదే అతి భీకరమైనదిగా భావిస్తున్నారు. దీంతో 10లక్షల మందికి పైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కల్మేగి తుపాను (టైఫూన్)తో వాటిల్లిన నష్టం నుంచి తేరుకోకముందే పసిఫిక్ మహా సముద్రం నుంచి మరొకటి వచ్చి పడింది. దీంతో దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. పలు ప్రాంతాల్లో గంటకు 185 నుంచి 230 కి.మీ. వేగంతో పెనుగాలులు వీస్తున్నాయి. 325 దేశీయ, 61 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. సముద్రంలోకి నౌకలు వెళ్లకుండా తీరగస్తీ దళాలు నిషేధం విధించాయి. దీంతో 6,600 మంది ప్రయాణికులు, కార్గో కార్మికులు వివిధ ఓడరేవుల్లో చిక్కుకుపోయారు. పాఠశాలలు, కార్యాలయాలకు సోమ, మంగళవారాలు సెలవులుగా ప్రకటించారు. ఈ పెనుతుపాను వాయవ్య దిశగా కదిలి సోమవారం ఉదయానికి తీరాన్ని తాకుతుందని అంచనా వేస్తున్నారు.

న్యాయమూర్తిని హత్య చేయబోతున్నారు..

- అలహాబాద్ హైకోర్టు జడ్జికి బెదిరింపు మెయిల్ పంపిన ఖైదీ

లఖ్‌నవూ: జైలులో ఉన్న ఓ ఖైదీ హైకోర్టు న్యాయమూర్తిని బెదిరిస్తూ ఈ-మెయిల్ పంపిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో వెలుగు చూసింది. రూ.3,700 కోట్ల సైబర్ నేరం కేసులో నిందితుడిగా ఉన్న అనుభవ్ మిత్తల్ ఈ దుస్సాహసానికి పాల్పడ్డాడు. బోగస్ ఆన్‌లైన్ ట్రేడింగు పథకం పేరుతో 7 లక్షలమంది పెట్టుబడిదారులను మోసగించిన అనుభవ్ ప్రస్తుతం లఖ్‌నవూ జైల్లో ఉన్నాడు. 2017లో అరెస్టయిన ఇతడిపై 324 క్రిమినల్ కేసులున్నాయి. లఖ్‌నవూ ధర్మాసనంలోని ఓ న్యాయమూర్తిని హత్య చేయబోతున్నారంటూ అలహాబాదు హైకోర్టు జడ్జికి అనుభవ్ ఈ-మెయిల్ పంపాడు. కానిస్టేబులు అజయ్‌కుమార్ ఫోను నుంచి ఆ సందేశం వెళ్లినట్లు విచారణలో తేలింది. మరో ఖైదీ ఆనందేశ్వర్‌ను నేరంలో ఇరికించేందుకు అతడి పేరుతో మెయిలు పంపినట్లు బయటపడింది. నవంబరు 4న అనుభవ్‌ను కోర్టు విచారణకు తరలించే సమయంలో తన కేసు వివరాలు చెక్ చేసుకోవాలంటూ కానిస్టేబులు అజయ్ నుంచి ఫోను తీసుకున్నాడు. ఆ సమయంలో కొత్త మెయిల్ ఐడీ సృష్టించి.. మరుసటి రోజుకు ఆ మెసేజ్ ఆటోమేటిక్‌గా వెళ్లేలా టైమర్ సెట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనుభవ్‌తోపాటు కానిస్టేబుల్ అజయ్‌కుమార్‌పై ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు.

చొరబాటుదారుల నడవా నిర్మించడమే ప్రతిపక్షాల లక్ష్యం

- బిహార్‌లో నిప్పులు చెరిగిన అమిత్‌షా

సాసారాం, అర్వల్: బిహార్‌లో ప్రధాని మోదీ పారిశ్రామిక నడవా నిర్మించాలని అనుకుంటుంటే కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు మాత్రం చొరబాటుదారుల కారిడార్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శలు గుప్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాసారాం, అర్వల్ పట్టణాల్లో ర్యాలీల్లో పాల్గొన్న ఆయన.. ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగారు. 'ఇటీవల రాహుల్ గాంధీ, లాలూ కుమారుడు (తేజస్వీ యాదవ్) బిహార్‌లో ఓటర్ అధికార యాత్ర చేపట్టారు. దీని ప్రధాన లక్ష్యం చొరబాటుదారులను రక్షించడం. రాహుల్‌గాంధీకి నిజంగా ఓటు చోరీ జరుగుతున్నట్లు అనుమానాలుంటే నిబంధనల ప్రకారం ఫిర్యాదు ఎందుకు చేయడం లేదు? అధికార పీఠాలపై మన్మోహన్‌సింగ్, లాలూ ఉన్నప్పుడు ఈ దేశ గడ్డపై ఉగ్రదాడులు జరిగేవి. ఇప్పుడు ముష్కరుల ఇళ్లలోకి వెళ్లి మరీ మనం చితకబాదుతున్నాం. భవిష్యత్తులో భారత్‌పై దాడి చేయాలంటే వారు ఆలోచించాల్సిందే. ఎందుకంటే ఈ రాష్ట్రంలో తయారైన మోటార్ షెల్స్ వారి తూటాలకు దీటైన జవాబిస్తాయి' అని అమిత్‌షా వ్యాఖ్యానించారు. అయోధ్య రామాలయంపై కాంగ్రెస్, ఆర్జేడీల వైఖరిని, దాణా కుంభకోణంలో లాలూ ప్రసాద్ యాదవ్ దోషిగా తేలడంపైనా ఆయన విమర్శలు గుప్పించారు.



జపాన్ తీరంలో భూకంపం

సునామీ హెచ్చరికలు జారీ.. ఉపసంహరణ

టోక్యో: జపాన్ ఉత్తర తీరంలో ఆదివారం శక్తిమంతమైన భూకంపం సంభవించింది. ఇవాటే ప్రావిన్సు తీరంలో 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉందని, 6.9 తీవ్రతతో ఇది సంభవించిందని జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించింది. ఈ నేపథ్యంలో సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. మూడు మీటర్ల ఎత్తు వరకు సముద్ర కెరటాలు విరుచుకుపడే అవకాశం ఉందని, తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని ప్రజలను అప్రమత్తం చేశారు. ఆ ప్రాంతాల్లో మరిన్ని భూకంపాలు వచ్చే అవకాశముందన్నారు. మూడు గంటల తర్వాత ఆ హెచ్చరికల్ని ఉపసంహరించుకున్నారు. ఆ ప్రాంతంలోని రెండు అణు విద్యుత్తు కర్మాగారాలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. బుల్లెట్ రైళ్లు కొంత ఆలస్యంతో నడిచాయి.

ఒకప్పుడు అమెరికా నిర్బంధ కేంద్రంలో..
నేడు సిరియా అధ్యక్షుడిగా వైట్‌హౌస్‌కు

ఇంటర్నెట్ డెస్క్: దాదాపు రెండు దశాబ్దాల క్రితం అమెరికా నిర్బంధ కేంద్రంలో ఉన్న ఓ వ్యక్తి.. నేడు ఓ దేశాధ్యక్షుడి హోదాలో అగ్రరాజ్యంలో పర్యటిస్తున్నారు. ఆయనే సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్-షరా. 1946లో స్వాతంత్ర్యం అనంతరం వాషింగ్టన్‌ను సందర్శించిన మొదటి సిరియా అధ్యక్షుడు కూడా ఆయనే కావడం గమనార్హం. అల్-షరా సోమవారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశం కానున్నారు. ఈ ఏడాది మే నెలలో సౌదీ అరేబియా వేదికగా ఇరువురునేతలు తొలిసారి భేటీ అయ్యారు. అబు మహ్మద్ అల్ జులానీగానూ పేరున్న అహ్మద్ అల్-షరా.. 2003లో ఇరాక్‌పై అమెరికా దండయాత్రకు కొంతకాలం ముందు అక్కడ అల్-ఖైదాలో చేరారు. ఇరాకీ తిరుగుబాటులో పాల్గొన్నారు. దీంతో అమెరికన్ దళాలు ఆయన్ను 2006-11 మధ్యకాలంలో నిర్బంధ కేంద్రంలో ఉంచాయి. అనంతరం సిరియా చేరుకొని అల్-ఖైదా అనుబంధంగా.. 'అల్ నుస్రా ఫ్రంట్' ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వ్యతిరేకత ఉన్న ఇద్లిబ్ లాంటి ప్రాంతాల్లో బలీయమైన శక్తిగా ఎదిగారు. క్రమంగా అల్-ఖైదాకు దూరం జరిగారు. వేల మంది తిరుగుబాటుదారులతో కలిసి 2017 ప్రారంభంలో 'హయాత్ తహరీర్ అల్-షమ్' (హెచ్‌టీఎస్)ను స్థాపించారు. గత ఏడాది డిసెంబరులో ఆయన నాయకత్వంలోని తిరుగుబాటు దళాలు సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ సర్కారును గద్దెదించాయి.



ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛతతో
కేంద్రానికి రూ.4 వేల కోట్ల ఆదాయం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో గత అయిదేళ్లుగా నిర్వహిస్తూ వచ్చిన స్వచ్ఛతా కార్యక్రమాల ద్వారా రూ.4,085 కోట్ల ఆదాయం వచ్చినట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ మంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. 2021 నుంచి ఏటా గాంధీజయంతి రోజు నుంచి అక్టోబరు నెల మొత్తం చేపడుతున్న స్వచ్ఛతా కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లోని పనికిరాని సాధారణ, ఎలక్ట్రానిక్ వస్తువులను తొలగించి విక్రయించడం ద్వారా రూ.4,085.24 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. ఇది ఒక మెగా స్పేస్‌మిషన్ లేదంటే బహుళ చంద్రయాన్ స్పేస్‌మిషన్‌ల బడ్జెట్‌తో సమానమని వెల్లడించారు. దీని ద్వారా తొలి నాలుగేళ్లలో రూ.3,300 కోట్లు, ప్రస్తుత ఏడాది రూ.788.53 కోట్ల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. చెత్తను తొలగించడంవల్ల కార్యాలయాల్లో 231.75 లక్షల చదరపు అడుగుల స్థలంకూడా అందుబాటులోకి వచ్చినట్లు వెల్లడించారు. స్వచ్ఛత కార్యక్రమాల్లో సేకరించిన వ్యర్థాలను సంపద సృష్టికోసం ఉపయోగిస్తున్నామన్నారు. సీఎస్ఐఆర్-ఎన్ఐఐఎస్‌టీ తిరువనంతపురం అభివృద్ధిచేసిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఆసుపత్రుల నుంచి తొలగించిన వ్యర్థాలను రీసైకిల్ చేస్తున్నట్లు చెప్పారు. దీన్ని ప్రస్తుతం దిల్లీ ఎయిమ్స్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. అలాగే వాడిన వంట నూనెను సీఎస్ఐఆర్-ఐఐపీ దేహ్రాదూన్ పునర్ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. సీఎస్ఐఆర్-సీఆర్ఆర్ఐ దిల్లీ అభివృద్ధిచేసిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఇనుప తుక్కును రహదారుల నిర్మాణం కోసం ఉపయోగిస్తున్నట్లు చెప్పారు.



ఉద్ధవ్ ఇంటిపై డ్రోన్ కలకలం

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని బాంద్రా ప్రాంతంలో ఉన్న ఉద్ధవ్ ఠాక్రే నివాసం మాతోశ్రీపై ఆదివారం ఓ డ్రోన్ ఎగరడం కలకలం రేపింది. దీనిపై శివసేన (యూబీటీ) ఎమ్మెల్సీ అనిల్ పరబ్ ఆందోళన వ్యక్తం చేశారు. అత్యంత భద్రత కలిగిన ప్రాంతంలోకి డ్రోన్ ఎలా వచ్చిందని ప్రశ్నించారు. పోలీసులు దర్యాప్తు జరపాలని, డ్రోన్ ఆపరేటర్‌ను గుర్తించాలని, దాని వెనుక ఉద్దేశాన్ని విచారించాలని, ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో చూడాలని ఎక్స్‌లో పరబ్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై జోన్-8 డిప్యూటీ పోలీస్ కమిషనర్ కల్పనియా స్పందించారు. ముంబయి మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధి అథారిటీ (ఎంఎంఆర్‌డీఏ) అనుమతితోనే బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలో సర్వే జరిగిందని తెలిపారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన సిగ్గు చేటని, దీనిద్వారా రాష్ట్రం మొత్తం నిఘా కళ్ల రాష్ట్రంగా మారిపోతోందని పార్టీ నేత ఆదిత్య ఠాక్రే విమర్శించారు. కిటికీ అంత ఎత్తులో డ్రోన్ ఎగిరిందని, వీడియోలను రికార్డు చేసిందని, ఆ తర్వాత ఎటో వెళ్లిపోయిందని తెలిపారు.

వలసదారుల పడవ బోల్తా.. ఏడుగురి మృతి

కౌలాలంపూర్: మయన్మార్ నుంచి వలసదారులతో వెళ్తున్న పడవ ఒకటి మలేసియా సమీపంలో సముద్రంలో బోల్తా పడటంతో ఏడుగురు దుర్మరణం చెందారు. మరో 13 మందిని సహాయక బలగాలు కాపాడాయి. మయన్మార్‌లోని రఖిన్ రాష్ట్రం బుథిడయాంగ్ పట్టణం నుంచి సుమారు 300 మందితో ఒక పడవ బయల్దేరింది. మలేసియాకు సమీపంలోకి వచ్చాక వీరిని విభజించి మూడు చిన్న పడవల్లోకి మార్చారని పోలీసులు చెబుతున్నారు. వీటిలో ఒకటి మునిగిపోగా పలువురు నీటిలో కొట్టుకుపోయారు.

బహుభార్యత్వం నిషేధ బిల్లుకు అస్సాం క్యాబినెట్ ఆమోదం

గువాహటి: బహుభార్యాత్వం నిషేధించే బిల్లుకు అస్సాం మంత్రివర్గం ఆదివారం ఆమోదం తెలిపింది. నిషేధాన్ని ఉల్లంఘిస్తే ఏడేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉంటుంది. ఆరో షెడ్యూల్ ప్రాంతాలకు మాత్రం కొన్ని మినహాయింపులు ఉంటాయి. బిల్లును ఈ నెల 25న శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ విలేకరులకు తెలిపారు. బాధిత మహిళలకు పరిహారం ఇచ్చేందుకు ఒక నిధిని ఏర్పాటు చేస్తామని, జీవితంలో ఏ మహిళా ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు.

తేజ్ ప్రతాప్ యాదవ్‌కు 'వై ప్లస్' కేటగిరీ భద్రత

బిహార్ ఎన్నికల వేళ.. కేంద్రం కీలక నిర్ణయం



పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌కు ముందు మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు, జనశక్తి జనతా దళ్ జాతీయ అధ్యక్షుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌కు 'వై ప్లస్' కేటగిరీ భద్రతను కేంద్ర హోం శాఖ మంజూరు చేసింది. శత్రువులు తనను హత్య చేసే ముప్పు ఉందని తేజ్ ప్రతాప్ ఆందోళన వ్యక్తం చేయడంతో కేంద్ర సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. దీనిపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. తనను శత్రువులు హత్యచేసే గండం ఉందని, ప్రతి ఒక్కరు శత్రువుల్లాగే కనిపిస్తున్నారని తేజ్ ప్రతాప్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు ముప్పు ఉండబట్టే, తనకు కేంద్రం భద్రత పెంచిందన్నారు. అయితే తన శత్రువుల వివరాలను బయటపెట్టలేనని ఆయన స్పష్టంచేశారు.

ప్రభుత్వం ఏర్పాటయ్యాక 'రిటర్న్ గిఫ్ట్' ఉంటుంది

పుట్టినరోజు సందర్భంగా ఆర్జేడీ నేతలతో తేజస్వీయాదవ్



దిల్లీ: ఆర్జేడీ నాయకుడు తేజస్వీయాదవ్ 36వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఎన్నికల ప్రచారం చివరి రోజైన ఆదివారం కారాకట్‌లో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న తేజస్వీ.. 'నాకు శుభాకాంక్షలు తెలిపిన ఆర్జేడీ మద్దతుదారులకు కృతజ్ఞతలు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం మన ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. మీకు 'రిటర్న్ గిఫ్ట్' ఉంటుంది. 20 ఏళ్లుగా ఎన్డీయేకు అధికారం ఇచ్చారు. నన్ను నేను నిరూపించుకోవడానికి 20 నెలల సమయం ఇవ్వండి' అంటూ ప్రజలను కోరారు. మరోవైపు, తేజస్వీకి కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. మార్పు, ఉద్యోగాలు, సమానత్వంతో పాటు, బిహార్ ప్రజల అభివృద్ధి కోసం పోరాడదామని పేర్కొన్నారు. తేజస్వీ సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్ సైతం ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. తేజస్వి జీవితంలో ఇంకా పురోగమించాలని తేజ్ ప్రతాప్ ఆకాంక్షించారు.

నిద్రిస్తున్న చిన్నారి కిడ్నాప్.. ఆపై అత్యాచారం

- పశ్చిమబెంగాల్‌లో మరో దారుణం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో మరో దారుణ ఘటన చోటుచేసుకుంది. అమ్మమ్మ పక్కన నిద్రిస్తున్న నాలుగేళ్ల చిన్నారిని గుర్తుతెలియని వ్యక్తి కిడ్నాప్‌చేసి.. ఆపై అత్యాచారానికి పాల్పడ్డాడు. హుగ్లీలో జరిగిన ఈ ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. తారకేశ్వర్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో బాధిత కుటుంబం ఆశ్రయం పొందుతోంది. శనివారం రాత్రి ఆ ఇంట్లోని చిన్నారి తన అమ్మమ్మ వద్ద నిద్రించింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి పాపను కిడ్నాప్ చేసి.. అత్యాచారానికి పాల్పడ్డాడు. తెల్లవారుజామున బిడ్డ కన్పించకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె కోసం గాలించగా రైల్వేస్టేషన్ పక్కన ఉన్న కాలువలో రక్తపుమడుగులో పడి ఉంది. దీంతో బాధితురాలిని ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జ్ చేశారు. చిన్నారికి తీవ్ర రక్తస్రావమైందని.. ఆస్పత్రి సిబ్బంది కేసును తప్పుదారి పట్టిస్తున్నారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ క్రమంలో పోలీసులు వైద్య పరీక్షల కోసం చిన్నారిని మరోసారి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో సంబంధం ఉందని భావిస్తోన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చనా మజుందర్ ఈ ఘటనపై స్పందించారు. ఈ కేసును సుమోటోగా తీసుకుని విచారించాలని కోరారు. కాగా, ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రభుత్వంపై విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నాయి.



ఆహా సారంగ్ విన్యాసం..

నాలుగు హెలికాప్టర్లు ఒకదానికొకటి ఢీకొంటున్నట్లు ఉంది కదూ. భారత వైమానిక దళ 93వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అస్సాంలోని గువాహటిలో బ్రహ్మపుత్ర నది ఒడ్డున సారంగ్ హెలికాప్టర్లు చేపట్టిన విన్యాసాలివి.

'ట్రబుల్ ఇంజిన్ గవర్నమెంట్' నుంచి బిహార్‌కు విముక్తి: కాంగ్రెస్

దిల్లీ: అవినీతి ద్వారా భాజపా-జేడీ(యూ)లు బిహార్‌ను 20ఏళ్లుగా దోచుకుంటున్నాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ప్రజలు ఓటు ద్వారా ఈ 'ట్రబుల్ ఇంజిన్ గవర్నమెంట్' నుంచి విముక్తి పొందుతారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. బిహార్ ప్రభుత్వం నిర్వహించిన కుల ఆధారిత సర్వే ప్రకారం.. 9 కోట్ల మంది ప్రజలు రోజుకు కేవలం రూ.67తో జీవిస్తున్నారని వెల్లడించారు. గత 20 ఏళ్లుగా రాష్ట్ర బడ్జెట్‌తో ఎన్డీయే ఏం చేసిందని 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాగ్-2025 నివేదిక ప్రకారం.. ప్రభుత్వం రూ.70,877.61 కోట్లను ఖర్చుపెట్టిందని, కానీ, వాటిని ఎలా ఖర్చు చేశారో తెలిపే 49,649 పత్రాలను సమర్పించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. ఫలితంగా ఎంత పెద్ద అవినీతి జరిగిందో తెలుసుకునేందుకు ఆధారాలు లేకుండా పోయాయని విమర్శించారు.


పోటెత్తిన జనం.. హీటెక్కిన ప్రాంగణం

- కరూర్ సభ వద్ద చల్లబరిచే సహజ వ్యవస్థలు దెబ్బతిన్నాయి
- అధిక ఉష్ణోగ్రతలో గంటల తరబడి నిరీక్షణ ప్రాణాంతకమైంది
- తొక్కిసలాట ఘటనపై ఓ స్వచ్ఛంద సంస్థ కీలక విశ్లేషణ



సెప్టెంబరు 27న కరూర్‌లో విజయ్ సభకు వచ్చిన జనసందోహం

తమిళనాడులోని కరూర్‌లో సెప్టెంబరు 27న తమిళగం వెట్రి కళగం (టీవీకే) అధినేత, సినీ నటుడు విజయ్ రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాట 41 మంది ప్రాణాల్ని బలిగొంది. సుమారు 100 మందికి పైగా గాయపడ్డారు. మరెంతోమంది సొమ్మసిల్లారు. ఇరుకు ప్రాంతాల్లో ఈ తరహా రోడ్‌షోలు పెట్టడం, జనాలు భారీగా గుమిగూడటం వల్ల ఆ ప్రాంతాల్లో వేడి పెరిగి, భూతాపానికి కారణమవుతోందని చెన్నైకి చెందిన పర్యావరణ స్వచ్ఛంద సంస్థ 'భూవులగిన్ నన్బర్గళ్ (భూ మిత్రులు)' విశ్లేషించింది. ఘటన నేపథ్యంలో అక్కడ ఏర్పడిన తీవ్ర వాతావరణ మార్పులపై ఈ సంస్థ పరిశోధన చేపట్టింది. సొంతంగా రూపొందించిన పునల్ ఫ్రేమ్‌వర్క్‌తో స్థానిక సమాచారంతో పాటు గూగుల్ ఎర్త్, ఐఎండీ, పలు థర్మల్ ఎనాలసిస్ టూల్స్, 3డీ రేడియేషన్ మోడల్స్, థర్మో సైకలాజికల్ మోడల్స్‌ను తీసుకుని డేటాను విశ్లేషించింది. అక్కడి వాతావరణం, వడదెబ్బ పరిస్థితుల్ని అంచనా వేసేందుకు యూనివర్సల్ థర్మల్ క్లైమేట్ ఇండెక్స్ (యూటీసీఐ) నుంచి డేటా తీసుకుంది. కరూర్ సభకు ముందు విజయ్ నామక్కల్‌లో రోడ్‌షో చేశారు. కరూర్‌లో సభ తలపెట్టిన కూడలి నుంచి బయటకు వెళ్లేందుకు సరైన దారుల్లేవు. 20 వేలకు మించి జనాలు రావడంతో తోపులాట జరిగింది. కొన్ని గంటల పాటు వేచి ఉన్న ప్రజలు ఆహారం, నీరు, నీడ లేకపోవడంతో సొమ్మసిల్లారు. ర్యాలీకి ఎంపిక చేసుకున్న ప్రాంతం ముప్పుతో కూడినదని తేలింది.



సభ నేపథ్యంలో రద్దీ ఏర్పడిన ప్రాంతం

6 గంటలు.. 42 డిగ్రీలు

- కరూర్‌లో రోడ్‌షో, సభకు 27 వేల మంది హాజరైనట్లు ప్రభుత్వం చెబుతున్నా.. 50 వేల మంది ఉంటారని అంచనా. అక్కడ సగటున చదరపు మీటర్‌కు నలుగురికి మించి జనం ఉండటం ప్రమాదకరంగా మారింది. అరుపులు, ఒకరినొకరు నెట్టుకునే క్రమంలో ఒక్కో వ్యక్తి 250 వాట్ల వేడి శక్తిని వదిలినట్లు అంచనా. ఇలా చ.మీ.కు 1,000 వాట్‌లు దాటింది. సూర్యుడు మధ్యాహ్నం నడినెత్తిన ఉన్నప్పుడే చ.మీ.కు 800 వాట్ల వేడి వస్తుంది. ఇది అంతకు మించి. ర్యాలీకి ఎంచుకున్న 19,000 చ.మీ. వైశాల్యంలో 50 వేల మంది ద్వారా 12 మెగావాట్ల వేడిశక్తి విడుదలైందని తెలుస్తోంది.
- సభ వద్ద చల్లబరిచే వ్యవస్థలు దెబ్బతిన్నాయి. కరూర్‌లో ఆరోజు గాలి సెకనుకు 5 మైళ్ల వేగంతో వీస్తుంటే సభా ప్రాంగణంలో ఒక మైలులోపే ఉంది. గాలిలోని తేమ 5-10 శాతానికి పెరిగింది.
- ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య రద్దీతో ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు మించిపోయింది. మధ్యాహ్నం 2.30 నుంచి 40-42 డిగ్రీల దాకా వెళ్లింది. ఇలాంటి వాతావరణంలో 6 గంటలపాటు వేచి ఉండటంతో ఒక్కొక్కరుగా సొమ్మసిల్లడం, తలతిరగడం మొదలైంది. ఓ తల్లి, బిడ్డ సైతం విజయ్ రాక మునుపే మృతి చెందారని చెబుతున్నారు. వాతావరణ మార్పులతోనే ఇది జరిగి ఉండొచ్చు.
- విపరీతమైన వేడికి వడదెబ్బ తగిలి కొందరు తీవ్ర అస్వస్థత పాలయ్యారు. యూటీసీఐ ప్రమాణాల ప్రకారం ఉష్ణోగ్రత 38 డిగ్రీలకు మించితే వడదెబ్బకు గురవుతారు. 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటితే మరణాలకు ఆస్కారముంటుంది.

గుణపాఠాలు నేర్వలేదు

ఈ ఏడాది పూరి జగన్నాథ యాత్ర, కుంభమేళా తొక్కిసలాట, న్యూదిల్లీ రైల్వే స్టేషన్, బెంగళూరులో ఆర్‌సీబీ విజయయాత్ర, హైదరాబాద్‌లో పుష్ప సినిమా హాలు బయట తొక్కిసలాట తదితర ఘటనల్లో వాతావరణ మార్పుల కారణంగా శరీరాలు అసౌకర్యానికి గురయ్యాయి. పలువురు సొమ్మసిల్లడంతో పాటు దుష్పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలన్నింటిలోనూ అక్కడ భూతాపం పెరిగిన దాఖలాలున్నాయి.

రోడ్‌షోలు రద్దు చేయాలి

భూవులగిన్ నన్బర్గళ్ సంస్థ తమిళనాడు ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది.

- భారీగా జనం హాజరయ్యే సభలు, రోడ్‌షోలకు అనుమతిచ్చేటప్పుడు వాతావరణ నిపుణుల సూచనలు తప్పనిసరి చేయాలి. అక్కడ వాతావరణాన్ని చల్లబరిచేలా ఏర్పాట్లు చేయాలి.
- ఎక్కువ గంటలు వేచి ఉండే రోడ్‌షోలకు స్వస్తి పలకాలి.
- ఫిబ్రవరి- అక్టోబరు నెలల్లో అధిక వేడి ఉండటంతో పగలు బహిరంగ సభలకు అనుమతించకూడదు. తప్పనిసరైతే జనాలకు నీడ, తగినంత మంచినీరు అందేలా చూడాలి.

- ఈనాడు, చెన్నై



తల్లి కోటేశ్వరమ్మకు పాదపూజ చేసి ఆమెతో ఉన్న జ్ఞాపకాల చిత్రమాలికను అందజేస్తున్న కుటుంబసభ్యులు

పిచ్చయ్యా.. కొడుకంటే నువ్వయ్యా..

మాతృదేవోభవ.. అని చెప్పడమే కాదు.. ఆ తల్లి తమ మధ్య ఉన్నప్పుడే ఘనంగా కృతజ్ఞతలు తెలపాలని అనుకున్నారు ఆ కుమారుడు. ఆలోచన వచ్చిందే తడవుగా తన తోబుట్టువులను.. సంతానాన్ని పిలిచి.. వృద్ధురాలైన తన తల్లిని ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. బంధువులు, స్నేహితులు, ఆత్మీయులను పిలిచి 'మాతృమూర్తికి వందనం' పేరుతో సంగీత విభావరి ఏర్పాటు చేసి విందు భోజనాలు పెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కు చెందిన పిల్లలమర్రి వరప్రసాద్ అలియాస్ పిచ్చయ్య ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి 2012లో ఉద్యోగ విరమణ చేశారు. ఇప్పుడు ఆయన వయసు 72. తండ్రి లక్ష్మీనారాయణ గతంలోనే చనిపోగా తల్లి కోటేశ్వరమ్మకు ప్రస్తుతం 93 ఏళ్లు. తన పనులు తాను చేసుకుంటూ ఆమె ఆరోగ్యంగా ఉన్నారు. కోటేశ్వరమ్మకు వరప్రసాద్‌తో పాటు మరో ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. తల్లికి సంతోషాన్ని కలిగించేందుకు ఆదివారం తన ఇంటి వద్దే.. కోటేశ్వరమ్మ వారసులందరి సమక్షంలో ఆమెకు వరప్రసాద్ పాదపూజ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లాలోని పలువురు ప్రముఖులు, వివిధ సంస్థల గురువులు.. వరప్రసాద్‌ను అభినందించారు. -న్యూస్‌టుడే, కొత్తగూడెం కలెక్టరేట్

శిక్షణతో రాటుదేలి.. సాహసంతో మెరిసి..



ఏ మాత్రం బెరుకు, భయం లేకుండా తలపైన ట్యూబ్‌లైట్లను పగల కొట్టించుకుంది ఈ చిన్నారి. ఒకటి రెండూ కాదు.. 6 నిమిషాల 9 సెకన్ల వ్యవధిలో ఏకంగా 100 లైట్లను శిక్షకుడు ఆమె తలపై పగలకొట్టారు. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక యశస్వి భారతి అందరి ముందూ ఆదివారం ఈ సాహస కృత్యంలో పాల్గొంది. స్థానిక సంజీవనగర్‌లో ఉన్న ఓ తైక్వాండో శిక్షణ కేంద్రంలో ఆమె 6 నెలలుగా శిక్షణ తీసుకుంటోంది. ఈ కార్యక్రమం వీడియోను చిన్నారి శిక్షకుడు సాయిబాబా నోబెల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులకూ పంపించారండోయ్!

- న్యూస్‌టుడే, తాడిపత్రి



గెలుపు పొందే వరకూ అలుపు లేదు మనకు

వచ్చే ఒలింపిక్స్‌కు క్రీడాకారులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా.. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియం ప్రధాన ద్వారం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి క్షణం విలువైనదని చాటుతూ.. ఒలింపిక్స్ క్రీడల కౌంట్ డౌన్ (రోజులు, గంటలు, నిమిషాలు, సెకన్లతో) కనిపించే స్క్రీన్‌ని ఉంచారు. 2028లో అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌నూ చేర్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి పది మంది వరకూ ఆ క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒలింపిక్స్‌లో పాల్గొనే వివిధ దేశాల పతకాలనూ అక్కడ ఏర్పాటు చేశారు. - ఈనాడు, హైదరాబాద్

మీ సంపాదనలో 10 శాతం మదుపు చేస్తే..



- రోజూ కనీసం అరగంట సేపు వ్యాయామం చేస్తే- 90 శాతం మంది కన్నా మీరు బలంగా ఉంటారు.
- ప్రతి నెలా మీ సంపాదనలో 10 శాతం మదుపు చేస్తే- మీతో సమానంగా సంపాదిస్తున్న వారి కన్నా ఎక్కువ సంపన్నులవుతారు.
- రోజూ కనీసం రెండు పేజీలు రాయడం సాధన చేస్తే- ఇతరుల కన్నా మీరు మరింత స్పష్టంగా ఆలోచించగలరు.

- అభిజీత్ చోక్సీ, ఫైనాన్షియల్ అడ్వైజర్



ములుకుపై ముక్కంటి

లోకంలో 64 కళలున్నాయని చెబుతాయి శాస్త్రాలు. గత కొన్ని దశాబ్దాల్లో కొత్తగా సూక్ష్మకళ ప్రాచుర్యంలోకి వచ్చింది. సాధారణ దృష్టితో చూడలేని విధంగా సూక్ష్మంగా కళాఖండాలను మలచడమే ఈ కళలోని ప్రత్యేకత. రంగారెడ్డి జిల్లా మహేశ్వరానికి చెందిన సాయి.. ఇందులో నైపుణ్యం సాధించి పెన్సిల్ ములుకు (ముల్కి)పై వివిధ ఆకృతులు చెక్కుతూ ఔరా అనిపిస్తున్నారు. ములుకుపై త్రిశూలం, శివలింగం, దానిపై నాగపడగ చెక్కిన చిత్రాన్ని చిత్రంలో చూడవచ్చు. - న్యూస్‌టుడే, మహేశ్వరం

ఒక్కసారి చెబితే.. అయిదుసార్లు చెప్పినట్టే!



నాలుగు రాష్ట్రాల్లో విస్తరించిన సత్పుడా పర్వత శ్రేణుల నడుమ మహారాష్ట్రలోని అమరావతి వద్ద ఉన్న మేల్‌ఘాట్ ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తుంది. ఈ ప్రాంతంలోని చిఖల్‌దరా కొండ ప్రాంతానికి సమీపంలో ఉన్న 'పంచ్‌బోల్' పాయింటు పర్యాటకులను ఆకట్టుకొంటుంది. చుట్టూ ఎత్తైన కొండలు, లోతైన లోయలతో కూడిన ఈ పాయింటులో నిలబడి బిగ్గరగా అరిస్తే మన గొంతు అయిదుసార్లు ప్రతిధ్వనించటం ఇక్కడి ప్రత్యేకత. చాలామంది తమ స్నేహితులు, ప్రేమికుల పేర్లను అరిచి చెబుతూ మురిసిపోతుంటారు. కరతాళ ధ్వనులు చేసినా మళ్లీ అయిదుసార్లు అవి ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. శబ్ద తరంగాలు గాలిలో పయనించి చుట్టూ ఉన్న అయిదు పర్వత శిఖరాల నుంచి వెనక్కు మళ్లీ అలా వినిపిస్తాయి. వర్షాకాలంలో 'పంచ్‌బోల్' పాయింటు చుట్టూ అలరించే పచ్చికబయళ్లు, జలపాతాలు చూసి తీరాల్సిందే. శీతాకాలంలో లోయల నుంచి పైకి ఎగసే మంచును చూడటం ప్రత్యేక అనుభూతినిస్తుంది. పర్వత శ్రేణుల నుంచి అయిదు గొంతులను స్పష్టంగా వినాలంటే జలపాత సవ్వడులు లేని వేసవిలో వెళ్లాల్సిందే. -ఈటీవీ భారత్

ఈ యాప్‌లు... సెల్‌ఫోన్‌కు రక్షక భటులు!



ఫైండ్ హబ్..

- ఆండ్రాయిడ్ ఫోన్లలోని 'ఫైండ్ మై డివైస్' గురించి చాలా మందికి తెలియదు. ఫోన్ లొకేషన్‌ను గుర్తించటానికి, ఎవరైనా ఫోన్ దొంగిలిస్తే దానిలోని సమాచారాన్ని కాపాడుకోవడానికి సాయం చేస్తుంది.
- సెల్‌ఫోన్‌లోని సెటింగ్స్‌కి వెళ్లి, సెక్యూరిటీ ఆప్షన్ ద్వారా ప్రైవసీలోకి వెళ్లాలి. ఫైండ్ మై డివైజ్‌ను ఆన్ చేయాలి.
- దీని కింద ఫైండ్ మై డివైజ్, వెబ్, గూగుల్ అనే ఆప్షన్లు ఉంటాయి.
- గూగుల్ ఫైండ్ హబ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోకుంటే ప్లే స్టోర్లో నుంచి డౌన్లోడ్ చేసుకోవాలి. అనంతరం ఓపెన్ చేస్తే గూగుల్ మ్యాప్ మాదిరిగా కనిపిస్తుంది.
- ఇది పనిచేయాలంటే ఫోన్లో లొకేషన్ ఆన్ చేసి ఉంచాలి. అప్పుడే మ్యాప్‌లో ఫోన్ ఉన్నచోటు కనిపిస్తుంది.
- ఇందులో ప్లే సౌండ్, సెక్యూర్ డివైజ్, ఎరేజ్ డివైస్ ఆప్షన్లు ఉంటాయి. వీటిలో ఎరేజ్ డివైస్‌ను అదే పరికరం నుంచి ఉపయోగించుకోలేం. వెబ్ లేదా ఇతర పరికరం ద్వారా ఎరేజ్ చేయడానికి వీలుంటుంది.

ఎలా ఉపయోగపడుతుంది...

- ఎప్పుడైనా ఫోన్ కనిపించనప్పుడు, ఎవరైనా దొంగిలించినప్పుడు వెబ్ ఇంటర్ ఫేస్‌తోగుర్తించొచ్చు.
- https://www.google.com/android/find అధికారిక వేదికను ఓపెన్ చేయాలి.
- దానిలో మన ఫోన్ కనిపిస్తుంది. ప్లే సౌండ్‌ను ఎంచుకుంటే 5 నిమిషాలు ఫోన్ రింగ్ అవుతుంది. ఫోన్ ఎవరిదగ్గర ఉందో, వారిని హెచ్చరించేందుకు మెసేజ్ కూడా పంపించొచ్చు. స్క్రీన్ లాక్ అయినా వారికి మెసేజ్ కనిపిస్తుంది.
- ఫోన్‌ని లాక్ చేయాలనుకుంటే 'సెక్యూర్ డివైస్' మీద క్లిక్ చేసి, గూగుల్ ఖాతా నుంచి సైన్ అవుట్ కావాలి. 'ఎరేజ్ డివైస్' ఆప్షన్‌తో ఫోన్లోని సమాచారాన్నంతా డిలీట్ చేయొచ్చు.
- ఒకవేళ కంప్యూటర్ అందుబాటులో లేకపోతే ఇతర ఆండ్రాయిడ్ పరికరంతోనూ ఫైండ్ మై డివైస్ యాప్లోకి సైన్ ఇన్ అయ్యి సెల్‌ఫోన్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించొచ్చు.

అందుబాటులో ఇవి కూడా...

ఇతరుల చేతికి చిక్కిన ఫోన్లను గుర్తించడానికి థర్డ్ పార్టీ యాప్‌లు, యాంటీ థెఫ్ట్ యాప్‌లు తోడ్పడతాయి. వీటిల్లో కొన్ని..

సెర్బరస్..

- ఈ యాప్‌ను అధికారిక వేదిక, గూగుల్ ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని మెయిల్‌తో లాగిన్ అవ్వాలి.
- మీ ఫోన్‌ని ఎవరైనా తీసుకెళ్తే యాప్‌లో నమోదైన నంబరుకు వెంటనే ఎలర్ట్ మెసేజ్ వెళుతుంది. ఈ యాప్ అడ్మిన్ లిస్ట్‌లో ఉండడం వల్ల దాన్ని డిలీట్ చేయడం కుదరదు. ఫోన్ దొంగలు చేసే మొదటి పని సిమ్ మార్చడం. అలాచేస్తే సెర్బరస్ వెంటనే హెచ్చరికలు జారీచేస్తుంది.
- దీని ద్వారా ఫోన్‌కు లాక్ పడేలా చేయడం, హెచ్చరికలు జారీ చేయడం వంటివి చేయొచ్చు. ఫోన్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించవచ్చు.
- ఈ యాప్‌లో ఉన్న మరో సదుపాయం ఏంటంటే ఏ వ్యక్తి అయితే దొంగలించిన తరవాత వాడుతుంటారో అతని చిత్రాన్ని కూడా కంట్రోల్ చేసే అధికారిక వేదిక ద్వారా తీసుకోవచ్చు.

డబ్ల్యూఎంపీ..

ఎవరైనా మీ పక్కన ఉన్న వ్యక్తులు మీకు తెలియకుండా సెల్‌ఫోన్ తీసి వాడే అవకాశం ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో ఈ యాప్ బాగా ఉపయోగపడుతుంది. మీ ఫోన్‌ను ఎవరైనా తీసుకుని ఓపెన్ చేసిన వెంటనే వారి ఫొటో తీసుకుంటుంది. దాని ద్వారా ఎవరు, ఏ సమయంలో తీసుకున్నారో పూర్తి సమయంతో సహా యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రే యాప్..

ఫోన్లు, ట్యాబ్‌లు, లాప్‌టాప్‌లకు ఇది మంచి యాప్. అన్నీ పరికరాల్లో ఒకే ఎకౌంట్‌తో వాడొచ్చు. ఈ యాప్ అధికారిక వేదిక ద్వారా సెల్‌ఫోన్‌ని కంట్రోల్ చేయొచ్చు. ఆప్షన్లలో రిమోట్ అలారాన్ని క్లిక్ చేస్తే మీరు ఆపేంత వరకు సౌండ్ వస్తూనే ఉంటుంది. ఎలర్ట్ మెసేజ్ పంపుతుంది. ఫోన్ ఎవరి వద్ద ఉన్నా మీరు లాగిన్ అయిన వేదిక ద్వారా స్క్రీన్‌లాక్ చేయొచ్చు.

డోంట్ టచ్ మై ఫోన్..

సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టినప్పుడు ఎవరైనా తీసినా, పాస్‌వర్డ్ తప్పుగా కొట్టినా వెంటనే ఈ యాప్ హెచ్చరిస్తుంది.

- ఈనాడు డిజిటల్, హైదరాబాద్



నైనం ఛిందంతి శస్త్రాణి...



విశాఖలోని పోర్టు స్టేడియంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. భగవద్గీత మానవాళికి లభించి 5162 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 5,116 మందితో పారాయణం చేసినట్లు మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానందస్వామి తెలిపారు. అవధూత దత్తపీఠం, భగవద్గీత ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో భగవద్గీతలోని 18 అధ్యాయాల నుంచి 700 శ్లోకాలను ఆలపించగా, ఈ పారాయణాన్ని పీఠం ఉత్తరాధికారి విజయ సచ్చిదానందస్వామి పర్యవేక్షించారు. సుమారు 10 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సనాతన భారతీయ సంస్కృతి, గీతతత్వాన్ని ప్రజల్లోకి విస్తరింపజేయడం సహా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని భక్తులు పేర్కొన్నారు.

-న్యూస్‌టుడే, విశాఖపట్నం

'ఛత్తీస్‌గఢ్ భీముడు'కి అమెరికాలో ప్రశంసలు



ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మల్లయోధుడు, సామాజికవేత్త, విద్యాదాత చింతారామ్ టిక్రిహా జీవితం ఆధారంగా తెరకెక్కిన డాక్యుమెంటరీ 'ఛత్తీస్‌గఢ్ కే భీమ్ చింతారామ్'కు అమెరికాలో గొప్ప గౌరవం లభించింది. ఈ నెల 2న న్యూయార్క్‌లో జరిగిన అమెరికన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ డాక్యుమెంటరీకి ప్రశంసలు లభించాయి. నగరంలోని స్టేటెన్ ఐలాండ్‌లో గల సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ పెర్ఫార్మింగ్ థియేటరులో దీన్ని ప్రదర్శించగా ప్రేక్షకులు నిలబడి కరతాళ ధ్వనులు చేశారు. యువ దర్శకుడు ఎస్. అన్షు దురంధర్ ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించారు. 154 దేశాల నుంచి 2,974 చిత్రాలు పోటీపడగా, ఎంపిక చేసిన కొన్నింటిని మాత్రమే ప్రదర్శించారు. భారత్ నుంచి 8 సినిమాలు స్క్రీనింగుకు ఎంపికవగా, అందులో 'ఛత్తీస్‌గఢ్ కే భీమ్' ఒకటి. ఛత్తీస్‌గఢ్‌లోని జాంజ్‌గిర్ చాంపా జిల్లా బుడ్గహాన్‌లో చింతారామ్ టిక్రిహా 1880లో జన్మించారు. సమాజంలోని ఏ వర్గం ఆకలితో ఉన్నా సంపన్నులు సంతోషంగా ఉండలేరని చింతారామ్ నమ్మారు. ఆయన ఇంటి ధాన్యాగారపు తలుపులు నిత్యం తెరిచి ఉండేవి. ఆహారం అవసరం ఉన్నవారు తీసుకువెళ్లేవారు. -ఈటీవీ భారత్

పాండవుల స్వర్గ 'మార్గం'



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో 3,200 మీటర్ల ఎత్తులో ఉన్న మానా గ్రామంలో నెలకొల్పిన పాండవులు, ద్రౌపది విగ్రహాలు ఇవి. బద్రీనాథ్ సమీపంలో ఉన్న మానా నుంచే పాండవులు స్వర్గానికి పయనమయ్యారని స్థానికుల నమ్మకం. దాని ప్రతీకగానే అక్కడ విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఒక్కో లోహపు విగ్రహం దాదాపు 13 క్వింటాళ్ల బరువు ఉంటుంది. మహాభారత ఇతిహాసం నేపథ్యం కారణంగా మానాలో సాంస్కృతిక, ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. దీన్ని మొదటి భారతీయ గ్రామంగానూ పిలుస్తారు.

ప్రపంచ షూటింగ్

అనీష్‌కు రజతం


అనీష్

కైరో: ప్రపంచ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో అనీష్ బన్వాలా మెరిశాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అతడు రజతం సాధించాడు. ఆదివారం ఫైనల్లో అనీష్ 28 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో ఈ భారత షూటర్ రెండు షూటాఫ్‌లను దాటాడు. మొదట ముల్లర్ (జర్మనీ, 22)ను వెనక్కి నెట్టిన అనీష్.. తర్వాత మెక్సిమ్ హొరోడ్‌నెట్స్ (ఉక్రెయిన్, 25)పై గెలిచి ముందంజ వేశాడు. కానీ క్లెమెంట్ బెస్‌గెట్ (ఫ్రాన్స్, 31)తో స్వర్ణ పోరులో చివర్లో తడబడి రజతానికి పరిమిత మయ్యాడు. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్‌లో అర్జున్ బబుతా, ఇలవేనిల్ వలరివాన్ ఫైనల్ చేరడంలో విఫలమయ్యారు. 632.3 పాయింట్లతో భారత జంట ఎనిమిదో స్థానంలో నిలిచింది. రుద్రాంక్ష్ పాటిల్-శ్రేయ అగర్వాల్ జంట (628.8) 21వ స్థానానికి పరిమితమైంది.

విదిత్ ఔట్


విదిత్ గుజరాతి

పంజిమ్: చెస్ ప్రపంచకప్ నుంచి విదిత్ గుజరాతి నిష్క్రమించాడు. మూడో రౌండ్లో అతడు 2.5-3.5తో సామ్ షంక్‌లాండ్ (అమెరికా) చేతిలో ఓడాడు. ఈ పోరులో తొలి రెండు గేమ్‌లు డ్రా కాగా.. టైబ్రేక్‌లో విదిత్-సామ్ చెరో గేమ్ నెగ్గారు. మూడో గేమ్ డ్రా కాగా.. నాలుగో గేమ్‌ను సామ్ గెలుచుకుని ముందంజ వేశాడు. ఎస్ ఎల్ నారాయణన్ 1.5-2.5తో యు యాంగి (చైనా) చేతిలో ఓడగా.. కార్తీక్ వెంకటరామన్ 2.5-1.5తో డానియల్ బోగ్డాన్ (రొమేనియా)పై గెలిచాడు. అర్జున్ ఇరిగేశి, పెంటేల హరికృష్ణ, ప్రజ్ఞానంద, ప్రణవ్ నాలుగో రౌండ్లో ప్రవేశించిన సంగతి తెలిసిందే. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్, మహిళల ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ ఇప్పటికే ఇంటిముఖం పట్టారు.

మెరిసిన భారత ఆర్చర్లు


జ్యోతి సురేఖ

ఢాకా: ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు మెరిశారు. ఆదివారం జరిగిన అర్హత రౌండ్లలో భారత యువ రికర్వ్ ఆర్చర్లు యశ్‌దీప్ భోగె, అంషిక కుమారి సత్తా చాటడంతో టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్లు రెండో స్థానం సాధించాయి. పురుషుల ర్యాంకింగ్ రౌండ్లో 687/720 స్కోరుతో యశ్‌దీప్ అగ్రస్థానంలో నిలిచాడు. అతాను దాస్ (668) ఏడు, రాహుల్ 11వ స్థానాలు సాధించడంతో మొత్తంగా భారత్‌కు రెండో ర్యాంకు లభించింది. 13వ స్థానంలో నిలిచిన బొమ్మదేవర ధీరజ్ (665) టీమ్ ఈవెంట్ నుంచి నిష్క్రమించాడు. మహిళల విభాగంలో అంషిక (660) అయిదు, అంకిత భకత్ (655) 9, సంగీత (649) 11వ స్థానాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్‌కు రెండో ర్యాంకు దక్కింది. 12వ స్థానంలో నిలిచిన దీపిక కుమారి (649) టీమ్ ఈవెంట్‌కు దూరమైంది. కాంపౌండ్ విభాగంలో భారత్ ఆర్చర్ల ఆధిపత్యం కొనసాగుతోంది. మహిళల అర్హత రౌండ్లో నలుగురు భారత ఆర్చర్లు టాప్-5లో చోటు సంపాదించారు. దీప్షిఖ (705), పార్క్ యెరిన్ (704- కొరియా) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. వెన్నం జ్యోతి సురేఖ (703), ప్రీతిక ప్రదీప్ (702), చికిత తానిపర్తి (701) వరుసగా తర్వాతి స్థానాలు సాధించారు. భారత జట్టు టాప్ సీడింగ్ సొంతం చేసుకుంది. పురుషుల విభాగంలో అభిషేక్‌వర్మ (713) రెండు, సాహిల్ జాదవ్ (709) 4, ప్రథమేశ్ (707) 6వ స్థానాల్లో నిలవడంతో భారత్‌కు రెండో ర్యాంకు దక్కింది. కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్‌లో అభిషేక్‌వర్మ, దీప్షిక జోడీకి రెండో సీడింగ్ లభించింది.

కివీస్‌దే మూడో టీ20

నెల్సన్ (న్యూజిలాండ్): ఇష్ సోధి (3/34), జాకబ్ డఫీ (3/36) విజృంభించడంతో వెస్టిండీస్‌తో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో న్యూజిలాండ్ పైచేయి సాధించింది. ఆదివారం మూడో టీ20లో 9 పరుగుల తేడాతో విండీస్‌ను ఓడించిన కివీస్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యం సంపాదించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆతిథ్య జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 177 పరుగులు సాధించింది. డెవాన్ కాన్వే (56; 34 బంతుల్లో 6×4, 2×6), డరైల్ మిచెల్ (41; 24 బంతుల్లో 2×4, 3×6) సత్తాచాటారు. ఛేదనలో విండీస్ తడబడింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ సోధి, డఫీ దెబ్బకు 19.5 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. రొమారియో షెఫర్డ్ (49; 34 బంతుల్లో 4×4, 3×6), షమర్ స్ప్రింగర్ (39; 20 బంతుల్లో 3×4, 3×6) పోరాటం వృథా అయింది.

ఛాంపియన్

దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ మరో నాలుగు రోజుల్లో మొదలవుతోంది. బ్యాటింగ్‌లో ఎవరుండాలి.. బౌలింగ్‌లో ఎవరిని ఆడించాలి అన్న చర్చ ఎక్కడా లేదు. ఇప్పుడు అందరి చర్చ వికెట్‌కీపర్ స్థానం గురించే! గాయంతో స్టార్ వికెట్‌కీపర్ రిషభ్ పంత్ దూరమైన సమయంలో సత్తా చాటిన ధ్రువ్ జురెల్‌ను జట్టులో కొనసాగించాలన్న డిమాండ్ రోజు రోజుకు బలపడుతోంది. మరి అతడిని ఆడించాలంటే ఎవరిని తప్పించాలి?

జురెల్‌కు చోటుందా!


ధ్రువ్ జురెల్

ఈనాడు క్రీడావిభాగం

ధ్రువ్ జురెల్.. భారత టెస్టు జట్టులోకి దూసుకొచ్చిన యువ వికెట్‌కీపర్. స్థిరంగా రాణిస్తూ కుదురుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్ పర్యటనలో రెగ్యులర్ వికెట్‌కీపర్ రిషబ్ పంత్ గాయపడడంతో జురెల్ అతడి స్థానంలో ఆడాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్‌లో సత్తా చాటాడు. సెంచరీతో అదరగొట్టాడు. తాజాగా దక్షిణాఫ్రికా-ఎతో నాలుగు రోజుల టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ శతకాలతో ఫామ్ చాటుకున్నాడు. మరోవైపు ఇదే మ్యాచ్‌లో పునరాగమనం చేసి ఫిట్‌నెస్, ఫామ్ నిరూపించుకున్న రిషబ్ పంత్ దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు అందుబాటులోకి వచ్చాడు. జట్టుకు వైస్ కెప్టెన్ అయిన పంత్ జట్టులో ఉండడం ఖాయం. మరి పంత్‌తో పాటు జురెల్‌ను జట్టులో ఆడించాలంటే..? ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ ముందున్న ప్రధాన సమస్య ఇదే.

సంప్రదాయబద్ధంగా ఆడుతూనే దూకుడుగా షాట్లు కొట్టడం 24 ఏళ్ల జురెల్ శైలి. దీనికి తోడు చక్కని వికెట్‌కీపింగ్ నైపుణ్యాలు అతడి సొంతం. గతేడాది ఫిబ్రవరిలో స్వదేశంలో ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో జురెల్ అరంగేట్రం చేశాడు. తొలి టెస్టులోనే తన ముద్ర వేశాడు. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి పరిణతితో ఆడాడు. లోయర్‌ఆర్డర్‌తో కలిసి జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. ఆ సిరీస్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన అతడు.. తర్వాత ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఒక టెస్టు ఆడాడు. ఈ మ్యాచ్‌లో పంత్ వికెట్‌కీపింగ్ చేయగా.. జురెల్ బ్యాటర్‌గా బరిలో దిగాడు. తర్వాత ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రిషబ్ పంత్ (479 పరుగులు) గొప్ప ప్రదర్శనే చేసినా.. పాదం గాయంతో అయిదో టెస్టుకు దూరమయ్యాడు. ఆ మ్యాచ్‌లో జురెల్ ఆడాడు. స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్‌లోనూ ఈ వికెట్‌కీపర్ కొనసాగాడు. విండీస్‌తో రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (125)తో అదరగొట్టాడు. మొత్తంగా 7 టెస్టుల్లో 47పైన సగటుతో 430 పరుగులు చేశాడు. దేశవాళీలోనూ అతడు ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. గత 9 ఫస్ట్‌క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో జురెల్ మూడు సెంచరీలు, నాలుగు అర్ధసెంచరీలు సాధించాడు. తాజాగా దక్షిణాఫ్రికా-ఎతో రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించాడు. టీ20ల ప్రభావంతో కాసేపు క్రీజులో నిలబడటానికి కష్టపడుతున్న యువ క్రికెటర్లకు జురెల్ భిన్నం. అతడి టెక్నిక్, నిబద్ధతను చూసి తీరాల్సిందే. టీ20 శైలి బ్యాటింగ్ ఉన్నా కూడా పరిస్థితికి తగ్గట్టుగా ఆడుతూ గేర్లు మార్చుతూ సాగడం జురెల్ స్టయిల్. ప్రస్తుతం జురెల్ ఉన్న ఫామ్‌లో అతడిని తుది జట్టు నుంచి తొలగించే సాహసం టీమ్‌మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు. మరి ఎవరిని తప్పిస్తారు?

ఎవరి స్థానంలో

భారత టెస్టు జట్టులో ఒకే మ్యాచ్‌లో ఇద్దరు స్పెషలిస్టు వికెట్‌కీపర్లు ఆడిన సందర్భాలు చాలా తక్కువ. జురెల్ జట్టులో ఉండాలంటే స్పెషలిస్టు బ్యాటర్‌గానే ఆడాలి. ప్రస్తుత కూర్పులో సాయి సుదర్శన్ ఆడే మూడో స్థానంలో అతడిని జట్టులోకి తీసుకోవాలి. కానీ మూడో స్థానంలో స్థిరమైన ఆటగాడి కోసం చూస్తున్న టీమ్ఇండియా.. సుదర్శన్‌ను తప్పించకపోవచ్చు. స్వదేశంలోనే సిరీస్ జరుగుతున్న నేపథ్యంలో పేస్ ఆల్‌రౌండర్ పాత్ర పరిమితమవుతుంది. అతడు ఎక్కువ బౌలింగ్ చేసే అవకాశాలు కూడా ఉండవు. ప్రధాన స్పిన్నర్ కుల్‌దీప్‌యాదవ్‌తో పాటు.. స్పిన్ ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు జట్టులో ఉంటారు కాబట్టి.. పేస్ ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి స్థానంలో జురెల్ తీసుకోవాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. టీమ్‌మేనేజ్‌మెంట్ ఆలోచన ఈ దిశగానే సాగుతున్నట్లు సమాచారం. జురెల్‌ను ఆడిస్తే బ్యాటింగ్ లోతు కూడా పెరుగుతుంది. సాధారణంగా వికెట్‌కీపర్లు ఔట్ ఫీల్డింగ్‌లో ఇబ్బందిపడుతుంటారు. కానీ జురెల్ మంచి ఫీల్డర్ కూడా. ఇటీవల తరుచుగా గాయపడుతున్న పంత్‌ను బ్యాటర్‌గా ఆడించి.. జురెల్‌కు కీపింగ్ అప్పగించే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇలా చేయడం ద్వారా పంత్‌పై భారం తగ్గి బ్యాటింగ్‌పై మరింత దృష్టి సారించే అవకాశాలుంటాయని మాజీ వికెట్‌కీపర్ సబా కరీం అన్నాడు. ''చేయి, కన్ను మధ్య సమన్వయంతోనే రిషబ్ పంత్ కీపింగ్ సాగుతుంది. జురెల్ ప్రస్తుత తరం కీపర్. బౌలర్‌కు తగ్గట్టుగా వికెట్ల వెనుక మెరుపులా కదులుతూ కీపింగ్ చేస్తాడు. ప్రస్తుత పరిస్థితుల్లో పంత్‌ను బ్యాటర్‌గా ఆడించి.. జురెల్‌కు గ్లోవ్స్ ఇస్తే మేలు. అప్పుడు పంత్‌కు విశ్రాంతి కూడా దొరుకుతుంది'' అని కరీమ్ అన్నాడు.

ఆకాశ్ అద్భుతం


ఆకాశ్

- వరుసగా ఎనిమిది సిక్సర్లు
- 11 బంతుల్లో అర్ధ సెంచరీ
- మేఘాలయ కుర్రాడి సంచలన బ్యాటింగ్

సూరత్: ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన ఓ బౌలర్ మహా అంటే పది పరుగులు చేస్తే గొప్ప అనుకుంటారు! కానీ ఆ కుర్రాడు అద్భుతమే చేశాడు. రికార్డుల దుమ్ముదులిపాడు. వరుసగా 8 సిక్సర్లతో చెలరేగిపోయాడు. 11 బంతుల్లోనే అర్ధసెంచరీ చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. అరుణాచల్ ప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో మేఘాలయ ఆటగాడు 25 ఏళ్ల ఆకాశ్ చౌదరి (50 నాటౌట్; 14 బంతుల్లో 8×6) ఘనతలివి. రాహుల్ దలాల్ (144; 102 బంతుల్లో 12×4, 9×6) కూడా రెచ్చిపోవడంతో ఓవర్‌నైట్ స్కోరు 386/2తో ఆదివారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మేఘాలయ 628/6 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓ డాట్, రెండు సింగిల్స్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆకాశ్ ఆ తర్వాత లిమార్ దాబి బౌలింగ్‌లో వరుసగా ఆరు సిక్సర్లు బాదాడు. తాను ఎదుర్కొన్న తర్వాతి రెండు బంతులను సిక్సర్లుగా మలిచి అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో వరుసగా 8 సిక్సర్లు కొట్టిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించిన ఆకాశ్.. ఈ ఫార్మాట్లో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ రాబట్టిన ఆటగాడిగానూ ఘనత అందుకున్నాడు. 2012లో ఎసెక్స్‌తో మ్యాచ్‌లో లీసెస్టర్‌షైర్ బ్యాటర్ వేనీ వైట్ (12 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును తిరగరాశాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో గ్యారీ సోబర్స్, రవి శాస్త్రి తర్వాత ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు బాదిన మూడో క్రికెటర్‌గా ఆకాశ్ నిలిచాడు. అనంతరం అరుణాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 27.4 ఓవర్లలో 73 పరుగులకే కుప్పకూలింది. ఫాలోఆన్ ఉచ్చులో చిక్కుకున్న అరుణాచల్ ప్రదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లకు 29 పరుగులు చేసింది.

తనయ గెలిచె.. తండ్రి గౌరవం నిలిచె


క్రాంతి గౌడ్

భోపాల్: చరిత్రాత్మక ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యురాలైన మధ్యప్రదేశ్ పేసర్ క్రాంతి గౌడ్ మరో గొప్ప విజయాన్ని సాధించింది. బర్తరఫ్ అయిన తన తండ్రిని తిరిగి పోలీసుగా చూసుకోవాలన్న ఆమె కోరిక నెరవేరనుంది. ఆమె తండ్రి మున్నా సింగ్ గౌడ్‌ను పోలీసుగా పునర్నియమిస్తామని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ హామీ ఇచ్చారు. క్రాంతిని సన్మానించిన సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు. 2012లో ఎన్నికల విధులు నిర్వర్తించడంలో ఒక పొరపాటు చేయడంతో కానిస్టేబుల్ మున్నా సింగ్‌పై వేటు పడింది. అప్పటి నుంచి క్రాంతి కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంది. కొన్నిసార్లు తాము తిండికి కూడా నోచుకోలేకపోయామని గతంలో క్రాంతి ఆవేదన వ్యక్తం చేసింది. అయినా క్రికెటర్‌గా కెరీర్‌ను కొనసాగించిన ఆమె భారత జట్టులో చోటు సంపాదించి.. కుటుంబానికి అండగా నిలిచింది. తండ్రిని తిరిగి పోలీసుగా చూసుకోవాలనుకుంటున్నట్లు, అతడు గౌరవంగా రిటైర్ కావాలని కోరుకుంటున్నట్లు ఇటీవల ఆమె చెప్పింది. తల్లిదండ్రుల ఎదురుగా క్రాంతిని సన్మానించిన సీఎం మోహన్ యాదవ్.. మున్నా సింగ్‌ను పోలీసు శాఖలో పునర్నియమిస్తామని చెప్పారు. కుటుంబ గౌరవాన్ని నిలిపినందుకు చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా క్రాంతి పేర్కొంది.

సీఎస్కేకు సంజు!


సంజు శాంసన్

దిల్లీ: ఐపీఎల్-2026 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ వేరే జట్టు తరపున ఆడటం దాదాపుగా ఖాయం. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) అతడి కోసం ఇప్పటికే ఆసక్తి ప్రదర్శించింది. సంజు కోసం ఆల్‌రౌండర్లు రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను వదులుకునేందుకు సిద్ధమైందని సమాచారం. రాజస్థాన్ ఒప్పుకుంటే.. ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ పూర్తవుతుంది. సంజు తన ఐపీఎల్ కెరీర్‌లో ఎక్కువ రాజస్థాన్‌కే ఆడాడు. 2021 నుంచి ఆ జట్టుకు సారథిగా కూడా ఉన్నాడు. తొలి రెండు ఐపీఎల్ టోర్నీల్లో రాజస్థాన్‌కు జడేజా ఆడాడు. ఆ తర్వాత కెరీర్‌లో ఎక్కువశాతం చెన్నైకే ప్రాతినిధ్యం వహించాడు. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ చెన్నైతో పాటు పంజాబ్ కింగ్స్‌కు ఆడాడు.

ఏటీపీ ఫైనల్స్‌కు జకోవిచ్ దూరం


జకోవిచ్

ఏథెన్స్: టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ వరుసగా రెండో ఏడాది ఏటీపీ ఫైనల్స్ టోర్నీకి దూరమయ్యాడు. హెలెనిక్ ఛాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న అతడు.. టాప్-8 ఆటగాళ్ల మధ్య జరిగే ఏటీపీ ఫైనల్స్ నుంచి వైదొలిగానని చెప్పాడు. గాయం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. అతడి స్థానంలో లొరెంజో ముసెట్టి (ఇటలీ)కి ఆడే అవకాశం లభించింది. ఆదివారం ముసెట్టిని ఓడించే జకోవిచ్ హెలెనిక్ టైటిల్ గెలిచాడు. ఫైనల్లో జకోవిచ్ 4-6, 6-3, 7-5తో విజయం సాధించాడు. కెరీర్లో అతడికిది 72వ హార్డ్ కోర్టు టైటిల్. హార్డ్ కోర్టుల్లో అత్యధిక టైటిళ్లు గెలిచిన ఆటగాడిగా ఫెదరర్ పేరిట ఉన్న రికార్డు (71)ను అధిగమించాడు.

టాప్-16పై దృష్టి పెట్టా


ఆకర్షి కశ్యప్

హైదరాబాద్, ఈటీవీ భారత్: బ్యాడ్మింటన్ మహిళల సింగిల్స్‌లో టాప్-16 ర్యాంకులోకి రావడమే తన లక్ష్యమని భారత యువ షట్లర్ ఆకర్షి కశ్యప్ 'ఈటీవీ భారత్'తో చెప్పింది. "2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నా. అన్ని రోజులు ఆడాలంటే గాయాలు కాకుండా జాగ్రత్త వహించాలి. ర్యాంకింగ్స్‌లో టాప్-16లో ఉండేలా చూసుకుంటే ఒలింపిక్స్‌కు అర్హత సాధించొచ్చు. స్థిరంగా రాణిస్తున్నా. ప్రస్తుతం నేనున్న ఫామ్‌ను బట్టి చూసుకుంటే కచ్చితంగా లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో ఆడతాననే అనుకుంటున్నా" అని ఆకర్షి తెలిపింది. అండర్-15, 17, 19 జాతీయ ఛాంపియన్ అయిన ఆకర్షి.. 2022లో కామన్వెల్త్ క్రీడల్లో మిక్స్‌డ్ టీమ్ విభాగంలో రజతం సాధించింది. ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో ప్రస్తుతం ఆమె 59వ స్థానంలో ఉంది.

డబ్ల్యూటీఏ ఫైనల్స్

ఛాంప్ రిబకీనా


రిబకీనా

రియాద్: ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంకా(బెలారస్)కు షాక్. డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్‌ను ఎలీనా రిబకీనా సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన తుది పోరులో ప్రపంచ నం.6 రిబకీనా (కజకిస్థాన్) 6-3, 7-6 (7/0)తో సబలెంకాను ఓడించింది. టైటిల్ గెలిచే క్రమంలో రిబకీనా ప్రపంచ నం.2 ఇగా స్వైటెక్(పోలెండ్)పైనా విజయం సాధించింది. ఆమెకు ఇదే తొలి డబ్ల్యూటీఏ ఫైనల్స్ టైటిల్. అత్యుత్తమ ఎనిమిది మంది క్రీడాకారిణుల మధ్య నిర్వహించే డబ్ల్యూటీఏ ఫైనల్స్ తుది పోరులో ఓడటం సబలెంకాకు ఇది రెండోసారి. 2022లోనూ ఆమెకు పరాజయం ఎదురైంది. ఈ టోర్నీలో ఓడినప్పటికీ సబలెంకా ఈ ఏడాదిని అగ్రస్థానంతో ముగించనుంది. ఈ ఘనత సాధించడం ఆమెకు ఇది వరుసగా రెండోసారి. ఈ ఏడాది సబలెంకా యుఎస్ ఓపెన్‌తో సహా నాలుగు టైటిల్స్ గెలిచింది. ఫ్రెంచ్ ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఫైనల్ చేరింది.

పోరాడుతున్న రాజస్థాన్

ఈనాడు, హైదరాబాద్: రాజస్థాన్, హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-డి మ్యాచ్ ఆసక్తికరంగా సాగుతోంది. హైదరాబాద్‌పై ఆధిక్యం కోసం రాజస్థాన్ గట్టిగా పోరాడుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 295/7తో ఆదివారం ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 364 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్ రాదేశ్ (129; 202 బంతుల్లో 16×4) సెంచరీతో సత్తాచాటాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రాజస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లకు 221 పరుగులు సాధించింది. సచిన్ యాదవ్ (43) రాణించగా.. కునాల్‌సింగ్ రాఠోడ్ (64 బ్యాటింగ్), కుక్నా అజయ్ సింగ్ (42 బ్యాటింగ్) ఆరో వికెట్‌కు అజేయంగా 104 పరుగులు జోడించి రాజస్థాన్ స్కోరును 200 దాటించారు. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్‌రెడ్డి (2/50), తనయ్ త్యాగరాజన్ (2/58), సి.వి. మిలింద్ (1/35) మెరిశారు. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు రాజస్థాన్ 143 పరుగుల దూరంలో ఉంది.

తమిళనాడుకు ఆధిక్యం

విశాఖపట్నం: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూపు-ఎ మ్యాచ్‌లో తమిళనాడుకు స్వల్ప ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 20/1తో రెండో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 177 పరుగులకే ఆలౌటైంది. షేక్ రషీద్ (87 నాటౌట్; 150 బంతుల్లో 8×4, 2×6) ఒంటరి పోరాటం చేశాడు. సందీప్ వారియర్ (4/53), త్రిలోక్ నాగ్ (2/50), సోను యాదవ్ (2/20), సాయి కిషోర్ (2/38) సమష్టిగా విజృంభించడంతో తమిళనాడు అయిదు పరుగుల ఆధిక్యం సంపాదించింది. ఆదివారం ఆట ముగిసే సమయానికి తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 102 పరుగులు చేసింది. బాలసుబ్రమణ్యం సచిన్ (51; 81 బంతుల్లో 8×4) అర్ధ సెంచరీతో రాణించాడు. ఆంధ్ర బౌలర్లు పృథ్వీరాజ్ (1/16), కలిదిండి రాజు (1/30) చెరో వికెట్ తీశారు.

ఆస్ట్రేలియా పాస్‌పోర్టు వదిలి..


ర్యాన్ విలియమ్స్

బెంగళూరు: ఆస్ట్రేలియా ఫుట్‌బాల్ ఆటగాడు ర్యాన్ విలియమ్స్ భారత జట్టు తరపున ఆడబోతున్నాడు. ర్యాన్ ఆస్ట్రేలియాలో జన్మించాడు. అతడి తల్లి స్వస్థలం ముంబయి.. తండ్రిది ఇంగ్లాండ్. ఇండియన్ సూపర్ లీగ్‌లో బెంగళూరు ఎఫ్‌సీకి ఆడిన 32 ఏళ్ల ఈ ఫార్వర్డ్.. ఆస్ట్రేలియా పాస్‌పోర్టును వదిలి భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. బంగ్లాదేశ్‌తో ఏఎఫ్‌సీ ఆసియాకప్ క్వాలిఫయర్స్ పోరుకు సిద్ధమవుతున్న భారత శిబిరంలో ర్యాన్ ఆదివారం చేరాడు. ఆస్ట్రేలియా అండర్-20, 23 జట్ల తరపున ర్యాన్ ఆడాడు. సీనియర్ జట్టు తరపున 2019లో దక్షిణ కొరియాతో ఓ స్నేహపూర్వక మ్యాచ్‌లో పాల్గొన్నాడు. నేపాల్‌కు ఆడే అబ్‌నీత్ భార్తి కూడా భారత జట్టులో ఆడబోతున్నాడు.


సత్తాచాటిన బ్యాటర్లు.. దక్షిణాఫ్రికా-ఎ విజయం

బెంగళూరు: బ్యాటర్లు సమష్టిగా సత్తాచాటడంతో ఇండియా-ఎతో రెండో అనధికారిక టెస్టును దక్షిణాఫ్రికా-ఎ సొంతం చేసుకుంది. ఆదివారం 5 వికెట్ల తేడాతో విజయం సాధించి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకుంది. 417 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 25/0తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా-ఎకు బౌలర్ల నుంచి పెద్ద సవాల్ ఏమీ ఎదురుకాలేదు. ఓపెనర్లు జోర్డాన్ హెర్మన్ (91), లెసెగో సెనోక్వానె (77) తొలి వికెట్‌కు 156 పరుగులతో గట్టి పునాది వేశారు. అనంతరం జుబేర్ హంజా (77), బవుమా (59) నాలుగో వికెట్‌కు 107 పరుగులు జత చేసి జట్టు స్కోరును 300 దాటించారు. చివర్లో కానర్ ఎస్తరూజెన్ (52 నాటౌట్; 54 బంతుల్లో 8×4, 1×6), తియాన్ వూరెన్ (20 నాటౌట్; 23 బంతుల్లో 1×6) ఆరో వికెట్‌కు అజేయంగా 65 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికా-ఎ విజయాన్ని అందుకుంది. భారత బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (1/53), ఆకాశ్ దీప్ (1/106), ప్రసిద్ధ్ కృష్ణ (2/49), హర్ష్ దూబె (1/111) సఫలమయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్-ఎ 255 పరుగులు చేయగా.. దక్షిణాఫ్రికా జట్టు 221 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌ను భారత జట్టు 382/7 వద్ద డిక్లేర్ చేసింది.

కూటముల్లో మార్పులతో రసవత్తరం!

బిహార్ రెండో విడతలో తేలనున్న ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ కీలక నేతల భవితవ్యం

122 సీట్లలో హోరాహోరీ



ఓట్ల బదిలీ 100 శాతం జరిగితే..

ఎన్నికల్లో 2 ప్లస్ 2 ఎప్పటికీ 4 కాదు. కానీ కూటముల్లో 100 శాతం ఓట్ల బదిలీ జరిగితే ఈ విడతలో మళ్లీ ఎన్డీయే ఆధిక్యం సాధించవచ్చు. అప్పుడు ఆ కూటమి ఓట్ల వాటా 43.97శాతానికి పెరుగుతుంది. ఆర్జేడీ కూటమి ఓట్ల వాటా 37.45 శాతానికి పరిమితమవుతుంది. కానీ అది ఎంతవరకు సాధ్యమనేది ఈ నెల 14నగానీ తేలదు.

ప్రభుత్వంలోని కీలక మంత్రులతోపాటు ఎన్డీయే, మహాగఠ్‌బంధన్ ముఖ్య నేతలు.. తమ భవితవ్యాన్ని రెండో విడతలో పరీక్షించుకోనున్నారు. ప్రచారం ముగియడంతో ఇక వారంతా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

● ఎన్డీయే తరఫున బరిలో ఉన్న ప్రముఖుల్లో మాజీ ఉప ముఖ్యమంత్రులు తార్ కిశోర్ ప్రసాద్, రేణుదేవి ఉన్నారు.

ఎన్డీయే ప్రముఖులు..

నీతీశ్ మిశ్ర, బిజేంద్ర ప్రసాద్ యాదవ్, లేశీ సింగ్, నీరజ్ కుమార్ బబ్లూ, ప్రేమ్ కుమార్, సుమీత్ కుమార్ సింగ్, జయంత్ రాజ్, జమన్ ఖాన్, షీలా మండల్, కృష్ణానందన్ పాస్వాన్.

మహాగఠ్‌బంధన్ ప్రముఖులు

ఉదయ్ నారాయణ్ చౌధరీ, రాజేశ్ రామ్, షకీల్ అహ్మద్ ఖాన్, మెహబూబ్ ఆలం.

రెండు కూటముల మధ్య గట్టి పోటీ

రెండో విడత పోలింగ్ జరిగే 122 సీట్లలో గట్టి పోటీ నెలకొంది. 2020లో రెండు కూటములు హోరాహోరీగా తలపడ్డాయి. అప్పట్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. అయితే ఆ కూటమికి, మహాగఠ్‌బంధన్‌కు ఓట్ల తేడా 1.6 శాతమే. ఆ ఎన్నికల్లో సీమాంచల్ ప్రాంతంలో ఆర్జేడీ కూటమి అవకాశాలను ఎంఐఎం దెబ్బతీసింది.

● మగధ్, అంగ ప్రాంతాల్లో కులాలు, ప్రాంతీయ సమస్యలు ఎన్నికలను ప్రభావితం చేస్తాయి.

● మొత్తం 122 సీట్లలోని 50 సీట్లున్న మగధ్, సీమాంచల్ ప్రాంతాలు ఎన్నికల దిశను మారుస్తాయి. ఇక్కడ వచ్చే ఫలితాలే బిహార్ రెండో విడత ఫలితాలను మొత్తంగా నిర్ణయిస్తాయి. ఈసారి ఆర్జేడీకి సీమాంచల్‌లో ఎంఐఎంతోనే తలనొప్పులున్నాయి. ముస్లిం ఓట్ల చీలిక ద్వారా తమకు లబ్ధి కలుగుతుందని ఎన్డీయే ఆశిస్తోంది.

2020లో ఓట్ల వాటా ఇలా..

2020లో ఎన్డీయే 66 సీట్లను, మహాగఠ్‌బంధన్ 49 సీట్లను గెలుచుకున్నాయి. ఎన్డీయేకు 38.07శాతం ఓట్లు వచ్చాయి. మహాగఠ్‌బంధన్‌కు 36.43 శాతం ఓట్లు దక్కాయి. అంటే దాదాపుగా సమానంగా ఓట్లు వచ్చాయి. అయితే ఎన్డీయే వ్యూహాత్మక పోల్ మేనేజ్‌మెంట్ కలిసివచ్చింది.

● అంగ ప్రదేశ్, మిథిల, తిర్హుత్ ప్రాంతాల్లో భాజపాకు గట్టి ఓటు బ్యాంకు ఉంది. మగధ్, సీమాంచల్‌లలో ఆర్జేడీకి పట్టుంది. గత ఎన్నికల్లో మగధ్, సీమాంచల్‌లలో ఆర్జేడీ కూటమి 40శాతానికి పైగా ఓట్లు సాధించింది. ఎంఐఎంకు 10.81 శాతం ఓట్లు వచ్చాయి. దీంతో త్రిముఖ పోటీ నెలకొని ఎన్డీయే లబ్ధి పొందింది. ఈసారి ఎంఐఎం కాస్త వెనక్కి తగ్గింది. అయినా ఆ పార్టీ 20 చోట్ల పోటీ చేస్తోంది. ఇది తమకు లాభం చేకూరుస్తుందని ఎన్డీయే భావిస్తోంది.

● మగధ్, అంగ ప్రదేశ్‌లలో ఎన్డీయే వ్యూహానికి గట్టి పరీక్ష ఎదురవుతోంది. గత ఎన్నికల్లో మగధ్ ప్రాంతంలో ఆర్జేడీ మంచి ఫలితాలను సాధించింది. అప్పట్లో యాదవ్, ముస్లిం, దళితుల ఓట్లు ఆ కూటమికి దక్కాయి. అంగ ప్రదేశ్‌లో ఎన్డీయే సత్తా చాటింది. ఆ కూటమికి 41 శాతం ఓట్లు వచ్చాయి.

● మిథిల, తిర్హుత్‌లు సంప్రదాయంగా ఎన్డీయేకే అండగా నిలుస్తుంటాయి. గత ఎన్నికల్లో ఇక్కడ ఆ కూటమికి 44శాతానికిపైగా ఓట్లు వచ్చాయి.

● మగధ్, భోజ్‌పుర్‌లలో ఎల్జేపీ ప్రభావం ఉంటుంది. ఆ పార్టీ సొంతంగా విజయాలు సాధించకపోయినా తనకున్న 5, 6 శాతం ఓట్లతో ఫలితాలను ప్రభావితం చేయగలదు. గత ఎన్నికల్లో సొంతంగా పోటీ చేసిన ఆ పార్టీ ఇప్పుడు ఎన్డీయేతో కలిసి బరిలోకి దిగింది.

● సీమాంచల్, మిథిలల్లో వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) ప్రభావం ఉంటుంది.

- నేషనల్ డెస్క్



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో ప్రమాణస్వీకారం చేస్తున్న ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లు

రూ.2,800 కోట్లతో రోడ్ల అభివృద్ధి

- టోల్ భారం లేకుండా పీపీపీ విధానంలో నిర్మాణం
- మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఇప్పటికే రూ.2,800 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. మరో రూ.1,000 కోట్లతో అభివృద్ధి పనులకు టెండర్లు పిలవబోతున్నట్లు తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వేల కిలోమీటర్ల మేర రోడ్లు ప్రయాణించేందుకు అనువుగా ఉండేవి కావని ఆరోపించారు. విజయవాడలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్డీసీ) డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ 'వైకాపా హయాంలో రోడ్లను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1,061 కోట్లతో ఐదు నెల్లో మరమ్మతులు చేయించింది. పలు కీలక రోడ్లను పీపీపీ విధానంలో ప్రజలపై టోల్ భారం పడకుండా అభివృద్ధి చేసేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారు' అని పేర్కొన్నారు. డైరెక్టర్లు తమ ప్రాంతాల్లోని రహదారుల పరిస్థితి సమీక్షించి సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావాలని ఏపీఆర్డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సూచించారు. 14 మంది డైరెక్టర్లతో ఏపీఆర్డీసీ ఎండీ శ్రీనివాసరెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు.



బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎస్పీ చరణ్

జంగారెడ్డిగూడెంలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో గానగాంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆయన తనయుడు ఎస్పీ చరణ్ ఆదివారం ఆవిష్కరించారు. అశ్వారావుపేట రోడ్డు విఘ్నేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఈ విగ్రహాన్ని ఉపాధ్యాయుడు కుందా వెంకట శ్రీరామశాస్త్రి ఏర్పాటుచేశారు. స్థానిక నారాయణ పాఠశాలలో జరిగిన సభలో చరణ్ మాట్లాడుతూ తన తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు శ్రీరామశాస్త్రికి, విగ్రహాన్ని అద్భుతంగా మలచిన శిల్పి ఒడయార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వీరిద్దరినీ చరణ్ శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయుడైన శ్రీరామశాస్త్రి తన పీఎఫ్ డబ్బులు రూ.50 లక్షలతో బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ చరణ్‌ను ఘనంగా సత్కరించారు. ప్రధాన రాజకీయ పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

‘స్వచ్ఛ సుందర చల్లపల్లి’ దేశానికే స్ఫూర్తిదాయకం

- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య



చల్లపల్లి డంపింగ్‌యార్డులో ‘స్వచ్ఛసుందర చల్లపల్లి’ కార్యకర్తలతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య, డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ టి.పద్మావతి, డాక్టర్ గురవారెడ్డి తదితరులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: ‘స్వచ్ఛ సుందర చల్లపల్లి’ కార్యక్రమం భారతదేశానికే స్ఫూర్తిదాయకమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి.కృష్ణయ్య పేర్కొన్నారు. కార్యక్రమం చేపట్టి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారమిక్కడ వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 గంటలకు పి.కృష్ణయ్య, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, స్వచ్ఛ చల్లపల్లి రథసారథులు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్-డాక్టర్ టి.పద్మావతి దంపతులు, కార్యకర్తలు, గ్రామస్థులు కృష్ణాజిల్లా చల్లపల్లిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పి.కృష్ణయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం 30 వేలకు పైగా మొక్కలను నాటడంతో పాటు రోజూ ఉదయమే పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ చల్లపల్లికి జాతీయస్థాయిలో గుర్తింపు తేవడం విశేషమన్నారు. 150 మందికి పైగా కార్యకర్తలు శ్రమదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుల స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర పిలుపులను అందుకొని స్వచ్ఛ సుందర చల్లపల్లిని ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గంలో మొదట్లో 20 గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాలు జరిగాయన్నారు. వైద్యులు డి.ఆర్.కె.ప్రసాద్, పద్మావతి దంపతులను.. కృష్ణయ్య, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కలెక్టర్ డి.కె.బాలాజీలు అభినందించారు. నారాయణరావునగర్‌లో ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధిలో భాగంగా డాక్టర్ పద్మావతి ఆర్థిక సహకారంతో రూ.11.05 లక్షలతో నిర్మించిన ముఖద్వారం, నమాజ్ షెడ్డును ప్రారంభించారు. మనకోసం మనం ఛారిటబుల్ ట్రస్ట్‌కు డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి (కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్, హైదరాబాద్), డాక్టర్ కాలేషావలీ తదితరులు ఎంతో సహకరించారని వైద్య దంపతులు తెలిపారు. రాష్ట్ర స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, డిప్యూటీ సీఈవో ఆనందకుమార్, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ శ్రీనివాస్, ఈవో పి.వి.మాధవేంద్రరావు, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైకాపాకు ఆ 11 సీట్లైనా ఎందుకని జనం అనుకుంటున్నారు

మంత్రులు కొలుసు, కొల్లు రవీంద్ర ఎద్దేవా



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు పార్థసారథి, కొల్లు రవీంద్ర

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: వైకాపా పాలనలో రైతు సంక్షేమాన్ని పట్టించుకోని జగన్.. మొంథా తుపాను పరిస్థితులు సద్దుమణిగాక పరామర్శల పేరుతో డ్రామాలు ఆడటం సిగ్గుచేటని మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జగన్ వ్యవహార శైలిని వారు ఎద్దేవా చేశారు. పార్థసారథి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాల గురించి జగన్ క్రెడిట్ స్కోర్ ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ‘ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు కూటమికి 164 స్కోర్ ఇచ్చి, వైకాపాకు 11తో సరిపెట్టారు. ఆ పదకొండు కూడా ఎందుకు ఇచ్చామా అని జనాలు బాధపడుతున్నారు’ అని ఎద్దేవాచేశారు. తుపాను నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలను దేశమంతా కొనియాడిందని తెలిపారు. ప్రజలు బుద్ధి చెప్పినా మారకుండా కులాలను అడ్డుపెట్టుకుని అరాచకాలకు పాల్పడాలనుకునే వారు, వ్యంగ్యాస్త్రాలు సంధించే వారు చట్టం ముందు తలవంచక తప్పదంటూ పరోక్షంగా మాజీ మంత్రులు పేర్ని నాని, జోగి రమేష్‌లను హెచ్చరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ రైతు పరామర్శ పేరుతో సంబంధం లేని వ్యక్తులను తీసుకొచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేయించడం జగన్‌కే చెల్లిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం చేసిన నకిలీ మద్యం కేసులో అన్ని ఆధారాలతో దొరికిపోయిన జోగి రమేష్.. బీసీ కుల ప్రస్తావన చేయడం హేయమన్నారు. తుపానుకు పంట నష్టపోయిన రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా హెక్టారుకు 25 వేల చొప్పున ఇవ్వాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో లీప్ పాఠశాల

- మంత్రి లోకేశ్ చొరవతో శరవేగంగా పనులు





నిర్మాణంలో ఉన్న పాఠశాల ముఖద్వారం ★ ఆకట్టుకునే రీతిలో ప్రాథమిక పాఠశాల భవనం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: ఆకట్టుకునే పాఠశాల భవనాలు, ఆహ్లాదపరిచే ప్రాంగణాలు, అద్భుత ప్రయోగశాలలు, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబోధన ఇవన్నీ ఒకేచోట అందేలా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ‘లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఏపీ’(లీప్) పేరుతో నూతన ప్రయోగానికి నడుం కట్టారు. ఇందుకోసం గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నిడమర్రు జడ్పీ ఉన్నత పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఐదెకరాల విస్తీర్ణంలో 22 గదులతో ఉన్న ఈ పాఠశాల భవనాలను రూ.14 కోట్ల వ్యయంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా జీ+1 భవనానికిపైన మరో అంతస్తు ఏర్పాటుచేసి ఇండోర్ స్టేడియం, యాంఫీ థియేటర్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రాంగణంలో వాకింగ్, రన్నింగ్ ట్రాక్, క్రీడా మైదానం, అంతర్గత రోడ్లు తదితర పనులను వేగంగా నిర్వహిస్తున్నారు. ఇండోర్ గేమ్స్ కోసం షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాల నిర్మాణం ‘యూ’ ఆకారంలో ఉండేలా డిజైన్ చేశారు. రానున్న ఐదేళ్లలో విద్యావ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పులతో ‘లీప్’ పాఠశాల రూపొందుతోంది. ఇక్కడ ప్రాథమిక విద్య నుంచి ప్రాథమికోన్నత స్థాయి వరకూ బోధన చేపట్టాలని నిర్ణయించారు. డిజిటల్ అక్షరాస్యత 21వ శతాబ్దపు స్కిల్స్‌తో కూడిన విద్యా ప్రమాణాలను ప్రవేశ పెట్టనున్నారు. డిజిటల్ అక్షరాస్యత, 21వ శతాబ్దపు స్కిల్స్‌తో కూడిన విద్యా ప్రమాణాలను ఇక్కడ ప్రవేశ పెట్టనున్నారు. ‘లీప్’ కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

అనంతకే ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్

రెండో స్థానంలో విశాఖ • ముగిసిన రెవెన్యూ క్రీడా సంబరాలు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ అందుకుంటున్న అనంతపురం జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఏపీ రెవెన్యూ ఉద్యోగుల క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో అనంతపురం జిల్లా ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకుంది. మూడు రోజులుగా అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరిగిన పోటీల్లో అనంతపురం జిల్లా 38 పాయింట్లు సాధించి టైటిల్ సొంతం చేసుకుంది. విశాఖపట్టణం జిల్లా 37 పాయింట్లతో రెండో స్థానాన్ని ఆక్రమించింది. కాకినాడ జిల్లా 30 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. చివరిరోజు క్రికెట్‌లో అనంతపురం జట్టు కృష్ణా జట్టుపై 2 వికెట్ల తేడాతో గెలిచింది. ముగింపు కార్యక్రమానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, సవిత, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, పల్లె సింధూరరెడ్డి, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, అనంతపురం కలెక్టర్ ఆనంద్, సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ హాజరై బహుమతులు ప్రదానం చేశారు.

వివిధ క్రీడాంశాల ఫలితాలు: క్రికెట్-అనంతపురం, కబడ్డీ-చిత్తూరు, త్రోబాల్ (మహిళలు)-చిత్తూరు, త్రోబాల్ (పురుషులు)-కాకినాడ, టగ్ ఆఫ్ వార్ (మహిళలు)-కాకినాడ, బ్యాడ్మింటన్-విశాఖ, టేబుల్ టెన్నిస్-అనంతపురం, టీటీ (మహిళలు)-కడప, క్యారమ్స్ (పురుషులు)-సీసీఎల్ఏ, క్యారమ్స్ (మహిళలు)- కర్నూలు, చెస్ (పురుషులు)-బాపట్ల



ఆత్మవిశ్వాసాన్ని ఇలా సాధించొచ్చు

ఆత్మవిశ్వాసమనేది పుట్టుకతో వచ్చే లక్షణం కాదు. అన్ని నైపుణ్యాల్లాగే దాన్నీ సాధన ద్వారా సొంతం చేసుకోవచ్చు. అందుకు ఓ మార్గముంది. ముందు మీరు సాధించదగ్గ చిన్న చిన్న లక్ష్యాలను విధించుకోండి. వాటిని అందుకున్న ప్రతిసారీ మీ మీద మీకు విశ్వాసం పెరుగుతుంది. తుదుపరి పెద్ద లక్ష్యాలపై గురిపెట్టడానికి అదే ప్రేరణగా నిలుస్తుంది.

– బి.ఎస్.గుప్తా, యోగా ట్రయినర్

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.3.23 కోట్లు

తిరుపతి (కలెక్టరేట్), కేవీబీపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు ముంపు బాధితులకు తక్షణ సహాయార్థం రూ.3.23 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నెల 6న వర్షాల కారణంగా తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలోని రాయలచెరువు కట్ట తెగిపోయిన సంగతి తెలిసిందే.

చటుక్కున పట్టి.. గుటుక్కున మింగి!



కర్నూలు జిల్లా సుంకేసుల వద్ద తుంగభద్ర నదిలో నీటికాకులు ఆహార అన్వేషణలో భాగంగా నీటిలో మునుగుతూ చేపల కోసం వెతికాయి. వీటిలో ఒక పక్షికి చేప చిక్కగానే మిగతావి దాన్ని లాక్కునేందుకు ప్రయత్నించాయి. అది వాటి నుంచి చాకచక్యంగా తప్పించుకుంటూ.. చేపను గుటుక్కుమనిపించింది.

– ఈనాడు, కర్నూలు

నేటి నుంచి ‘స్వామిత్వ’ ప్రత్యేక గ్రామసభలు

ఈనాడు, అమరావతి: గ్రామ కంఠాల్లో ఇళ్లు, స్థలాలకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసే ముందు ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణకు సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నారు. స్వామిత్వ పథకంలో రెండో విడత కింద 45 లక్షల ఆస్తులకు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలకు వీటిని అందించే ముందు మరోసారి గ్రామసభలు నిర్వహించాలన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, సర్వే శాఖలు సంయుక్తంగా ఈ నెల 22 వరకు గ్రామసభలు నిర్వహించనున్నాయి. డ్రోన్ సర్వే తర్వాత గ్రామకంఠాల్లో ఆస్తులకు సంబంధించిన కొలతలు నిర్ధారించుకునేందుకు 2,300 గ్రామాల్లో సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేశారు. గ్రామసభల్లో ప్రజల నుంచి వీటిపై అభ్యంతరాలు స్వీకరించాకే ప్రాపర్టీ కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు. కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఇటీవల జరిగిన సమీక్షలో ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. మూడో దశ కార్యక్రమం కూడా ప్రారంభించి మార్చి నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం కోటి కార్డులు పంపిణీ చేయాలని ఆయన నిర్దేశించారు.

ఈసీబీసీ అమలులో రాష్ట్రం మొదటిస్థానం

ఈనాడు, అమరావతి: పట్టణాల్లో కొత్తగా నిర్మించిన వ్యాపార భవనాల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలులో దేశంలోనే రాష్ట్రం మొదటిస్థానంలో నిలిచిందని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ‘దేశంలోని ఏడు రాష్ట్రాల్లో 2,446 భవనాలను ఈసీబీసీ భవనాలుగా మార్చాలని బీఈఈ లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 786 భవనాలను ఈసీబీసీ భవనాలుగా మార్చేందుకు ఏపీ ముందుకొచ్చింది’ అని పేర్కొన్నారు.

గాడిన పడుతున్న పీఎం జేవీకే

- వైకాపా హయాంలో పథకానికి నిధులు కేటాయించకుండా నిలిపివేత
- మైనారిటీలకు మొండిచేయి
- రూ.200 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం
- గురుకులాలు, వసతి గృహాలు, పాలిటెక్నిక్ భవనాల నిర్మాణానికి పచ్చజెండా



గుంతకల్లులో నిర్మాణదశలో ఉన్న బాలికల గురుకుల పాఠశాల కాంప్లెక్స్ భవనం



నిర్మాణ దశలో కదిరిలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో మైనారిటీలు అధికంగా ఉండే ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యక్రమాన్ని(పీఎం జేవీకే) కూటమి ప్రభుత్వం తిరిగి గాడిన పెడుతోంది. 2014-15లో ఈ పథకాన్ని రాష్ట్రంలో కేంద్రం అమలు చేయగా.. 2019 వరకు నిరాటంకంగా అమలైంది. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రవాటా నిధులు ఒక్క రూపాయీ కేటాయించకుండా పక్కనపెట్టింది. అసంపూర్తిగా ఉన్న పనుల్ని పూర్తి చేయాలని అప్పట్లో మైనారిటీ సంఘాలు విజ్ఞప్తి చేసినా జగన్ పట్టించుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం వీటిని పూర్తి చేసి మైనారిటీలకు అందుబాటులోకి తెచ్చేందుకు రూ.200 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే కొన్ని పనుల్ని అధికారులు ప్రారంభించారు.

✦ రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి గుంటూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో మైనారిటీలు అధికంగా ఉన్నారు. ఆయా చోట్ల పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు 60:40 నిష్పత్తిలో నిధుల మంజూరుతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్ వికాస్ పథకం అమలు చేస్తోంది. దీని కింద పాలిటెక్నిక్, ఐటీఐ, గురుకులాలు, వసతిగృహాలు, పాఠశాలలు, రహదారులు, పారిశ్రామిక పార్కులు, క్రీడా వసతులు, ఆక్వా రంగం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టొచ్చు. 2013-19 మధ్య రూ.213 కోట్లతో వివిధ పనుల్ని కేంద్రం మంజూరు చేసింది. ఇందులో 2019 నాటికే రూ.123 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు వివిధ దశల్లో ఉండగా వైకాపా అధికారంలోకి వచ్చింది. తెదేపా ప్రభుత్వం వీటిని మొదలు పెట్టిందనే కక్షతో వాటిని నిలిపేసింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్ని ఇతర పనులకు మళ్లించింది

వైకాపా నిర్వాకంతో 78 పనులు రద్దు..

2019-24 మధ్య ఈ పథకాన్ని ముందుకు తీసుకెళ్లకపోవడంతో కేంద్రం తదుపరి నిధులు కేటాయించలేదు. అప్పట్లో పలుమార్లు కేంద్ర అధికారులు.. రాష్ట్ర వాటా నిధులు ఇవ్వాలని కోరినా చెవికెక్కించుకోలేదు. దీంతో మొదలుపెట్టని పనులు దాదాపు 78 రద్దయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో ఉన్న పనులు పూర్తి చేస్తామని కేంద్రంతో సంప్రదింపులు జరిపింది. గత ప్రభుత్వం ఇతర పనులకు మళ్లించిన, రాష్ట్రవాటా నిధుల కింద రూ.200 కోట్లు ఇటీవల విడుదల చేసింది. ఒక్కో వసతి గృహం పూర్తికి రూ.21 కోట్లు, గురుకులం పూర్తి చేసేందుకు రూ.18 కోట్లు చొప్పున మంజూరు చేసింది. పాత పనులు చేపట్టడంతోపాటు కొత్తగా మరి కొన్ని పనులు మంజూరుకు కేంద్రానికి రాష్ట్రం నివేదించింది.

పీఎం జేవీకే కింద పూర్తి చేయనున్న భవనాలివే

ప్రాంతం	పూర్తి చేసే భవనాలు
కర్నూలు	100 పడకల బాలికల వసతి గృహం
కర్నూలు	100 పడకల బాలుర వసతి గృహం
కర్నూలు	వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ (100 మంది)
కర్నూలు	100 పడకల పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం
కర్నూలు	100 పడకల ప్రీమెట్రిక్ బాలికల వసతి గృహం
కర్నూలు	100 పడకల పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం
నరసరావుపేట	గురుకుల పాఠశాల కాంప్లెక్స్
నరసరావుపేట	మల్టీపర్పస్ కమ్యూనిటీ సెంటర్
గుంతకల్లు	గురుకుల పాఠశాల కాంప్లెక్స్ (బాలికలు)
కదిరి	గురుకుల పాఠశాల కాంప్లెక్స్ (బాలురు)
రాయచోటి	గురుకుల పాఠశాల కాంప్లెక్స్ (540 మంది విద్యార్థులు)
ప్రొద్దుటూరు	జూనియర్ కళాశాల (480 మంది విద్యార్థులు)
అనంతపురం	పాలిటెక్నిక్ భవనం
చిత్తూరు	50 పడకల బాలుర వసతి గృహం (కళాశాల విద్యార్థులు)



ప్రేరణ తాత్కాలికం.. క్రమశిక్షణ శాశ్వతం

బయటి వ్యక్తులు, పరిస్థితుల నుంచి మీరు పొందే ప్రేరణ కొంతకాలమే ఉంటుంది. కానీ మీరు పాటించే క్రమశిక్షణ మాత్రం శాశ్వతంగా ఉండిపోతుంది. ఉత్సాహం ఉన్నా, లేకున్నా మీరు నిలకడగా పనిచేసి ఫలితాలు సాధించడానికి అది తోడ్పడుతుంది.

– లిల్లీ, లైఫ్ కోచ్

నేటి నుంచి వాటర్‌షెడ్ జాతీయ సదస్సు

గుంటూరు, (గోరంట్ల), న్యూస్‌టుడే: గుంటూరులో 10, 11 తేదీల్లో వాటర్‌షెడ్ జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సోమవారం ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు, నిపుణులు పాల్గొననున్నారు. మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలోని వాటర్‌షెడ్ మోడల్ ప్రాజెక్టును సందర్శిస్తారు.

మది దోచే మండువాల్లో హోంస్టే



అల్లవరం మండలం గూడాలలో మండువా లోగిలి ఇల్లు



మలికిపురం మండలం తూర్పుపాలెంలో హోంస్టేకు ఎంపికైన మండువా ఇల్లు



ఓ ఇంటి లోపల ఇలా..

కోనసీమ అందాలు చూసేందుకు వచ్చే వారికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మండువా లోగిళ్లు ఆతిథ్యానికి సిద్ధమవుతున్నాయి. ఇందుకు దశాబ్దాల నాటి ఆ ఇళ్లు నేటి అవసరాల మేరకు సుందరంగా ముస్తాబవుతున్నాయి. రాష్ట్రంలో హోం స్టే విధానం తీసుకురావాలనే ప్రభుత్వ ఆలోచనను.. అధికారులు ఎంపిక చేసిన ఇళ్లతో ముందుకెళ్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని గూడాల, పేరూరు, తూర్పుపాలెం, కేశనపల్లి, పెదపట్నంలంక, శేరిలంక, ముమ్మిడివరం, అయినవిల్లి, మండపేట తదితర గ్రామాల్లో అద్భుతమైన మండువా లోగిలి గృహాలు ఉన్నాయి. అధికారులు.. యజమానులకు అవగాహన కల్పించి.. ఇళ్లను పర్యాటకులు ఉండేలా ఆధునికీకరిస్తున్నారు. ఇంటిని హోం స్టేగా మార్చుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన వారిని ప్రోత్సహిస్తున్నారు. అలా ఇప్పటివరకు 20 ఇళ్లను గుర్తించి, వసతులు కల్పిస్తున్నట్లు పర్యాటక శాఖ జిల్లా అధికారి అన్వర్ తెలిపారు. 2029 నాటికి జిల్లాలో 400 గృహాలు హోం స్టేలుగా నమోదయ్యేలా చూడాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు.

– న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్. చిత్రంలో విష్ణుకుమార్‌రాజు, చిరంజీవిరావు తదితరులు

ఎగుమతుల్లో రాష్ట్రాన్ని టాప్‌లోకి తెస్తాం

ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు

విశాఖపట్నం (మాధవధార), న్యూస్‌టుడే: పరిశ్రమలను బలోపేతం చేసి యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏపీలో నూతన పాలసీలను అమలు చేస్తున్నామని ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఏపీ గ్లోబల్ ఎంఎస్ఎంఈ ఎగుమతుల అభివృద్ధి సదస్సుకు ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 'కూటమి ప్రభుత్వంలో ఎంఎస్ఎంఈలకు సుమారుగా రూ.439 కోట్ల ప్రోత్సాహకాలు ఇచ్చాం. ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు ఎంఎస్ఎంఈల ఎగుమతుల్లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఇతర దేశాల సంస్థలు ముందుకొస్తున్నాయని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ పేర్కొన్నారు. భారత ఎంఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఏపీలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన విధానాలు, డిజిటల్ పాలనతో చిన్న వ్యాపారులు సైతం అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్నారన్నారు. విదేశీ ప్రతినిధులకు ఆటో మొబైల్ విడిభాగాలు, ఫుడ్ అండ్ బెవరేజెస్, ఎలక్ట్రానిక్స్, శానిటరీవేర్, వ్యవసాయ యంత్రాలు, వైద్య పరికరాల రంగాల్లో ఉన్న అవకాశాల గురించి తెలియజేశారు. 16 దేశాల నుంచి వచ్చిన 34 మంది ప్రతినిధులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సత్కరించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ ఆర్.వి.ప్రథమేశ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ కేంద్రంగా మరో ఉగ్రకుట్ర!

- ప్రాణాలు పోయాల్సిన వైద్యుడే సూత్రధారి
- సైనైడ్ కంటే ప్రమాదరకమైన రైసిన్ తయారీ
- డాక్టర్ సహా ముగ్గురు ఐసిస్ సానుభూతిపరుల అరెస్టు

అహ్మదాబాద్; ఈనాడు, హైదరాబాద్; రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ కేంద్రంగా మరో ఉగ్రకోణం బట్టబయలైంది. ప్రాణాలు పోయాల్సిన వైద్యుడు.. ఇంటినే ప్రయోగశాలగా మార్చి ఆముదం గింజలను ప్రాసెస్ చేసిన తర్వాత మిగిలిపోయిన వ్యర్థాల నుంచి సైనైడ్ కంటే ప్రమాదకరమైన రైసిన్ అనే విష రసాయనాన్ని తయారు చేయటం కలకలం సృష్టిస్తోంది. గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) ముగ్గురు ఐసిస్ సానుభూతిపరులను అరెస్ట్ చేసింది. వారి వద్ద తుపాకులు, రసాయన పదార్థాలను స్వాధీనం చేసుకుంది. నిందితులు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్‌లుగా పేర్కొంది. సులేమాన్, సలీంఖాన్‌లు లఖ్‌నవూ, దిల్లీ, అహ్మదాబాద్ వంటి సున్నిత ప్రాంతాల్లో విధ్వంసానికి రెక్కీ నిర్వహించారని ఏటీఎస్ డీఐజీ సునీల్ జోషి తెలిపారు. రైసిన్‌ను తయారు చేస్తున్నాడని మొహియుద్దీన్‌ను, పాకిస్థాన్ సరిహద్దు మీదుగా డ్రోన్ల సాయంతో ఆయుధాలను సరఫరా చేస్తున్నారని సులేమాన్, సలీంఖాన్‌లను అరెస్టు చేసింది. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన వీరంతా ముఠాగా ఏర్పడి దేశంలో రైసిన్ ద్వారా భారీ విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు ఏటీఎస్ పేర్కొంది. ఈ ముగ్గురిలో హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్(35) కీలకంగా వ్యవహరించినట్లు తెలిపింది. గుజరాత్ ఏటీఎస్.. వారిని అహ్మదాబాద్ సమీపంలోని అదాలజ్ టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకొని ప్రశ్నించటంతో ఉగ్రకోణం వెలుగులోకి వచ్చింది.



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, రసాయనం

ఎవరీ డాక్టర్ మొహియుద్దీన్...?



మొహియుద్దీన్

రాజేంద్రనగర్ ఫోర్ట్‌వ్యూ కాలనీ అసద్‌మంజిల్‌లో మొహియుద్దీన్ సయ్యద్ కుటుంబం నివసిస్తోంది. నలుగురు సోదరుల్లో ఇతడు పెద్దవాడు. ఇతడికి చిన్నప్పటి నుంచి శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఆసక్తి ఉండేది. చైనాలో ఎంబీబీఎస్ పూర్తిచేశాక.. కొంతకాలం ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుడిగా పనిచేసినట్లు సమాచారం. మూడు పదుల వయసు దాటినా వివాహం కాకపోవటం, ఒంటరితనంతో మనోవేదన అనుభవించాడు. ఆన్‌లైన్ ద్వారా బయటి నుంచి కొన్ని రసాయనపదార్థాలు తెప్పించి.. గదిలో ప్రయోగాలు నిర్వహించేవాడు. కుమారుడి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో పలుమార్లు తల్లిదండ్రులు మందలించారు. తయారు చేస్తున్న పదార్థం గురించి వాకబు చేశారు. అది చాలా విలువైన రసాయనమని.. మార్కెట్‌లో దీని డిమాండ్‌ను సొమ్ము చేసుకోవచ్చంటూ సర్దిచెప్పాడు. ఉగ్రవాదం, ఐసిస్ పట్ల ఆకర్షితుడయ్యాక యాప్‌లు, సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్ర సానుభూతిపరులతో పరిచయాలు పెంచుకున్నాడు. తరచూ కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబయి తదితర నగరాలకు వెళ్లి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలోనే కొద్దిరోజుల క్రితం కోల్‌కతాకు వెళ్లి.. అక్కడి నుంచి అహ్మదాబాద్ చేరినట్లు తెలిసింది.

విజయవాడ-దుబాయ్ విమానమెప్పుడో?

అక్కడకు సర్వీసులొస్తే ఏ దేశానికైనా తేలికగా చేరుకోవచ్చు



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం

ఈనాడు, అమరావతి: విజయవాడ విమానాశ్రయానికి 2017లో అంతర్జాతీయ హోదా వచ్చినప్పటి నుంచి దుబాయ్‌కి కనీసం ఒక్క సర్వీసైనా నేరుగా ఇక్కడి నుంచి నడపాలంటూ విజ్ఞప్తులు వస్తూనే ఉన్నాయి. విజయవాడ నుంచి దుబాయ్‌కి సర్వీసులను ఆరంభిస్తే.. సింగపూర్ కంటే ఎక్కువ రద్దీ ఉంటుందని అధికారిక సర్వేలోనూ తేలింది. ఈ మేరకు 2.5 లక్షల మందికిపైగా దుబాయ్ సర్వీసుకు ఓటేశారు. అయినా ఇప్పటివరకూ అది కార్యరూపం దాల్చలేదు. విజయవాడ నుంచి దుబాయ్‌కి సర్వీసులు ఆరంభిస్తే.. ప్రపంచంలోని అనేక దేశాలతో నేరుగా అనుసంధానమైనట్టే. ప్రధానంగా అమెరికాలోని న్యూయార్క్, న్యూజెర్సీ లాంటి నగరాలతో పాటు చైనా, ఆస్ట్రేలియా, లండన్, పారిస్ సహా ఎక్కడికైనా అత్యంత తేలికగా చేరుకోవచ్చు. ప్రస్తుతం మంగళ, శనివారాల్లో షార్జాకు ఒకే ఒక్క సర్వీసు నడుస్తోంది. నవంబరు 15 నుంచి సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి మంగళ, గురు, శనివారాల్లో సర్వీసులు ఆరంభం కానున్నాయి. వీటితో పాటు దుబాయ్‌కి సర్వీసు నడిపితే.. ఏటా లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది.

భారీ సంఖ్యలో ప్రయాణికులు..

విజయవాడ విమానాశ్రయం నుంచి 2014-15లో 2.31 లక్షల మంది మాత్రమే రాకపోకలు సాగించారు. గత తెదేపా ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా సర్వీసులను పెంచడంతో 2018-19 నాటికే 12లక్షల మార్కు దాటింది. మధ్యలో ఐదేళ్ల వైకాపా ప్రభుత్వ హయాంలో విమానాశ్రయం అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారు. నిత్యం 60కి పైగా తిరిగే విమాన సర్వీసులను 24కు తగ్గించేశారు. దీంతో గణనీయంగా ప్రయాణికులు తగ్గిపోయారు. ప్రస్తుతం రోజుకు నాలుగు వేల మంది వరకూ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. 2025-26లో ప్రయాణికుల సంఖ్య 15లక్షలు దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. విజయవాడ నుంచి దుబాయ్‌కి విమాన సర్వీసును వయబులిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) విధానంలో 2019 జనవరిలోనే ఆరంభించేందుకు నాటి చంద్రబాబు సర్కారు అన్నిచర్యలూ చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్) ఆధ్వర్యంలో దుబాయ్‌కి సర్వీసులు నడిపేందుకు విమానయాన సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించారు. తక్కువకు కోట్ చేసిన సంస్థను ఎంపిక చేసి.. సర్వీసులు ఆరంభించాలనుకున్నారు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం గద్దెనెక్కడంతో.. ఉన్న సింగపూర్ సర్వీసును ఆపేసింది. దుబాయ్ ఆశను అటకెక్కించేసింది.

ఎలుకల దాడి ఘటనపై మంత్రి ఆగ్రహం

విచారణకు ఆదేశించిన సత్యకుమార్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని వైద్య కళాశాల వసతి గృహంలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన ఘటనపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహంలోని ఆరుగురు మొదటి సంవత్సరం వైద్య విద్యార్థినులను శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఎలుకలు కరిచాయి. దాంతో వారు శనివారం ఏఆర్‌వీ ఇంజెక్షన్లు చేయించుకున్నారు. ఈ ఘటనపై మంత్రి స్పందించి విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిర్వహణ సంస్థకు నోటీసులు జారీ చేయాలని డీఎంఈ రఘునందన్‌ను ఆయన ఆదేశించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ మేరకు డీఎంఈ రఘునందన్ నిర్వహణ సంస్థకు నోటీసులు ఇచ్చారు. వార్డెన్‌కు మెమో ఇవ్వాలని, వసతి గృహంలో పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.


EENADU Vol: 52, Issue: 90
Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.
Founder Ramoji Rao

ఈనాడు సినిమా

“ఓ కథ ఎప్పుడు చెప్పాలి.. ఎవరి ద్వారా తెరపైకి రావాలన్నది ఆ కథే నిర్ణయిస్తుంది” అన్నది చిత్రసీమలో వినిపించే మాట. ఇదే నిజం కూడా. ఇండస్ట్రీలో ఓ కథ పుట్టిన దగ్గర్నుంచి.. అది దృశ్య రూపంగా తెరపైకి వచ్చే వరకు ఎన్నో చేతులు మారుతూనే ఉంటుంది. కాల్షీట్ సమస్యల వల్ల కావొచ్చు.. ఇమేజ్‌ల కొలతలు, మార్కెట్ లెక్కల వల్ల కావొచ్చు.. ఒకరితో చేయాలనుకున్న కథ మరొకరితో పట్టాలెక్కడమన్నది చిత్ర పరిశ్రమలో పరిపాటే. ప్రస్తుతం తెలుగులో అందరి దృష్టినీ ఆకర్షిస్తున్న సినిమాల్లో ఈ కోవకు చెందినవి కొన్ని ఉన్నాయి. వాటిలో కొన్ని ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభించుకోగా.. మరికొన్ని సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. మరి ఆ చిత్ర విశేషాలపై ఓ లుక్కేద్దాం పదండి..

చేతులు మారి.. చెంతకు చేరి


ఎన్టీఆర్


విజయ్ దేవరకొండ


సందీప్ కిషన్



భాగ్యశ్రీ బోర్సే
మృణాల్ ఠాకూర్

తినే ప్రతి గింజ మీద తినే వాడి పేరు రాసి ఉంటుందన్నట్లు.. దర్శక రచయితల కలం నుంచి పుట్టే ప్రతి పాత్ర మీద దాన్ని చేయబోయే నటీనటుల పేరు ముందే రాసుంటుందంటారు సినీ పెద్దలు. అందుకే ప్రతి స్క్రిప్ట్ తనకు కావాల్సిన తారల్ని చేరుకునే క్రమంలో ఎన్నో చేతులు మారుతూనే ఉంటుంది. ప్రతి సినిమా ప్రయాణంలోనూ ఈ మలుపులు.. మార్పులు, చేర్పులు సాధారణమే. ప్రస్తుతం కథానాయకుడు రామ్‌చరణ్ చేస్తున్న 'పెద్ది' కూడా అలా చేతులు మారి తన చెంతకు చేరిన చిత్రమే. దర్శకుడు బుచ్చిబాబు ఈ కథను తొలుత ఎన్టీఆర్‌కి వినిపించినట్లు అప్పట్లో వార్తలు వినిపించాయి. కానీ, అప్పటికే ఆయన లైనప్‌లోకి కొరటాల శివ, ప్రశాంత్ నీల్ లాంటి స్టార్ డైరెక్టర్లు చేరడం వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత ఈ కథ చరణ్ చేతుల్లోకి చేరింది. కథానాయకుడు ఎన్టీఆర్.. దర్శకుడు త్రివిక్రమ్ కలయికలో త్వరలో ఓ సినిమా పట్టాలెక్కనున్న సంగతి తెలిసిందే. ఇది యుద్ధ దేవుడిగా పేరొందిన కార్తికేయ స్వామి కథతో భారీ పౌరాణిక చిత్రంగా ముస్తాబు కానుంది. నిజానికి త్రివిక్రమ్ ఈ కథను తొలుత అల్లు అర్జున్‌తో పట్టాలెక్కించనున్నట్లు బలంగా ప్రచారం జరిగింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ సినిమాతో పాటు రవి కిరణ్ కోల దర్శకత్వంలో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. వీటి తర్వాత ఆయనతో ఓ స్పోర్ట్స్ డ్రామా సినిమా చేసేందుకు యూవీ క్రియేషన్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. దీనికోసం దర్శకుడు విక్రమ్ కె కుమార్‌ని రంగంలోకి దింపినట్లు సమాచారం. నిజానికి విక్రమ్ కుమార్ ఈ కథని తొలుత నితిన్‌తో అనుకున్నట్లు వార్తలొచ్చాయి. కానీ, ఇప్పుడీ స్క్రిప్ట్‌నే విజయ్‌తో పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు మొదలైనట్లు తెలుస్తోంది.

ఈ కలయికలు వినిపిస్తున్నాయి!

'బలగం' సినిమాతో తొలి అడుగులోనే దర్శకుడిగా అందరి మన్ననలు అందుకున్నారు వేణు యెల్దండి. ఆ వెంటనే రెండో ప్రయత్నంగా 'ఎల్లమ్మ' అనే సినిమాకి శ్రీకారం చుట్టాలని భావించారు. ఈ కథకి తొలుత నానిని హీరోగా అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత అది శర్వానంద్, నితిన్ ఇలా పలువురు హీరోల చేతులు మారింది. ఇప్పుడు ఎట్టకేలకు ఈ స్క్రిప్ట్ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ చేతుల్లోకి వచ్చి చేరినట్లు సమాచారం. ఈ సినిమాతోనే ఆయన్ని హీరోగా పరిచయం చేసేందుకు దిల్‌రాజు ప్రణాళిక రచిస్తున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ 'జటాయు' పేరుతో ఓ సినిమా రూపొందించేందుకు గత కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికోసం గతంలో ప్రభాస్, విజయ్ దేవరకొండ లాంటి హీరోల పేర్లు ప్రచారంలో వినిపించాయి. అయితే ఇప్పుడీ కథను శ్రీకాంత్ తనయుడు హీరో రోషన్‌తో పట్టాలెక్కించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. కథానాయకుడు నితిన్.. దర్శకుడు కృష్ణచైతన్య కలయికలో 'పవర్ పేట' పేరుతో ఓ సినిమా రూపొందనున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. కానీ, తర్వాత అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత ఈ స్క్రిప్ట్‌ను విష్వక్ సేన్ చేయనున్నట్లు ప్రచారం వినిపించింది. అయితే ఇది ఎట్టకేలకు హీరో సందీప్ కిషన్ చెంతకు చేరినట్లు సమాచారం.


దేవిశ్రీ ప్రసాద్


రోషన్

నాయికలూ మారారు

కథానాయకుడు అడివి శేష్ త్వరలో 'డెకాయిట్'గా ప్రేక్షకుల్ని పలకరించనున్న సంగతి తెలిసిందే. షానిల్ డియో తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో తొలుత శేష్‌కు జోడీగా శ్రుతి హాసన్ నాయికగా ఎంపికైంది. కానీ, కొంత చిత్రీకరణ పూర్తయ్యాక సృజనాత్మక విభేదాల వల్ల శ్రుతి ఈ సినిమా నుంచి తప్పుకోవడంతో ఆ స్థానంలోకి మృణాల్ ఠాకూర్ వచ్చి చేరింది. అఖిల్ హీరోగా మురళి కిశోర్ అబ్బూరి దర్శకత్వంలో 'లెనిన్' అనే చిత్రం ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. ఇందులో తొలుత శ్రీలీల కథానాయికగా ఎంపికవ్వగా.. కొంత చిత్రీకరణ పూర్తయ్యాక కాల్షీట్స్ సమస్యల వల్ల ఆమె సినిమా నుంచి తప్పుకుంది. దీంతో ఇప్పుడా పాత్ర కోసం భాగ్యశ్రీ బోర్సేని రంగంలోకి దించినట్లు సమాచారం.


జాన్వీ కపూర్, రామ్‌చరణ్, ఏఆర్ రెహమాన్

'పెద్ది'తో ఆ కల నెరవేరింది - రామ్‌చరణ్



“'నాటు నాటు' పాట ఆస్కార్ గెలవడం మనందరికీ గర్వకారణమ”న్నారు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్. 'బాహుబలి', 'పుష్ప', 'ఆర్ఆర్ఆర్' చిత్రాలతో తెలుగు సినిమా ప్రపంచాన్ని ఆకట్టుకుందని కొనియాడారు. ఆయన శనివారం రాత్రి రామోజీ ఫిల్మ్ సిటీ వేదికగా హైదరాబాద్ టాకీస్ నిర్వహించిన తన మ్యూజిక్ లైవ్ షోతో సినీ సంగీత ప్రియుల్ని ఉర్రూతలూగించారు. 'యువ' సినిమాలోని “జన గణ మన” పాటతో ఆరంభమైన ఈ సంగీత విభావరి.. 'రంగ్ దే బసంతి', 'ఫనా', 'దిల్ సే', 'రోజా', 'ప్రేమదేశం', 'ఏ మాయ చేశావే' తదితర చిత్రాల్లోని ఎవర్‌గ్రీన్ హిట్ గీతాలతో ఆద్యంతం హుషారుగా సాగింది. 'పెద్ది' చిత్ర ప్రచార కార్యక్రమంలో భాగంగా కథానాయకుడు రామ్‌చరణ్, నాయిక జాన్వీ కపూర్, దర్శకుడు బుచ్చిబాబు ఈ వేడుకలో సందడి చేయడం.. ఈ సినిమాలోని 'చికిరి చికిరి' పాటను రెహమాన్ తనయుడు ఏఆర్ అమీన్ స్వయంగా ఆలపించడం ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మాట్లాడుతూ.. “రెహమాన్ సంగీతంలో భాగమవ్వాలనేది నా చిన్ననాటి కల. అది 'పెద్ది'తో నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉంద”న్నారు. ఈ వేడుకలో రెహమాన్ తెలుగు సంగీతం పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. తన సంగీత ప్రయాణం తెలుగుతోనే మొదలైందని చెబుతూ.. తొలినాళ్లలో ఏవీఎం స్టూడియోస్‌లో ఇళయరాజా, ఎంఎస్ విశ్వనాథన్ లాంటి సంగీత దిగ్గజాలతో కలిసి పని చేసిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. ఈ వేడుకలో ఆయన తొలిసారి ఓ పంజాబీ భంగ్రా పాటను ఆలపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. ఈ సంగీత విభావరిలో ఎవెలిన్ సోటో, శ్వేతా మోహన్, రక్షిత సురేశ్, నితీష్, ఆదిత్య, రంజిత్ బరోట్, అలీఫ్ హమ్దాన్ తదితరులు రెహమాన్‌తో కలిసి తమ ప్రదర్శనలతో అలరించారు.

చిరంజీవికి క్షమాపణలు చెప్పిన ఆర్జీవీ


రామ్‌గోపాల్ వర్మ

అగ్ర హీరో చిరంజీవికి ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా క్షమాపణలు చెప్పారు. ఈ నెల 14న 'శివ' రీరిలీజ్ సందర్భంగా చిత్రబృందానికి ఓ వీడియోతో అభినందనలు చెబుతూ, ఆ చిత్ర కథానాయకుడు నాగార్జున నటనని, దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ విజన్‌ని ప్రత్యేకంగా మెచ్చుకున్నారు. తెలుగు సినిమా భవిష్యత్తు ఈ యువ దర్శకుడని అప్పుడే తనకి అనిపించిందంటూ వర్మని ఉద్దేశించి చిరంజీవి అందులో చెప్పారు. ఆ వీడియోపై రామ్‌గోపాల్ వర్మ ఎక్స్‌లో స్పందిస్తూ చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పారు. “విశాల హృదయంతో మా బృందానికి అభినందనలు చెప్పినందుకు మీకు కృతజ్ఞతలు. అనుకోకుండా మిమ్మల్ని బాధపెట్టి ఉంటే ఈ సందర్భంగా హృదయపూర్వకంగా క్షమాపణలు కోరుతున్నా” అంటూ చిరంజీవిని ఉద్దేశించి ఎక్స్‌లో వ్యాఖ్య చేశారు రామ్‌గోపాల్ వర్మ. గతంలో చేసిన వ్యాఖ్యల్ని ఉద్దేశించే వర్మ ఇప్పుడు క్షమాపణలు చెప్పినట్టు తెలుస్తోంది.

డబ్బుతో ఆనందాన్ని ఎందుకు కొనలేం?


కవిన్, ఆండ్రియా

'మాస్క్' మ్యాన్‌గా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతున్నారు తమిళ నటుడు కవిన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాలో ఆండ్రియా, రుహానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వికర్ణన్ అశోక్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా ఈ నెల 21న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. యాక్షన్ సన్నివేశాలతో ఆద్యంతం ఆసక్తిగా సాగుతోందీ ట్రైలర్. ఇందులో 'డబ్బుతో ఆనందాన్ని ఎందుకు కొనలేం..' లాంటి సంభాషణలు సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నాయి. చెన్నై నేపథ్యంలో డార్క్ కామెడీ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం కవిన్.. నయనతారతో కలిసి 'హాయ్' సినిమాతో బిజీగా ఉన్నారు.

ప్రేమకథతో పరిచయం


జయకృష్ణ

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసుడు తెరకు పరిచయం అవుతున్నారు. ఆయనే ఘట్టమనేని జయకృష్ణ. ప్రముఖ సీనియర్ నటుడు కృష్ణ మనవడు, దివంగత రమేశ్‌బాబు తనయుడైన ఈ యువతరంగం 'ఆర్.ఎక్స్. 100' ఫేం అజయ్ భూపతి దర్శకత్వంలో తొలి సినిమా చేయబోతున్నారు. చందమామ కథలు పతాకంపై పి.కిరణ్ నిర్మిస్తుండగా, వైజయంతీ మూవీస్ పతాకంపై అశ్వినీదత్ సమర్పిస్తున్నారు. సూపర్‌స్టార్ కృష్ణతో 'అగ్ని పర్వతం' చిత్రాన్ని నిర్మించిన అశ్వినీదత్.. మహేశ్‌బాబుని 'రాజకుమారుడు' చిత్రంతో కథానాయకుడిగా పరిచయం చేశారు. ఆ కుటుంబంలో మూడోతరానికి చెందిన జయకృష్ణనీ ఇప్పుడు కథానాయకుడిగా పరిచయం చేస్తున్నారు. మనసుకు హత్తుకునే ఓ ప్రేమకథతో ఈ చిత్రం రూపొందుతోందని సినీ వర్గాలు తెలిపాయి. వాస్తవికతతో కూడిన ఈ చిత్రాన్ని భావోద్వేగాలు, సహజత్వానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కిస్తున్నట్టు స్పష్టం చేశాయి. ఆదివారం ఈ సినిమాని ఓ పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఆ పోస్టర్‌లో తిరుమల ఆలయం, పరిసరాలు కనిపిస్తున్నాయి. దీన్నిబట్టి తిరుపతి, తిరుమల నేపథ్యంలో సాగే కథతోనే ఈ చిత్రం రూపొందుతుందనే అంచనాతో ఉన్నాయి ప్రేక్షక, పరిశ్రమ వర్గాలు. ప్రస్తుతం జయకృష్ణ ఘట్టమనేని నటన, పోరాటాలు, నృత్యాల్లో పట్టు పెంచుకునేందుకు శిక్షణ పొందుతున్నారు. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది.

థ్రిల్లింగ్ 'సీమంతం'


వజ్రయోగి, శ్రేయ

వైవిధ్యంగా సాగే క్రైమ్ థ్రిల్లర్ కథతో రూపొందిన సినిమానే మా 'సీమంతం' అన్నారు వజ్రయోగి. ఆయన కథా నాయకుడిగా సుధాకర్ పాణి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'సీమంతం'. శ్రేయభర్తీ కథానాయిక. ప్రశాంత్ టాటా నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుక జరిగింది. కథానాయకుడు వజ్రయోగి మాట్లాడుతూ “గర్భిణిల నేపథ్యంలో సాగే ఈ కథ కొత్తగా ఉంటుంది” అన్నారు.

క్లాప్.. క్లాప్

తిరువీర్ సరసన ఐశ్వర్య రాజేశ్


ఐశ్వర్య రాజేశ్, తిరువీర్

'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' సినిమాతో విజయాన్ని అందుకున్న తిరువీర్ కథానాయకుడిగా గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఐశ్వర్య రాజేశ్ కథానాయిక. భరత్ దర్శన్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మహేశ్వరరెడ్డి మూలి నిర్మాత. ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. కడుపుబ్బా నవ్వించే కథతో ఈ చిత్రం రూపొందుతోందని, ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుందని సినీ వర్గాలు తెలిపాయి. ఈ నెల 19 నుంచి రెగ్యులర్ చిత్రీకరణని ప్రారంభిస్తారు. తెలుగుతోపాటు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లోనూ ఒకేసారి విడుదల కానున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సీహెచ్ కుషేందర్, సంగీతం: భరత్ మంచిరాజు, కళ: తిరుమల ఎం. తిరుపతి, కూర్పు: శ్రీవరప్రసాద్, సాహిత్యం: పూర్ణాచారి.


ఇరువురు భామల కౌగిలిలో..


వైష్ణవి, త్రినాథ్, మలినా

ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరువురు భామల కౌగిలిలో'. 'కమిటీ కుర్రోళ్ళు' ఫేం త్రినాథ్ వర్మ కథానాయకుడు. వైష్ణవి కొల్లూరు, మలినా కథానాయికలు. అక్షర గౌడ కీలక పాత్ర పోషిస్తున్నారు. అచ్యుత్ చౌదరి దర్శకుడు. శ్రీనివాస్‌గౌడ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కథానాయిక నిహారిక కొణిదెల క్లాప్‌నిచ్చారు. దర్శకులు బి.గోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా ఎ.కోదండరామిరెడ్డి, ఎస్.గోపాల్ రెడ్డి గౌరవ దర్శకత్వం వహించారు.

కర్మ రథసారథి.. మాధవన్

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో స్పై యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ధురంధర్'. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని ఆయన.. జ్యోతి దేశ్‌పాండే, లోకేశ్ ధర్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆర్.మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సారా అర్జున్ కథానాయిక. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 12న రాబోతుంది. ఈ సందర్భంగా ఇందులోని నటీనటులకు సంబంధించిన పాత్రల వివరాల్ని ప్రకటించే పనిలో పడింది చిత్రబృందం. ఇందులో భాగంగానే 'కర్మ రథసారథి'గా పేర్కొంటూ ఇన్‌స్టా వేదికగా ఆర్.మాధవన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ చిత్రం డిసెంబరు 5న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకురానుంది.


ఆర్.మాధవన్

అనుపమకు ఆన్‌లైన్ వేధింపులు

● కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు


అనుపమ పరమేశ్వరన్

ఆన్‌లైన్ వేదికగా వేధింపులు రావడంపై నటి అనుపమ పరమేశ్వరన్ కేరళ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. ఈ విషయాన్ని ఆమె ఇన్‌స్టా వేదికగా తెలియజేస్తూ.. “నా గురించి అసత్య ప్రచారం చేస్తున్న ఓ ఇన్‌స్టాగ్రామ్ ప్రొఫైల్ కొన్ని రోజుల క్రితం నా దృష్టికి వచ్చింది. నాతోపాటు నా ఫ్యామిలీ, స్నేహితులు, సహ నటులే లక్ష్యంగా ట్యాగ్ చేస్తూ ఆ ఖాతాలో పోస్టులున్నాయి. నిరాధార ఆరోపణలతో మార్ఫింగ్ చేసిన ఫొటోలు కూడా ఉన్నాయి. ఈ విధంగా లక్ష్యంగా చేసుకుని చేస్తున్న ఆన్‌లైన్ వేధింపులు చాలా బాధించాయి. నన్ను ద్వేషిస్తూ అదే వ్యక్తి మరికొన్ని ఫేక్ అకౌంట్లు సృష్టించినట్లు తర్వాత తెలిసింది. దీంతో కేరళ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాను. వెంటనే అధికారులు స్పందించి.. ఈ చర్యల వెనుక ఉన్న వ్యక్తిని కనిపెట్టారు. తమిళనాడుకు చెందిన 20ఏళ్ల యువతి ఇదంతా చేసినట్లు తెలియడంతో ఆశ్చర్యపోయా. ఆమెది చిన్న వయసు కావడంతో తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నేను పూర్తి వివరాలు పంచుకోవాలనుకోవడం లేదు. దీనిపై న్యాయపరంగానే ముందుకెళతా. సైబర్ బెదిరింపు అనేది శిక్షార్హమైన నేరం. ఇతరులను వేధించేలా, పరువుకు నష్టం కలిగించేలా సామాజిక మాధ్యమాల్లో అసత్యాలు ప్రచారం చేసే హక్కు ఎవరికీ లేద”ని ఘాటుగా పేర్కొంది.

నవ్వించే 'జిగ్రీస్'

ఒక అనుభవంలాంటి సినిమా 'జిగ్రీస్' అంటున్నారు హరీశ్‌రెడ్డి ఉప్పుల. ఆయన దర్శకత్వంలో కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రమిది. కృష్ణ వోడపల్లి నిర్మాత. ఈ నెల 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ “మనలో ఒకరు అనిపించే ఓ నలుగురు కుర్రాళ్ల కథ ఇది. ఇందులోని ప్రతి పాత్రతోనూ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. సహజమైన లొకేషన్లలో కడుపుబ్బా నవ్వించే సన్నివేశాలతో చిత్రీకరించాం. కుటుంబంతోనూ, స్నేహితులతో కలిసి వెళితే ఈ సినిమాని మరింతగా ఆస్వాదిస్తార”న్నారు. నిర్మాత మాట్లాడుతూ “ఎంతగా నవ్విస్తుందో, అంతగా హృదయాల్ని కదిలించి భావోద్వేగానికీ గురిచేస్తుందీ చిత్రం” అన్నారు. ఇప్పటివరకూ చూడని గోవా లొకేషన్లని ఇందులో చూస్తారన్నారు ధీరజ్ ఆత్రేయ. ఒక కొత్త అనుభూతిని పంచే చిత్రమిదన్నారు కృష్ణ బురుగుల. ఇందులోని ప్రతీ సన్నివేశం ఎంతో విలువైనదిగా, ప్రేక్షకులకు వందశాతం నచ్చేలా ఉంటుందన్నారు మణివక్కా. ఈ కార్యక్రమంలో సహ నిర్మాత చిట్టెం వినయ్ సహా చిత్రబృందం పాల్గొంది.

గోద్రేజ్ ప్రోపర్టీస్ విక్రయాలు రూ.32,500 కోట్లు దాటొచ్చు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) నిర్దేశించుకున్న విక్రయాల లక్ష్యమైన రూ.32,500 కోట్లను గోద్రేజ్ ప్రోపర్టీస్ అందుకోవచ్చని/ అధిగమించే అవకాశం కూడా ఉందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ పిరోజ్‌షా గోద్రేజ్ వెల్లడించారు. సొంత ఇంటి కోసం గిరాకీ 'ఆకర్షణీయం'గా ఉందని పేర్కొన్నారు. ముందస్తు విక్రయాలు/విక్రయాల బుకింగులు, వినియోగదారుల నుంచి వసూళ్లు, డెలివరీలు, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, భూమి కొనుగోళ్ల పరంగా కంపెనీ వార్షిక లక్ష్యాలను అందుకుంటుందనే ధీమా వ్యక్తం చేశారు. 2025-26 మొదటి ఆరు నెలల్లో కంపెనీ ముందస్తు విక్రయాలు రూ.15,587 కోట్లకు చేరాయి. 2024-25 ఇదే కాలం నాటి రూ.13,835 కోట్ల కంటే ఇవి 13% అధికం.



వచ్చే ఆర్థిక సంవత్సరంలో అపోలో ఫార్మసీ నమోదు

గ్రూప్ సీఎఫ్ఓ క్రిష్ణన్ అఖిలేశ్వరన్

అపోలో హాస్పిటల్స్ పునర్వ్యవస్థీకరణ, డిజిటల్-ఫార్మసీ వ్యాపార విభాగాల స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేయడం 2026-27 ఆర్థిక సంవత్సరంలో పూర్తవ్వచ్చని గ్రూప్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) క్రిష్ణన్ అఖిలేశ్వరన్ వెల్లడించారు. మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీ, నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వంటి నియంత్రణ సంస్థల అనుమతులను బట్టి అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) పునర్వ్యవస్థీకరణ పూర్తవుతుందని తెలిపారు. కొత్త సంస్థలో డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ అపోలో 24/7, అపోలో హెల్త్ ఆఫ్‌లైన్ ఫార్మసీ వ్యాపారం, క్లినిక్‌లు, టెలిహెల్త్ సేవల వ్యాపారం మిళితమై ఉంటాయని పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) పునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో ఓమ్ని-ఛానల్ ఫార్మసీ, డిజిటల్ వ్యాపారాల విలువను వెలికితీసి, వాటాదార్లకు ప్రతిఫలాలు పెంచడమే లక్ష్యంగా కంపెనీ పని చేస్తోందని వివరించారు. 'స్టాక్ ఎక్స్ఛేంజ్ అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాం. త్వరలోనే అక్కడ నుంచి ఆమోదం లభిస్తుంది. తర్వాత ఎన్‌సీఎల్‌టీ వద్ద దరఖాస్తు చేస్తాం. ఈ ప్రక్రియలన్నీ 2026-27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పూర్తవుతాయి. సమాంతరంగా ఫార్మసీ, డిజిటల్ వ్యాపారాలను స్టాక్ మార్కెట్‌లో నమోదు చేస్తామ'ని క్రిష్ణన్ వెల్లడించారు.

విమానం నడిపేందుకు.. మన ఇంటి వంటనూనె!

- పర్యావరణహిత ఎస్ఏఎఫ్ ఉత్పత్తిపై కంపెనీల దృష్టి
- 2027 నుంచి ఏటీఎఫ్‌లో కలపడం తప్పనిసరి

ప్రయాణికుల రవాణా వ్యవస్థలను పర్యావరణ హితంగా తీర్చిదిద్దేందుకు ప్రపంచవ్యాప్తంగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ఇంజిన్ల ద్వారా వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు.. పలు దేశాలు విద్యుత్తు వాహనాల (ఈవీ)లను ప్రోత్సహిస్తున్నాయి. చమురు కోసం దిగుమతులపై ఆధారపడిన మనదేశం పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలపడం ద్వారా.. శుద్ధ ఇంధనంలో కీలక పురోగతి సాధించింది. భారీగా విదేశీ మారకపు ద్రవ్యాన్ని మనదేశం ఆదా చేసుకోగలుగుతోంది. విమాన ప్రయాణాలు జోరందుకుంటున్న క్రమంలో, సంప్రదాయ విమాన ఇంధనానికి (ఏటీఎఫ్) బదులుగా సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్) వినియోగించడంపై ప్రభుత్వం దృష్టి సారించగా.. దీని ఉత్పత్తి కోసం దేశీయ చమురు కంపెనీలు ప్రయత్నాలు ఆరంభించాయి. ఇప్పటికే పలు దేశాల్లో 100% హరిత ఇంధనంతో భారీ విమానాలు నడుస్తున్నాయి.

ఈ ఏడాదిలోనే ఐఓసీ తయారీ

ఇళ్లు, పెద్ద హోటళ్లలో వంటకు ఒకసారి వినియోగించిన వంటనూనెను పారబోస్తారు. ఇలా పారవేసే వంటనూనె నుంచి ఎస్ఏఎఫ్ ఉత్పత్తి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) వంటి సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఈ ఏడాది చివరి నుంచి వార్షికంగా 35,000 టన్నుల ఎస్ఏఎఫ్‌ను హరియాణలోని పానిపట్ రిఫైనరీ నుంచి ఉత్పత్తి చేస్తామని ఐఓసీ ప్రకటించింది. అంతర్జాతీయ విమాన సర్వీసుల కోసం 2027 నుంచి 1% ఎస్ఏఎఫ్ కలపాలన్న నిబంధన అమలుకు ఈ ఉత్పత్తి సరిపోతుందని కంపెనీ చెబుతోంది. హోటళ్లు, రెస్టారెంట్‌లు, హల్దీరామ్ వంటి స్నాక్స్, స్వీట్స్ తయారీ సంస్థల్లో వినియోగించిన వంటనూనెను ఏజెన్సీలు సేకరించి, ఐఓసీ పానిపట్ రిఫైనరీకి సరఫరా చేస్తాయి. ఈ నూనెను వినియోగించి, ఎస్ఏఎఫ్ ఉత్పత్తి చేస్తారు.

దేశీయ విమానాల్లో 2030 నుంచి 5% ఎస్ఏఎఫ్

ఎస్ఏఎఫ్‌ను తక్కువ కర్బన ఉద్గారాలు ఉండే ఇథనాల్ వంటి పెట్రోలియంయేతర ఉత్పత్తుల నుంచి తయారు చేస్తారు. దీంతో వాయు రవాణా నుంచి వెలువడే ఉద్గారాలు అదుపులోకి వస్తాయి. లభ్యతకు అనుగుణంగా ఏటీఎఫ్‌లో దీన్ని 50% వరకు కలపొచ్చు. 2030 సంవత్సరానికల్లా దేశీయ మార్గాల్లో నడిచే విమానాల్లో 5%, 2040 కల్లా 15% ఎస్ఏఎఫ్ కలపడాన్ని తప్పనిసరి చేయాలన్నది ప్రభుత్వ ఆకాంక్ష. ఆ లక్ష్యాలు సాకారం అవ్వాలంటే 2030కి 100 కోట్ల లీటర్లు, 2040కి 600 కోట్ల లీటర్ల ఎస్ఏఎఫ్ అవసరం అవుతుందని పరిశ్రమ సంఘం ఇండియన్ షుగర్ అండ్ బయో ఎనర్జీ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్స్ (ఐఎస్ఎంఏ) అంచనా వేస్తోంది.

- అంతర్జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా.. 2027 నుంచి అంతర్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే విమాన ఇంధనంలో 1% ఎస్ఏఎఫ్ కలపడాన్ని మనదేశం తప్పనిసరి చేసింది. 2028కు 2%, 2030కు 5% చేయనుంది. ఎస్ఏఎఫ్ కోసం ప్రత్యేక విధానాన్ని త్వరలో ఆవిష్కరిస్తామని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ఇటీవల వెల్లడించారు కూడా.

ఉద్గారాలు 80% తగ్గించొచ్చు

విమాన ఇంధనంలో ఎస్ఏఎఫ్ కలపడం వల్ల గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాలను 80% వరకు తగ్గించొచ్చు. వినియోగించిన వంట నూనె, చెరకు, ధాన్యాలు, మొక్కజొన్న, వ్యవసాయ వ్యర్థాల నుంచి ఎస్ఏఎఫ్ రూపొందించొచ్చు. ఇవన్నీ మనదేశంలో సమృద్ధిగా లభిస్తున్నందున, ఎస్ఏఎఫ్ ఉత్పత్తిలో మనదేశం అంతర్జాతీయ హబ్‌గా ఎదిగే వీలుంది. ఏటా భారత్ 2,450- 3100 కోట్ల లీటర్ల (19-24 మిలియన్ టన్నుల) ఎస్ఏఎఫ్‌ను ఉత్పత్తి చేయగలదని అంచనా. 2040 నాటికి దేశీయంగా 600 కోట్ల లీటర్ల ఎస్ఏఎఫ్ మాత్రమే అవసరం అవుతుందని అంచనా. అంటే మిగిలింది ఎగుమతి చేయొచ్చు కూడా. ఈ రకంగా విదేశీ మారకపు ద్రవ్యం లభిస్తుంది.


దేశీయ విమాన ప్రయాణికులు

2025 జనవరి-సెప్టెంబరు 123.37 కోట్లు

2024 జనవరి- సెప్టెంబరు 118.49 కోట్లు

దేశీయ సంస్థల మార్కెట్ వాటా

64.2%	ఇండిగో
27.4%	ఎయిరిండియా
5.2%	ఆకాశ ఎయిర్
2%	స్పైస్‌జెట్



- ఈనాడు వాణిజ్య విభాగం

రూ.2.65 లక్షల కోట్లకు డీప్‌టెక్ మార్కెట్

2030కి చేరొచ్చు: రెడ్‌సీర్ నివేదిక

మన దేశ డీప్‌టెక్ రంగం, 2030 నాటికి 30 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2.65 లక్షల కోట్ల) స్థాయికి చేరొచ్చని రెడ్‌సీర్ స్ట్రాటజీ కన్సల్టెంట్స్ నివేదిక వెల్లడించింది. రక్షణ రంగ ఆవిష్కరణలు, అంతర్జాతీయ రోబోటిక్స్‌లో వృద్ధి ఇందుకు కలిసివస్తాయని పేర్కొంది. రక్షణ రంగ డీప్‌టెక్‌పై మన దేశం గణనీయంగా పెట్టుబడులు పెడుతోంది. గత దశాబ్దకాలంలో దేశ రక్షణ రంగ బడ్జెట్ దాదాపు రెట్టింపై 80 బిలియన్ డాలర్ల (సుమారు రూ.7 లక్షల కోట్ల)కు చేరింది. ఈ సమయంలో అమెరికా, చైనా వంటి పెద్ద దేశాలతో పోల్చినా, మన ఖర్చులో వృద్ధి అధికంగా ఉందని రెడ్‌సీర్ వెల్లడించింది. 'భారత్ డీప్‌టెక్ అవకాశాలు గత 5 ఏళ్లలో 2.5 రెట్లు అధికమయ్యాయి. 2030కి ఈ మార్కెట్ 30 బి.డాలర్లకు చేరొచ్చు. చైనా వెలుపల విశ్వసనీయమైన, తక్కువ ఖర్చు కలిగినదిగా భారత్ అభివృద్ధి చెందుతోంది. 2024-25లో మన దేశ డీప్‌టెక్ విపణి 9-12 బి.డాలర్లు (సుమారు రూ.79,200-1,05,600 కోట్లు)గా ఉంది' అని నివేదిక స్పష్టం చేసింది.

- రోబోటిక్స్‌లో డీప్‌టెక్ పురోగతి వల్ల భారత్ వర్ధమాన శక్తిగా ఎదుగుతోంది. ప్రస్తుతం అంతర్జాతీయ రోబోటిక్ యంత్రాల మార్కెట్ 60 బి.డాలర్లు (సుమారు రూ.5.28 లక్షల కోట్లు)గా ఉంది. 2030కి ఇది 230 బి.డాలర్ల (సుమారు రూ.20.24 లక్షల కోట్ల)కు చేరొచ్చు. హ్యూమనాయిడ్స్‌తో ఇదే సమయంలో 10 బి.డాలర్ల (సుమారు రూ.88,000 కోట్ల) అవకాశాలు రావొచ్చని అంచనా.

మారుతీ సుజుకీ ఇండియాలో సుజుకీ మోటార్ గుజరాత్ విలీనానికి ఆమోదం



దిల్లీ: సుజుకీ మోటార్ గుజరాత్ తన మాతృసంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ)లో విలీనమయ్యేందుకు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదం తెలిపింది. ఇందుకోసం ఇరు సంస్థలు దాఖలు చేసిన సంయుక్త పిటిషన్‌ను దిల్లీ ఎన్‌సీఎల్‌టీ ప్రిన్సిపల్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు ఆమోదించారు. 2025 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ విలీన పథకం కంపెనీలు, వాటి వాటాదార్లు, రుణదాతలు, ఉద్యోగులు, సంబంధితులందరికీ ఉపయోగకరంగా ఉంటుందని ట్రైబ్యునల్ పేర్కొంది. ఈ పథకం పరిశీలనకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ, అధికారిక లిక్విడేటర్ (అహ్మదాబాద్) ట్రైబ్యునల్ ముందు తమ అభ్యంతరాలను దాఖలు చేయలేదని కూడా ప్రస్తావించింది. ఆర్‌బీఐ, సెబీ, బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వంటి ఇతర చట్టబద్ధ సంస్థల నుంచీ ఎలాంటి పరిశీలనలు/అభ్యంతరాలు రాలేదని తెలిపింది.

ఇండియా డెవలప్‌మెంట్- స్ట్రాటజిక్ ఫండ్

ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరిన సీఐఐ

మన దేశ దీర్ఘకాల వృద్ధి, స్థిరత్వంతో పాటు విదేశాల్లో కీలక ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు ఇండియా డెవలప్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ ఫండ్ (ఐడీఎస్ఎఫ్)ను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) కోరింది. వృద్ధికి అవసరమైన రుణాలు ఇవ్వడానికి, దేశ వ్యూహాత్మక భవిష్యత్తుకు ఐడీఎస్ఎఫ్ దోహదపడుతుందని తెలిపింది. జాతీయ నిధిగా ఏర్పాటయ్యే ఐడీఎస్ఎఫ్‌తో దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాలను మరింత పెంచేందుకు మూలధనాన్ని సమీకరించొచ్చని వెల్లడించింది. సరైన ప్రణాళికతో వచ్చే రెండు దశాబ్దాల్లో ఐడీఎఫ్ఎస్ భారీ నిధి అవుతుందని సీఐఐ విశ్వసిస్తోంది. 2047 నాటికి 1.3- 2.6 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.115-230 లక్షల కోట్ల) శ్రేణిలో ఈ నిధి ఉంటుందని.. ప్రపంచస్థాయి సార్వభౌమ పెట్టుబడిదార్లు ఇచ్చే రుణాలకు ఇది సమానమని పేర్కొంది.



నిధుల సమీకరణ ఇలా

ప్రతిపాదిత నిధిపై పెట్టుబడిదార్ల విశ్వాసాన్ని సాధించేందుకు ప్రారంభ దశలో స్వల్ప బడ్జెట్ కేటాయింపు జరపాల్సి ఉంటుంది. అనంతరం రహదారులు, ట్రాన్స్‌మిషన్ లైన్లు, పోర్టులు, స్పెక్ట్రమ్ వంటి జాతీయ ఆస్తుల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని ఈ నిధిలోకి క్రమపద్ధతిలో మళ్లించొచ్చు.

- భవిష్యత్తులో ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కొంత ప్రభుత్వ వాటాను ఈ నిధికి బదిలీ చేయొచ్చు. ఈ సంస్థలను కేవలం పెట్టుబడుల ఉపసంహరణ కోసం మాత్రమే చూడకుండా, అంతర్జాతీయ విస్తరణకు సాధనంగా మార్చుకోవచ్చని నివేదిక సూచించింది.
- దీర్ఘకాలంలో దేశీయంగా, అంతర్జాతీయంగా నిధులను సమీకరించడానికి మౌలిక, హరిత, డయస్పోరా బాండ్లు సహా థీమ్యాటిక్ సాధనాలను ఈ ఫండ్ జారీ చేయొచ్చు. బహుళపాక్షిక, ద్వైపాక్షిక భాగస్వాములతో కలిసి పెట్టుబడులు పెట్టొచ్చు.
- సరిపడా నిల్వలను సాధించాక.. మన విదేశీ మారకపు నిల్వల్లో కొంత మొత్తాన్ని కీలక ఖనిజాలు, ఇంధనం వంటి రంగాల్లో విదేశీ వ్యూహాత్మక కొనుగోళ్లకు వినియోగించొచ్చు.
- భారత అభివృద్ధి కోసం శాశ్వత ప్రాతిపదికన సొంత ఆర్థిక నిధి ఏర్పాటు చేసుకోవాల్సిన సమయం వచ్చిందని సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచంలో అగ్రగామి ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్నామని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ఇటువంటి దీర్ఘకాలిక మూలధన లక్ష్యాలు అవసరమని అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో 20 లక్షల చ.అ. కొత్త కార్యాలయ స్థలాల సరఫరా

ఈ సంవత్సరం (2025) మూడో త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో హైదరాబాద్‌లో కొత్త కార్యాలయ స్థలాల సరఫరా 20 లక్షల చదరపు అడుగులకు చేరిందని అమెరికాకు చెందిన స్థిరాస్తి కన్సల్టెంట్ వెస్టియన్ తాజా నివేదికలో తెలిపింది. గతేడాది ఇదే సమయం కంటే ఇది 51% తక్కువని పేర్కొంది. అంతర్జాతీయంగా అనిశ్చితులున్నా, గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల ఏర్పాటు కోసం దేశీయ ప్రధాన నగరాల్లో ప్రీమియం కార్యాలయ స్థలాలను లీజుకు తీసుకోవడం పెరుగుతోందని పేర్కొంది. గతేడాది మూడో త్రైమాసికంతో పోలిస్తే, దేశంలోని 6 ప్రధాన నగరాల్లో కొత్త కార్యాలయాల స్థలాల సరఫరా 26% పెరిగి 161 లక్షల చ.అ.లకు చేరిందని వెల్లడించింది.

సెప్టెంబరు త్రైమాసికంలో కొత్త కార్యాలయ స్థలాలు (లక్షల చ.అ.)

నగరం	(లక్షల చ.అ.)	వృద్ధి/ క్షీణత(%)
హైదరాబాద్	20	-51
బెంగళూరు	34	-6
పుణె	37	164
దిల్లీ-ఎన్‌సీఆర్	31	35
చెన్నై	21	320
ముంబయి	18	----

కోడి గుడ్లు

10న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)



హైదరాబాద్	590	తూ/ప గోదావరి	600
వరంగల్	592	విశాఖపట్నం	585
విజయవాడ	600	చిత్తూరు	623

పడినపుడల్లా వెండి కొనొచ్చు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి డిసెంబరు కాంట్రాక్టుకు ఈవారం రూ.1,19,410 వద్ద మద్దతు లభించొచ్చు. ఇది కోల్పోతే రూ.1,17,782; రూ.1,16,414కు దిగి రావొచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.1,22,406 వద్ద నిరోధం ఎదురు కావొచ్చు. దీన్ని అధిగమిస్తే రూ.1,23,774; రూ.1,25,402 వరకు చేరొచ్చు.

వెండి



వెండి డిసెంబరు కాంట్రాక్టు రూ.1,44,610 కంటే దిగువన ట్రేడయితే రూ.1,41,610; రూ.1,38,863 వరకు దిద్దుబాటు కావొచ్చు. ఒకవేళ రూ.1,50,357 కంటే పైకి వెళితే రూ.1,52,925; రూ.1,56,104 వరకు పెరగొచ్చు. రూ.1,45,662 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకుని, పడినపుడల్లా కొనుగోలు చేసి, స్వల్ప లాభాలు రాగానే స్వీకరించడం మంచి వ్యూహం.

ప్రాథమిక లోహాలు



- రాగి నవంబరు కాంట్రాక్టు రూ.1,011.75 కంటే ఎగువకు చేరితే, రూ.1,022.85; 1,032.15 వరకు పెరగొచ్చు. ఒకవేళ కిందకు దిగితే రూ.991.35 వద్ద మద్దతు లభిస్తుంది. ఇది కోల్పోతే రూ.982.05; రూ.970.95 వరకు చేరొచ్చు. ఈ వారం రూ.1,013 కంటే పైన ట్రేడ్ కాకుంటే మరింత బలహీనం కావొచ్చు.
- సీసం నవంబరు కాంట్రాక్టుకు రూ.182.65 వద్ద మద్దతు ఉంది. ఈ స్థాయిని కోల్పోతే రూ.181.95; రూ.181.35 వరకు దిద్దుబాటుకు అవకాశం ఉంది. ఒకవేళ రూ.184.05 కంటే ఎగువకు వెళితే రూ.184.65; రూ.185.35 వరకు పెరగొచ్చు.
- జింక్ నవంబరు కాంట్రాక్టు రూ.299.30 కంటే దిగువన ట్రేడయితే, రూ.296.60, రూ.294.00 వరకు దిద్దుబాటు కావొచ్చు. ఒకవేళ రూ.304.60 కంటే ఎగువకు వెళితే రూ.307.25; రూ.309.90 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- అల్యూమినియం నవంబరు కాంట్రాక్టు రూ.270.25 కంటే దిగువకు వస్తే రూ.267.80, రూ.265.55 వరకు దిద్దుబాటు కావొచ్చు. ఒకవేళ రూ.274.95 కంటే పైకి వెళితే రూ.277.20; రూ.279.65 వరకు పెరగొచ్చు.

ఇంధన రంగం



- ముడి చమురు నవంబరు కాంట్రాక్టుకు రూ.5,205 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.5,101; రూ.4,968 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.5,442 కంటే ఎగువన చలిస్తే రూ.5,574; రూ.5,679 వరకు పెరగొచ్చు.
- సహజవాయువు నవంబరు కాంట్రాక్టు రూ.367.80 కంటే దిగువన ట్రేడయితే రూ.351.20; రూ.339 వరకు దిద్దుబాటు కావొచ్చు. రూ.396.60 కంటే పైకి వెళితే రూ.408.80; రూ.425.40 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



- పసుపు డిసెంబరు కాంట్రాక్టు ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.14,730 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.14,234; రూ.13,986 వరకు దిగిరావొచ్చు. ఒకవేళ రూ.15,474 కంటే ఎగువకు వెళితే రూ.15,722; రూ.16,218 వరకు పెరగొచ్చు.
- జీలకర్ర నవంబరు కాంట్రాక్టు రూ.19,686 కంటే కిందకు వస్తే రూ.19,443; రూ.18,986 వరకు దిద్దుబాటు కావొచ్చు. రూ.20,386 కంటే పైకి వెళితే రూ.20,843; రూ.21,087 వరకు పెరగొచ్చు.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా


కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (డిసెంబరు)	1,21,435	1,21,038	-0.33
వెండి (డిసెంబరు)	1,48,791	1,47,789	-0.67
రాగి (నవంబరు)	1008.30	1,000.65	-0.76
సీసం (నవంబరు)	183.75	183.45	-0.16
జింక్ (నవంబరు)	304.60	301.95	-0.10
అల్యూమినియం (నవంబరు)	272.35	272.70	0.13
ముడి చమురు (నవంబరు)	5,433	5,310	-2.26
సహజ వాయువు (నవంబరు)	364.30	384.40	5.52
పసుపు (డిసెంబరు)	14,950	15,226	1.85
జీలకర్ర (నవంబరు)	20,280	19,930	-1.73

నిఫ్టీ 25,600కు రికవరీ కావొచ్చు

స్టాక్ మార్కెట్ ఈ వారం

- బ్యాంకింగ్ సూచీ రికార్డు గరిష్ఠాలకు చేరొచ్చు
- ఔషధ, వాహన షేర్లకూ సానుకూలతలు
- యంత్రపరికరాలు, ఎఫ్ఎంసీజీ రంగాల్లో బలహీనతలు

విశ్లేషకుల అంచనాలు



వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	141.28	143.40	137.70
బజాజ్ ఆటో	8721.50	8836.50	8547.50
ఐషర్ మోటార్స్	6886.00	7011.00	6658.00
హీరో మోటోకార్ప్	5296.00	5358.70	5226.70
ఎం అండ్ ఎం	3690.20	3809.50	3507.10
మారుతీ	15479.00	15651.70	15173.70
టాటా మోటార్స్	405.85	411.40	400.80
టీవీఎస్ మోటార్	3456.80	3550.30	3294.30

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	6157.50	6336.20	5824.20
కోల్గేట్ పామోలివ్	2167.20	2189.50	2143.90
డాబర్ ఇండియా	518.65	527.20	508.20
ఇమామీ	514.10	529.10	505.10
హిందుస్థాన్ యునిలీవర్	2414.00	2437.60	2388.80
ఐటీసీ	404.05	411.40	399.40
మారికో	711.60	721.30	700.90

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	263.85	272.20	251.20
సీజీ పవర్	733.25	746.50	713.50
ఎల్ అండ్ టీ	3882.50	3930.60	3807.00
సీమెన్స్	3033.40	3121.30	2961.10
థెర్మాక్స్	3190.90	3267.60	3122.00

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	982.30	990.80	970.50
ఐసీఐసీఐ బ్యాంక్	1,343.00	1,361.00	1,309.60
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	81.47	83.70	77.60
ఇండస్ఇండ్ బ్యాంక్	797.25	815.60	769.90
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2,088.30	2,122.40	2,042.20
పీఎన్‌బీ	122.38	125.50	117.30
ఎస్‌బీఐ	955.85	975.80	934.10

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1123.80	1153.00	1105.40
బయోకాన్	380.40	388.60	372.00
సిప్లా	1505.70	1520.80	1484.00
డాక్టర్ రెడ్డీస్	1205.40	1219.00	1191.20
గ్లెన్‌మార్క్ ఫార్మా	1811.50	1842.10	1786.10
నాట్కో ఫార్మా	802.50	810.80	791.00

ఈ వారం స్టాక్ మార్కెట్లు సానుకూల ధోరణితో, పరిమిత శ్రేణిలో కదలాడొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. నిఫ్టీ-50 సూచీ 25,500-25,600 స్థాయులకు రికవరీ అయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. 'ఈవారం 25,300-25,800 స్థాయిలో నిఫ్టీ కదలాడొచ్చు. ప్రస్తుత స్థాయులు కొనుగోళ్లకు ఆకర్షణీయంగా ఉన్నాయ'ని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. '50 రోజుల చలన సగటు కంటే దిగువన ట్రేడింగ్ అవుతుండడంతో, స్వల్పకాలంలో బలహీనతలు కనిపిస్తున్నాయి. నిఫ్టీ 25,600 నిరోధ స్థాయి దిగువన చలించినంత కాలం.. పెరిగినపుడల్లా విక్రయించే వ్యూహాన్ని అనుసరించొచ్చ'ని అంటున్నారు. నిఫ్టీ-50 కంపెనీల్లో బజాజ్ ఫైనాన్స్, ఓఎన్‌జీసీ ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. దేశీయంగా ద్రవ్యోల్బణ గణాంకాలు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ పరిణామాలూ ప్రభావం చూపొచ్చు. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ) అక్టోబరులో రూ.14,610 కోట్ల నికర కొనుగోళ్లు జరిపినా, ఈ నెలలో ఇప్పటికే రూ.12,569 కోట్ల విక్రయాలు జరిపారు. జనవరి నుంచి చూస్తే, ఎఫ్‌పీఐలు రూ.1.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఉపసంహరించినట్లు అయ్యింది. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు స్వల్పకాలంలో కొంత బలహీనపడచ్చు. సమీప భవిష్యత్తులో జీఎస్‌టీ 2.0 నుంచి ఈ కంపెనీలు కాస్త ప్రయోజనం పొందొచ్చు. ఇమామీ, మారికో ఫలితాలు ఈ వారం రానున్నాయి.
- నిఫ్టీ బ్యాంక్ సూచీ సానుకూలంగా ట్రేడవవచ్చు. రికార్డు గరిష్ఠమైన 58,577.5 చేరువకు వెళ్లే అవకాశం ఉంది. ప్రస్తుత స్థిరీకరణ దశను కొనుగోళ్లకు అవకాశాలుగా భావించొచ్చు.
- ఇటీవలి స్థిరీకరణ అనంతరం **లోహ** కంపెనీల షేర్లు హెచ్చుతగ్గులకు లోనుకావొచ్చు. డిసెంబరులో అమెరికా ఫెడ్ రేట్ల కోత ఉంటుందన్న సంకేతాలేవైనా వెలువడితే, లోహ ధరలకు సానుకూలంగా మారొచ్చు. నిఫ్టీ మెటల్ సూచీకి 10,200 వద్ద మద్దతు, 10,850 వద్ద నిరోధం కనిపిస్తోంది.
- సానుకూల అంశాలు లేనందున, **ఐటీ** షేర్లు ఈ వారమూ నష్టపోనున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య క్లయింట్ల వ్యయాలు తగ్గుతాయన్న ఆందోళనలు ఉన్నాయి.
- **ఔషధ** షేర్లు ఈ వారం రాణించొచ్చు. కంపెనీల సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు అంచనాల కంటే కాస్త మిన్నగా వెలువడడంతో, సెంటిమెంటు సానుకూలంగా మారింది. ఆల్కెమ్ లేబొరేటరీస్, బయోకాన్, గ్లెన్‌మార్క్ ఫార్మా, ఇప్కా లేబొరేటరీస్, జేబీ కెమికల్స్ ఫలితాలు ఈ వారంలోనే రానున్నాయి.
- **సిమెంటు** షేర్లు సమీప కాలంలో రాణించొచ్చు. వర్షాకాలం పూర్తికావొస్తుండడంతో నిర్మాణ కార్యకలాపాలు పుంజుకుంటాయన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. కంపెనీలు త్వరలో ధరలు పెంచే అవకాశం ఉంది.
- **యంత్ర పరికరాల** షేర్లు నష్టాల్లో ట్రేడవవచ్చు. ఆర్డర్లు తగ్గుతున్నాయన్న సంకేతాలున్నాయి. దీనికి తోడు షేర్ల విలువలు అధికంగా ఉండడంతో, లాభాల స్వీకరణ దిశగా మదుపర్లు పయనించొచ్చు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ బుధవారం ఫలితాలను ఇవ్వనుంది.
- **వాహన** షేర్లపై సాంకేతిక విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. హీరో మోటోకార్ప్, అశోక్ లేలాండ్, బాష్, ఐషర్ మోటార్స్, సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ ఫలితాలను మదుపర్లు గమనించొచ్చు. ఈ రంగ సూచీ 26,300-27,000 మధ్య కదలాడొచ్చు.
- **టెలికాం** షేర్లు ఒక శ్రేణిలోనే చలించొచ్చు. సోమవారం ఫలితాలను వెల్లడించనున్న నేపథ్యంలో వొడాఫోన్ ఐడియా షేర్లు వెలుగులోకి రావొచ్చు. ఇవి రూ.9-10.50 మధ్య చలించొచ్చు. భారతీ ఎయిర్‌టెల్‌కు లక్ష్యం ధరను రూ.2,635కు 'జెఫరీస్' సవరించింది.
- చమురు-గ్యాస్ సూచీ సమీప కాలంలో బులిష్ ధోరణి ప్రదర్శించొచ్చు. అయితే కీలక మద్దతు వద్ద ట్రేడింగ్ అవుతున్నందున అప్రమత్తత అవసరం. ఓఎన్‌జీసీ, ఇంద్రప్రస్థ గ్యాస్, ఆయిల్ ఇండియా ఫలితాలు ఈ వారమే ఉన్నాయి.

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	790.40	811.60	772.40
హిందుస్థాన్ జింక్	474.50	485.60	454.40
ఎన్ఎండీసీ	74.24	75.60	71.70
సెయిల్	141.00	146.50	131.90
టాటా స్టీల్	181.37	186.80	172.30
వేదాంతా	515.05	529.70	490.20

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1478.00	1506.60	1461.60
బీపీసీఎల్	367.15	373.00	356.80
హెచ్‌పీసీఎల్	479.55	488.80	463.70
ఐఓసీఎల్	169.16	171.70	164.80
ఓఎన్‌జీసీ	252.20	255.50	248.30
ఆయిల్ ఇండియా	433.70	443.60	423.20

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1512.40	1535.50	1478.90
ఇన్ఫోసిస్	1476.80	1500.70	1437.10
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5781.00	5917.00	5631.00
టీసీఎస్	2991.80	3028.90	2941.90
టెక్ మహీంద్రా	1386.70	1418.60	1369.00
విప్రో	236.49	240.50	234.00

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1840.50	1871.80	1803.20
అంబుజా సిమెంట్స్	558.80	571.20	544.40
ఇండియా సిమెంట్స్	378.45	394.10	369.10
శ్రీ సిమెంట్	27375.00	27998.30	26898.30
అల్ట్రాటెక్ సిమెంట్	11849.00	11995.00	11761.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,001.20	2067.30	1962.50
ఎంటీఎన్ఎల్	40.86	42.10	39.80
టాటా కమ్యూనికేషన్స్	1849.40	1876.90	1803.90
వొడాఫోన్ ఐడియా	9.61	10.00	9.00

ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో ఆర్ఆర్‌బీలు ఎన్‌టీపీసీ ఉద్యోగాల భర్తీకి ఇటీవలే ప్రకటనలు వెలువరించాయి. ఇదే బాటలో డిప్లొమాతోనూ రైల్వేలో జూనియర్ ఇంజినీర్(జేఈ)గా కొలువుదీరే అవకాశం వచ్చింది. ఇటీవలే 2569 పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. పరీక్షల్లో ప్రతిభ చూపితే చాలు.. లెవెల్-6 వేతనంతో సేవలందించవచ్చు. ఆపై ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు.

డిప్లొమాతో రైల్వే జేఈ!

సన్నద్ధత



డిప్లొమా విద్యార్హతతో మేటి ఉద్యోగం పొందే అవకాశం రైల్వేలు కల్పిస్తున్నాయి. జూనియర్ ఇంజినీర్‌గా చేరిన వారు మొదటి నెల నుంచే సుమారు రూ.65,000 జీతం పొందవచ్చు. ఆ తర్వాత అనుభవం, నైపుణ్యాలు, విద్యార్హతల ద్వారా.. అసిస్టెంట్ ఇంజినీర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్, అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్, డివిజినల్ ఇంజినీర్.. ఇలా ఉన్నత హోదాలూ పొందవచ్చు. రెండు దశల్లో నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతో నియామకాలుంటాయి.

స్టేజ్-1: వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున వంద ప్రశ్నలు వస్తాయి. మ్యాథ్స్ 30, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25, జనరల్ అవేర్‌నెస్ 15, జనరల్ సైన్స్ 30 ప్రశ్నలు ఉంటాయి. వీటిని 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.

స్టేజ్-2: స్టేజ్-1లో ప్రతిభావంతులకే స్టేజ్-2కి అవకాశమిస్తారు. స్టేజ్-1 మార్కుల మెరిట్‌తో విభాగాల వారీ ఉన్న ఖాళీలకు 15 రెట్ల మందిని స్టేజ్-2కి తీసుకుంటారు. దీన్ని 150 మార్కులకు నిర్వహిస్తారు. 150 ప్రశ్నలు. ప్రశ్నకు ఒక మార్కు. పరీక్ష వ్యవధి 2 గంటలు. జనరల్ అవేర్‌నెస్ 15, ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ 15, కంప్యూటర్స్ అండ్ అప్లికేషన్స్ బేసిక్స్ 10, ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్ బేసిక్స్ 10, టెక్నికల్ ఎబిలిటీస్ 100 ప్రశ్నలు వస్తాయి.

పరీక్ష కోసం తెలుగు మాధ్యమాన్నీ ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్ ప్రశ్నలు తెలుగు, ఇంగ్లిష్‌లో డిస్‌ప్లే అవుతాయి. స్టేజ్-1, స్టేజ్-2 రెండు దశల్లోనూ తప్పు సమాధానానికి 1/3 మార్కు తగ్గిస్తారు. స్టేజ్-1, స్టేజ్-2ల్లో అర్హత సాధించడానికి జనరల్, ఈడబ్ల్యూఎస్ 40, ఓబీసీ, ఎస్సీ 30, ఎస్టీలు 25 శాతం మార్కులు పొందాలి. స్టేజ్-2లో అర్హత పొందినవారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీల సంఖ్యకు సమానంగా అభ్యర్థులను ధ్రువపత్రాల పరిశీలనకు పిలుస్తారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, ఏ సమస్యా లేనివారిని ఉద్యోగంలోకి ఆహ్వానిస్తారు.

వివరాలు

ఖాళీలు: 2569. **అర్హత:** జూనియర్ ఇంజినీర్ పోస్టులకు.. సంబంధిత/అనుబంధ విభాగాల్లో మూడేళ్ల డిప్లొమా లేదా బీఈ/బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కెమికల్ అండ్ మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకు బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీలతో అవకాశం ఉంది. డిపో మెటీరియల్ సూపరింటెండెంట్ ఖాళీలకు డిప్లొమా అన్ని విభాగాలవారూ అర్హులే. ఏదో ఒక ఆర్ఆర్‌బీలో ఉన్న ఖాళీలకే దరఖాస్తు చేసుకోవాలి. ప్రస్తుతం చివరి ఏడాది కోర్సుల్లో ఉన్నవారికి అవకాశం లేదు.

వయసు: జనవరి 1, 2026 నాటికి 18 నుంచి 33 ఏళ్లలోపు ఉండాలి. జనరల్ అభ్యర్థులైతే జనవరి 2, 1993 - జనవరి 1, 2008 మధ్య జన్మించాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

పరీక్ష ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, దివ్యాంగులు, మైనార్టీలు, ఈబీసీలకు రూ.250. స్టేజ్-1కు హాజరైతే బ్యాంకు ఛార్జీలు మినహాయించి, పరీక్ష ఫీజు ఇచ్చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 30

పరీక్ష తేదీలు: తర్వాత ప్రకటిస్తారు

వెబ్‌సైట్: https://www.rrbapply.gov.in/#/auth/landing

- ముందు నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు గమనించాలి. వాటికి అవసరమైన పుస్తకాలు, స్టడీ మెటీరియల్ సిద్ధం చేసుకోవాలి. పరిమిత సాధన వనరులనే ఎంచుకుని, వాటినే విస్తృతంగా చదవడం, పునశ్చరణ చేయడానికి ప్రాధాన్యమివ్వాలి.
- పరీక్ష తేదీ ప్రకటించనందున ఎక్కువ వ్యవధే ఉంటుంది. అందువల్ల ఏదైనా విభాగంలోని ఒక అంశాన్నే తీసుకుని పూర్తిగా ఒక రోజు కేటాయించుకోవచ్చు. ప్రాథమికాంశాల నుంచి ప్రారంభించి, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి. అలాగే ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.
- ప్రతి విభాగంలోనూ అన్ని అంశాలూ చదవడం పూర్తయిన తర్వాత, పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, మళ్లీ చదవడం, వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధించడం చేయాలి.
- పరీక్ష తేదీకి నెల రోజుల ముందు నుంచి మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. వెనుకబడుతున్న అంశాలకు ప్రాధాన్యమిచ్చి, బాగా చదివితే, స్కోరు పెరుగుతుంది.
- రుణాత్మక మార్కులు ఉన్నందున తెలియనివి వదిలేయాలి.
- తక్కువ వ్యవధిలో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను సరైన సమాధానాలు గుర్తించాలి. అందువల్ల వేగం, కచ్చితత్వం రెండూ ముఖ్యమే. వీలైనన్ని మాదిరి ప్రశ్నల సాధనతో, వీటిపై పట్టు లభిస్తుంది.
- మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రశ్నలకు ఆబ్జెక్టివ్ అరిథ్‌మెటిక్ -ఆర్ఎస్ అగర్వాల్ పుస్తకం సరిపోతుంది. ఈ విభాగంలో త్రికోణమితి, ఆల్జీబ్రా.. మొదలైన అంశాల కోసం పదో తరగతి గణిత పుస్తకాన్ని బాగా చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేయాలి.
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగానికి ఆర్ఎస్ అగర్వాల్ రీజనింగ్ పుస్తకం లేదా ఏదైనా తీసుకోవచ్చు.
- స్టేజ్-1, స్టేజ్-2లో ఉమ్మడిగా ఉన్న జనరల్ సైన్స్ కోసం.. సీబీఎస్ఈ 8,9,10 తరగతుల భౌతిక, రసాయన, జీవశాస్త్రాల పుస్తకాలు క్షుణ్నంగా చదవాలి. అలాగే ఈ విభాగాల్లో ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాత ప్రశ్నపత్రాల అధ్యయనంతో ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంది.
- స్టేజ్-1, 2లోని జనరల్ అవేర్‌నెస్ కోసం.. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ప్రాధాన్యమివ్వాలి. ఏప్రిల్, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు.. ముఖ్య సంఘటనలు గుర్తుంచుకోవాలి. పత్రికలు చదువుతున్నప్పుడే ప్రశ్నగా రావడానికి అవకాశం ఉన్నవాటిని నోట్సు రాసుకోవాలి. పరీక్షకు ముందు తక్కువ వ్యవధిలోనే మరోసారి పునశ్చరణ చేసుకోవచ్చు.
- పరీక్షలో విజయాన్ని నిర్ణయించేది స్టేజ్-2లో టెక్నికల్ ఎబిలిటీస్ విభాగం. ఇందులో ఎక్కువ మార్కులకు డిప్లొమా పాఠ్యపుస్తకాలే దిక్కుచి. అలాగే ఆర్ఆర్‌బీ జేఈ పాతప్రశ్న పత్రాలతోపాటూ.. ఎస్ఎస్‌సీ దాదాపు ఏటా నిర్వహిస్తోన్న జేఈ ప్రశ్నపత్రాల అధ్యయనమూ ఎంతో మేలు చేస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగానికి.. ఏ కోర్సులు?

మా అబ్బాయి ఐదోతరగతి చదువుతున్నాడు. పదోతరగతి తర్వాత ఏ కోర్సులు చదివితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు త్వరగా సంపాదించొచ్చు. ముందే తెలుసుకుంటే అబ్బాయిని చిన్నతనం నుంచే లక్ష్యం దిశగా మోటివేట్ చేయొచ్చనేది నా ఉద్దేశం. - ఎం.రాజేశ్‌కుమార్

■ ఐదో తరగతి చదువుతున్న మీ బాబుకు భవిష్యత్తులో కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు రావాలంటే పదో తరగతి తర్వాత ఏం చదవాలి అన్న విషయం గురించి ఇప్పటి నుంచే ఆలోచించాల్సిన అవసరం లేదు. మీ ఆలోచన, తాపత్రయం పిల్లవాడిలో అనవసరమైన మానసిక ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉంది.



ముందుగా, మీ అబ్బాయి తప్పనిసరిగా ప్రభుత్వ ఉద్యోగం పొందాలి అన్న కోరికను తొలగించే ప్రయత్నం చేయండి. గత కొన్ని సంవత్సరాలుగా చాలామంది విద్యార్థులు ప్రైవేటు ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. చాలా ప్రైవేటు ఉద్యోగాల్లో వేతనాలు, పదోన్నతులు, ఎదుగుదల అవకాశాలు ప్రభుత్వ ఉద్యోగాల్లో కంటే ఎక్కువ స్థాయిలో ఉన్నాయి. కాబట్టి, మీ అబ్బాయి ఏం చదవాలి, ఏ రంగంలో స్థిరపడాలి.. అనే నిర్ణయాన్ని అతనికే వదిలేయడం మంచిది.

తనకు నచ్చిన కోర్సు, ప్రతిభ, ఆసక్తి, అభిరుచి ఏ రంగంలో ఉంటే, ఆ దిశలో సాగేందుకు అతనికి స్వేచ్ఛ ఇవ్వండి. మీ బాబు ప్రస్తుతం ఐదో తరగతిలో ఉన్నాడంటే.. తను ఉద్యోగ మార్కెట్లో అడుగుపెట్టడానికి కనీసం మరో పది సంవత్సరాలు పడుతుంది. అప్పటి ఉద్యోగ మార్కెట్ ఎలా ఉంటుంది, ఉద్యోగాల స్వభావం ఎలా మారుతుంది, ప్రభుత్వ ఉద్యోగాల నియామక విధానాలు ఏ విధంగా ఉంటాయి అన్నది ఇప్పుడే ఊహించడం కష్టం. కాబట్టి, దీర్ఘకాలిక ప్రణాళికలకు బదులుగా, వెంటనే ఉపయోగపడే స్వల్పకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడం శ్రేయస్కరం.

మీ అబ్బాయిని రేపటి ఉద్యోగిగా మార్చడం కన్నా, మంచి పౌరుడిగా తీర్చిదిద్దటం ముఖ్యం. సృజనాత్మకత, నైతికత పెంచేలా విలువలతో కూడిన విద్యను అందించండి. మార్కుల కోసం బట్టీ చదువులను ప్రోత్సహించకండి. తను ఇష్టంతో, ఆనందంతో చదివే వాతావరణం కల్పించండి.

ఇప్పుడు చదివే ప్రతి సబ్జెక్టులోనూ ప్రాథమిక భావనలపై పట్టు వచ్చేలా, స్పష్టమైన భావప్రకటన సామర్థ్యాలు పెరిగేలా మార్గనిర్దేశం చేయండి. క్రీడలు, సంగీతం లాంటి రంగాలపై ఆసక్తి కల్పించే ప్రయత్నం చేయండి.

చివరిగా.. మీ జీవితంలో నెరవేరని స్వప్నాలను పిల్లల భుజాలపై భారంగా మోపకండి. వారి జీవిత ప్రయాణం వారి సొంతం. మీరు చూపే ప్రేమ, సహనం, స్వేచ్ఛ, మార్గదర్శనం వారిని నిజమైన విజయం దిశగా నడిపిస్తాయి.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటీస్ బోర్డు

ఎన్‌పీసీఐఎల్‌లో డిప్యూటీ మేనేజర్లు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.. 122 డిప్యూటీ మేనేజర్, జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● డిప్యూటీ మేనేజర్ (హెచ్ఆర్): 31 ● డిప్యూటీ మేనేజర్ (ఎఫ్ అండ్ ఏ): 48 ● డిప్యూటీ మేనేజర్ (సీ అండ్ ఎంఎం): 34 ● డిప్యూటీ మేనేజర్ (లీగల్): 01 ● జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్: 08

అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, గ్రాడ్యుయేషన్, ఎంబీఏ, పీజీ, ఎల్ఎల్‌బీ, ఎంఎస్‌డబ్ల్యూతో పాటు ఉద్యోగానుభవం. **మూల వేతనం:** నెలకు డిప్యూటీ మేనేజర్‌కు రూ.56,100; జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు రూ.35,400. **వయసు:** డిప్యూటీ మేనేజర్‌కు 18-30; జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** డిప్యూటీ మేనేజర్‌కు రూ.500; జూనియర్ హిందీ ట్రాన్స్‌లేటర్‌కు రూ.150. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 27.11.2025. **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in/

జూనియర్ మేనేజర్లు..

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, కోల్‌కతా.. జూనియర్ మేనేజర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● **జూనియర్ మేనేజర్: 64**

విభాగాలు: మైనింగ్, జియాలజీ, ఎలక్ట్రికల్, మెకానికల్, సర్వే, ఎన్విరాన్‌మెంట్, సివిల్, మినరల్ ప్రాసెసింగ్, ఫైనాన్స్, హెచ్ఆర్, అడ్మిన్, లా, మెటీరియల్స్ అండ్ కాంట్రాక్ట్స్. **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంబీఏతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుంది. **జీతం:** నెలకు రూ.30,000 - రూ.1,20,000. **దరఖాస్తు ఫీజు:** రూ 500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు లేదు. **దరఖాస్తు ప్రారంభ తేదీ:** నవంబరు 27. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబరు 17. **ఎంపిక:** రాత పరీక్షతో. **వెబ్‌సైట్:** https://www.hindustancopper.com/Page/Career_New

బీవోబీ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్‌లో..

బీవోబీ క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్.. బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● **బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్: 110**

అర్హత: డిగ్రీతో పాటు సేల్స్, మార్కెటింగ్ విభాగంలో పని అనుభవం కావాలి. **దరఖాస్తు:** ఈ మెయిల్‌తో. email: careers@bobcaps.in **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** నవంబరు 30. **వెబ్‌సైట్:** https://www.bobcaps.in/careers

జూనియర్ టెక్నీషియన్లు

ఆర్మ్‌డ్ వెహికల్స్ నిగమ్ లిమిటెడ్, చెన్నై ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 133 జూనియర్ టెక్నీషియన్, మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ టెక్నీషియన్: 130 ● జూనియర్ మేనేజర్: 01 ● డిప్లొమా టెక్నీషియన్: 02. **విభాగాలు:** టర్నర్, మెషినిస్ట్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ ఫిట్టర్, ఎలక్ట్రిక్ ఫిట్టర్, మిల్‌రైట్, ఎగ్జామినర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, టూల్ డిజైన్. **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్), డిప్లొమాతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** నవంబరు 21 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీకి 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **జీతం:** నెలకు జూనియర్ టెక్నీషియన్‌కు రూ.34,227, జూనియర్ మేనేజర్‌కు రూ.47,610, డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.37,201. **దరఖాస్తు ఫీజు:** రూ.300. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, ఈడబ్ల్యూఎస్, మహిళలకు ఫీజు లేదు. **తపాలా ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** నవంబరు 21. **చిరునామా:** చీఫ్ జనరల్ మేనేజర్, ఏవీఎన్ఎల్, మెషిన్ టూల్ ప్రోటోటైప్ ఫ్యాక్టరీ, ఆర్డినెన్స్ ఎస్టేట్, అంబర్‌నాథ్, మహారాష్ట్ర- 421 502. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూతో **వెబ్‌సైట్:** https://ddpdoo.gov.in/career

ఎన్ఐఈపీవీడీలో లెక్చరర్లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజెబిలిటీస్.. ఒప్పంద ప్రాతిపదికన 14 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● లెక్చరర్: 08 ● ఇన్‌స్ట్రక్టర్: 03 ● కోర్ ఫ్యాకల్టీ ఫర్ సీబీఐడీ: 02 ● స్పెషల్ ఎడ్యుకేటర్: 01

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎడ్, డీఎడ్, ఎంఎడ్, ఎంఫిల్, పీహెచ్‌డీ. **వేతనం:** నెలకు లెక్చరర్‌కు రూ.60,000; ఇన్‌స్ట్రక్టర్‌కు రూ.45,000; సీబీఐడీ రూ.30,000; స్పెషల్ ఎడ్యుకేటర్‌కు రూ.45,000. **వయసు:** 56 ఏళ్లు మించకూడదు. **దరఖాస్తు ఫీజు:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ మహిళలకు రూ.250. **తపాలా ద్వారా దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** 28.11.2025. **చిరునామా:** డైరెక్టర్, ఎన్ఐఈపీవీడీ, 116, రాజ్‌పూర్ రోడ్, డెహ్రాడూన్. **వెబ్‌సైట్:** https://niepvd.nic.in/

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. ఐటీకి సవాలుగా వచ్చిందనుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుధీర్ మూడు రోజులపాటు దాన్ని క్షుణ్నంగా అర్థం చేసుకున్నాడు. ఏఐ అనేది ఒక టూల్.. అంతే తప్ప ఉద్యోగాలకు చెక్ పెట్టే నిరోధక శక్తికాదని గుర్తించాడు. ఎక్కడెక్కడ ఏఐపై స్వల్పకాల వ్యవధి కోర్సులున్నాయో చకచకా వెతికి మూడు నెలల్లో జనరేటివ్ ఏఐని తన అర్హతలకు జత చేసుకున్నాడు. ఆ తర్వాత హాజరైన మూడు క్యాంపస్ ప్లేస్‌మెంట్లలోనూ ఎంపికయ్యాడు.

సాఫ్ట్‌స్కిల్స్‌పై పట్టు.. కెరియర్ సూపర్ హిట్టు

కంపెనీలు గుర్తించిందేమిటి?

సుధీర్‌లో రెండు లక్షణాలు రిక్రూటర్లకు నచ్చాయి. ఒకటి.. అడాప్టబిలిటీ - స్వీకరణ. సాంకేతిక విజ్ఞానరంగంలో వచ్చిన కొత్త మార్పు కృత్రిమ మేధ కాగా.. దాన్ని సుధీర్ వేగంగా అందిపుచ్చుకున్నాడు. రెండు.. లెర్నింగ్ ఎబిలిటీ. నేర్చుకోవాలన్న జిజ్ఞాస. ఈ రెండు టెక్నికల్ క్వాలిఫికేషన్స్ కంపెనీలకు కావలసిన లక్షణాలే. ఇవి సాఫ్ట్‌స్కిల్స్‌లో భాగం. ఇంజినీరింగ్ డిగ్రీతో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కి వచ్చిన అందరిలో టెక్నికల్ స్కిల్స్ సమానంగా ఉండగా.. సుధీర్‌కి ఉన్న సాఫ్ట్‌స్కిల్స్ అతడి పేరును ఎంపిక జాబితాలోకి చేర్చాయి.

ఏమిటీ నైపుణ్యాలు?

టెక్నికల్ స్కిల్స్‌కు కొదవలేని నేపథ్యంలో.. ఉద్యోగార్థుల తలరాతలను లిఖిస్తున్న విజయ మంత్రం, ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు సైతం వృత్తిపరంగా ఊతమిస్తున్న మార్గదర్శి సాఫ్ట్‌స్కిల్సే.

నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) తాజా నివేదిక ప్రకారం.. నేటి ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో టెక్నికల్ స్కిల్స్ బలంగానే ఉన్నా.. సాఫ్ట్‌స్కిల్స్ లోపించి 60 శాతం మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. అలాగే ఇప్పటికే కంపెనీల్లో వివిధ స్థాయుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కూడా ఈ నైపుణ్యాలు లోపించే ఎదగలేకపోతున్నారు. దీన్ని అధిగమించేందుకు చాలా కంపెనీలు ఉద్యోగులకు రీస్కిల్లింగ్ పేరిట నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నాయి.

సాఫ్ట్‌స్కిల్స్ అగోచరంగా నిక్షిప్తమై ఉండే లక్షణాలు. వాటికి కొలమానం లేదు. టెక్నికల్ స్కిల్స్‌కు పరీక్ష పెట్టి సర్టిఫికెట్లు ఇవ్వవచ్చు. కానీ సాఫ్ట్‌స్కిల్స్‌ని కొలవలేం. నేర్చుకోవాలన్న తపన (లెర్నింగ్ ఎబిలిటీ)ని ఏ ఉపకరణాల్లో కొలవగలం? ఒక మనిషిలో ఉండే ఈ లక్షణం ఫలితాన్ని మాత్రమే మనం చూడగలం. ఒక్కమాటలో అర్థం చేసుకోవాలంటే టెక్నికల్ స్కిల్స్ ఐ.క్యూ. (ఇంటెలిజెన్స్ కోషెంట్)కు సూచిక కాగా.. సాఫ్ట్‌స్కిల్స్ ఈ.క్యూ. (ఎమోషనల్ కోషెంట్)కు సంకేతం.

రెండు రకాలుగా..

సాఫ్ట్‌స్కిల్స్‌ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ప్రాథమిక నైపుణ్యాలు, అనుబంధ సామర్థ్యాలు. ఈ రెండిటి సమాహారమే సాఫ్ట్‌స్కిల్స్.


సాఫ్ట్‌స్కిల్స్

ప్రాథమిక నైపుణ్యాలు	అనుబంధ సామర్థ్యాలు
భావ వ్యక్తీకరణ (కమ్యూనికేషన్)	శ్రద్ధగా వినడం
సమస్యా పరిష్కార సామర్థ్యం (ప్రాబ్లం సాల్వింగ్)	టైమ్ మేనేజ్‌మెంట్
టీమ్ వర్క్	ఉద్వేగ నిర్వహణ (ఎమోషనల్ మేనేజ్‌మెంట్)
క్రిటికల్ థింకింగ్	మెంటరింగ్
వర్క్ ఎథిక్స్	లెర్నింగ్ ఎబిలిటీ
క్రియేటివిటీ	లీడర్‌షిప్
అడాప్టబిలిటీ	ఎంపతీ

ప్రాథమిక నైపుణ్యం - ప్రవేశ ద్వారం

సాఫ్ట్‌స్కిల్స్‌లో మొదటి శ్రేణికి చెందిన కమ్యూనికేషన్, ప్రాబ్లం సాల్వింగ్ అత్యంత కీలకం. ఉద్యోగ సాధనలో అనివార్యమైన నైపుణ్యాలు. ప్రాంగణ నియామకాల్లో రిక్రూటర్లు ప్రధానంగా దృష్టి నిలిపే అంశాలు.. సాంకేతిక సామర్థ్యాలకు తోడు ఇవి జత కలిస్తేనే అభ్యర్థిని కంపెనీలోకి ప్రవేశించేందుకు ఆఫర్ లెటర్ ఇస్తారు.

ఇక రెండో కోవకు చెందిన కౌశలాలు.. సంస్థలో చేరాక ఉద్యోగిగా మెట్టు తర్వాత పైమెట్టు ఎక్కేందుకు, కార్పొరేట్ కెరియర్‌లో రాణించేందుకు ఉపకరించేవి. సమయ నిర్వహణ, ఉద్వేగాల నియంత్రణ, శ్రద్ధగా ఆలకించడం, కొత్త విషయాలు, నైపుణ్యాలను నేర్చుకోవాలన్న ఉత్సుకత లాంటివి పని వాతావరణంలో ఉద్యోగిని భిన్నంగా నిలబెట్టి పైస్థాయి లీడర్లను ఆకర్షిస్తాయి.



94 శాతం మొగ్గు ఇటువైపే

టెక్నికల్ స్కిల్స్ స్థిరంగా ఉండవు. ఏ టెక్నాలజీ కలకాలం రాజ్యమేలలేదు. ఐటీ విప్లవంలో తడిసి ముద్దవుతుండగా.. ఏఐ సాంకేతికత సూర్యోదయమైంది. కృత్రిమ మేధ అన్ని రంగాలకూ విస్తరించే పనిలో ఉండగానే పెనువేగంతో పనులు చక్కదిద్దే క్వాంటం టెక్నాలజీ కూతవేటు దూరంలో సిద్ధమవుతోంది. ఏ సాంకేతికత వచ్చి వెళ్లినా.. ఉద్యోగిలో నిశ్చయంగా ఉండాల్సినవి మాత్రం.. సాఫ్ట్‌స్కిల్సేనని కంపెనీలు గుర్తించాయి. అందుకే రిక్రూటర్లు ఎంపికల సమయంలో అభ్యర్థిలోని సాఫ్ట్‌స్కిల్స్ వైపు 94 శాతం మొగ్గు చూపుతున్నారని ఇటీవల నియామకాలపై నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది.

సాఫ్ట్‌స్కిల్స్‌లో ఉండే సుగుణం.. వీటిని నేర్చుకునేందుకు ఏ యూనివర్సిటీలకూ వెళ్లనవసరం లేదు. ఏ కాలేజీలనూ ఆశ్రయించాల్సిన పని లేదు. అవగాహన, ఆచరణ అనే రెండు మార్గాల ద్వారా సొంతంగా నేర్చుకోవచ్చు. సాఫ్ట్‌స్కిల్స్‌పై పట్టు సాధించి, నియామకాల సమయంలో ఉత్తమంగా నిలవవచ్చు.



– గంపా నాగేశ్వర్ రావు
సైకాలజిస్ట్, ఇంపాక్ట్ వ్యవస్థాపకులు

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: బస్తీకీ పాఠశాల ఫౌండేషన్
నైపుణ్యం: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్
స్టైపెండ్: రూ.1,500-10,000 (ఒకేసారి)
దరఖాస్తు గడువు: డిసెంబరు 3
☛ https://shorturl.at/zbaVx

రిక్రూట్‌మెంట్

సంస్థ: కోడ్‌క్రాఫ్ట్ ఐటీ సొల్యూషన్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.1,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/Jn1pT

గూగుల్ యాడ్స్ ఎక్స్‌పర్ట్

సంస్థ: కోడ్‌క్రాఫ్ట్ ఐటీ సొల్యూషన్స్
నైపుణ్యం: గూగుల్ యాడ్‌వర్డ్స్
స్టైపెండ్: రూ.1,500-2,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/ZrmVO

ద అఫర్డబుల్ ఆర్గానిక్ స్టోర్‌లో

1. డేటా ఎంట్రీ
నైపుణ్యాలు: డేటా ఎంట్రీ, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ షీట్స్ స్టైపెండ్: రూ.1,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/yCs9P

2. గ్రాఫిక్ డిజైన్
నైపుణ్యాలు: కేన్వా, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గ్రాఫిక్ డిజైన్, హిందీ మాట్లాడటం, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.1,500
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/OZhZ1

కంటెంట్ రైటింగ్

సంస్థ: ఫైనల్ రౌండ్ ఏఐ
నైపుణ్యాలు: బ్లాగింగ్, కంటెంట్ ఎడిటింగ్, క్రియేటివ్ రైటింగ్
స్టైపెండ్: రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/CYRI1

వీడియో ఎడిటింగ్/మేకింగ్

సంస్థ: ఎన్ఎల్‌టీఏ లాకిఫై ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ప్రీమియర్ ప్రో, క్యాప్‌కట్, కలర్ గ్రేడింగ్, డావిన్సీ రిసాల్వ్, ఫైనల్ కట్ ప్రో, మోషన్ గ్రాఫిక్స్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/SVDzW

జన్ ఏఐ వీడియో క్రియేషన్ (ఎడ్‌టెక్)

సంస్థ: థింక్‌ప్లస్ ఎడ్యుకేషన్ టెక్నాలజీస్ ప్రై.లి. నైపుణ్యాలు: క్రియేటివ్ రైటింగ్, జనరేటివ్ ఏఐ టూల్స్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.11,000-13,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/unind

లీడ్ జనరేషన్

సంస్థ: ఎలిత్రా ఎడ్యుఫై టెక్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: బ్రాండింగ్, లీడ్ జనరేషన్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.13,000-35,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/cIAjq


సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: లీడ్స్‌ఆర్బ్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, లీడ్ జనరేషన్
స్టైపెండ్: రూ.2,000-10,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 5
☛ https://shorturl.at/vxCxi

ఉన్నతవిద్య, కెరియర్ ఎంపికలకు సంబంధించి విద్యార్థులకూ, ఉద్యోగార్థులకూ అనుమానాలు, ఊగిసలాట సహజం. సంబంధిత సందేహాలను సకాలంలో నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా?

మీ ప్రశ్నలను మాకు పంపండి. అనుభవజ్ఞులైన నిపుణులు సమాధానాలు ఇస్తారు.

చదువు
మా చిరునామా:
చదువు
ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ -501 512
edc@eenadu.in



ప్రపంచీకరణ భారతీయ కుటుంబ వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసింది. పట్టణీకరణ, ఆధునిక జీవనశైలి, పాశ్చాత్య విధానాలపై మోజు, అన్నింటికీ మించి ఆర్థిక అంశాల వల్ల సంప్రదాయ ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. తల్లిదండ్రులు, పిల్లలు మాత్రమే ఉండే చిన్న చిన్న కుటుంబాలు పెరిగాయి. వ్యక్తివాదంతో పాటు కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర, ప్రాధాన్యం అధికమైంది. అదే సమయంలో వివాహాల తీరులో వినూత్న విధానాలు, సంబంధ బాంధవ్యాల్లో తగ్గుదల, విడాకుల రేటు పెంపు, పిల్లల్లో మానసిక సమస్యలు తదితర సామాజిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. కుటుంబ వ్యవస్థలో వచ్చిన ఈ మార్పులు, వాటి ఫలితాలు, కారణాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇందులోని అనుకూల, ప్రతికూలతలు సహా సమస్యలకు పరిష్కార మార్గాలపైనా అవగాహన కలిగి ఉండాలి.

విలువలు తరిగి.. వ్యక్తివాదం పెరిగి!

భారతీయ సమాజం

ఆధునిక కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు

'కుటుంబ వ్యవస్థలో విలువలు క్షీణిస్తున్నాయి'' అని ఇటీవల సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వివిధ విషయాలపై తల్లిదండ్రులు, పిల్లలు పరస్పరం వ్యాజ్యాలు వేసుకుంటున్నారు. ఇది 'వసుధైక కుటుంబం' అనే భావనకు భిన్నంగా 'ఒక వ్యక్తి, ఒక కుటుంబం' నడిపిస్తోంది. సంతోలా దేవి వర్సెస్ స్టేట్ ఆఫ్ ఉత్తర్‌ప్రదేశ్ అండ్ అదర్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం (2007) ప్రకారం 'వృద్ధ తల్లిదండ్రుల నిర్వహణ బాధ్యత సంతానానిదే' అంది. అదే సమయంలో తల్లిదండ్రులు ఇంట్లో నుంచి తమ పిల్లలను నెట్టివేయడాన్ని కూడా చట్టం అనుమతించదని స్పష్టం చేసింది.



భారతదేశంలో మారుతున్న కుటుంబ వ్యవస్థ: సంప్రదాయ కుటుంబాలు ఒకప్పుడు తాత, బామ్మ, అత్తమామలు, మేనకోడళ్లు, మేనల్లుళ్లు ఒకే ఇంట్లో కలిసి నివసించే బహుళ తరాలున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థగా ఉండేవి. ప్రస్తుతం చిన్న కుటుంబాలు లేదా తల్లిదండ్రులు, పిల్లలు మాత్రమే ఉంటున్నారు.

నిర్ణయాధికారం: పెద్దలు సమష్టిగా తీసుకునే నిర్ణయాలతో కూడిన పితృస్వామ్య సోపాన క్రమం గతంలో ఉండేది. ప్రస్తుతం స్త్రీ, పురుషులు కలిసి నిర్ణయం తీసుకునే సమానత్వ విధానం పెరుగుతోంది.


వివాహ ఆచారాలు: గతంలో పెద్దలు కుదిర్చిన వివాహాలే జరిగేవి. వివాహానికి ముందు వారు చర్చలు జరిపి, వంశపారంపర్యం, కుటుంబ ఐక్యతకు ప్రాధాన్యం ఇచ్చి చేసేవారు. ప్రస్తుతం ప్రేమ వివాహాలు లేదంటే వివాహం కాకముందే ఇద్దరి ఇష్టానుసారం సహజీవనం చేస్తున్న ధోరణి వచ్చేసింది. స్వలింగ భాగస్వాములు లాంటి సంప్రదాయేతర వివాహాలకూ అంగీకారం పెరుగుతోంది. (లెస్బియన్ - ఇద్దరు స్త్రీలు వివాహం చేసుకోవడం. గే - ఇద్దరు పురుషులు వివాహం చేసుకోవడం)

విలువలు: గతంలో పరస్పరం ఆధారపడటాన్ని బలపరిచే సామూహికవాదం ఉండగా, నేడు కుటుంబ విధేయత, ఐక్యత, వ్యక్తివాదం వచ్చాయి.

భారతీయ కుటుంబ వ్యవస్థలో మార్పులకు కారణాలు: ఆర్థిక అంశాలు: పట్టణీకరణ, విస్తరిస్తున్న కార్మిక మార్కెట్ డిమాండ్, పట్టణ ప్రాంతాల్లో జీవనవ్యయం పెరుగుదల, ద్వంద్వ ఆదాయ మార్గాలు.

మారుతున్న లింగ ఆధారిత పాత్ర: మహిళలకు విద్య, అధికారిక ఉపాధిలో మెరుగైన స్థానాలను అందుకోవడం లాంటివి సంప్రదాయ పితృస్వామ్య నిబంధనలను సవాలు చేస్తున్నాయి.

డింక్



డ్యుయల్ ఇన్‌కమ్ నో కిడ్స్ (DINK). అంటే వివాహం చేసుకుని, ఇద్దరూ ఆదాయ సముపార్జన చేస్తూ పిల్లలను కనడానికి నిరాసక్తతను చూపడం.

పాశ్చాత్యీకరణ: వ్యక్తివాదం మొదలైన విలువలకు ప్రాముఖ్యత ఇవ్వడం వల్ల చిన్న కుటుంబ వ్యవస్థలకు ప్రాధాన్యం పెరిగింది.

ప్రపంచీకరణ: మీడియా, సమాచార విస్తృత అనుసంధానంతో భారతీయులు ప్రపంచ సంస్కృతుల ప్రభావాలకు గురవుతున్నారు. ఫలితంగా ప్రత్యామ్నాయ కుటుంబ నమూనాలు, విలువలు వచ్చి చేరాయి. **ఉదా:** బహుళజాతి కార్పొరేషన్ (ఎంఎన్‌సీ) పని సంస్కృతులు చిన్న, సరళమైన కుటుంబాలకు అనుకూలంగా ఉంటాయి.

సాంకేతికత పాత్ర: సెల్‌ఫోన్ లాంటి సాధనాల ద్వారా మెరుగైన కమ్యూనికేషన్, కుటుంబాలు అనుసంధానమై ఉండటానికి అవకాశం లభించింది (**ఉదా.** స్కైప్, వాట్సాప్). కానీ ఇది ముఖాముఖి/ ప్రత్యక్ష సంబంధాలను తగ్గిస్తుంది. భావోద్వేగ బంధాలను ప్రభావితం చేస్తుంది.

సానుకూల ప్రభావాల



పేరెంటింగ్: తండ్రులు తమ పిల్లల పెంపకంలో ఎక్కువగా పాల్గొంటున్నారు. కేవలం ఆర్థిక ప్రదాతలుగా ఉండే సంప్రదాయ పాత్ర నుంచి దూరమవుతున్నారు.

పటిష్ఠమైన తల్లిదండ్రులు – పిల్లల బంధం: చిన్న కుటుంబాల్లో పిల్లల విద్య, వ్యక్తిగత అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడంతో బలమైన భావోద్వేగ సంబంధాలు పెంపొందుతాయి. ఇవి తల్లిదండ్రులు, పిల్లల మధ్య స్వేచ్ఛాయుత వాతావరణం, నమ్మకాన్ని ప్రోత్సహిస్తాయి.

తగ్గిన కుటుంబ సంఘర్షణ: చిన్న/ఏక కేంద్రక కుటుంబం తరతరాలుగా నియంత్రణ ఉన్న ఉమ్మడి ఆస్తికి సంబంధించిన వివాదాలను తగ్గిస్తుంది.

స్వయం ప్రతిపత్తి: వ్యక్తులు, ముఖ్యంగా మహిళలు, స్వతంత్ర జీవితాన్ని గడుపుతున్నారు.

ప్రతికూల ఫలితాలు

తరాల మధ్య సంఘర్షణలు: తల్లిదండ్రులు, పిల్లల మధ్య విలువలు, జీవనశైలిలో తేడాలు (తరాల అంతరం), సాంకేతిక పురోగతి వల్ల తీవ్రతరమవుతాయి. ఇవి అపార్థాలు, గొడవలకు దారితీస్తున్నాయి.

వృద్ధుల ఒంటరితనం: పెరుగుతున్న చిన్న కుటుంబాల కారణంగా వృద్ధులు ఒంటరితనం, శక్తిహీనత, నిరాశకు గురవుతున్నారు.

పిల్లల అభివృద్ధిపై ప్రభావం: తాత, నాన్నమ్మ/అమ్మమ్మలు తమ సంతానాన్ని చూసుకోవడానికి, ప్రేమ, ఆప్యాయత పంచడానికి అందుబాటులో లేకపోవడం వల్ల మొత్తం కుటుంబంపై ముఖ్యంగా పిల్లల మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. అదనపు పనిభారం కారణంగా తల్లిదండ్రులు పిల్లలను జాగ్రత్తగా చూసుకోలేకపోతున్నారు.

విడాకుల రేటు పెరగడం: పాశ్చాత్య విలువలు భారతదేశంలో విడాకుల రేటును పెంచడంలో ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతున్నాయి. ఉదాహరణకు గత పదేళ్లలో విడాకుల రేటు 13 రెట్లు పెరిగినట్లు ఫోర్బ్స్ నివేదిక వెల్లడించింది.



మహిళలపై పెరిగిన భారం: ఆధునిక కుటుంబ పోకడలు మహిళలకు రెండు రకాల బాధ్యతలను పెంచాయి. ఇంటిపని, కార్యాలయ విధులు నిర్వర్తించే మహిళలు ఒత్తిడితో సతమతమవుతున్నారు. ఉదాహరణకు భారతదేశంలో మహిళలు రోజుకు ఐదు గంటలు వేతనం లేని గృహసేవలకు కేటాయిస్తుంటే, పురుషులు కేవలం 1.5 గంటలే ఇంటి పనులు చేస్తున్నారు (ఎన్ఎస్ఎస్ నివేదిక, 2019). భారత కుటుంబ వ్యవస్థపై ప్రపంచీకరణ ప్రభావం దేశవ్యాప్తంగా ఒకేలా లేదు. గ్రామీణ ప్రాంతాలు, సాంప్రదాయిక సమాజాల్లో ఈ మార్పులు పట్టణ ప్రాంతాలు, ప్రగతిశీల వర్గాలతో పోలిస్తే నెమ్మదిగా వస్తున్నాయి. స్థూలంగా చూస్తే 21వ శతాబ్దంలో ప్రపంచీకరణ భారతీయ కుటుంబ వ్యవస్థను గణనీయంగా మార్చింది.

పరిష్కార మార్గాలు


కుటుంబ న్యాయస్థానాల చట్టం, 1984: ఇది దేశమంతటా వర్తిస్తుంది. దీని ప్రకారం ఏర్పాటైన కుటుంబ న్యాయస్థానాల్లో కుటుంబ వివాదాలు పరిష్కరించుకోవచ్చు.

విద్య, సామాజిక అవగాహన: కుటుంబ సానుభూతిని పెంపొందించే విధంగా విద్యావిధానం ఉండాలి. విలువలు, భావోద్వేగ నియంత్రణ, మానసిక సామర్థ్యాన్ని పెంపొందించే రీతిలో పాఠ్యాంశాలను రూపొందించాలి. బహుళ తరాలు ఒకేచోట నివసించే గృహ ప్రాజెక్టులను ప్రోత్సహించాలి. ప్రభుత్వాలు కూడా ఒకటి, రెండు పడక గదుల ఇళ్లకు బదులుగా ఉమ్మడి కుటుంబం నివసించే ఇళ్లు కట్టించాలి.



'కుటుంబ భావన' ను పునర్నిర్వచించడం: ఒంటరి తల్లిదండ్రులు, ఒంటరిగా నివసిస్తున్న వృద్ధులకు వసతి కల్పించేందుకు రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలి.

☛ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం (2007)ను సమర్థంగా అమలు చేయాలి. ఇది తల్లిదండ్రుల సంరక్షణ చూడని పిల్లలను చట్టబద్ధంగా బాధ్యులను చేయవచ్చని నిర్దేశిస్తోంది. అలాగే వృద్ధులకు ఉచిత న్యాయసాయం అందిస్తుంది.



జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్): ఈ పథకాన్ని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారి కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తోంది. కుటుంబంలోని ప్రధాన ఆర్జనాపరుడు చనిపోతే మరణానికి కారణం ఏదైనా సరే ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తారు. అయితే చనిపోయిన వ్యక్తి (అతను/ఆమె) వయసు 18 - 60 సంవత్సరాల్లోపు ఉండాలి.

☛ కేరళలో కుటుంబశ్రీ అనే పథకం వృద్ధులు, మహిళలకు సంరక్షణను అందిస్తోంది.



రచయిత:
బద్దం పురుషోత్తం రెడ్డి

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

✦ చైనాలోని బీదైహేలో జరిగిన 2025 స్పీడ్ స్కేటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత్‌కు తొలి స్వర్ణపతకం సాధించిన క్రీడాకారుడిగా ఎవరు ఘనత సాధించారు?



జ: ఆనంద్ కుమార్ వెల్‌కుమార్ (ఆనంద్ సీనియర్ పురుషుల 1000 మీటర్ల స్ప్రింట్‌లో స్వర్ణం నెగ్గాడు. దీంతో పాటు జూనియర్ 1000 మీటర్ల స్ప్రింట్‌లో ఆనంద్ కుమార్‌తో కలిసి క్రిష్ శర్మ స్వర్ణం సాధించాడు.)

✦ భారత్ అధికారికంగా ఎంత మొత్తం శిలాజేతర ఇంధన విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించినట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది? **జ:** 250 గిగావాట్లు (2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధనమంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు.)

✦ హిందీ దివస్‌ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: సెప్టెంబరు 14

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?



☛ రైట్స్ లిమిటెడ్‌లో 600 సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ ఖాళీలు
చివరి తేదీ: 2025, నవంబరు 12.

☛ రైల్వే వికాస్ నిగమ్ లిమిటెడ్‌లో మేనేజర్ పోస్టులు
చివరి తేదీ: 12.11.2025.

డిజిటల్ వ్యూహకర్త కావాలనుకుంటున్నారా..! **డిజిటల్ స్కిల్స్**



రోజూ చూసే అనేక వెబ్‌సైట్లు, సోషల్ మీడియా, ఎస్ఈఓ తదితరాలన్నీ డిజిటల్ మార్కెటింగ్‌లో భాగాలే. ఇవన్నీ విజయవంతంగా నడుస్తుండటం వెనుక పక్కా డిజిటల్ వ్యూహం ఉంటుంది. డిజిటల్ స్ట్రాటజిస్టులు కొత్త ఆలోచనలతో, పద్ధతులతో టూల్స్‌ను ఉపయోగించి మార్కెటింగ్ కంటెంట్‌ను తయారుచేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తుంటారు. సంస్థ ఉత్పత్తిని డిజిటల్ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లడమే వీరి ప్రధాన లక్ష్యం. కొత్త కెరియర్ మార్గంగా అవతరించిన ఈ అవకాశాన్ని ఏవిధంగా అందిపుచ్చుకోవాలి, అందుకు ఎలాంటి అర్హతలను పెంచుకోవాలి, ఎలాంటి లక్షణాలు ఉంటే ఇందులో రాణిస్తారో తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

కేంద్రం ఆదేశాలను రాష్ట్రం ధిక్కరిస్తే..!

సమాఖ్య వ్యవస్థ ఉన్న మన దేశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆధిక్యతను ఇస్తున్న అంశాల్లో రాష్ట్రపతి పాలన కీలకమైంది. రాష్ట్రాల్లో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైనప్పుడు, రాజ్యాంగబద్ధ పాలన కష్టమైనప్పుడు గవర్నర్ నివేదిక ఆధారంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంటుంది. రాజ్యాంగంలో ఈ నిబంధన చేర్చడం వెనుక రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశాలు, సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు, ఆచరణలో అమలైన తీరుతెన్నులను పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. తెలుగునాట ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం నుంచి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు వరకు రాష్ట్రపతి పాలన విధించిన సందర్భాలు, కొనసాగిన కాలం, ఇందుకు దారితీసిన కారణాలను గుర్తుంచుకోవాలి. ఆర్థిక అత్యవసర పరిస్థితిని ఎలాంటి సందర్భాల్లో విధిస్తారు, దాని పరిణామాలు ఎలా ఉంటాయో అవగాహన ఉండాలి.



రాష్ట్రపతి భవన్

ఇండియన్ పాలిటీ

రాష్ట్రపతి పాలన - ఆర్థిక అత్యవసర పరిస్థితి

1. రాష్ట్రపతి పాలన/రాజ్యాంగ అత్యవసర పరిస్థితి గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
   1) 18వ భాగం, ఆర్టికల్ 352
   2) 18వ భాగం, ఆర్టికల్ 356
   3) 19వ భాగం, ఆర్టికల్ 361
   4) 20వ భాగం, ఆర్టికల్ 365

2. ఏదైనా రాష్ట్రంలో ఏ సందర్భంలో రాష్ట్రపతి పాలనను విధిస్తారు?
   ఎ) ఆ రాష్ట్రంలో రాజ్యాంగ యంత్రాంగం విఫలమైనప్పుడు
   బి) రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి తలెత్తినప్పుడు
   సి) తరచూ రాష్ట్ర ప్రభుత్వాలు పడిపోతున్నప్పుడు
   డి) ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రపతి పాలన విధించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నివేదిక ఇచ్చినప్పుడు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

3. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.
   ఎ) ఆర్టికల్ 356(1) ప్రకారం 'రాష్ట్రపతి పాలన'ను రాష్ట్రపతి విధిస్తారు.
   బి) ఆర్టికల్ 356(2) ప్రకారం రాష్ట్రపతి పాలనను రాష్ట్రపతి ఎప్పుడైనా రద్దు చేయవచ్చు.
   సి) ఆర్టికల్, 356(3) ప్రకారం పార్లమెంటు ఆమోదంతో మాత్రమే రాష్ట్రపతి పాలన అమల్లోకి వస్తుంది.
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

4. రాష్ట్రపతి జారీ చేసిన 'రాష్ట్రపతి పాలన/రాజ్యాంగ అత్యవసర పరిస్థితి' ప్రకటనను పార్లమెంటు ఎన్ని రోజుల్లోగా సాధారణ మెజార్టీతో ఆమోదిస్తే అది అమల్లోకి వస్తుంది?
   1) 15 2) 30 3) 60 4) 90

5. రాష్ట్రపతి పాలన కాలపరిమితికి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) పార్లమెంటు ఆమోదిస్తే ఆరు నెలలు కొనసాగుతుంది.
   బి) పార్లమెంటు ఆమోదంతో ఆరు నెలలకోసారి చొప్పున గరిష్ఠంగా ఎంత కాలమైనా కొనసాగించవచ్చు.
   సి) పార్లమెంటు ఆమోదంతో ఆరు నెలలకోసారి చొప్పున గరిష్ఠంగా మూడేళ్లు కొనసాగించవచ్చు.
   1) ఎ, సి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, బి, సి

6. ఏదైనా రాష్ట్రంలో ఆర్టికల్ 356 ప్రకారం విధించిన రాష్ట్రపతి పాలనను మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం కొనసాగించాలంటే అనుసరించాల్సిన పద్ధతిని గుర్తించండి.
   1) పార్లమెంటు ప్రత్యేక మెజార్టీతో ఒక తీర్మానాన్ని ఆమోదించాలి.
   2) రాష్ట్రపతి ఆర్డినెన్స్‌ను జారీ చేయాలి.
   3) రాజ్యాంగ సవరణ చేయాలి.
   4) కేంద్ర మంత్రిమండలి ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించాలి.

7. రాష్ట్రపతి పాలన విధించిన రాష్ట్రంలో సంభవించే మార్పును గుర్తించండి.
   ఎ) ముఖ్యమంత్రి నాయకత్వంలోని రాష్ట్ర మంత్రిమండలి వెంటనే రద్దవుతుంది.
   బి) రాష్ట్ర శాసనసభను పూర్తిగా రద్దు చేయవచ్చు లేదా సుప్త చేతనావస్థలో ఉంచవచ్చు.
   సి) రాష్ట్ర బడ్జెట్‌ను, రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను పార్లమెంటు ఆమోదిస్తుంది.
   డి) ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తారు.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి


8. రాష్ట్రపతి పాలన కొనసాగుతున్న రాష్ట్రంలో పరిపాలనను ఎవరు నిర్వహిస్తారు?
   1) ఆపద్ధర్మ ముఖ్యమంత్రి
   2) కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి
   3) గవర్నర్ 4) ప్రధానమంత్రి

9. రాష్ట్రపతి పాలనకు సంబంధించి కింది వాటిలో సరైన సమాధానాన్ని గుర్తించండి.
   ఎ) రాష్ట్ర జాబితాలోని అంశాలపై శాసనాలు రూపొందించే అధికారం పార్లమెంటుకు లభిస్తుంది.
   బి) పార్లమెంటు సమావేశాలు అందుబాటులో లేనప్పుడు రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన అంశాలపై రాష్ట్రపతి ఆర్డినెన్స్‌ను జారీ చేస్తారు.
   సి) హైకోర్టు అధికారాల్లో ఎలాంటి మార్పులు ఉండవు
   1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

10. ఏ రాష్ట్రంలో 59వ రాజ్యాంగ సవరణ చట్టం–1988, 68వ రాజ్యాంగ సవరణ చట్టం–1991 ద్వారా మూడేళ్ల తర్వాత కూడా రాష్ట్రపతి పాలన కొనసాగించారు?
    1) పంజాబ్ 2) కేరళ
    3) ఉత్తర్‌ప్రదేశ్ 4) మహారాష్ట్ర

11. మత సంస్థలపై నిషేధం పాటించాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదనే కారణంతో 1992లో బీజేపీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాల్లో పి.వి.నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టికల్ 356 ద్వారా రాష్ట్రపతి పాలన విధించింది?
    1) ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్
    2) మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్
    3) ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
    4) గుజరాత్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్

12. లౌకికవాదం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగం అని, లౌకికవాదం కారణంతో రాష్ట్రపతి పాలన విధించడం సమంజసమేనని ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది?



ఎస్.ఆర్.బొమ్మై

    1) ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1994)
    2) చంద్రమోహన్ ఖన్నా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1992)
    3) షీలాబర్సె వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1987)
    4) షందాసాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు (1951)

13. మన దేశంలో తొలిసారిగా ఆర్టికల్ 356ను ఏ రాష్ట్రంపై ప్రయోగించారు?
    1) కేరళ (1951) 2) రాజస్థాన్ (1952)
    3) పంజాబ్ (1951) 4) కర్ణాటక (1951)

14. ఆర్టికల్ 356 ప్రకారం విధించిన రాష్ట్రపతి పాలనకు సంబంధించిన మార్గదర్శకాలను ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో వెలువరించింది. సుప్రీంకోర్టు వెలువరించిన మార్గదర్శకాల్లో సరైన జవాబును గుర్తించండి.




    ఎ) రాష్ట్రపతి పాలన న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుంది.
    బి) రాష్ట్రపతి పాలనను సహేతుక కారణాలతోనే విధించామని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.
    సి) కేంద్రంలో నూతన పార్టీ అధికారం చేపట్టాక ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై ఆర్టికల్ 356ను ప్రయోగించడం సమంజసం కాదు.
    డి) రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో విశ్వాసం కోల్పోయిందా? లేదా అనేది శాసనసభ వేదికగానే నిర్ణయించాలి.
    1) ఎ, బి, సి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

15. సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో ఇచ్చిన తీర్పుల ఆధారంగా ఏ సందర్భంలో ఒక రాష్ట్రంపై ఆర్టికల్ 356ను ప్రయోగించి రాష్ట్రపతి పాలనను విధించవచ్చు?
    ఎ) రాష్ట్ర శాసనసభకు జరిగిన సాధారణ ఎన్నికల అనంతరం ఏ రాజకీయ పార్టీకి పూర్తి మెజార్టీ రాకుండా హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు.
    బి) రాష్ట్ర శాసనసభలో అవిశ్వాస తీర్మానం నెగ్గడం వల్ల మంత్రివర్గం రాజీనామా చేసి, ఏ ఇతర రాజకీయ పార్టీకి మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసే మెజార్టీ లేనప్పుడు.
    సి) రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన రాజ్యాంగపరమైన సూచనలు, ఆదేశాలు పాటించకుండా ధిక్కరించినప్పుడు.
    1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

16. జనతా పార్టీ ప్రభుత్వం 1977లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్ని రాష్ట్రాల్లో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఆర్టికల్ 356ను ప్రయోగించి రాష్ట్రపతి పాలన విధించింది?
    1) 9 2) 6 3) 5 4) 4

17. 1980లో ఇందిరా గాంధీ నేతృత్వంలో కేంద్రంలో తిరిగి అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెసేతర ప్రభుత్వాలపై ఆర్టికల్ 356ను ప్రయోగించి రాష్ట్రపతి పాలన విధించింది?
    1) 9 2) 4 3) 3 4) 2

18. ఆంధ్ర రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధింపునకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) మద్యపాన నిషేధ చట్టం అమలు విషయమై చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో అప్పటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పదవికి రాజీనామా చేశారు.
    బి) అప్పటిగవర్నర్ చందూలాల్ మాధవ్‌లాల్‌త్రివేది రాష్ట్రపతిపాలన విధించాలని కేంద్రానికి నివేదిక పంపారు.
    సి) 1954, నవంబరు 15 నుంచి.. 1955, మార్చి 29 వరకు రాష్ట్రపతి పాలన కొనసాగింది.
    డి) డా.బాబూ రాజేంద్రప్రసాద్ ఆర్టికల్ 356 ను ప్రయోగించారు.



సి.ఎం.త్రివేది

    1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

19. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధించిన (1973లో) రాష్ట్రపతి పాలనకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) జై ఆంధ్ర ఉద్యమం నేపథ్యంలో 1973 లో అల్లర్లు చెలరేగాయి.
    బి) అప్పటి ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు పదవికి రాజీనామా చేశారు.
    సి) అప్పటి గవర్నర్ ఖండూభాయ్ కసంజీ దేశాయ్ రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి నివేదిక పంపారు.
    డి) 1973, జనవరి 11 నుంచి.. 1973 డిసెంబరు 10 వరకు రాష్ట్రపతి పాలన కొనసాగింది.
    1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

20. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014లో విధించిన రాష్ట్రపతి పాలనకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
    ఎ) ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాల నేపథ్యంలో ఆందోళనలు జరిగాయి.
    బి) రాజకీయ అనిశ్చితిని నియంత్రించేందుకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి పదవికి రాజీనామా చేశారు.
    సి) అప్పటి గవర్నర్ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రానికి నివేదించారు.
    డి) రాష్ట్రపతి పాలన 2014, మార్చి 1 నుంచి.. 2014, ఏప్రిల్ 30 వరకు కొనసాగింది.
    1) ఎ, సి, డి 2) ఎ, బి, సి
    3) ఎ, బి, డి
    4) ఎ, బి, సి, డి



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు


1-2; 2-1; 3-4; 4-3; 5-1; 6-3; 7-2; 8-3; 9-4; 10-1; 11-2; 12-1; 13-3; 14-4; 15-4; 16-1; 17-1; 18-4; 19-4; 20-4.

ఈనాడు ప్రతిభ

■ e-mail: support@epratibha.net

గోళం

త్రిపరిమాణ అంతరాళంలో ఒక దత్తబిందువు నుంచి స్థిర దూరంలో ఉన్న బిందు సమితిని గోళం అంటారు. ఒక వృత్తాకారాన్ని వ్యాసం ఆధారంగా తిప్పితే గోళాకారం ఏర్పడుతుంది. గోళాన్ని కేంద్రం మీదుగా రెండు సమాన భాగాలుగా విభజిస్తే, ఒక్కో సమభాగాన్ని అర్ధగోళం అంటారు.




గోళం   అర్ధగోళం

గోళం ఉపరిత వైశాల్యం $= 4\pi r^2$

గోళం ఘనపరిమాణం $= \frac{4}{3}\pi r^3$

అర్ధగోళం పక్కతల వైశాల్యం $= 2\pi r^2$

అర్ధగోళం సంపూర్ణతల వైశాల్యం $= 3\pi r^2$



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

నీరు బయటికి వెళ్లేందుకు వేయాల్సిన గోళీల సంఖ్య?

మాదిరి ప్రశ్నలు

1. ఒక గోళ వ్యాసార్ధం 3.5 సెం.మీ అయితే ఆ గోళ ఉపరితల వైశాల్యం ఎంత?

1) 77 చ.సెం.మీ.   2) 154 చ.సెం.మీ.

3) 42.5 చ.సెం.మీ.   4) 308 చ.సెం.మీ.

సాధన: గోళ వ్యాసార్ధం $r = 3.5$ సెం.మీ. $= \frac{7}{2}$ సెం.మీ.

గోళ ఉపరితల వైశాల్యం $= 4\pi r^2$

$= 4 \times \frac{22}{7} \times \frac{7}{2} \times \frac{7}{2} = 154$ చ.సెం.మీ.

సమాధానం: 2

2. ఒక గోళ ఉపరితల వైశాల్యం 616 చ.సెం.మీ. అయితే ఆ గోళ వ్యాసం ఎన్ని సెం.మీ. ఉంటుంది?

1) 14   2) 7   3) 3.5   4) 28

సాధన: గోళ ఉపరితల వైశాల్యం $4\pi r^2 = 616$

$4 \times \frac{22}{7} \times r^2 = 616$

$r^2 = 616 \times \frac{7}{4 \times 22}$

$r = 7$ సెం.మీ.

వ్యాసం $d = 14$ సెం.మీ.

సమాధానం: 1

3. రెండు గోళాల ఉపరితల వైశాల్యాలు 121 : 144 నిష్పత్తిలో ఉంటే వాటి వ్యాసార్ధాల నిష్పత్తి?

1) 11 : 12   2) 12 : 14   3) 9 : 8   4) 7 : 6

సాధన: $\frac{4\pi r_1^2}{4\pi r_2^2} = \frac{121}{144}$

$\frac{r_1}{r_2} = \sqrt{\frac{121}{144}} = \frac{11}{12} = 11 : 12$

సమాధానం: 1

4. వ్యాసార్ధం 5 సెం.మీ., లోతు 4 సెం.మీ. కలిగిన ఒక శంకువు ఆకారపు పాత్ర నిండా నీళ్లు నింపారు. ఇందులో 0.5 సెం.మీ. వ్యాసార్ధం ఉన్న గోళాకారపు గోళీలను ఎన్ని వేస్తే పాత్రలోని నీరు 4వ వంతు బయటికి పోతుంది?

1) 25   2) 50   3) 75   4) 100

సాధన: శంకువు వ్యాసార్ధం $r = 5$ సెం.మీ.

శంకువు లోతు (ఎత్తు) $h = 4$ సెం.మీ.

గోళ వ్యాసార్ధం $r = 0.5 = \frac{1}{2}$ సెం.మీ.

ఒక్కొక్క గోళం ఘనపరిమాణం $= \frac{4}{3}\pi r^3$

$= \frac{4}{3}\pi \times \frac{1}{2} \times \frac{1}{2} \times \frac{1}{2} = \frac{\pi}{6}$ సెం.మీ.

$x \times$ గోళ ఘనపరిమాణం $= \frac{1}{4} \times$ శంకువు ఘనపరిమాణం

$x \times \frac{\pi}{6} = \frac{1}{4} \times \frac{1}{3} \times \pi r^2 h$

$x \times \frac{\pi}{6} = \frac{1}{12} \times \pi \times 5 \times 5 \times 4$

$x = \frac{6}{12} \times 5 \times 5 \times 4 = 50$

50 గోళీలు వేస్తే 4వ వంతు నీరు బయటకు వస్తుంది.

సమాధానం: 2

5. రెండు గోళాల ఘనపరిమాణాలు 27 : 125 నిష్పత్తిలో ఉన్నాయి. వీటి వ్యాసార్ధాల మొత్తం 40 సెం.మీ. అయితే ఆ వ్యాసార్ధాల విలువలు?

1) 14, 28   2) 15, 25   3) 9, 15   4) 15, 20

సాధన: $\frac{V_1}{V_2} = \frac{\frac{4}{3}\pi r_1^3}{\frac{4}{3}\pi r_2^3} = \frac{27}{125} \Rightarrow \frac{r_1}{r_2} = \frac{3}{5}$

$r_1 + r_2 = 3x + 5x = 40 \Rightarrow 8x = 40 \Rightarrow x = 5$

$\therefore 3 \times 5 = 15$

$5 \times 5 = 25$

వ్యాసార్ధాలు 15, 25

సమాధానం: 2

6. ఒక గోళం వ్యాసం 21 సెం.మీ. దాన్ని కరిగించి 1 సెం.మీ. భుజం ఉన్న ఘనాలుగా మార్చితే ఎన్ని ఘనాలు తయారు చేయవచ్చు?

1) 4851   2) 4951   3) 4651   4) 4751

సాధన: ఘనాల సంఖ్య $= \frac{\text{గోళ ఘనపరిమాణం}}{\text{ఘనం ఘనపరిమాణం}}$

$= \frac{\frac{4}{3}\pi r^3}{a^3} = \frac{\frac{4}{3} \times \frac{22}{7} \times \frac{21}{2} \times \frac{21}{2} \times \frac{21}{2}}{1 \times 1 \times 1}$

$= 4851$

సమాధానం: 1

7. రెండు గోళాల ఘనపరిమాణాలు 8 : 27 నిష్పత్తిలో ఉన్నాయి. అయితే వాటి వ్యాసార్ధాల నిష్పత్తి?

1) 3 : 2   2) 2 : 3

3) 4 : 3   4) 3 : 4

సాధన: $\frac{V_1}{V_2} = \frac{8}{27} = \frac{\frac{4}{3}\pi r_1^3}{\frac{4}{3}\pi r_2^3} = \frac{\pi r_1^3}{\pi r_2^3} = \frac{8}{27}$

$= \frac{r_1}{r_2} = \frac{2}{3}$

$r_1 : r_2 = 2 : 3$

సమాధానం: 2

8. రెండు గోళాల వ్యాసార్ధాల నిష్పత్తి 4 : 7. అయితే వాటి ఉపరితల వైశాల్యాల నిష్పత్తి?

1) 64 : 343   2) 16 : 49

3) 4 : 7   4) 8 : 21

సాధన: వ్యాసార్ధాలు

$4r_1, 7r_2$ అయితే

ఉపరితల వైశాల్యాల నిష్పత్తి

$= \frac{4\pi (4r)^2}{4\pi (7r)^2} = \frac{16}{49}$

$= 16 : 49$

సమాధానం: 2



రచయిత

హెచ్. అరుణ శివప్రసాద్, విషయ నిపుణులు

Word of the Day

826 *Opprobrium*

Telugu meaning: నింద, అవమానం

English meaning: The word opprobrium (అప్రోబ్రియం) is a noun that refers to harsh criticism, public disgrace, or shame arising from one's actions.

Synonyms: Disgrace, Shame   ***Antonyms:*** Praise, Honour

Usage: **1.** The scandal brought great opprobrium upon the company and its leaders.

2. He faced public opprobrium for his unethical behaviour during the investigation.

కరెంట్ అఫైర్స్



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర విశ్రాంత ఆచార్యుడు రాజూరు రామకృష్ణారెడ్డి యునైటెడ్ కింగ్‌డమ్‌లోని 'రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ' అనే సంస్థ ఫెలోగా ఎంపికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 55 వేల మంది ఇందులో సభ్యులుగా ఉంటారు. అసాధారణ పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు ఇందులో చోటు దక్కుతుంది. సైద్ధాంతిక, భౌతిక, పర్యావరణ శాస్త్రాల్లో రామకృష్ణారెడ్డి పరిశోధనలు చేశారు. ఆయా రంగాల్లో 244 పరిశోధన ప్రతులు, గూగుల్ సైటేషన్స్ 6439, ఐ10 ఇండెక్స్ 125, హెచ్ ఇండెక్స్ 45 పొందారు.



ఫుజియాన్ పేరుతో తన మూడో విమాన వాహక నౌకను చైనా లాంఛనంగా నేవీలో చేర్చింది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో చేసిన ఈ విమాన వాహక నౌకను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హైనాన్ ప్రావిన్స్‌లోని సాన్యా రేవు వద్ద ప్రారంభించారు. విమాన వాహకనౌక డెక్ నుంచి యుద్ధవిమానాలను వేగంగా, సాఫీగా నింగిలోకి పంపడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇలాంటి వ్యవస్థ.. అమెరికాకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌లో మాత్రమే ఉంది. ఫుజియాన్ బరువు 80వేల టన్నులు. పొడవు 316 మీటర్లు. దీనికి దాదాపు 50 విమానాలను మోసుకెళ్లే సామర్థ్యం ఉంది.


దేశీయంగా రూపొందించిన తేలికపాటి యుద్ధవిమానం 'తేజస్' కోసం 113 జెట్ ఇంజిన్ల కొనుగోలుకు అమెరికాకు చెందిన జీఈ ఏరోస్పేస్‌తో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) 2025, నవంబరు 7న కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని విలువ రూ.8,870 కోట్లు. దీనికింద ఎఫ్404-జీఈ-ఐఎన్20 శ్రేణి ఇంజిన్లను భారత్‌కు జీఈ అందిస్తుంది.

మహిళల వన్డే ప్రపంచకప్‌లో పోటీపడే జట్ల సంఖ్యను 10కి పెంచాలని ఐసీసీ నిర్ణయించింది. 2029లో ఈ జట్ల మధ్య మెగా టోర్నీ జరుగుతుంది. ప్రస్తుతం ఎనిమిది జట్లు ఆడుతున్నాయి. ఇటీవల జరిగిన మహిళల ప్రపంచకప్‌ను దాదాపు 3 లక్షల మంది అభిమానులు స్టేడియాలకు వచ్చి మ్యాచ్‌లను వీక్షించారు. డిజిటల్ వేదికలో 500 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. అందుకే 2029 ప్రపంచకప్‌లో పది జట్లను ఆడించాలని నిర్ణయించినట్లు ఐసీసీ పేర్కొంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

శాంతి - అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం

సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్రను గుర్తించడంతోపాటు దాని వల్ల కలిగే దుష్ప్రభావాలపైనా ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా **నవంబరు 10న 'శాంతి - అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం'**గా (World Science Day For Peace And Development) నిర్వహిస్తారు. విజ్ఞానశాస్త్రంలో ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలను తెలియజేయడం; శాంతిని పెంపొందించడంలో, స్థిరమైన సమాజాలను నిర్మించడంలో సైన్స్ పాత్రను చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



సైన్స్ (విజ్ఞానశాస్త్రం) - చరిత్ర

విశ్వంలో దాగి ఉన్న రహస్యాలు, నిజాలు, కారణాలను తెలుసుకోవడానికి ఉపయోగపడే మార్గమే విజ్ఞానశాస్త్రం. ఇది విలువలతో కూడి ఉంటుంది.

✦ విజ్ఞానశాస్త్ర నిర్మాణం అనేది ప్రకృతిలోకి అన్వేషణ, శాస్త్ర ప్రక్రియలు, శాస్త్ర పరిజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది.

నవంబరు 10 చరిత్రలో ఈనాడు

✦ మానవ అభివృద్ధి పరిణామ క్రమంలోనే సైన్స్ కూడా వృద్ధి చెందుతూ వస్తోంది. ప్రాచీన శిలాయుగానికి చెందిన 'నియాండెర్తల్' పురాతన మనిషి నుంచి ప్రస్తుత 'హోమో సెపియన్స్' దాకా ప్రతి అంశంలోనూ మనం దీన్ని గమనించొచ్చు.

✦ సైద్ధాంతిక విజ్ఞానశాస్త్రం గ్రీకుల కాలంలో అభివృద్ధి చెందింది.

చారిత్రక నేపథ్యం


విజ్ఞానశాస్త్రం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు దేశాలు, ప్రాంతాల మధ్య తలెత్తుతున్న సంఘర్షణలను రూపుమాపి, శాంతిని నెలకొల్పేలా శాస్త్రవేత్తల మధ్య సహకారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏటా నవంబరు 10న 'శాంతి - అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం'గా జరుపుకోవాలని యునెస్కో జనరల్ అసెంబ్లీ 2001లో తీర్మానించింది.

'శాంతి - అభివృద్ధి కోసం ప్రపంచ సైన్స్ దినోత్సవం' 2025 నినాదం ఏమిటి? గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారతదేశ ర్యాంక్ ఎంత? తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

పట్టణీకరణ

ప్రజలు గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వలస వెళ్లడాన్ని పట్టణీకరణ అంటారు. ప్రతిసారీ గ్రామీణ ప్రాంతాల నుంచి వలస వచ్చిన ప్రజల వల్లే పట్టణం అనేది ఏర్పడకపోవచ్చు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా లేదా సహజంగా మానవ నివాసాల సాంద్రత పెరగడం వల్ల కూడా ఇవి ఏర్పడతాయి.



పట్టణీకరణ

నగరీకరణ లేదా పట్టణీకరణ అనే పదాన్ని స్పానిష్ దేశానికి చెందిన సివిల్ ఇంజినీర్ ఇల్‌డెఫాన్స్ సెర్డా (Ildefons Cerda) 1867లో తాను రచించిన General Theory of Urbanizationలో ఉపయోగించారు.

పట్టణీకరణ - కారణాలు

అన్ని రకాల భౌగోళిక ప్రాంతాల మాదిరిగా కాకుండా పట్టణ కేంద్రం అనేది సహజంగానో లేదా ఉద్దేశపూర్వకంగానో అభివృద్ధి చెందుతుంది.

❖ పట్టణ ప్రక్రియ అనేది ఆధునికీకరణ, వాణిజ్యీకరణ, పారిశ్రామికీకరణ, గ్రామీణ పట్టణ పరివర్తన లాంటి అనేక సామాజిక, ఆర్థిక కారకాలపై ఆధారపడి ఉంటుంది.

❖ పట్టణీకరణకు ఈ కారకాల వెనక చోదకశక్తులుగా పనిచేసే అనేక పుష్ - పుల్ కారకాలు ఉంటాయి.

భారతదేశంలో మెగా సిటీలు; పట్టణీకరణ - సానుకూల, ప్రతికూల ప్రభావాలు; పట్టణీకరణ - విధానం, లక్ష్యాలు; స్మార్ట్ సిటీస్ మిషన్‌లోని మౌలికాంశాలు; స్మార్ట్ అనువర్తనాలు - ఉదాహరణలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident Jobs

All India Institute of Medical Sciences (AIIMS) in Raebareli is conducting interviews for the Senior Resident posts on a temporary basis. Total no.of post is149. Candidates will be selected based on interview. Interview will conducted on 12 December 2025.

Ph.D Admissions

Biotechnology Research and Innovation Council-National Centre for Cell Science, Pune, Maharashtra invites applications for Ph.D admissions for March 2026 session. Shortlisting of candidates for Interview will be based on their JGEEBILS cut-off score set by NCCS. Last date for applications is 9 December 2025.

Young Professional Jobs

Competition Commission of India, New Delhi is inviting applications for the Young Professionals posts on contract basis. Total no.of post is 14. Last date for applications is 1 December 2025.

Technical Assistant Jobs

Council of Scientific & Industrial Research, National Institute of Oceanography (CSIR-NIO), Goa invites applications for filling up the Technical Assistant posts in various departments on contractual basis. Total no.of post is 24. Last date for online applications is 2 December 2025.

Apprentice Posts

Defence Institute of Bio-Energy Research (DIBER) invites applications for the Apprentice posts for the year 2025-26. Total no.of post is 18. Last date for application is 16 November 2025.

For more information and other notifications - scan QR code

SSC Exams

English

Phrasal Verbs

Directions (Qs. 1 - 25): *Select the most appropriate phrasal verb to fill the blank in the given sentence.*

1. The teacher asked the students to ...... the assignments before Friday.
A) give in   B) call off
C) take up   D) turn in

2. The lights ...... suddenly during the storm.
A) went out   B) broke down
C) took off   D) ran over

3. The company plans to ...... 100 new employees this year.
A) bring about   B) put off
C) take on   D) set aside

4. The thief managed to ...... the police for several days.
A) get away from   B) look after
C) run over   D) call up

5. The principal decided to ...... the rule after several complaints from students.
A) bring back   B) do away with
C) look into   D) go over

6. The teacher asked the students to ...... the paragraph carefully.
A) look into   B) take up
C) set up   D) go through

7. The manager decided to ...... the meeting due to lack of time.
A) give up   B) carry out
C) call off   D) turn out

8. The old man ...... his illness bravely and recovered soon.
A) gave away   B) fought through
C) turned down   D) set off

9. The shopkeeper tried to ...... the customers with fake products.
A) take in   B) put out
C) give up   D) call back

10. The government is determined to ...... corruption completely.
A) cut down   B) put up with
C) wipe out   D) bring in

11. The soldiers ...... their mission successfully despite the dangers.
A) took over   B) gave up
C) broke into   D) carried out

12. He was so tired that he ...... as soon as he lay down.
A) broke down   B) dropped off
C) turned up   D) ran out

13. The company has decided to ...... its outdated equipment.
A) get rid of   B) put off
C) take in   D) run over

14. She had to ...... her vacation plans due to urgent office work.
A) put aside   B) set out
C) bring about   D) call off

15. The teacher asked the students to ...... the meaning of the new words.
A) give out   B) take over
C) look up   D) come by

16. The athlete was ...... from the competition for violating the rules.
A) turned down   B) thrown out
C) brought up   D) taken over

17. He promised to ...... the truth no matter what happens.
A) bring out   B) hold on to
C) carry on   D) give away

18. The manager ...... the proposal after reviewing it thoroughly.
A) broke in   B) went over
C) took off   D) turned down

19. The children ...... a plan to surprise their teacher.
A) gave away   B) looked up
C) came up with   D) ran out

20. The new policy will ...... many positive changes in the company.
A) bring about   B) put out
C) set off   D) carry away

21. The detective was able to ...... the truth after weeks of investigation.
A) bring out   B) dig up
C) take off   D) set aside

22. The students ...... the problem until they found a proper solution.
A) called up   B) broke into
C) took after   D) went over

23. Despite several setbacks, the team decided to ...... with the project.
A) give up   B) turn down
C) carry on   D) put off

24. The police promised to ...... the matter thoroughly before taking action.
A) look after   B) look into
C) look up   D) look out


25. The manager asked the employees to ...... all unnecessary expenses.
A) cut down on
B) put up with
C) give in to
D) take up

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

చక్కెరను వదిలేస్తే.. రోజుల్లోనే చక్కని ఫలితాలు

ఆధునిక జీవనంలో చక్కెర పరమశత్రువుగా మారింది. అనేక వ్యాధులకు అది మూలకారణమవుతోంది. ఈ పదార్థాన్ని తీసుకోవడాన్ని తగ్గిస్తే.. ఆశ్చర్యకరమైన ఫలితాలు వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ప్రయోజనాల కోసం నెలలు, సంవత్సరాలు నిరీక్షించాల్సిన అవసరంలేదని, తీపికి కోతపెట్టిన కొద్దిరోజుల్లోనే అవి కనిపిస్తాయని పేర్కొంటున్నారు.



చక్కెర తినడం ఆరోగ్యానికి మంచిది కాదని మనలో చాలామందికి తెలుసు. అయితే ఏదో రూపంలో దాన్ని తీసుకుంటూనే ఉన్నాం. దీనివల్ల ఊబకాయం, ఫ్యాటీ లివర్ వ్యాధి, టైప్-2 మధుమేహం, గుండె జబ్బు, క్యాన్సర్ వంటి ముప్పులు పొంచి ఉంటాయి. తీపి పదార్థాలను తీసుకోవడాన్ని తగ్గించేస్తే.. మితిమీరి తినడం వల్ల కలిగే దుష్ప్రభావాలను తప్పించుకోవచ్చు. అంతేకాదు.. ఎక్కువ కాలం నిరీక్షించాల్సిన అవసరం లేకుండానే ఆశ్చర్యకరమైన ఫలితాలను పొందొచ్చు. అందులో.. మూడ్ మెరుగుపడటం, చర్మ, దంత ఆరోగ్యం, విషయగ్రహణ సామర్థ్యం, క్రీడా సామర్థ్యం మెరుగుపడటం జరుగుతుందని శాస్త్రవేత్తలు వివరించారు.

అటు ప్రకృతి.. ఇటు వికృతి..

బ్రెడ్‌లోని గ్లూకోజ్, పండ్లు, అనేక కూరగాయల్లో ఉండే ఫ్రక్టోజ్, పాలల్లోని ల్యాక్టోజ్ వంటి చక్కెరలు సహజసిద్ధంగానే లభిస్తాయి. అవి శక్తిని అందించడమే కాకుండా తీపిదనం, ఫ్లేవర్ వంటివి జోడిస్తాయి. తద్వారా ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు కలిగిన ఆహారాలను తినేలా మనల్ని ఆకర్షిస్తాయి. ఈ క్రమంలో వాటిలోని చక్కెరలతో కలిగే నష్టాన్ని ఈ పోషకాలు తగ్గిస్తాయి. ఉదాహరణకు మామిడి పళ్లలో అత్యధిక స్థాయిలో సహజసిద్ధ చక్కెరలు ఉంటాయి. మధ్యస్థ పరిమాణం కలిగిన పండులోనే 20 గ్రాముల వరకూ ఉంటుంది. అయితే మామిడిలో ప్రొటీన్, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, సి విటమిన్, భారీగా పీచు పదార్థం ఉంటాయి. దీనివల్ల చక్కెరను శరీరం నెమ్మదిగా శోషించుకుంటుంది. ఫలితంగా రక్తంలో చక్కెర పరిమాణం అకస్మాత్తుగా పెరిగే పరిస్థితి ఉండదు. శక్తి ఎక్కువకాలం సాగడానికి వీలవుతుంది.

కృత్రిమ చక్కెరలను ప్రాసెసింగ్, వంట లేదా తినేటప్పుడు ఆహారం లేదా పానీయాల్లోకి చేరుస్తారు. వీటిని యాడెడ్ షుగర్స్ అంటారు. అమెరికా ఎఫ్‌డీఏ సూచనల ప్రకారం వీటిని రోజుకు 50 గ్రాములకు మించి తీసుకోకూడదు. అయితే 260కిపైగా వివిధ రకాల చక్కెరలు మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. ఆహారాన్ని నిల్వ చేయడానికి, టెక్స్చర్‌ను పెంచడానికి, తీపిని జోడించడానికి, రుచిని పెంచడానికి వీటిని వాడుతుంటారు. చాలావరకూ అనారోగ్యకరమైన అల్ట్రాప్రాసెస్డ్ ఆహారాల్లోనే వీటిని ఉపయోగిస్తుంటారు. ఇలాంటి యాడెడ్ షుగర్స్ కలిగిన ఆహారాల్లో.. వాటి వల్ల తలెత్తే దుష్ప్రభావాలను తగ్గించే స్థాయిలో విటమిన్లు, ఖనిజాలు, పీచు ఉండవు.

- యాడెడ్ షుగర్స్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల క్రోన్స్ డిసీజ్, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి ఆటోఇమ్యూన్ రుగ్మతలు, అధిక రక్తపోటు, దంతాలు పుచ్చిపోవడం వంటి కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు పొంచి ఉంటుంది.
- చక్కెర 5 శాతం పెరిగినా.. గుండె జబ్బు ముప్పు 6 శాతం, పక్షవాతం ముప్పు 10 శాతం పెరుగుతుంది.
- ఇలాంటి హాని జరగడానికి ప్రధాన కారణం.. శరీరంలోకి చేరిన చక్కెర వినియోగం కాకుండా అది కొవ్వుగా నిల్వ ఉండటమే. ఇది ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకతకు దారితీయవచ్చు. అంతిమంగా మధుమేహం తలెత్తవచ్చు. చక్కెర ఎక్కువగా తినడం వల్ల కాలేయంలో కొవ్వు అధికంగా చేరి, ఫ్యాటీ లివర్ వ్యాధికి దారితీయవచ్చు.



- యాడెడ్ షుగర్స్.. పేగుల్లో చెడు బ్యాక్టీరియాను పెంచి పోషిస్తాయి. ఇది దీర్ఘకాల ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీయవచ్చు. ఆటో గట్ మైక్రోబయోమ్ సూక్ష్మజీవుల అసమతౌల్యానికి ఇది కారణం కావచ్చు.
- రక్తంలో అధిక చక్కెర ఉంటే.. అది లిపిడ్స్ లేక కొలాజెన్, ఎలాస్టిన్ వంటి ప్రొటీన్లతో బంధాన్ని ఏర్పరిచి చర్మ వార్ధక్యానికి కారణమవుతుంది. దీనివల్ల చర్మం ముడతలు పడటం, సాగే గుణాన్ని కోల్పోవడం వంటివి జరుగుతాయి.
- మెదడును అతిగా ప్రేరేపించడం ద్వారా నిద్ర నాణ్యతను చక్కెర దెబ్బతీస్తుంది. అందువల్ల నిద్రకు ఉపక్రమించడం కష్టమవుతుంది. బ్లడ్ షుగర్ క్రాషెస్‌కు ఇది దారితీస్తుంది. దీనివల్ల మెలకువ రావడం, దాహం వేయడం, ఆకలి, బాత్‌రూమ్‌కు వెళ్లాల్సి రావడం వంటివి జరుగుతాయి.

చక్కెరను తగ్గిస్తే ఆరోగ్యంపై పడే ప్రభావం

యాడెడ్ షుగర్లకు స్వస్తి పలకడం లేదా తగ్గించడం వల్ల ఇలాంటి వ్యాధుల ముప్పు తగ్గడమే కాకుండా జీవన నాణ్యత మెరుగుపడుతుందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చక్కెర్లను తగ్గించడం వల్ల ఏజీఈలు అనే హానికరమైన పదార్థ ఉత్పత్తి తగ్గుతుందని వివరించారు. వార్ధక్య ప్రక్రియను వేగవంతం చేయడం, అల్జీమర్స్ వ్యాధి వంటి దీర్ఘకాల సమస్యలతో ఈ పదార్థాలకు సంబంధం ఉంది.

- మెదడులో భావోద్వేగాలను నియంత్రించే రసాయనాలను చక్కెర అడ్డగిస్తుంది. అందువల్ల తీపిని తగ్గిస్తే కుంగుబాటు ముప్పు తగ్గిపోతుంది. ఒత్తిడి కూడా నియంత్రణలో ఉంటుంది.
- తీపిని తగ్గిస్తే.. రక్తంలో చక్కెర స్థాయి స్థిరీకరణ చెంది, క్రీడాకారులు ఎక్కువసేపు అలసిపోకుండా రాణించగలుగుతారు.

తాత్కాలికంగా తగ్గించుకున్నా మేలే..

చక్కెరను పూర్తిగా మానేసినా లేదా దీర్ఘకాలం పాటు తగ్గించుకున్నా ఆరోగ్యపరంగా ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు. దీన్ని తాత్కాలికంగా తగ్గించుకున్నా మంచిదేనంటున్నారు.

- లివర్ స్టీటోసిస్ ఉన్న కౌమార ప్రాయ బాలలు 8వారాల పాటు చక్కెరను తగ్గించినా వారి కాలేయ ఆరోగ్యం మెరుగుపడినట్లు ఒక అధ్యయనంలో తేలింది.
- టైప్-2 మధుమేహం ముప్పు బాగా తగ్గిపోతుంది.
- ఏదైనా పరీక్షకు ముందు తీపి తక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటే ఆలోచనల్లో స్పష్టతకు వీలవుతుంది. చక్కెర వల్ల ఏకాగ్రతకు భంగం కలుగుతుందని, మెదడులోని జ్ఞాపకశక్తికి సంబంధించిన గ్రాహకాలను అది అడ్డుకునే ముప్పు ఉందని పరిశోధనల్లో వెల్లడైంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

40వ రోజుకు చేరిన అమెరికా షట్‌డౌన్

- 1,400కు పైగా విమాన సర్వీసులు రద్దు

వాషింగ్టన్: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ 40వ రోజుకు చేరుకుంది. దేశవ్యాప్తంగా విమాన సేవలకు అంతరాయం కలగడంతో ఈ ప్రతిష్టంభనను తొలగించడానికి సెనెటర్లు ఆదివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అయితే అధికార, విపక్షాల మధ్య అంగీకారం కుదిరే సూచనలు కనబడటం లేదు. నిధుల విడుదలకు సంబంధించిన బిల్లులపై సెనెట్‌లో డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య అంగీకారం కుదరకపోవడంతో గత నెల 1 నుంచి అమెరికాలో షట్‌డౌన్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా శనివారం అగ్రరాజ్యంలో 1,400కిపైగా విమానాలు రద్దయ్యాయి. 6,000కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. 40 విమానాశ్రయాల్లో ఎయిర్ ట్రాఫిక్‌ను 4 శాతం మేరకు తగ్గించాలని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌ఏఏ) నిర్ణయించింది. షట్‌డౌన్ ఇలాగే కొనసాగితే, వచ్చే శుక్రవారం నాటికి 10శాతం విమాన సర్వీసులపై ప్రభావం పడే అవకాశం ఉంది. షట్‌డౌన్ కారణంగా గత నెల రోజులుగా విమానాశ్రయాల్లో పనిచేసే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు వేతనాలు అందడంలేదు. దీంతో చాలా మంది విధులకు హాజరుకావడం లేదు.

షాంఘై-దిల్లీ విమాన సర్వీసు ప్రారంభం

బీజింగ్: చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ సంస్థ ఆదివారం షాంఘై-దిల్లీ సర్వీసును 95 శాతం ఆక్యుపెన్సీతో నడిపింది. ఐదేళ్ల విరామం తర్వాత భారత్‌కు నేరుగా విమాన సర్వీసులను నడుపుతున్న చైనా తొలి విమానయాన సంస్థగా ఇది నిలిచింది. ఎంయూ563 అనే విమానం.. 248 మంది ప్రయాణికులతో షాంఘైలోని పుడాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరింది. భారత్‌కు చెందిన ఇండిగో సంస్థ సోమవారం నుంచి దిల్లీ- గువాంగ్‌ఝౌకు విమాన సర్వీసులను నడపనుంది. షాంఘై-దిల్లీ మార్గం అత్యంత కీలకమైంది. తాజా విమాన సర్వీసు వల్ల రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక, సాంస్కృతిక సంబంధ రాకపోకలు పెరుగుతాయని చైనా అధికారిక 'గ్లోబల్ టైమ్స్' పత్రిక పేర్కొంది. కొవిడ్-19 మహమ్మారి కారణంగా 2020లో రెండు దేశాల మధ్య విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఆ తర్వాత తూర్పు లద్దాఖ్‌లో ఉద్రిక్తతల వల్ల వీటి పునరుద్ధరణ సాధ్యం కాలేదు. గత నెల 26న రెండు దేశాల మధ్య విమాన రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. నాడు కోల్‌కతా నుంచి బయల్దేరిన ఇండిగో విమానం గువాంగ్‌ఝౌలో దిగింది.

కశ్మీర్‌లో నిఘా దాడులు..

- మహిళ సహా 9 మంది అరెస్టు

శ్రీనగర్: ఆన్‌లైన్ ఉగ్రవాద నెట్‌వర్కులే లక్ష్యంగా కశ్మీర్ లోయలో ఆదివారం నిఘావర్గాలు (సీఐకే) జరిపిన దాడుల్లో ఓ మహిళ సహా 9మంది అరెస్టయ్యారు. ఆన్‌లైన్‌లో ఉగ్రవాదాన్ని కీర్తించడం, యువతను తీవ్రవాదం వైపు మళ్లిస్తున్నారంటూ వచ్చిన సమాచారంతో కుల్గాం, బారాముల్లా పుల్వామా, శోపియన్‌లోని 10 నిర్దిష్ట ప్రాంతాలపై దాడులు నిర్వహించి తొమ్మిది మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సిమ్ కార్డులు, మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

భోజనానికి పిలిచి... క్లాస్‌మేట్‌పై విద్యార్థి కాల్పులు

గురుగ్రామ్: హరియాణాలోని గురుగ్రామ్‌లో దారుణం చోటుచేసుకుంది. భోజనానికని పిలిచి...క్లాస్‌మేట్ (17)పై ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కాల్పులకు తెగబడ్డాడు. బాధితుడి గొంతులోంచి తూటా దూసుకుపోవడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన శనివారం రాత్రి గురుగ్రామ్‌లోని సెక్టార్ 48లో చోటుచేసుకుంది. ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసుకున్న పోలీసులు కాల్పులతో సంబంధం ఉన్న ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలోంచి ఓ పిస్తోలు, రెండు మ్యాగజైన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. రెండు నెలల క్రితం తన కుమారుడికి, నిందితుడి మధ్య ఘర్షణ చెలరేగిందని బాధితుడి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఆ కక్షతోనే అతడిని భోజనం పేరుతో రూమ్‌కు పిలిచి..తన తండ్రి పిస్తోల్‌తో విద్యార్థి కాల్పులు జరిపాడని పోలీసులు వివరించారు.

'ఎస్ఐఆర్' భయం.. తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

కోల్‌కతా: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) పత్రం తమకు రాలేదన్న భయంతో పశ్చిమబెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో ఓ వివాహిత తన మైనర్ కూతురుతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసిందని ఆమె కుటుంబ సభ్యులు ఆదివారం ఆరోపించారు. విషం తాగడంతో వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

మరణానంతరం శరీరంలో రక్తప్రసరణ!

- అవయవాలు సేకరించేందుకు దిల్లీ వైద్యుల ప్రయోగం
- ఆసియాలోనే ఇది తొలిసారని వెల్లడి



దిల్లీ: వైద్య చరిత్రలో మరో కొత్త అధ్యాయానికి దిల్లీలోని హెచ్‌సీఎంసీటీ మణిపాల్ హాస్పిటల్ వైద్యులు నాంది పలికారు. మరణించిన మహిళ శరీరంలో ఆగిపోయిన రక్తప్రసరణను వారు తిరిగి ప్రారంభించారు. ఆమె అవయవాలను దానం చేసేందుకు వీలుగా దీన్ని చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆసియాలోనే ఈ ప్రక్రియను చేపట్టడం ఇదే మొదటిసారని ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. మోటార్ న్యూరాన్ వ్యాధి కారణంగా పక్షవాతం బారిన పడిన గీతా చావ్లా (55) అనే మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా కుటుంబసభ్యులు ఈ నెల 5న అమెను మణిపాల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో మరుసటి రోజు ఆమె మరణించింది. ఆమె అవయవాలు దానం చేయాలనుకుంటున్నట్లు మృతురాలి కుటుంబం తెలియజేయడంతో అక్కడి వైద్యబృందం నార్మోథెర్మిక్ రీజినల్ పెర్ఫ్యూజన్ (ఎన్ఆర్‌పీ) అనే అరుదైన ప్రక్రియను నిర్వహించింది. ఇందులో భాగంగా ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్ (ఎక్మో)ను ఉపయోగించి వైద్యులు మృతురాలి ఉదర అవయవాల్లో రక్త ప్రసరణను విజయవంతంగా పునః ప్రారంభించారు. అప్పటికి ఆమె గుండె ఆగిపోయి ఐదు నిమిషాలు గడిచిపోయింది.

"సాధారణంగా భారత్‌లో అవయవదానం బ్రెయిన్ డెత్ తరువాతే జరుగుతుంది. వారిలో గుండె ఇంకా కొట్టుకుంటూనే ఉంటుంది. కానీ గుండె కొట్టుకోవడం ఆగిపోయిన అనంతరం చేసే అవయవ దానాల్లో సమయం చాలా కీలకం. ఎన్ఆర్‌పీని ఉపయోగించి.. మృతురాలి శరీరంలోని కాలేయం, మూత్రపిండాలను సజీవంగా ఉంచాం. ఆ అవయవాలను భద్రంగా సేకరించే వరకూ దీన్ని కొనసాగించాం" అని శ్రీకాంత్ తెలిపారు. జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (నోటో) ఆ అవయవాలను వెంటనే రోగులకు కేటాయించింది. చావ్లా కాలేయాన్ని 48 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా మార్పిడి చేయగా, రెండు మూత్రపిండాలను 63, 58 ఏళ్ల పురుషులకు అమర్చారు. మృతురాలి కార్నియాలు, చర్మాన్ని కూడా దానమిచ్చారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచే కాకుండా సహజ మరణాల తర్వాత కూడా మృతుల నుంచి అవయవాలు సేకరించడం సాధ్యమేనని ఇది రుజువు చేస్తున్నట్లు మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ ఛైర్మన్ డాక్టర్ అవ్నీష్ సేథ్ తెలిపారు. ఈ విధానం ద్వారా గుండె, ఊపిరితిత్తులు వంటి అవయవాలనూ భవిష్యత్తులో రక్షించవచ్చన్నారు.

అంగోలాతో ఇంధన బంధానికి భారత్ ఆసక్తి

- దీర్ఘకాల ఒప్పందాలకు కంపెనీలు సిద్ధం: రాష్ట్రపతి ముర్ము



అంగోలాలోని లువాండాలో ఆ దేశాధ్యక్షుడు జోవో మాన్యుయేల్‌తో ముర్ము

లువాండా (అంగోలా): ఆఫ్రికా దేశమైన అంగోలా నుంచి ఇంధన కొనుగోళ్లకు దీర్ఘకాల ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భారత్‌లోని చమురు-సహజవాయు సంస్థలు ఆసక్తితో ఉన్నాయని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెల్లడించారు. చమురుశుద్ధి, అరుదైన ఖనిజాల వెలికితీతలో పెట్టుబడులు పెట్టేందుకు అవి ఆసక్తితో ఉన్నాయని చెప్పారు. అంగోలా నుంచి తాము భారీగా చమురు కొనుగోళ్లు చేస్తున్నామని గుర్తుచేశారు. నాలుగురోజుల పర్యటన కోసం అంగోలాకు చేరుకున్న ఆమె ఆదివారం తమ ప్రతినిధి బృందంతో అంగోలా అధ్యక్షుడు జోవో మాన్యుయేల్ గొన్‌సాల్వెష్ లోరెన్సోతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. ఎరువుల ఉత్పత్తి, వజ్రాల శుద్ధి వంటి రంగాల్లోనూ అవకాశాలు అందిపుచ్చుకునేందుకు భారతదేశ కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. విద్యుత్తు వాహనాలు, సెమీ కండక్టర్ల సాంకేతికత, కృత్రిమ మేధ వంటి రంగాల్లోనూ భాగస్వామ్యం పంచుకోవచ్చని తెలిపారు. అంగోలా రక్షణ రంగ అవసరాలు తీర్చేందుకు భారత్ సిద్ధమని చెప్పారు. దీర్ఘకాల ఒప్పందాల ద్వారా వ్యవసాయ రంగంలో తమ కంపెనీలు భాగం పంచుకోగలవన్నారు. వందేభారత్ రైళ్లనూ ఎగుమతి చేయవచ్చని చెప్పారు. మత్స్య పరిశ్రమ, చేపల సాగుకు సంబంధించి ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకునే వివిధ అవగాహన ఒప్పందాలపై రెండు దేశాలూ సంతకాలు చేశాయి. భారత రాష్ట్రపతి అంగోలాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఆమెకు అధ్యక్ష భవనం వద్ద సంప్రదాయబద్ధ స్వాగతం లభించింది.

భారత్‌లో 'మోస్ట్ వాంటెడ్'..

విదేశాల్లో ఇద్దరు గ్యాంగ్‌స్టర్ల అరెస్టు



వెంకటేశ్ గార్గ్, భాను రాణా

ఇంటర్నెట్ డెస్క్: భారత మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లలో ఇద్దరు విదేశాల్లో అరెస్ట్ అయ్యారు. అంతర్జాతీయ ఆపరేషనులో భాగంగా జార్జియాలో వెంకటేశ్ గార్గ్, అమెరికాలో భాను రాణాలను అదుపులోకి తీసుకొన్నట్లు అధికారులు వెల్లడించారు. విదేశాల నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వీరిని పట్టుకునేందుకు ఈ ఆపరేషనులో హరియాణా పోలీసులు కూడా భాగమయ్యారు. ఈ ఇద్దరినీ త్వరలోనే భారత్‌కు తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. వెంకటేశ్ గార్గ్ హరియాణాలోని నారాయణ్‌గఢ్‌కు చెందిన వ్యక్తి. ఇతడిపై దేశంలో 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. గురుగ్రామ్‌లో జరిగిన బీఎస్పీ నాయకుడి హత్యకేసులోనూ నిందితుడిగానూ ఉన్నాడు. గార్గ్ హరియాణా, రాజస్థాన్, దిల్లీతోపాటు ఉత్తరాది రాష్ట్రాల నుంచి అనేకమంది యువకులను తన క్రిమినల్ నెట్‌వర్కులో చేర్చుకున్నట్లు అధికారులు తెలిపారు. అమెరికాలో అదుపులోకి తీసుకున్న భాను రాణా స్వస్థలం హరియాణాలోని కర్నాల్. ఇతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగులో కీలక సభ్యుడు.

పాక్‌కు అర్థమయ్యే భాషలోనే సమాధానం చెప్పాలి: భాగవత్



బెంగళూరు: పాకిస్థాన్‌కు అర్థమయ్యే భాషలోనే భారత్ సమాధానం చెప్పాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భాగవత్ అభిప్రాయపడ్డారు. నిజాయితీ గల స్నేహితునిగా భారత్‌కు సహకరించటం ద్వారానే దాయాదికి మేలు జరుగుతుందన్నారు. సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా బెంగళూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పాకిస్థాన్‌కు నష్టం కలిగేలా భారత్ ప్రతిసారి ఓడించాలని, అప్పుడు పాకిస్థాన్ శాశ్వతంగా పశ్చాత్తాపం చెందక తప్పదని అభిప్రాయపడ్డారు. 'ఎల్లప్పుడూ మనం శాంతినే కోరుకుంటాం. పాకిస్థానే మనతో శాంతి కోరుకోవట్లేదు. భారత్‌కు హాని చేయటం ద్వారా ఎంతోకొంత సంతృప్తి చెందినంతకాలం పాకిస్థాన్ అలాగే చేస్తుంది. శాంతిని పాకిస్థాన్ ఉల్లంఘిస్తే అది ఎప్పుడూ విజయం సాధించలేదు. ఎంత ఎక్కువగా ప్రయత్నిస్తే అంత ఎక్కువ నష్టపోతుంది. 1971లో పాకిస్థాన్ దండయాత్ర చేసింది. 90 వేల మంది సైనికులను కోల్పోయింది. ఆ విధంగా వరుసగా జరిగితే పాకిస్థాన్ పాఠం నేర్చుకుంటుంది. భారత్‌ను ఏమీ చేయలేమనే విషయం ఆ దేశానికి అర్థం కావాలి. పాక్ కుట్రలను ఎదుర్కొనేందుకు మనం సిద్ధంగా ఉండాలి. తగిన విధంగా సమాధానం చెప్పాలి. ప్రతిసారీ ఓడించాలి' అని భాగవత్ అన్నారు.

మేం రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేదు

ఆరెస్సెస్‌ను ఇప్పటివరకు అధికారికంగా ఎందుకు రిజిస్టర్ చేయలేదని ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలపై భాగవత్ స్పందించారు. "హిందూ ధర్మం కూడా ఎక్కడా నమోదు చేసుకోలేదు. అదే విధంగా మేం కూడా ప్రత్యేకంగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేదు. వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆరెస్సెస్‌ను గుర్తింపులేని సంస్థగా పేర్కొంటున్నాయి. గుర్తింపే లేని సంస్థను గతంలో మూడుసార్లు ఎలా నిషేధించారు? మా సంస్థ గుర్తింపు పొందిందనడానికి ఇంతకన్నా ఆధారాలు ఏముంటాయి? 1925లో ఆరెస్సెస్‌ను స్థాపించినట్లుగా నాటి బ్రిటిష్ ప్రభుత్వంతో అధికారికంగా నమోదు చేయించాలా? దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అధికారికంగా ఆరెస్సెస్‌ను నమోదు చేసుకోవడాన్ని భారత ప్రభుత్వం తప్పనిసరి చేయలేదు. ఆదాయపు పన్ను శాఖ, కోర్టులు ఆరెస్సెస్‌ను వ్యక్తుల సంఘంగా గుర్తించాయి. దానిలో భాగంగానే పన్నుల నుంచి మినహాయించాయి" అని వివరించారు.

రష్యాలోని 2 నగరాల్లో కరెంట్ బంద్

- ఉక్రెయిన్ దాడుల ఫలితం

కీవ్: ఉక్రెయిన్ జరిపిన దాడుల్లో సరిహద్దుల్లో ఉన్న రెండు రష్యా నగరాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. డ్రోన్ల దాడి కారణంగా వోరోనెజ్‌లో కరెంట్ నిలిచిపోయిందని ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ గుసేవ్ తెలిపారు. శనివారం రాత్రి పలు డ్రోన్లను కూల్చేశామని వెల్లడించారు. స్థానిక యుటిలిటీ ప్రాంతంలో మంటలు చెలరేగాయని, వెంటనే ఆర్పేశామని వివరించారు. ఈ నగరంలో 10 లక్షల మంది జనాభా ఉంటారు.

- ✦ బెల్‌గొరోడ్‌లోని థర్మల్ విద్యుత్తు ప్లాంటుపై ఉక్రెయిన్ క్షిపణి దాడి చేసింది. దీంతో 20,000 మందికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ నగరంలో 3,40,000 మంది ప్రజలుంటారు.
- ✦ 44 ఉక్రెయిన్ డ్రోన్లను శనివారం రాత్రి కూల్చేశామని రష్యా రక్షణశాఖ వెల్లడించింది.
- ✦ శుక్రవారం రష్యా దాడుల్లో ఉక్రెయిన్ అణు విద్యుత్తు ప్లాంట్లకు సంబంధించిన సబ్‌స్టేషన్లు ధ్వంసమయ్యాయి.

ప్లాస్టిక్ పూల తయారీతో ఉపాధి



హరియాణాలోని కురుక్షేత్ర జిల్లా సుర గ్రామానికి చెందిన పదిమంది స్వయం సహాయక బృంద మహిళలు ప్లాస్టిక్‌తో కృత్రిమ పూలను తయారుచేస్తూ ఏటా దాదాపు రూ.15 లక్షలు ఆర్జిస్తున్నారు. 2020లో రూ.5,000 పెట్టుబడితో ఈ యూనిట్‌ను వీరు ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున ఉచిత స్టాళ్లు లభిస్తుండటంతో క్రమంగా వ్యాపారం లాభాల బాట పట్టింది. గృహాలంకరణకు, కానుకలుగా ఇచ్చేందుకు అనువుగా వీరు వస్తువులను డిజైన్ చేస్తున్నారు. వాటిని స్థానిక మార్కెట్లో, నేరుగా వచ్చే ఆర్డర్ల ద్వారా విక్రయిస్తున్నారు. "కొన్ని ముడి పదార్థాలు దిల్లీ నుంచి తెప్పిస్తాం. ఎక్కువభాగం స్థానికంగానే తయారు చేస్తాం. ఎంబ్రాయిడరీ, కుట్టుపనిలో మాకున్న నైపుణ్యం ఆకర్షణీయమైన పూల తయారీకి ఉపయోగపడుతుంది. ప్రస్తుత ట్రెండును దృష్టిలో పెట్టుకొని సృజనాత్మకంగా రూపొందిస్తాం" అని గ్రూపు సభ్యురాలు రేఖ వివరించారు. ఇంటిపనులు చూసుకొంటూ రోజుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు సంపాదిస్తున్నామని కవిత, వీణ తెలిపారు.

ఈటీవీ భారత్

రైతు ఛాతీలో 6 కిలోల కణితి

తొలగించిన జైపుర్ వైద్యులు



రాజస్థాన్‌లోని సవాయ్ మాన్‌సింగ్ (ఎస్.ఎం.ఎస్.) ఆస్పత్రి వైద్యబృందం ఓ రైతు ఛాతీలో నుంచి ఆరు కిలోల కణితిని తొలగించింది. సీకర్‌కు చెందిన 44 ఏళ్ల రైతు గత మూడు నెలలుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడేవారు. వివిధ ఆస్పత్రుల్లో చూపించినా ఎలాంటి ఫలితం లేకపోయింది. చివరకు జైపుర్‌లోని ఎస్.ఎం.ఎస్. ఆస్పత్రిని ఆశ్రయించారు. వైద్య పరీక్షల్లో ఛాతీలో కణితి ఉన్నట్లు గుర్తించి, శస్త్రచికిత్స ద్వారా సత్వరం తొలగించినట్లు జనరల్ సర్జరీ విభాగం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీవన్ కాంకడియా తెలిపారు. ఇలాంటి సాలిటరీ ఫైబరస్ కణుతులను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమన్నారు. ఈ కణితి ఊపిరితిత్తుల దగ్గర అత్యంత సున్నితమైన ప్రాంతాలకు అంటుకుందని.. దానిని ఒకే ముక్కగా, రక్తస్రావం లేకుండా తొలగించడంలో తమ వైద్య బృందం విజయం సాధించిందన్నారు. అక్టోబరు 31న జరిగిన శస్త్రచికిత్స తర్వాత ఆ రైతు కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు.



దిల్లీలో ఆదివారం నిర్వహించిన న్యాయవాదుల వాకథాన్‌లో పాల్గొన్న భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ తదితరులు

న్యాయసేవలందించడం నైతిక బాధ్యత: సీజేఐ బి.ఆర్.గవాయ్

దిల్లీ: న్యాయ సేవల అందించడాన్ని దాతృత్వంగా పరిగణించకూడదని, అది నైతిక బాధ్యత అని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్. గవాయ్ పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (నల్సా) నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, న్యాయ సహాయ ఉద్యమంలో ఉన్న వారు చట్టబద్ధమైన పాలనను దేశమంతటా విస్తరించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో త్వరలో భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ సూర్యకాంత్ ప్రసంగిస్తూ.. దేశంలోని మారుమూల ప్రాంతాలకు కూడా నల్సా విస్తరించడంపై హర్షం వ్యక్తంచేశారు. దీంతో ఎన్నడూ న్యాయం సాయానికి నోచుకోని వర్గాలు కూడా లబ్ధి పొందాయని పేర్కొన్నారు. న్యాయం అందుబాటులో ఉండటం అన్నది ఊహాత్మకమైన ఆలోచన కాదని, వాస్తవ హక్కు అని అన్నారు.

గణనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- బెంగాల్ బీఎల్‌వోలకు ఈసీ హెచ్చరిక

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవల్ అధికారుల(బీఎల్‌వో)కు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు భారత ఎన్నికల సంఘం(ఈసీ) ప్రకటించింది. ఇంటింటికీ వెళ్లి గణన పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. టీ స్టాళ్లు, లోకల్ క్లబ్బులు, ఇతర ప్రదేశాల నుంచి ఇవ్వడంతో ఈసీ ఎనిమిది మంది బీఎల్‌వోలకు నోటీసులు జారీచేసింది. బీఎల్‌వోలు ప్రతి ఓటర్ ఇంటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేసి, తిరిగి సేకరించాలనే నియమాన్ని కచ్చితంగా పాటించాలని సూచించింది. ఈ విషయంలో బిహార్ నమూనాను అనుసరించాలని కోరింది. అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పనిసరి అని హెచ్చరించింది. పర్యవేక్షణను బలోపేతం చేయడానికి ప్రతి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి 10 బూత్‌లకు ఒక బీఎల్‌వో సూపర్వైజర్‌ను నియమించాలని ఈసీ ఆదేశించింది.

మునీర్‌కు అపరిమిత అధికారాలు... పాక్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు

ఇస్లామాబాద్: పాకిస్థాన్ సైన్యాధిపతి మునీర్‌కు అపరిమిత అధికారాలను కట్టబెడుతూ ప్రభుత్వం పావులు కదపడంపై ఆ దేశ ప్రతిపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. పాక్ రాజ్యాంగానికి 27వ సవరణ చేయడానికి నిరసనగా ఆదివారం నుంచి దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాయి. ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్(పీటీఐ), తెహ్రీకే తౌఫిజ్ అయినే పాకిస్థాన్ (టీటీఏపీ) పార్టీలు జాతీయ స్థాయిలో ఆందోళనలకు పిలుపునిచ్చాయి. ప్రభుత్వ నిర్ణయంతో దేశ రాజ్యాంగం పునాదులే కదిలిపోతాయని ఆరోపించాయి. టీటీఏపీ నేత అలమ్ రజా నసీర్ అబ్బాస్ మాట్లాడుతూ... పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలు మొత్తం కుంగిపోతున్నాయని ఆరోపించారు. దేశం మొత్తం 27వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా కదం తొక్కాలని కోరారు. సీడీఎఫ్ పదవిని సృష్టిస్తే.. సైనిక దళాల్లో కూడా సమన్వయం తప్పుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆ ఆప్ ఎమ్మెల్యే ఆస్ట్రేలియాకు పరారు...

పటియాలా: అత్యాచార కేసులో సెప్టెంబరు 2 నుంచి పరారీలో ఉన్న పంజాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ పఠాన్‌మాజ్రా ఆస్ట్రేలియాలో దాక్కున్నట్లు తెలిసింది. శుక్రవారం ఆస్ట్రేలియాకు చెందిన ఓ పంజాబీ వెబ్ ఛానల్‌కు ఆయన వీడియో ఇంటర్వ్యూ ఇచ్చారు. దీంతో ఆయన జాడ వెలుగులోకి వచ్చింది. ఈ ఇంటర్వ్యూలో హర్మీత్ మాట్లాడుతూ...బెయిల్ పొందిన తర్వాతనే ఇంటికి తిరిగి వస్తానని ప్రకటించారు. తనపై ఆరోపణలు 'రాజకీయ కుట్ర'గా అభివర్ణించారు. "పంజాబ్‌లో కీలక విషయాలపై మంత్రులు, ఎమ్మెల్యేలను సంప్రదించడం లేదు. వాక్ స్వాతంత్ర్యాన్ని హరించేస్తున్నారు. దిల్లీలో ఓడిన ఆప్ నేతలు పంజాబ్ వైపు మళ్లారు. ఈ రాష్ట్రాన్ని కూడా నాశనం చేస్తున్నారు" అని ఆరోపించారు. పోలీసుల కస్టడీలో ఉన్న సమయంలోనే హర్మీత్ సింగ్ పరారైన విషయం తెలిసిందే. ఆయనపై పోలీసులు ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ చేశారు. పటియాలా కోర్టు కూడా అతణ్ని నేరస్థుడిగా ప్రకటించింది.

పాక్ క్రిప్టో వ్యాలెట్‌లో రూ.10 కోట్ల బదిలీకి సాయం

- సూరత్ వ్యక్తి అరెస్టు

అహ్మదాబాద్: పాకిస్థాన్‌కు చెందిన క్రిప్టో కరెన్సీ వ్యాలెట్‌కు రూ.10 కోట్లను బదిలీ చేయడానికి ఓ సైబర్ నేర ముఠాకు సాయం చేశాడన్న ఆరోపణలతో గుజరాత్‌లో ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని సూరత్‌కు చెందిన చేతన్ గంగానీగా గుర్తించారు. సైబర్ నేరాల ద్వారా వచ్చే అక్రమ ఆదాయాన్ని లాండరింగ్ చేయడానికి నేరగాళ్లు 'మ్యూల్' ఖాతాలను ఉపయోగిస్తుండడంపై జరుగుతున్న దర్యాప్తులో ఈ అరెస్టు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. దాదాపు వంద మ్యూల్ ఖాతాలను ఉపయోగించి దుబాయ్‌కు చెందిన సైబర్ నేరగాళ్లకు రూ.200 కోట్లను మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో ఇప్పటికే ఈనెల 3న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరితో గంగానీకి సంబంధాలు ఉండటంతో తాజాగా అతడిని అరెస్టు చేశారు.

పేద ఖైదీలకు సాయం కోసం ప్రత్యేక పథకం

- మూడేళ్లలో ఏపీ నుంచి ఒక్కరూ లబ్ధి పొందలేదు
- తెలంగాణలో ఉపయోగించుకున్నదీ ఐదుగురే

ఈనాడు, అమరావతి: బెయిల్ మంజూరైనప్పటికీ ఆర్థిక పూచీకత్తులు (ఫైనాన్షియల్ ష్యూరిటీలు) సమర్పించలేక, శిక్షా కాలం పూర్తయినా సరే న్యాయస్థానం విధించిన జరిమానా చెల్లించలేక జైళ్లలోనే మగ్గిపోతున్న నిరుపేద ఖైదీలకు ఆర్థిక సాయం అందించేందుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. గత మూడేళ్లుగా ఈ పథకం అమల్లో ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్ నుంచి ఏ ఒక్కరూ దీన్ని ఉపయోగించుకోలేకపోయారు. తెలంగాణలో కేవలం ఐదుగురే లబ్ధిపొందారు. ఇలాంటి ఖైదీలను గుర్తించేందుకు అధికార యంత్రాంగం తగిన చొరవ చూపకపోవడం, చాలా మందికి అవగాహన లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఈ పథకం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సెంట్రల్ నోడల్ ఏజెన్సీని ఏర్పాటు చేసింది. ఆ ఖాతాలో పుష్కలంగా నిధులు ఉన్నాయి. అయినా రాష్ట్రాలు వాటిని వినియోగించుకోలేకపోతున్నాయి. జైళ్లలో సామర్థ్యానికి మించి ఖైదీలు ఉండటాన్ని నియంత్రించేందుకు, నిరుపేద ఖైదీలకు సాయం చేసేందుకు తీసుకొచ్చిన ఈ పథకం లక్ష్యం నెరవేరట్లేదు. ఈ పథకం వినియోగంలో ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదని, నిధులున్నందున సద్వినియోగం చేసుకోవాలంటూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవల అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది.

పథకం ప్రయోజనం పొందడమిలా!

✦ ఆర్థిక పూచీకత్తులు సమర్పించలేక, జరిమానాలు చెల్లించలేక విడుదలకు నోచుకోక జైళ్లలో మగ్గిపోతున్న ఖైదీల సమాచారాన్ని జైలు అధికారులు వారం రోజుల్లో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు చెప్పాలి.

✦ న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి.. సామాజిక కార్యకర్తలు, ఎన్జీవోలు, జిల్లా ప్రొబేషన్ అధికారి, రెవెన్యూ అధికారి సాయంతో ఆ ఖైదీల ఆర్థిక పరిస్థితిపై విచారించి నివేదిక సిద్ధం చేస్తారు.

✦ 2-3 వారాలకోసారి ఆ ఖైదీల జాబితాను కలెక్టర్ నేతృత్వంలోని సాధికార కమిటీ ముందుంచుతారు. ఎస్పీ, జైలు సూపరింటెండెంట్, న్యాయాధికారి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీనిలో సభ్యులు.

✦ కమిటీ వివరాలన్నీ పరిశీలించి తగిన అర్హతలున్నాయని భావిస్తే బెయిల్ కోసం ఒక్కో ఖైదీకి రూ.40 వేల వరకు ఆర్థిక పూచీకత్తులు సమర్పించేందుకు ఆమోదం తెలుపుతుంది. శిక్ష పడ్డ ఖైదీలైతే జరిమానా సొమ్ము రూ.25 వేల వరకు చెల్లించేందుకు అనుమతిస్తుంది. అంతకు మించి కావాలంటే.. హోం, న్యాయ శాఖ కార్యదర్శుల నేతృత్వంలోని రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంటుంది.

✦ అవినీతి నిరోధక చట్టం, మనీ లాండరింగ్ నిరోధక చట్టం, మాదకద్రవ్యాల నిరోధక చట్టం, చట్ట విరుద్ధ కార్యకలాపాల నియంత్రణ చట్టం (ఉపా) కేసుల్లో అరెస్టైన, శిక్ష పడ్డ ఖైదీలకు ఈ పథకం వర్తించదు.

✦ జిల్లా స్థాయిలో సాధికార కమిటీ ఆమోదం తెలిపితే.. సెంట్రల్ నోడల్ ఏజెన్సీ ఖాతా నుంచి జిల్లా కలెక్టర్లే సొమ్మును నేరుగా విత్‌డ్రా చేసుకోవచ్చు. సంబంధిత న్యాయస్థానానికి సమర్పించవచ్చు.

✦ అయితే ఈ పథకాన్ని రెండు తెలుగు రాష్ట్రాలూ సద్వినియోగం చేయలేకపోతున్నాయి.

ఆ మూడు రాష్ట్రాలే...

✦ 2023-24, 2024-2025, 2025-26 (జులై వరకు) ఆర్థిక సంవత్సరాల్లో ఏపీలో ఒక్కరు కూడా ఈ పథకం వినియోగించుకోలేదు.

✦ తెలంగాణలో 2024-25లో ఐదుగురు ఖైదీలకు లబ్ధి కలిగింది.

✦ దేశవ్యాప్తంగా చూస్తే 2023-24లో 17 మంది, 2024-25లో 93 మంది, 2025-26లో (జులై వరకు) 34 మందికి ఈ పథకంతో ప్రయోజనం దక్కింది.

✦ మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. మిగతా వారు సరిగ్గా వినియోగించుకోలేకపోతున్నారు.

ఎంపీఎస్ హెచ్ఎంలకు జాబ్ చార్ట్ ప్రకటించాలి: ఫోరం డిమాండ్

ఈనాడు, అమరావతి: ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక జాబ్ చార్ట్ ప్రకటించాలని ఎంపీఎస్ హెచ్ఎం ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, వీరపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ.. 'ఎంపీఎస్ హెచ్ఎంలను పరిపాలనా పరమైన విధులకు మాత్రమే పరిమితం చేయాలి. వారి సబ్జెక్టుల్లో మాత్రమే బోధనకు వీలు కల్పించాలి. పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలి. గ్రేడ్-3 హెచ్ఎంలుగా గుర్తించాలి. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునివ్వాలి. రాబోయే బదిలీల్లో స్కూల్ అసిస్టెంట్లుగా వెనక్కి వెళ్లే వారికి ప్రాధాన్యత కల్పించాలి. ఎస్జీటీలకు సెలవుల మంజూరు చేసే అధికారం, ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ డిమాండ్లపై ఈ నెల 12 నుంచి 18 వరకు రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌ల్లో ఎస్ఏలను నియమించాలి: పీఆర్టీయూ

ఈనాడు, అమరావతి: హైస్కూల్ ప్లస్‌ల్లో అధ్యాపకులుగా అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని ఏపీ పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్టా కృష్ణయ్య, గిరి ప్రసాద్ డిమాండ్ చేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఆ సంఘ సమావేశంలో వారు మాట్లాడుతూ.. 'ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలి. డీఎస్సీ-2003 వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. ఉపాధ్యాయులకు భవిష్యత్తులో నిర్వహించే శిక్షణలన్నీ నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలి. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని పొరుగుసేవల సిబ్బందిని కాంట్రాక్టు విధానంలోకి మార్చాలి. అందరికీ పీఎఫ్ అమలు చేయాలి. ఉన్నత పాఠశాలల్లోని అన్ని ఖాళీలనూ భర్తీ చేయాలి. పీఆర్సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి. మధ్యంతర భృతి కింద 30% ప్రకటించాలి' అని డిమాండ్ చేశారు.

పరకామణి దోపిడీలో వైకాపా నేతలూ వాటాదారులే

యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జరిగిన శ్రీవారి పరకామణి దోపిడీలో వైకాపా నేతలూ వాటాదారులేనని యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ఆరోపించారు. ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహారంలో వెలుగు చూస్తున్న నిజాలపై సమాధానం చెప్పాలని తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డిని ఆదివారం ఓ ప్రకటనలో నిలదీశారు.

జన్యురకాలు ఒకేలా.. వందేళ్లు బతికేలా!

- ఇతరుల్లో లేని అరుదైనవి వారిలో ఉన్నాయి
- ఫలితంగానే దీర్ఘాయుష్షు సాధ్యం
- గుర్తించిన భారత్, ఇటలీ, అమెరికా పరిశోధకులు

ఈనాడు-చెన్నై, న్యూస్‌టుడే-టీనగర్: వందేళ్ల బతికితేనే.. అబ్బో అంటుంటారు. అలాంటిది 110 ఏళ్ల దాటిన వారిని చూస్తే అద్భుతం అనాల్సిందే కదా! వందేళ్లు.. 110 ఏళ్లు.. అంతకుమించి జీవించిన వాళ్లు ప్రపంచంలో చాలాచోట్లనే ఉన్నారు. ఇంత దీర్ఘాయుష్షు ఎలా సాధ్యమని పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ గుట్టును తేల్చేందుకు అమెరికా, ఇటలీ దేశాల యూనివర్సిటీలతో కలిసి భారత పరిశోధకులు గట్టి ప్రయత్నమే చేశారు. ఒకే రకమైన జన్యు వైవిధ్యాల కారణంగా వారలా జీవిస్తుండొచ్చని స్పష్టతకు వచ్చారు. ఈ పరిశోధనలో తమిళనాడు తిరునెల్వేలిలోని మనోన్మణియం సుందరనార్ యూనివర్సిటీ నుంచి ఆడ్రీప్రీనా మరియ సుందర్‌రాజ్, గాయత్రి సెల్వకుమార్, సుధాకర్ శివసుబ్రమణియం, ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ ఫెరీరాకు చెందిన జేమ్స్ క్లైమెంట్, అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన జార్జ్ ఎం.చర్చ్ తదితర పరిశోధకులు భాగస్వాములయ్యారు. ఈ మొత్తం పరిశోధన తిరునెల్వేలిలోనే జరగ్గా.. ఆడ్రీప్రీనా కీలకంగా వ్యవహరించారు. తమిళనాడులోని నాగర్‌కోవిల్‌కు చెందిన ఆమె ఇదే యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆరోగ్యంగా, దీర్ఘాయుష్షుతో ఎలా ఉండగలుగుతున్నారనే ఆసక్తితోనే ఈ పరిశోధన చేశామని చెబుతున్న ఆమెతో 'ఈనాడు' ప్రత్యేకంగా మాట్లాడింది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..


ఆడ్రీప్రీనా మరియ సుందర్‌రాజ్

ఆశ్చర్యంగా 7,54,520 జన్యురకాలు

జన్యు సేకరణ, వాటిని భద్రపరిచే వ్యవస్థలు భారత్‌లో పెద్దగా లేవు. ఫలితంగానే అమెరికాలోని బెటర్‌హ్యూమన్స్ సంస్థపై ఆధారపడ్డాం. వారి వద్ద వందేళ్లు దాటిన వ్యక్తుల జన్యువులున్నాయి. సంప్రదింపుల తర్వాత 42 మందికి చెందిన జన్యువులు అందించారు. వీటిలో నా పరిశోధనకు పనికొచ్చే 21 జన్యువులను పరిగణనలోకి తీసుకున్నాం. ఇందులో ముగ్గురు వందేళ్లు దాటిన, 18మంది 110-117 ఏళ్ల మధ్య జీవించిన వారి జన్యువులున్నాయి. ఆఫ్రికా, ఐరోపాలకు చెందిన 13 మంది ఆడవారు, 8మంది మగవారి జన్యువులివి. జన్యు వైవిధ్యాల్ని గుర్తించే ఎన్ఎన్‌పీ నెక్సస్ సాంకేతిక సాధనాన్ని ఉపయోగించి ఈ 21 మంది జన్యువులను పరీక్షించి.. 16,70,122 జన్యురకాల్ని గుర్తించాం. ఇందులో 7,54,520 ఒకేరకంగా ఉన్నాయి. వాటినే కామన్ జెనెటిక్ వేరియేషన్స్ అని, సింగిల్ న్యూక్లియోటైడ్ పాలిమార్ఫిజమ్స్ (ఎస్ఎన్‌పీ) అంటున్నారు. ఈ 21 మందిలో సుమారు 1,000 జన్యువులు ఇతర జనాభాలో లేని అత్యంత అరుదైనవిగా మాకు కనిపించాయి. ఇవే ఎక్కువ కాలం జీవించే అంశంలో ప్రభావం చూపిస్తూ ఉండొచ్చు. మరీ ప్రధానంగా టీఎంఎం-23, ఎన్ఈఎంఎఫ్, కేఎంటీ2సీ, ఎంపీపీ2కే3, జెడ్ఎన్ఎఫ్-214 లాంటి ఎస్ఎన్‌పీలు వయసును పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు అంచనాకు వచ్చాం. 110 హానికరమైన ఎస్ఎన్‌పీల్ని గుర్తించాం. ఇవి 79 జన్యువులతో ముడిపడి విభిన్న జీవక్రియలపై ప్రభావం చూపుతున్నాయి. మైటోకాండ్రియా, కణాలపై పర్యావరణ దుష్ప్రభావం, హిస్టోన్‌లో మార్పులు, ఆహారాన్ని తీసుకునే అవయవాలు, కణాలపై నియంత్రణలకు సంబంధించిన విభాగాలపై పనిచేస్తున్నాయి. ఆడవారికి మగవారి కన్నా ఆయుష్షు ఎక్కువని, ఇందుకు సంబంధించి ఈ పరిశోధన ద్వారా కొంత ఆధారమైతే దొరికింది. సాధారణంగా ఎవరైనా వందేళ్లు దాటి జీవిస్తే.. అందుకు ఆహారం, జీవనశైలి కారణమని అనుకుంటాం. దాంతోపాటూ జన్యువులూ కీలకంగా వ్యవహరిస్తాయని మా పరిశోధనలో గుర్తించాం. భవిష్యత్తులో శరీరంలోని ప్రొటీన్ పనితీరు మెరుగవడానికి ఈ ఎన్ఎన్‌పీల పాత్ర ఎలా ఉంది? ఆరోగ్యాన్ని ఎలా సంరక్షిస్తున్నాయి? అన్నది లోతుగా పరిశోధన చేయాల్సి ఉంది.

ఏమిటీ 'ఎస్ఎన్‌పీ'లు?

జనాల్లో ఉండే ఒకే విధమైన జన్యు వైవిధ్యాలను ఎస్ఎన్‌పీ అంటారు. కేవలం ఒక్క శాతం జనాభాలో మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి. జన్యు డీఎన్ఏలో వాటి జాడ ఉంటుంది. రోగాలకు కారణాల్ని గుర్తించడంలో పరిశోధకులు సహజంగా జన్యువులపై పరిశోధనలు చేస్తుంటారు. రోగాలకు ఎస్ఎన్‌పీలు నేరుగా కారణం కాకపోయినా.. ఆరోగ్య రహస్యాల్ని తెలుసుకునేందుకు ఇవెంతో ఉపకరిస్తాయి. ఉదాహరణకు వ్యాధుల్ని గుర్తించడంలో, వాటి ముప్పును అంచనా వేయడంలో, ఔషధాల ప్రభావాన్ని తెలుసుకోవడంలో సహకరిస్తాయి. వ్యక్తుల్లో వ్యాధుల తీవ్రతను తగ్గించడంలో, పెంచడంలో వాటిపాత్ర ఉంటుంది. ఫలితంగా ఎక్కువ కాలం జీవించేవారిలోని రహస్యాల్ని వాటిద్వారా గుర్తించే అవకాశముంది.


యాదగిరీశుడి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

యాదగిరిగుట్ట క్షేత్రంలో ఆధ్యాత్మిక కోలాహలం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక ఆరాధనల్లో భాగంగా శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు, దీపారాధన నిర్వహించారు. వివిధ విభాగాల నుంచి ఆలయానికి రూ.1,00,57,322 నగదు సమకూరింది. మొత్తం 78,200 మంది దర్శనం చేసుకున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావు వెల్లడించారు.



క్షమాపణ చెప్పడానికి సంశయించకండి

క్షమాపణ చెప్పడమంటే మీది తప్పు, ఎదుటివారిది ఒప్పు అని నిర్ధారించినట్లు కాదు. మీరు మీ అహం కన్నా బంధానికే ఎక్కువ విలువ ఇస్తున్నారని, దాన్ని కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నారని అర్థం. అందుకే అవసరమైనప్పుడు క్షమాపణ చెప్పడానికి సంశయించకండి.

– వాలా అఫ్సర్, కాలమిస్ట్

17 జిల్లాలు.. 10 సెక్టార్లు.. 32 పార్కులు!

- మంజూరు కోసం డీపీఐఐటీకి ప్రతిపాదన
- కొత్త పారిశ్రామిక నగరాలు అభివృద్ధి
- అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సెక్టార్లవారీగా 32 పార్కులను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. వాటిలో పది రంగాల పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ప్లగ్ అండ్ ప్లే విధానంలో.. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించబోతోంది. పెట్టుబడులను ఆకర్షించడం, తయారీ రంగాన్ని ప్రోత్సహించడం సాధ్యం అవుతుందని భావిస్తోంది. వాటిలో తయారయ్యే ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడేలా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనివల్ల కొత్తగా పారిశ్రామిక నగరాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు పేర్కొంటున్నారు. సెక్టార్లవారీగా పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అంతర్గత వాణిజ్యం, పారిశ్రామికాభివృద్ధి శాఖ (డీపీఐఐటీ)కు అధికారులు పంపారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ (ఎన్ఐసీడీపీ) ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా 100 పార్కుల్లో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి రూ.2,500 కోట్లు కేంద్రం ఖర్చు చేయనుంది.

జిల్లాల్లో ఉన్న వనరుల ఆధారంగా ప్రతిపాదనలు

జిల్లాల్లోని పరిశ్రమలు, అక్కడి వనరుల ఆధారంగా సెక్టార్లను ప్రభుత్వం నిర్దేశించింది. ఆ పార్కుల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు స్థానికంగా దొరికే ముడిసరకు వినియోగించుకునేలా చూడాలన్నది ఆలోచన. రవాణా వ్యయం. ఇతర ఖర్చులు తగ్గడం వల్ల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది. దీనివల్ల ప్రపంచ మార్కెట్‌తో పోటీ పడే అవకాశం ఉంటుంది. పార్కులో ఒకే తరహా కంపెనీలు రావడం వల్ల ఒకే తరహా మౌలిక సదుపాయాలు కల్పించడం సులువుగా ఉంటుంది. అనుబంధ యూనిట్ల ఉత్పత్తులకూ అక్కడే మార్కెటింగ్‌కు అవకాశం ఏర్పడుతుంది. ఒకే రంగానికి సంబంధించిన పరిశ్రమలు ఉండటం వల్ల ఎకోసిస్టమ్ త్వరగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో వివిధ సంస్థలకు యూనిట్ల ఏర్పాటుకు కేటాయించిన భూములనూ పార్కుల ఏర్పాటుకు వినియోగించుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

పార్కుల అభివృద్ధికి నిర్దేశించిన సెక్టార్లు

జిల్లా	ప్రదేశం	సెక్టార్
శ్రీకాకుళం	మూలపేట, పూండి, కళింగపట్నం	కెమికల్
	ఈస్ట్‌కోస్ట్ పవర్	కెమికల్/పోర్టు ఆధారిత
విజయనగరం	నాల్కో, జేఎస్‌డబ్ల్యూ	మల్టీ ప్రొడక్ట్
విశాఖపట్నం	అదానీ ఐటీ హిల్‌నెం-4	ఐటీఈఎస్
అనకాపల్లి	రాంబిల్లి ఫేజ్-2	మల్టీప్రొడక్ట్
	ఉపమాక	బొమ్మల తయారీ
కాకినాడ	గుర్జనపల్లి	మల్టీ ప్రొడక్ట్
తూర్పుగోదావరి	రాజమహేంద్రవరం-వైట్ ఫీల్డ్	మల్టీ ప్రొడక్ట్
కృష్ణా	మంగినపూడి (సాల్ట్ ల్యాండ్)	మల్టీ ప్రొడక్ట్
	పంద్రక	షిప్ బిల్డింగ్
ఎన్టీఆర్	జయంతీపురం	ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్
పల్నాడు	కొత్తపల్లి, మాచర్ల	మెడికల్ డివైజెస్
ప్రకాశం	నిమ్జ్, దొనకొండ	ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్
నెల్లూరు	అమడగూరు	పెట్రోకెమికల్
	మోచర్ల	మల్టీ ప్రొడక్ట్
	వాకాడు	మల్టీ ప్రొడక్ట్
తిరుపతి	దుగరాజపట్నం	షిప్ బిల్డింగ్
	రౌతుసురమాల	అంతరిక్ష పరిశోధన
చిత్తూరు	కోసలనగరం	మల్టీ ప్రొడక్ట్
	కుప్పం	ఫుడ్ ప్రాసెసింగ్
వైఎస్ఆర్ కడప	ఉక్కు కర్మాగారం	స్టీల్ అనుబంధ రంగాలు
అనంతపురం	తిమ్మసముద్రం	ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్
శ్రీ సత్యసాయి	టేకులోడు	ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)
	కూడేరు, ఉరవకొండ	ఈఎంసీ/టెక్స్‌టైల్
ప్రకాశం	ఇఫ్కో కిసాన్	మల్టీ ప్రొడక్ట్
నెల్లూరు	కోస్టల్ ఆంధ్ర పవర్ లిమిటెడ్	మల్టీ ప్రొడక్ట్
	కృష్ణపట్నం ఇన్‌ఫ్రా	
	కృష్ణపట్నం పవర్	
తిరుపతి	శ్రీసిటీ	మల్టీ ప్రొడక్ట్


కుటుంబ సభ్యులతో లక్ష్మణ్

ఆ కుటుంబాల్లో ఆనందం

ఏళ్ల కిందట అదృశ్యం.. సొంతిళ్లకు చేరిన వైనం


వెంకటరాములుతో తల్లి రుక్కమ్మ

న్యూస్‌టుడే, పెద్దపల్లి: మతి స్థిమితం కోల్పోయి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఇద్దరు ఏమయ్యారోనని ఆ కుటుంబాల వారు చాలా ఏళ్లు ఎదురు చూశారు.. తరువాత వారిపై ఆశలు వదులుకున్నారు.. కానీ అనూహ్యంగా వారు ఇళ్లకు చేరడం ఆ రెండు కుటుంబాల్లో ఆనందం నింపింది. తెలంగాణలోని పెద్దపల్లిలో ముత్యాల పోచమ్మవాడకు చెందిన మాడిశెట్టి లక్ష్మణ్ పండ్లు విక్రయించేవారు. వివిధ సమస్యలతో మతిస్థిమితం కోల్పోయి 17 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు, బంధువులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం తెల్లవారుజామున మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో బంధువులకు కనిపించటంతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. లక్ష్మణ్ కుమారుడు విశ్వ మంచిర్యాలకు వెళ్లి తీసుకువచ్చారు. ఇంటి నుంచి ఎప్పుడు వెళ్లిపోయానో.. ఎందుకు వెళ్లానో గుర్తులేదని, హైదరాబాద్‌లోని ఒక షామియానా కంపెనీలో పనిచేశానని చెప్పారు. తాను తిరిగిన లక్షెట్టిపేట, మంచిర్యాల గుర్తుకు రావడంతో శనివారం మంచిర్యాల చేరుకున్నానని చెప్పారు. పెద్దపల్లిలో కుటుంబ సభ్యులు ఎలా ఉన్నారో, ఎక్కడ ఉన్నారో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుండగా తన కుమారుడు తనను పెద్దపల్లికి తీసుకు వచ్చాడన్నారు. ఇక లేడనుకున్న వ్యక్తి సజీవంగా రావడంతో భార్య భాగ్య, కుటుంబసభ్యులు ఆనందంలో మునిగిపోయారు.

యువకుడిగా వెళ్లి..

తండ్రి చనిపోవడంతో కుటుంబ పోషణ భారం మీద పడడం.. సోదరికి, తనకు పెళ్లి సంబంధాలు రాకపోవడంతో మతిస్థిమితం కోల్పోయిన యువకుడు ఎక్కడికో వెళ్లిపోయి పన్నెండేళ్లకు తిరిగి వచ్చిన మరో ఉదంతమిది. పెద్దపల్లి మండలం రంగాపూర్‌కు చెందిన పట్టెం వెంకటరాములు(47) 2013లో ఇంటి నుంచి వెళ్లిపోయారు. అస్సోంలోని లాఖీంపుర్ జిల్లా బోగినాడుకు చేరుకున్న అతడు హోటల్‌లో పనిచేసి, టిఫిన్ పెట్టమని తెలుగులో మాట్లాడగా గతంలో హైదరాబాద్‌లో హోటల్ నిర్వహించిన యజమాని వివరాలు ఆరాతీశారు. తనకు తెలిసిన హైదరాబాద్ మిత్రులకు వెంకటరాములు వివరాలను పంపించారు. సామాజిక మాధ్యమాల్లో ఆ ఫొటోలు చూసి గ్రామస్థులు గుర్తు పట్టారు. బంధువులు అస్సోంకు వెళ్లి శనివారం ఆయన్ను స్వగ్రామానికి తీసుకువచ్చారు. 80 ఏళ్ల వయసులో ఉన్న తల్లి రుక్కమ్మ కుమారుడు వెంకటరాములును చూసి ఆనందంతో ఉప్పొంగిపోయింది.

తీరానికి మణిహారం

- ఓడరేవులకు అనుసంధానంగా పారిశ్రామిక క్లస్టర్లు
- గ్రామాలను కలుపుతూ నగరీకరణకు ప్రణాళిక
- అక్కడి అవసరాలకు అనుగుణంగా క్లస్టర్ల అభివృద్ధి
- సదుపాయాల కోసం రూ.1,220 కోట్లతో ప్రతిపాదనలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని తీరప్రాంతానికి సరికొత్త సొబగులు సమకూరనున్నాయి. ఓడరేవులు.. వాటికి అనుసంధానంగా పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. తీర ప్రాంతం వెంట జిల్లాల్లో మారిటైం ప్రాజెక్టులు తెచ్చేలా ప్రతిపాదనలు రూపొందించింది. అందుకు అనుగుణంగా పోర్టు ప్రాక్సిమల్ ఏరియా (పోర్టు నుంచి కనీసం 2-3 కి.మీ. పరిధి)లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.1,220 కోట్లతో ప్రణాళికలు రూపొందించింది. పోర్టు ఉన్న ప్రాంతానికి సమీపంలో జరిగే కార్యకలాపాలకు అనుగుణంగా ఆయా క్లస్టర్లు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీనికోసం పోర్టుకు సమీపంలో ఉన్న ఉప్పు భూములను వినియోగించుకోవాలని భావిస్తోంది. ఆ భూములను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అంతర్గత వాణిజ్యం, పరిశ్రమల ప్రోత్సాహక శాఖ (డీపీఐఐటీ) పరిధిలోని కోరాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా ఏపీ మారిటైం బోర్డు ప్రణాళిక సిద్ధం చేసింది.

ప్రతి 50 కి.మీ.కు పోర్టు ఆధారిత పరిశ్రమ

రాష్ట్రంలో విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నంలో పోర్టులు ఉన్నాయి. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ సెజ్‌లో కొత్త పోర్టులు నిర్మాణంలో ఉన్నాయి. వాటితోపాటు నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్స్ కోసం రాంబిల్లిలో మరో పోర్టు నిర్మాణంలో ఉంది. ఇవి కాకుండా నక్కపల్లి, దుగరాజపట్నంలో పోర్టులు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ తరహాలో ప్రతి 50 కి.మీ.కు పోర్టు, ఫిషింగ్ హార్బర్‌లు, పోర్టు ఆధారిత కార్యకలాపాలు నిర్వహించే ప్రాజెక్టులు తీసుకురావాలన్నది ప్రభుత్వ యోచన. వాటికి అనుబంధంగా పోర్టు ఆధారిత క్లస్టర్లు అభివృద్ధి చేసి.. భారీ ఎత్తున వాణిజ్యాన్ని అభివృద్ధి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతాల అభివృద్ధి

పోర్టులకు అనుసంధానంగా సమీప ప్రాంతాల్లో నగరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పోర్టు నుంచి ప్రస్తుతం ఉన్న గ్రామాలను కలుపుకొని నగరీకరణను ప్రోత్సహించాలని భావిస్తోంది. దీనికోసం పోర్టు నుంచి కనీసం రెండు మూడు కి.మీ. పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రోడ్లు, విద్యుత్ నీటి సరఫరా పనుల కోసం 11 ప్రతిపాదనలు రూపొందించింది. వాటికి కేంద్రసాయం కోసం సాగరమాల 2.0 కింద నిధులు ఇవ్వాలని కోరుతోంది.

పోర్టులు.. అనుబంధ క్లస్టర్లు

మూలపేట పోర్టు: దీనికి సమీపంలో రసాయన పరిశ్రమలు, వాటికి అనుబంధ కార్యకలాపాలు నిర్వహించే యూనిట్ల ఏర్పాటుకు వీలుగా మౌలిక సదుపాయాల కల్పన.

విశాఖపట్నం: విశాఖ చుట్టుపక్కల ఫార్మా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. అందుకు అనుగుణంగా ఫార్మాతో పాటు సముద్ర ఆధారిత వాణిజ్యాన్ని ప్రోత్సహించేలా క్లస్టర్ అభివృద్ధికి ప్రతిపాదన.

రాంబిల్లి: విశాఖ పోర్టు విస్తరణకు అవకాశం లేకపోవడంతో నేవల్ కార్యకలాపాల కోసం రాంబిల్లిలో కొత్త పోర్టును నిర్మిస్తోంది. ఈ ప్రాంతంలో రక్షణ రంగ పరిశ్రమల కోసం క్లస్టర్ ఏర్పాటు.

కాకినాడ: దీనికి సమీపంలో చమురు వెలికితీసే భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. దీని ఆధారంగా పెట్రోలియం ఆయిల్, లూబ్రికెంట్స్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా క్లస్టర్ ఏర్పాటు.

మచిలీపట్నం: హెవీ ఇంజినీరింగ్, ఆటోమొబైల్‌కు కేంద్రంగా ఉన్న విజయవాడకు సమీపంలో ఆయా రంగ పరిశ్రమలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు.

రామాయపట్నం: రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ భారీ చమురుశుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటుచేయనుంది.

కృష్ణపట్నం: తిరుపతి సమీపంలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఇప్పటికే ఉన్నాయి. దీంతోపాటు రాయలసీమ జిల్లాల్లో పునరుత్పాదక ప్రాజెక్టులు భారీగా ఉన్నాయి. ఆయా పరిశ్రమలకు అనుసంధానంగా క్లస్టర్ ఏర్పాటుకు నిర్ణయం.

దుగరాజపట్నం: షిప్ బిల్డింగ్, ఓడల నిర్వహణ, రిపేర్లు, ఓవర్ హాలింగ్ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా క్లస్టర్.

రూ.4,223 కోట్లతో ఎత్తిపోతల పథకాల నిర్వహణ

- పదేళ్లపాటు ప్రైవేట్‌కు అప్పగించేందుకు సన్నాహాలు
- 8.31 లక్షల ఆయకట్టు స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పరిధిలో ఉన్న ఎత్తిపోతల పథకాల నిర్వహణను రూ.4,222.84 కోట్లతో ప్రైవేట్ ఏజెన్సీకి అప్పజెప్పేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం ఎత్తిపోతల పథకాల్లో 777 పథకాలను 10 ఏళ్లపాటు నిర్వహించేలా ఏదైనా ప్రైవేట్ ఏజెన్సీకి టెండర్లు పిలిచి అప్పగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని వల్ల 7.39 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ఉపకరిస్తుంది. ఈ ఎత్తిపోతలలో 161 ప్రస్తుతం పని చేస్తున్నాయి. మరో 495 ఎత్తిపోతల పథకాలు పాక్షికంగా పని చేస్తుండగా.. 121 పూర్తిగా పాడైపోయాయి.

పథకాలన్నీ నాశనం

ఏపీఎస్ఐడీసీని 1974లో ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో పాటు, రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించి వెయ్యికి పైగా ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఈ పథకాల వల్ల 8.31 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందేది.

✦ జగన్ ప్రభుత్వం ఐదేళ్లపాటు ఈ సంస్థను, ఎత్తిపోతల పథకాలను నిర్లక్ష్యం చేసింది. నిర్వహణకు నిధులివ్వడం మాట అటుంచి.. ఐడీసీలో సిబ్బందికి నెలల తరబడి జీతాలు కూడా ఇవ్వలేదు.

✦ కనీస నిర్వహణ కరవై ఎత్తిపోతల పథకాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మొత్తం 8.31 లక్షల ఎకరాల ఆయకట్టులో లక్ష ఎకరాలకే అంతో ఇంతో నీరందింది.

✦ ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించి, ఎత్తిపోతల పథకాలన్నింటినీ సంస్కరించాలని ఆదేశించారు. ఐడీసీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎత్తిపోతల పథకాలన్నింటినీ పరిశీలించి, మరమ్మతులకు రూ.725 కోట్లు అవసరమవుతాయని లెక్కించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి, జలవనరులశాఖ ఉన్నతాధికారులకు పంపారు.

✦ ఎత్తిపోతల పథకాల మరమ్మతులతో సరిపోదు. వాటిని బాగు చేసి నిర్వహణను పదేళ్లపాటు ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని సీఎం సూచించారు.

✦ 25 ఎత్తిపోతల పథకాల్లో పెండింగులో ఉన్న నిర్మాణ పనులను రూ.83.48 కోట్లతో పూర్తి చేయాలని నిర్ణయించారు. నాబార్డు కింద ఇవి మంజూరైనప్పటికీ, ఆ పథకం కాలవ్యవధి ముగిసినందున రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులివ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇవి పూర్తయితే 33,190 ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.

అనవసర సబ్ డివిజన్ల ఎత్తివేత

✦ ఐడీసీలో రెగ్యులర్ సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉంది. 22 మంది రెగ్యులర్, 156 మంది పొరుగుసేవల సిబ్బంది పని చేస్తున్నారు.

✦ ఏఈఈలు అంతా పొరుగుసేవలవారే. 17 డీఈఈ పోస్టులకు ఇద్దరే ఉన్నారు. వారూ పదవీవిరమణకు దగ్గరలో ఉన్నారు.

✦ దీనికితోడు భవనాల అద్దె కూడా అదనపు భారమవుతోంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పెద్దగా అవసరం లేని 8 సబ్ డివిజన్లు మూసివేశారు.

✦ ఎత్తిపోతల పథకాల నిర్వహణ, కార్పొరేషన్ వ్యవహారాలు గాడిన పెట్టేందుకు జలవనరులశాఖ నుంచి 50 మంది ఏఈఈలు, 20 మంది డీఈఈలను ఐడీసీకి పంపనున్నారు.

✦ రెగ్యులర్ ఏఈఈలు లేనందున గ్రామ సచివాలయాల్లో ఉన్న ఇంజినీరింగ్, వ్యవసాయ అసిస్టెంట్ల సహాయం కూడా తీసుకోవాలని కార్పొరేషన్ పాలకమండలి సమావేశంలో తాజాగా నిర్ణయం తీసుకున్నారు.